మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2021-23
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.4.2023



అవలోకితేశ్వరి

మిసిమి

చింతనాత్మక సారస్వతం

2567వ బుద్ధ జయంతి



మాసపత్రిక, మే, 2023 ₹ 50/-

ISSN 2454–4329



తండ్రి
ఖెమూర్ చిత్రకళ



తనయుడు
ఖెమూర్ చిత్రకళ

మిసిమి

మాసపత్రిక

సంపుటి 34 **సంచిక 5**

మే - 2023

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI
Since 1946

Printed & Published by

BAPANNA ALAPATI

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27612436, 27645538.

Editor: **Ph: 994 951 6567**

(10.00 am to 5.00 pm)

చందా వివరాలు:

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : వి. ఆశారాణి

040-27645536

Scan QR to Pay

Misimi Publication

LIBRARY OF CONGRESS

LCCN 91-903060

UGC Care

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

misimi90monthly@gmail.com

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

మిసిమి

మే నెల సూచికలు...

అనర్ఘరత్నాలు : ఆచార్య పప్పు వేణుగోపాల్ రావు... 5
బుద్ధుడు చారిత్రక పురుషుడు : డా. దేవరాజు మహారాజు... 6
స్వామి వివేకానంద దృష్టిలో గౌతమ బుద్ధుడు : పురాణపండ రాఘవరావు... 9
మనమే బాధ్యులం : అశ్వినీ కుమార్... 10
మనోధర్మ సంగీతం : అమినేని సిద్ధయ్యనాయుడు... 16
జ్ఞానతంత్రులను మీటే ఆక్స్‌ఫర్డ్ : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు... 19
గువ్వల చెన్నా! : కె. దినకర్... 25
రసాయన శాస్త్రవేత్త – కోలాచల సీతారామయ్య : డా. నాగునూరి వేణుగోపాల్... 31
శారదా శ్రీనివాసన్ తో మాటా-మంతీ : **మిసిమి**... 33
అందమా.. అందవా..? : ఎడిటర్స్ డైరీ... 42
కథాకథన చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి : భమిడిపాటి గౌరీశంకర్... 43
శృంగార నైషధంలో హంస : డా. టి.ఎన్. రసూల్... 45
వెలుదండవారి అక్షరమాల : డా. దత్తయ్య అట్టెం... 49
డాక్టర్ జివాగో నవలా నేపథ్యం : డా. వేలూరి కృష్ణమూర్తి... 52
తెలంగాణ: జానపద కళానిలయం : ధరంసోత్ సరిత... 55
ఇచ్ఛామతి తీరాన : డా. నల్లపనేని విజయలక్ష్మి... 57
జార్జియా ఓ కీఫ్ : టి.వి. ప్రసాద్... 61
తమిళ సాహిత్యసేవ: కె.ఏ. వెంకట రామయ్య : డా. పి.ఎస్. గోపాల కృష్ణ... 63
చిత్రగీతాలు జావళీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 65
ఆత్మ సౌందర్య సాక్షాత్కారం : ఆచార్య వై. పార్థసారధి... 69
కొప్పర్తి కవితా శిల్పం : పోతుల శివాజీ... 73
వడ్డెర చండీదాస్ – హిమజ్వాల : వి. రాజారామ్మోహన్ రావు... 75
వేమన పద్యాల్లో 'అమ్మ..' 'ఆలీ..' : జె. మధుబాబు... 78
చదవండి... : **మిసిమి**... 80


బుద్ధ


ఆక్స్‌ఫర్డ్

అట్టమీది బొమ్మలు


గౌతమ బుద్ధ



తండ్రి
ఖైమూర్ చిత్రకళ



తనయుడు
ఖైమూర్ చిత్రకళ


అవలోకితేశ్వరి

అనర్ఘరత్నాలు

– పప్పు వేణుగోపాల రావు

కొన్ని కొన్ని శ్లోకాలు, పద్యాలు, ముందు వెనుక తెలియకుండానే అందులో ఒక పాదమో పంక్తియో తరచూ ఎదో సందర్భంగా చాలా మంది ఉపయోగించడం చూస్తున్నాం.

అందులో తరచుగా ఈ మధ్య వింటున్న మాట

'వినాశకాలే విపరీత బుద్ధిః'

అంటే వినాశకాలం దగ్గిరపడ్డప్పుడు బుద్ధి విపరీతిస్తుంది అని. ఎదో మూడింది లేపోతే ఇలా ఎందుకు ప్రవర్తిస్తాడు అనే ఉద్దేశ్యంలో ఈ శ్లోక పాదం వాడుతాం. దీని మూలం ఏమిటంటే

అళీ – కుళీ – వృశ్చిక – వేణు –
రంభావినాశకాలే ఫలముద్వహన్తి
యథా తథా సజ్జన –
దుర్జనానాంవినాశకాలే విపరీత బుద్ధిః

అంటే తుమ్మెద, పీత, తేలు, వెదురు, అరటి ఇవి నాశనం దగ్గిర పడ్డప్పుడే ఫలిస్తాయట ! ఎలా అంటే మంచి వారైనా చెడ్డ వారైనా వినాశకాలం దాపురించినప్పుడే బుద్ధి వక్రిస్తుందట.

తుమ్మెద, పీత, తేలు, వెదురు, అరటి వీటికి ప్రత్యుత్పత్తి కాగానే అవి మరణిస్తాయిట. వినాశకాల దాపురిస్తే సజ్జనులైనా దుర్జనులైనా విపరీతంగా ప్రవర్తిస్తారు అంటాడు కవి. దీని రచయిత ఎవరో తెలియదు గాని కొందరు మొదటి పాదాలు మార్చి చాణక్య నీతిలో ఈ శ్లోకం ఉందంటారు..

న నిర్మితః కేన న దృష్టపూర్వః
న శ్రూయతే హేమమయః కురంగః ।
తథాపి తృష్ణా రఘునన్దనస్య
వినాశకాలే విపరీతబుద్ధిః ॥

శ్రీ రాముడంతటి వానికి బుద్ధి విపరీస్తే ఎలా ప్రవర్తించేడో చూడండి, ఈ బంగారు లేడిని ఎవరూ ఇంతకూ ముందు సృష్టించ లేదు, ఎవరూ చూడలేదు, వినలేదు, ఈయనకి మాత్రం బంగారు లేడి ఉందనే తృష్ణ కలగడం వినాశకాలే విపరీతబుద్ధి కదా అంటాడు చాణక్యుడు. ఇలాంటిదే అర్థం ఇచ్చే వేమన పద్యం ఒకటి మనం ఇంతకు ముందు చూసేం. అంటే వినాశకాలం దగ్గిర పడ్డప్పుడు బుద్ధి విపరీతంగా పనిచేస్తుంది, వినాశానికి దారి చూపు తుంది అని. ఇదే అర్థంతో మరొక చక్కని శ్లోకం నీతిచంద్రికలో నారాయణ పండితుడు చెప్పేడు, దానిని తెనుగున పరవస్తు చిన్నయ సూరి చెప్పేడు. ఆ శ్లోకం ఆ గద్యం చూద్దాం.

దీప నిర్వాణ గంధం చ సుహృద్వాక్యమురున్ధతీం
న జిఘ్రంతి న శృణ్వంతి న పశ్యన్తి గతాయుషః

నారాయణ పండితుని హితోపదేశం లో ప్రథమ భాగం.

దీన్నే చిన్నయసూరి మిత్రలాభంలో వచనంలో ఇలా అన్నాడు. పోగాలము దాపురించినవారు దీపనిర్వాణ గంధమును, అరుంధతిని, మిత్ర వాక్యమును మూర్కొనరు, కనరు, వినరని పెద్దలు చెప్పుదురు. పోగాలం అంటే పోయేకాలం. పోయే కాలం వచ్చేవారికి, దీపం ఆరిపోతే (నూనె దీపం) వచ్చే ఒక రకమైన వాసన ముక్కుకి సోకదట, మిత్రుల మాట వినబడదట, పెళ్ళిళ్ళలో చూపిస్తారే ఆ అరుంధతీ నక్షత్రం కనిపించదట. ఇది క్రమాలంకారంకి ఉదాహరణగా చెప్తారు. వినాశకాలం అనండి లేదా పోగాలం అనండి అదొస్తే బుద్ధి వక్రిస్తుంది !

చాటువు: శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానంలో అష్ట దిగ్గజాలుండే వారని ప్రసిద్ధి. అందులో ఒక మహాకవి ధూర్జటి. ఆయన శ్రీ కాళహస్తీశ్వరుని యందమితమైన భక్తి గలవాడు. శ్రీకాళహస్తీ శ్వర మాహాత్మ్యం అనే ప్రభంధం శ్రీకాళహస్తీశ్వర శతకం వ్రాసేడు. ఒకనాడు రాయల వారు సభలో ధూర్జటి కవిత్వంలో మాధుర్యానికి అబ్బురపడి

స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేల కల్గెనో
యతులితమాధురీమహిమ?"

ఈ ధూర్జటి కవిత్వానికి ఇంత తీయదనం ఎలా వచ్చిందో అని విస్తుపోయేడట. ధూర్జటికి వేశ్యలయందు కొంత మక్కువవుండేదని వారి శతకంలోనే వారే వ్రాసిన పద్యమే ఋజువు. ఆ విషయం గుర్తొచ్చి తెనాలి రామకృష్ణుడు **వారవనితాజనతాఘనతాపహారి సంతతమధురాధరోదిత సుధా రసధారల** వలననే అని సమాధానం చెప్పేడని చాటువు.

ధూర్జటి కవిత్వంలో ఆకలంకమైన శివ భక్తి, జీవితంలో చేసిన అపరాధాలు, పశ్చాత్తాపము, వైరాగ్యం కనిపిస్తాయి. భక్తిభావ సంభరితమైన శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఒక పద్యం చూద్దాం. శ్రీ అంటే సాలెపురుగు, కాళ అంటే పాము, హస్తి అంటే ఏనుగు, ఈ మూడిటి భక్తికి నిధానమైన క్షేత్రము కనుక అది శ్రీ, కాళ, హస్తి

శా॥ ఏ వేదంబు పఠించె లూత? భుజంగ బే శాస్త్రముల్ సూచె దా
నే విద్యాభ్యసనం బనర్చెగరి; చెం చే మంత్ర మూహించె? బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా? కావు; నీ పాద సం
సేవాసక్తియే కాక జంతు తతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

శ్రీకాళహస్తీశ్వరా! ఎవారికైనా ఏమాత్రం భక్తీ ఉన్నది అనేది ప్రధానం గాని వారేం చదువుకున్నారు, ఏయే శాస్త్రాలు చదివేరు, ఏ మంత్రాలు జపించేరన్నది ముఖ్యం కానేకాదు. సాలె పురుగు ఏ వేదాలు చదువుకుంది? పాము ఏ శాస్త్రాలు అవలోకనం చేసింది? ఏనుగు ఏ విద్యాభ్యాసం చేసింది? ఆ కోయవాడు కన్నప్ప ఏ మంత్రం జపించేడు? వీరందరికీ నీయందు భక్తి తత్పరతయే, వారికి నీ పాదసేవయే సర్వస్వము అంటారు దూర్జటులవారు.

బుద్ధుడు చారిత్రక పురుషుడు!



– డాక్టర్ దేవరాజు మహారాజు

బౌద్ధ సాహిత్యంలో పురాణాల ప్రసక్తి గానీ, హిందూ దేవీదేవతల పేరుగానీ లేవు. కానీ, రామాణయంలో బుద్ధ శబ్దం ఉంది. అంటే అది బుద్ధుడి తర్వాత కాలంలో వెలువడిన రచనగా మనం అర్థం చేసుకోవాలి. బుద్ధుడి కాలం నాటి భాష ప్రాకృత భాష. అదే అప్పటి ప్రజల భాష. ప్రాకృత అంటే ప్రకృతి. స్వభావసిద్ధంగా ఏర్పడింది అని అర్థం. ప్రాకృతానికి మరో రూపం పాలి భాష. ఈ భాషను ధమ్మ లిపిలో రాస్తారు. దేశంలో దొరికిన అతి ప్రాచీన శిలాఫలకాలు, స్థూపాలు, బౌద్ధ సంప్రదాయానికి చెందినవి. మరీ ముఖ్యంగా అశోకుడి కాలం నాటివే – ఎక్కువగా లభించాయి. ప్రాకృత భాష సంస్కరించబడి సంస్కృత భాష అయ్యింది. మొదట అది సంభాషణలకు మాత్రమే పరిమితమైన లిపిలేని ఒక మాండలిక భాష. అది ఆర్యుల వ్యవహారిక భాష. భారతదేశం వచ్చాక, ఇక్కడి నాగరి లిపిలో దాన్ని రాసుకున్నారు. దానికి దేవశబ్దం కలిపి ఆ లిపిని దేవనాగరి లిపి అని అన్నారు. అలాగే సంస్కృతాన్ని ఏకంగా ఉన్నతీకరించుకుని దేవభాష అని అన్నారు.

అబద్దాలు నిలవవు – అనడానికి ఒక మంచి ఉదాహరణ ఏమిటంటే, సంస్కృత భాషలో ఉన్న శిలాఫలకాలు దొరకలేదు. అలాంటప్పుడు సనాతనం – అంటే ఏదవుతుంది? బౌద్ధ ధమ్మం – ధమ్మ లిపి – ప్రాకృత (పాలి) భాష సనాతనమవుతాయి. చారిత్రక ప్రమాణాల మీద కదా మనం ఏ నిర్ణయమైనా తీసుకునేది? సంస్కృతం, పురణాలు, వైదిక ధర్మం వగైరాలన్నీ సనాతనం అని ప్రచారం చేసుకోవడమే తప్ప, అందుకు ఆధారాలు లేవు. అందువల్ల సనాతనమంటే బౌద్ధ ధమ్మం, బౌద్ధ సంస్కృతి అని చెప్పుకోవల్సి ఉంటుంది. చివరికి బుద్ధుడు చెప్పిన వేదన నుండే వైదిక మత ప్రబోధకులు వేదం – అనే పదం సృష్టించుకున్నారు. మన దేశంలో పురాతన సింధూ నాగరికత బయటపడింది. హరప్పా – మొహంజోదారో శిథిలాలలో అవతారాల ఆనవాళ్ళు దొరికితే, వైదిక ధర్మమే సనాతనమైంది అని భావించేవాళ్ళం. కానీ, దొరకలేదు. దొరికే అవకాశమూ లేదు. కారణం అవన్నీ కల్పితాలు కాబట్టి! వాస్తవాలకే ఆధారాలు దొరుకుతాయి. కానీ, ఊహలకు, కల్పనలకూ దొరకవు కదా? అక్కడ అప్పటి నాగరికతకు, సభ్యతకూ ఆధారాలు దొరికాయి. శిలాఫలకాల మీద ఒక లిపి కూడా దొరికింది. అయితే ఆ లిపిని ఎవరూ చదవలేకపోయారు. కానీ అది ద్రావిడ భాష లిపులకు దగ్గరగా ఉన్నట్టు నిపుణులు తేల్చారు.

చైనా, జపాన్, ఇండోనేషియా, థాయ్‌లాండ్ వంటి ఆసియా దేశాలలో బౌద్ధం ఇంకా ఎందుకు ఉచ్ఛస్థితిలో ఉంది? భారతదేశంలో ఎందుకు సన్నగిల్లిందీ? అంటే ఇక్కడ బౌద్ధాన్ని వక్రీకరించి రాసుకున్న వేదాలున్నాయి. బౌద్ధారామాల్ని కొల్లగొట్టి మార్చుకున్న దేవాలయాలున్నాయి. రామాయణంలో నాస్తికుల గూర్చి, చార్వాకుల గూర్చి, బుద్ధుడి గూర్చిన ప్రసక్తి ఉందంటేనే తెలుస్తోంది కదా? వారంతా పురాణకాలానికి ముందు వారని! వారి ఆలోచనా విధానం పురాణ కాలానికంటే ముందు కాలం నాటిదని!! ఒరిజినల్ ఒరిజనలే– కాపీ పేస్ట్ కాపీ పేస్టే! ఋగ్వేదంలో స్థూపాల వర్ణన ఉందంటే అది రాయబడక ముందే బౌద్ధ స్థూపాలు విరివిగా దేశంలో ఉన్నట్టే కదా? బౌద్ధులు విరివిగా ఉన్న దేశాలలో అష్టాంగ మార్గం – అహింస – మధ్య మార్గం శాంతి – కొత్త దిశ వంటివి అక్కడి ప్రజల జీవితాల్లో అంతర్భాగమై పొయ్యాయి. ఇక్కడ మన దేశంలో ఎందుకు కాలేకపోయాయి అంటే ఇక్కడ అంతా కలుషితమై పోయింది కదా. బౌద్ధారామాలు, శిల్పాలు, స్థూపాలు విదేశీ దండయాత్రల వల్ల కొంతవరకు నాశనమైతే, ఇక్కడి బ్రాహ్మణార్యుల, వైదిక ధర్మ ప్రభోదకుల నిర్వాకం వల్ల మిగతావి నాశనమైనవి. పైగా మనువాద భావజాలాన్ని బలవంతంగా జనం మెదడ్లకు ఎక్కించి, అది తరతరాలుగా కొనసాగేట్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. బుద్దుణ్ణి దశావతారాలలో కలుపుకున్నది ఆయన బోధనలు నిలుపుకోవడానికి కాదు. నలిపి పారెయ్యడానికి – నాశనం చెయ్యడానికి అనేది ముందు అర్థం చేసుకోవాలి!

ఇటు హిందూ పురాణాలు, అటు బౌద్ధ సాహిత్యం క్షుణ్ణంగా అధ్యయనం చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రకారం (జాతీ భేద్ క ఉచ్ఛేద్ / Annihilations of Caste వంటి పుస్తకాలు) అవతార వాదం అంతా అబద్ధం. విష్ణు దశావతారాలలో బుద్ధుడు తొమ్మిదో అవతారమని ప్రచారం చేయడంలో నిజం లేదు. ఎందుకంటే అవతారవాదమే తప్పుల తడక. ఉదాహరణకు హరివంశంలో విష్ణు ఆరు అవతారాలు ఎత్తాడని ఉంటే, నారాయణీయంలో పది అవతారాలు ఎత్తాడని ఉంది. వరాహ పురాణంలో పదకొండు అవతారాలు ఎత్తాడనీ ఆ చివరిదైన అవతారం బుద్ధుడిదనీ రాసుకున్నారు. అలాగే వాయుపురాణంలో విష్ణు పన్నెండు అవతారాలు ఎత్తాడని రాసుకుంటే, భగవత్ పురాణంలో ఇరవై రెండు అవతారాలు ఎత్తాడనీ, అందులో ఇరవై ఒకటవ అవతారం బుద్ధుడిదనీ రాసుకున్నారు. మనం ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది ఏమంటే వేదాల రచన, పురాణాల రచన సుదీర్ఘకాలం పాటు సాగింది. కాలానుగుణంగా ఎవరికి తోచింది వాళ్ళు రాసుకున్నారు. అవతారాలకు నిర్దిష్టంగా ఒక సంఖ్య లేకపోవడం, అందులో బుద్ధుడి వరుస సంఖ్య మారుతూ ఉండడం అనుమానాలకు దారి తీస్తుంది కదా? ఊహలకు, కల్పితాలకు ప్రామాణికత ఉండదు. కారణం వాటికి ఏ రకమైన ఆధారాలు ఉండవు కాబట్టి!



"అవతారాలకు ఆధారాలేవీ?" అని వైదిక ధర్మ ప్రభోదకులను, ప్రవచన కారులను అడిగి చూడండి. జవాబు చెప్పలేరు సరికదా క్షణంలో తోకముడిచి పారిపోతారు. చార్వాకులు, లోకాయతులు, బౌద్ధులు, జైనులు... వీళ్ళందరూ భౌతికవాదులు. వీరు మనుషులకు నైతికత కావాలన్నారు. దృష్టి ఈ జగత్తు మీద పెట్టమన్నారు. సమస్యల్ని పరిష్కరించు కుంటూ, మానవ సమాజాన్ని ఉద్ధరించుకోవాలన్నారు. పీడ నుండి, దుఃఖం నుండి, వేదన నుండి బయటపడే మార్గాలు అన్వేషించుకోవలన్నారు. దీనికి పూర్తి విరుద్ధంగా వైదిక ధర్మం ఏం చెప్పింది? బ్రహ్మ – సత్యం అనీ, జగత్తు మిథ్య అనీ అంది. పుణ్యం, పాపం, జన్మ, పునర్జన్మ, మోక్షం వంటి మూఢనమ్మకాల్ని వ్యాప్తి చేసింది. ఎక్కడా లేని పరలోకాల గురించి ప్రచారం చేసింది. వెరసి, మనుషుల ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసింది. హిందూ సన్యాసికి ఈ ప్రపంచంతో సంబంధం ఉండదు. కానీ బౌద్ధ భిక్షువుకు ప్రపంచంతో తప్పక సంబంధం ఉంటుంది. వారు సామాన్య జనానికి సేవ చేస్తారు. బౌద్ధ ధమ్మం బోధిస్తారు. వీరికి స్వంత ఆస్థి అంటూ ఉండదు.

ఇకపోతే, హిందువుల దశావతారాల్లో బుద్ధుణ్ణి చేర్చుకున్నారు కదా? బుద్ధుడు హిందూమతంలో భాగమే అని అంటారు కదా? మరి బౌద్ధారామాల్ని పరిరక్షించుకోవాలని గానీ, పునరుద్ధరించుకోవాలని గానీ వైదిక సంస్థలకు, నేటి ప్రభుత్వాలకూ ఎందుకు ఉండడం లేదూ? విశాఖ పరిసర ప్రాంతాల్లో ఉన్న తొట్లకొండ, పావురాల కొండ, బొజ్జన్నకొండ, లింగాలకొండ లాంటివన్నీ ఎందుకు నిరాదరణకు గురవుతున్నాయీ? విషయాలు తెలుసుకుని, లోతుగా అధ్యయనం చేయాల్సిన విషయం. ఉదాహరణకు ఇక్కడ ఒక ప్రాంతం గురించి ప్రస్తావించాను కానీ, దేశవ్యాప్తంగా శిథిలమైపోయిన బుద్ధ విగ్రహాలు, స్థూపాలు, ఆరామాలు ఎన్నెన్నో ఉన్నాయి కదా? మరి వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదూ? పునరుద్ధరించుకోవడం లేదంటే, అవి తమ వైదిక ధర్మానికి ఏమాత్రం సంబంధం లేనివి అని వారికి కచ్చితంగా తెలుసన్న మాట! వైదిక ధర్మాన్ని నెత్తిన పెట్టుకునే ప్రభుత్వ పెద్దలవి నాటకాలు కావా? చారిత్రక అవగాహన తప్పనిసరి కదా! "సనాతన" బౌద్ధధమాన్ని రక్షించుకుందామన్న చిత్తశుద్ధి అవసరం కదా! మనువాదుల ప్రభావంలో వడి తమను తాము గుర్తించుకోవడం మరిచిపోయిన జనం, ఎప్పుడు వివేకవంతులవుతారో మరి? ఆరామాలన్ని అరాచక కేంద్రాలని ప్రచారం చేశారు. మహా స్థూపాలను అన్యాయంగా 'లంజెదిబ్బ' లన్నారు. స్థూపాలు దిబ్బలైనాయి. విహారాలు గబ్బిలాలకు నిలయాలైనాయి. బుద్ధుడు విష్ణుమూర్తి అవతారమని ఒక మహా అబద్ధం ప్రచారం చేసినవారే ఈ దుర్మార్గాలన్నీ చేశారు. ఇవన్నీ ప్రత్యక్షంగా కళ్ళకు కనిపిస్తున్న విషయాలు. కొన్ని స్థూపాలు నరసింహ క్షేత్రాలయ్యాయి. తిరణాల స్థానంలో

మంత్రతంత్రాలు ప్రతిష్ఠించారు. అష్టాంగ మార్గాన్ని అష్టోత్తరాలుగా మార్చారు. పంచశీలను పాతి పెట్టారు. నిబ్బాణకు బదులు వ్రతాల్ని ప్రవేశపెట్టి, గృహిణుల్ని మానసిక బానిసలుగా మార్చారు. పదిహేను వందల ఏళ్ళపాటు శాంతియుత సుఖమయ, ఆనందకర జీవితాన్ని అందించిన బౌద్ధజీవన శైలిని ఏ రకంగా నాశనం చేశారో రఘుపతి రావు (2010) ఒక పుస్తకంలో విషదపరిచారు.

అశోకుడి కంటే ముందే 'సనాతన' సంస్కృతిలో (అంటే వారి వైదిక సంస్కృతిలో) అనేక స్థూపాలున్నాయని కొందరు తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. సింహస్థంభ, ధ్వజస్థంభ, సూర్యస్థంభ, విజయస్థంభ వంటి వాటి గురించి చెపుతూ – ఇవి భూమి అనంత విశ్వాసన్నుంచి విడిపడడాన్ని (Saparation of earth with infinite cosmos) సూచిస్తాయని చెపుతారు. అయితే ఇందులో సింహస్థంభం, సూర్యస్థంభం బౌద్ధుల శిల్పాలకు పోలికలున్నాయి. అబద్ధాలు ప్రచారం చేసే ఆ మందమతులు ఆ విషయం గ్రహించలేదు. ఇకపోతే అశోక స్థంభాల్ని స్ఫూర్తి (మోడల్)గా తీసుకుని తర్వాత కాలంలో కొందరు ప్రాంతీయ పరిపాలకులు కొంత భిన్నంగా స్థూపాలను నిర్మించి ఉంటారు. కాదనలేం. కార్బన్ డేటింగ్ చేయించి అవి ఏ కాలంవో నిర్ధారణ చేయిస్తే గానీ అసలు విషయం బయటపడదు.

ఏమైనా అశోకుడికి ముందు కాలంలో దేశంలో స్థూపాలన్న విషయం ఏ చరిత్రకారుడూ నమోదు చేయలేదు. ఆనాటి చరిత్రకారుల్ని నమ్ముదామా? లేక ఈనాటి ఈ మిడిమిడి జ్ఞానపు వైదిక హిందూ పడితుల్ని నమ్ముదామా? హేతుబద్ధంగా ఆలోచించేవారు నిజమైన ప్రమాణాల్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు.

ఆనాటి వైదిక మత గురువు శంకరాచార్యకు పెద్దగొంతు, వాదనాపటిమ ఉండి ఉంటుంది. ఉంటే మాత్రం సున్నిత మనస్కులైన బౌద్ధ భిక్షువుల్ని హేళన చేసి, అవమానించి, న్యూనతాభావంతో వారు ఆత్మహత్య చేసుకునే దాకా వదిలి పెట్టేవారు కాదు. మనిషిని మనిషిగా గౌరవించలేని వారు ఎంత ఉన్నత స్థాయి వారైనా హీనుడిగానే గుర్తింపబడాలి. ఎంత చిన్నదైనా స్వంత సృజనాత్మక శక్తి గొప్పది. అరువు తెచ్చుకున్నది అరువు తెచ్చుకున్నదే అవుతుంది. గ్రీకుల కట్టడాలు కాపీ చేసి మందిరాలు నిర్మించుకున్నట్టు – ఈజిప్టు, గ్రీకు దేవతల్ని కాపీ చేసి హిందూ దేవతల్ని ఏర్పరుచుకున్నట్టు పూర్తి ఆధారాలు దొరికాయి. లండన్‌లోని పెట్రీ మ్యూజియం ఆఫ్ ఈజిప్షియన్ ఆర్కియాలజీలో అన్ని ఆధారాలు ఉన్నాయి. కొన్ని ఆధారాలు అంతర్జాలంలో కూడా దొరుకుతాయి. ఇకపోతే– లాభసాటి వ్యాపారాలు నడుస్తాయంటే ఈ మనువాదులు, రేప్పొద్దున అంబేద్కర్‌ను కూడా దేవుడిగా చేసేయ్యగల సమర్థులు! మనువాదుల మాయాజాలం మహా విచిత్రం. సాధారణ శకానికి ముందు బుద్ధుడు ఈ నేల మీద పుట్టి పెరిగి, దేశం నాలుగు చెరగులా తిరిగిన వాడు. కల్పితం కాదు. మరి కల్పించుకున్న దేవుళ్ళలో బుద్ధుణ్ణి చేర్చడమేమిటి? వాస్తవాలకూ భ్రమలకు తేడా తెలుసుకోండి! అందువల్ల విష్ణు అవతారాలలో బుద్ధుడు కూడా ఒకరు అని చెప్పడం వందశాతం అబద్ధం!!

డాక్టర్ దేవరాజు మహారాజు
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

అర్థస్మృతి

మతంలో ఏవో విలువలు ఉన్నట్లు భ్రాంతి కలుగుతుంది తప్పా వాస్తవం కాదు. మతం తత్త్వశాస్త్రం యొక్క అడుగు జాడల్లో నడవవలసి ఉంది. మతం ఎప్పుడైతే తత్త్వశాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుందో.. మతం కాలక్రమేణా అస్థిత్వాన్ని కోల్పోయి ఒక అన్వేషణ మార్గంలో, జిజ్ఞాస మార్గంలో పయనిస్తుంది. సమాజానికి, వ్యక్తికి కావల్సింది ఇదే. అన్ని మతాల రీతిలో బౌద్ధం మతం కాదు. అది ఒక అన్వేషణ పథం.

మతమౌఢ్యం మాదిరిగా తాత్త్విక మౌఢ్యం కూడా ఉంటుంది. ఒక అజస్రవంతిలా ప్రవహించవలసిన తత్త్వ జిజ్ఞాస తన అన్వేషణలో విసుగు చెంది, తాను దర్శించిన దానితో సంతృప్తి చెంది, ఒక నిర్ధారణకే వచ్చి, అదే అంతిమ సత్యం అనే నిర్ణయానికి వచ్చినప్పుడు తాత్త్విక మౌఢ్యం ఏర్పడుతుంది. అలాంటి స్థితి ఏర్పడినప్పుడు మరలా కొత్త జవజీవాలతో పయనించవలసి ఉంటుంది. అంతులేని అన్వేషణ ద్వారా సమగ్రతకు, సత్యానికి దగ్గరగా వచ్చే అవకాశం ఉంది.

– ముంగర జాషువా



– డా. పురాణపండ రాఘవరావు

భగవద్గీతలో నిష్కామ కర్మయోగమును గూర్చి విపులంగా బోధించాడు శ్రీ కృష్ణభగవానుడు. ఆ కర్మయోగం గురించి మరింత వివరముగా వివేకానందస్వామి ప్రవచించారు. సనాతన ధర్మ వైశిష్ట్యము గురించి ప్రపంచవ్యాప్తముగా ప్రవచించిన మహాత్ముడు స్వామీ వివేకానంద. ఆయన దృష్టిలో నిష్కామ కర్మయోగమును మనసా వాచా కర్మణా అనుష్టించి చూపిన మహనీయుడు గౌతమబుద్ధుడు. అంతేగాక కర్మయోగమును సంపూర్ణముగా ఆచరణలో చూపినవాడు బుద్ధుడు మాత్రమేయని నొక్కి వక్కాణించారు స్వామి. ప్రపంచమున బుద్ధుడు వినా యితర ప్రవక్తలందరూ తమను తాము స్వార్థరహిత కర్మాచరణము నకు పురికొల్పుటకు బాహ్యేశయములను కలిగియుండిన వారు. బుద్ధుని మినహాయించి మిగిలిన ప్రవక్తలను రెండు తరగతులుగా విభజించవచ్చును. మొదటి తరగతి వారు తాము భగవంతుని అవతారములని పేర్కొన్నారు. రెండవ తరగతి వారు తమలను కేవలం భగవంతుని దూతలు (కుమారులు)గా చెప్పియున్నారు. వారి భావములు ఎంతటి పరమార్థ భావము కలిగియున్నను ఉభయపక్షముల వారు కర్మాచరణమునకు బాహ్యము నుండియే ప్రేరణ పొందియున్నారు. బాహ్యలోకముల నుండి ఫలములను ఆశించిరి.

కాని సిద్ధార్థుడు మాత్రమే యీ రీతిగా వక్కాణించినాడు. పలు విధములైన మీ సిద్ధాంతములతో నాకు పని లేదు. ఆత్మను గూర్చిన సిద్ధాంత రాద్ధాంతములు చేయుటవలన ఏమాత్రమును ప్రయోజనము లేదు. సత్కర్మలను చేయుచూ సజ్జనులుగా జీవించండి. మంచి పనులు చేయుచూ సజ్జనులుగా జీవించినచో మోక్షమును మీరు పొందగలరు అని బుద్ధుడు బోధించిన విషయములను మనం గుర్తించాలి.

బుద్ధుని జీవితాన్ని పరిశీలించి చూచినచో ఎటువంటి స్వార్థ చింతనయు కనబడదు. లోకహితము కొరకు గౌతమ బుద్ధుని కంటె ఎవరును ఎక్కువ కృషి చేయలేదని వివేకానందులు నొక్కి చెప్పారు. తాను బోధించిన అంశములను ఆచరణలో చూపిన సిద్ధార్థుని మించిన సచ్చరిత్రుని మానవకోటి చరిత్రలో వేరొకరిని చూపగలమా? అని స్వామి సూటిగా ప్రశ్నించారు. గౌతముని వలె సమస్త జీవులను ఆదరించిన, అఖండ సానుభూతిని చూపిన సచ్చరిత్రుడు విశ్వచరిత్రలో ఇంతవరకు వేరొకరు పుట్టలేదని వివేకానంద పేర్కొన్నారు.

మహోన్నత తత్త్వమును బోధించిన తత్త్వజ్ఞ శిఖామణియగు గౌతమ బుద్ధుడు, పరమ నికృష్ట జీవులను కూడా కరుణామయుడై ప్రేమించినాడు. ఎంత మహాత్కార్యములు చేసినను తనను గురించి ఎక్కడను ఎప్పుడును చెప్పుకొనని మహనీయుడు గౌతముడు. స్వార్థరహితుడై జీవించిన బుద్ధుడు "ఆదర్శ కర్మయోగి" అనుట ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అఖండ ధీశక్తితో, అపార ఔదార్యముతో, అనంతాత్మ ప్రభావ భాస్కరునిగా వెలుగొందిన బుద్ధుడు అనుపమాన మహనీయుడు గాదా! మానవ చరిత్రలో అతనికి సాటియగు వారు వేరొకరు లేరు. ప్రపంచ మహా సంస్కర్తలలో అతడే అగ్రగణ్యుడు.

బుద్ధుడు ఇలా ప్రవచించాడు. ఏవో కొన్ని ప్రాచీన వ్రాత ప్రతులలో ఉన్నంత మాత్రాన, ఒక విషయమును యదార్థమని నమ్మకుడు. పరంపరాగతమని కూడా దేనిని సత్యమని నమ్మ వలదు. దేశాచారమని కూడా వాస్తవమని నమ్మకండి. ఏ విషయమైనను సంపూర్ణముగా పరిశీలించి, కార్యకారణము లను సమగ్రముగా విమర్శించిన తరువాత మాత్రమే, సమస్త మానవ శ్రేయస్కరమని మీకు విశ్వాసము కలిగిన తరువాత మాత్రమే ఏ విషయము నైనను నమ్మగలరు. నమ్మిన దానికి అనుగుణముగా నడుచుకొనగలరు. ఇతరులు మంచి విషయములను అనుసరించునట్లుగా మీరు తోడ్పడండి. ధనమును గాని, పేరు ప్రతిష్ఠలను గాని వాంఛించక, స్వార్థ రహిత కర్మపరాయణుడైన వాడు మాత్రమే మహోత్తమ కర్మయోగి కాగలడు అని గౌతముడు బోధించినాడు. పై రీతిగా ఆచరించు మానవుడు "అపర బుద్ధునిగా ప్రకాశించగలడని" గౌతమ బుద్ధుని గొప్పదనమును గూర్చి స్వామి వివేకానంద పేర్కొన్నారు.

ప్రపంచ ప్రఖ్యాతి గన్న స్వామి వివేకానంద సిద్ధార్థ గౌతముని "నిష్కామ కర్మయోగము"ను ప్రశంసించినారు.

పురాణపండ రాఘవరావు
రాజమహేంద్రవరం

మనమే బాధ్యులం

– అశ్వినీ కుమార్

మన కష్టాలన్నిటికీ కారణం – వంశానుగతంగా సంప్రాప్తించిన విధి వ్రాతలే అనుకుంటాం.

లేక మన పూర్వీకులు చేసిన పాపఫలం అనుకుంటాం లేదా ఏ కోపగించిన దేవతలో – దెయ్యాలో కారణం కావచ్చు అని కూడా ఆలోచిస్తాం.

ఒక్క క్షణం ఆగి పరికించండి – ఈ దుఃఖ మూలాలు మీలోనే ఉన్నాయేమో?

సంకోచమెందుకు – ఆ బాధ్యత మీదే సుమా! నీ వైఫల్యాలన్నీ నీ కార్యాలే – నీ కష్టాలన్నీ నీ 'కష్ట' ఫలమే.

కానీ తన కష్టాలకీ, దుఃఖానికీ మరెవరో బాధ్యులనుకుంటే మనసు తేలికపడుతుంది. ఇదీ మానవ నైజం. లోక సహజం!

మన లోపాలను – బలహీనతలను తరచి చూసుకోవడానికి ఇష్టపడం. దీనికేమైనా కుంటి సాకు దొరుకుతుందేమోనని వెతుకుతుంటాము.

ఎంత చేతకానివాడైనా తన చేతలను సమర్థించుకోవడానికే – ప్రయత్నిస్తాడు, ఇష్టపడతాడు. నమ్ముతాడు కూడా. ఆ రకంగా ఒక దెయ్యాన్ని సృష్టించుకుని–తను నమ్మి, ఇతరులను నమ్మించటానికి విశ్వప్రయత్నం చేస్తాడు. అలా తన బుద్ధి తక్కువ తనాన్ని (దెయ్యాన్ని) తను నమ్మి – ఎదుటివాళ్లతో నమ్మించడం ఎల్లకాలం కుదరదు కదా–

బుద్ధుడంటాడు – 'బుద్ధితక్కువ తనాన్ని గుర్తించలేకపోవటమే – అసలు బుద్ధిహీనత' అని. ఏదైనా పొరపాటు చేస్తే అది నీ పనేనని అంగీకరించవు. దీనికి చాలా ధైర్యం కావాలి – తన తప్పుకు తనే కారణమని తెలుసుకోవడానికి ధైర్యమే కాదు – ఆ దుఃఖాన్ని భరించే శక్తి కూడా ఉండాలి! నీ తప్పులు నువ్వు అంగీకరించడానికి బుద్ధి కుశలతా అవసరమే!

బుద్ధుని మాట 'ఇతరుల లోపాలను చూడటం తేలిక – తన లోపం తను గుర్తించడం కష్టమైన కార్యమే' అని.

ఏదో పరిస్థితులు కలిసిరాలేదు – అంతే – లేకపోతే నాకీ గతి పట్టేది కాదు – అని తను చేసిన పొరపాటును సమర్థించుకోవడానికి ఇష్టపడతాం.

కష్టాలు చుట్టుముట్టినప్పుడు నవ్వుతూ భరించటం అలవాటు చేసుకోవాలి – ముఖం డీలా వేసుకుని 'కొంప మునిగి' పోయినట్లు ప్రవర్తించకూడదు. అవసరమైతే ధైర్యాన్ని కూడతీసుకుని పరిస్థితి మార్చటానికి ఏమాత్రం అవకాశమున్నా ప్రయత్నించాలి. ఎవరినో నిందిస్తూ కూర్చుంటే – మరింతగా కూరుకుపోతావు!

ఒకవేళ ఆ మార్పు నీ పరిధిలో లేకపోతే – ఆ విషయాన్ని ధైర్యంగా అంగీకరించాలి.

నీకు అదృష్టం కలిసి రాలేదు – అని నిందించోవద్దు. అసలా పరిస్థితి రావటానికి నీ చేతలు ఎంతవరకూ కారణమో ప్రశాంతంగా అంచనా వేసుకోవాలి. నీవు చేసిన తప్పులు ఒక్కొక్కటి గుర్తించగలిగితే – నువ్వు వాటినుంచి బయట పడతావు – నీకు సంతోషం కలిగించే పరిస్థితులు నువ్వే సృష్టించుకోగలుగుతావు – ఆత్మవంచన అరిష్టదాయికం!

నీ కష్టాలకు కారణాలు:

బుద్ధుని బోధ ప్రకారం 'మన విధి – మనమే నిర్ణయించు కుంటాము' నీ కష్టాలకు, దుఃఖానికి ఎవరినీ నిందించవలసిన పనిలేదు. ఆ బాధ్యత పూర్తిగా మనదే. దుఃఖమైనా సంతోషమైనా!

మన చుట్టూ ఉన్న పరిసరాలు – పరివారం ఎంత వత్తిడి తెచ్చినా మన కష్టాలకీ – మన ఆనందానికి మన చర్యలే కారణం – దీనినే 'కర్మ' – మన కార్యాల పర్యవసానమే – ఈ 'కర్మ' – అందుకని దాని ఫలితాలను స్వీకరించటానికి సిద్ధంగా ఉండాలి. ఈ విధంగా చూసినపుడు – మనిషి విధిని రాసే – మానవుడో దేవుడో ఎక్కడో ఉన్నాడనే ఆలోచనరాదు – నీ అంతిమ యాత్రను ఎవ్వరూ అడ్డుకోజాలరు! నీ పతనాన్ని ఎవ్వరూ రచించరు – ఆపనూలేరు – మానసికంగా స్వచ్ఛంగా ఉంటే ఆలోచనాపరంగా ఆచరణలోనూ నిష్కలంకంగా ప్రవర్తించ గలిగితే నీ 'కర్మ' కూడా స్వచ్ఛంగా ఉంటుంది.

మనసు నిండా చెడు ఆలోచనలతో కల్మషంగా నీ పరిస్థితులను మార్చుకుంటే అదే నీ వ్యక్తిత్వం, అదే నీ విధి!

నీ 'కర్మ'కు కారణాలు తెలియకపోయినా నువ్వు మంచిగా ఉండు – మంచి పనులు చేయి. నీ కష్టాల నుండి గట్టెక్కుతావు.

నీ నిరాశను నీవు సృష్టించుకుంటే నీ సదాలోచనలతో దానిని అధిగమించగలవు – మంచి 'కర్మ'కు నీవే మార్గదర్శి – అవి నీ చేతలే – అదే 'కర్మ'గా బుద్ధుడు విశదీకరించాడు.

నీ కష్టాలకు నీ చేతలే కారణమని చెప్పాము కదా – నీ చేతలేమిటి? – లోభంతో – ద్వేషంతో – భ్రమలతో కూడినవి – ఇవి మూలాలు!



నీ వేదనకు కారణం, ఖరీదు – నీ దురాశ – భౌతిక సుఖాలపై వెంపర్లాట.

మానసిక క్షోభ – భౌతికమైన బాధలు – దురాశతో కూడిన ఆలోచన వలన – ద్వేషంతో చేసే చేతలవలన కలిగేవి.

దీనికి ఒక ఉదాహరణ – నీవు నివసించే ఇంటికి అద్దెకట్టాలి కదా – అలాగే నీవు అనుభవించే భౌతిక సుఖాలకు – మానసిక వేదనే – అద్దె అన్నమాట. దురదృష్టం ఏమిటంటే ఏదీ ఉచితంగా రాదు కదా – నీవు ఎంతగా 'తృష్ణ' అనే ఇనుప గొలుసులలో చిక్కుకుంటావో అంతగా మానసిక వేదన అనుభవించాల్సి వస్తుంది. ఈ మానసిక క్షోభ నుంచి బైటపడాలంటే నీ భౌతిక సుఖాల వేట తగ్గించుకోవాలి.

ఇక్కడ నీకున్న వెసులుబాటు – నీవు ఎంచుకోవటమే మనోవేదన నుంచి విముక్తి కావాలంటే – భౌతిక తృష్ణను త్యజించాలి – అప్పుడే నీవు ఆధ్యాత్మికమైన ఆనందాన్ని పొంద గలవు. ఇందులో రెండు దారులు ఉండవు.

* * *

ఎవరిది బాధ్యత – ఎవరు కారణం?

ఒక నానుడి ఉంది – కుసంస్కారి ఇతరులను నిందిస్తాడు – అర్ధసంస్కారి తనను తనే నిందించుకుంటాడు – కాని సంస్కారి ఎవ్వరినీ నిందించడు!

అందుకే నీ సమస్యలను సంస్కారిలాగా ఎదుర్కొని పరిష్కరించుకోవాలి. ఎవరో కారణమని, అనుకొని పరులను నిందిస్తే సమస్య – కష్టంగా మారుతుంది. ప్రక్కవాళ్లు శత్రువులుగా కనపడతారు – నీ సమస్యను నువ్వు గుర్తించలేని గుడ్డివాడవు అయిపోతావు!

సరే – 'నా సమస్యలకు – కష్టాలకు పరులు కారణం కాదు – నా చేతకానితనమే' అని నిన్ను నువ్వు నిందించుకోవలసిన అవసరం లేదు.

బయటవారిని కాని, నిన్ను నువ్వుకాని, వేలెత్తి చూపాలను కోవటం, ప్రతికూల మార్గం. దానివలన నీవున్న స్థితి, కష్టకాలం మారిపోదు. ఆ ధోరణి ప్రక్కనపెట్టి ధైర్యంగా పరిస్థితిని ఎదుర్కోవాలి. నీ ఆలోచనలు మంచి మార్గంలో ఉండాలి. ఇది సాధన ద్వారానే సమకూరుతుంది. అదే నిన్ను సమస్యల నుండి కష్టాల నుండి గట్టెక్కిస్తుంది. నీవు జీవించే ఈ ప్రపంచం మరింత సంతోషంగా దర్శనమిస్తుంది. ఈ ధోరణి అందరికీ మేలు చేస్తుంది.

ఆత్మనింద – పరనింద నుంచి బయటపడితే – నీకు ప్రపంచంతో స్నేహం కుదురుతుంది. పరిస్థితులను సరైన వెలుగులో చూడకలుగుతావు – నువ్వు ఈ పరిస్థితులలో భాగమని – ప్రపంచంలో బ్రతుకుతున్నావని తెలుసుకోగలుగుతావు. అందుకనే నీవు మంచిగా ఉంటే లోకం మంచిగా ఉంటుంది. నీవు దుర్మార్గంగా ప్రవర్తిస్తే ప్రపంచం నిన్ను శిక్షిస్తుంది.

లోకాన్ని – లోకులను నిందిస్తూ నువ్వు మంచివాడవు కాలేవు.

ఉన్నది ఉన్నట్లు తెలుసుకోగలిగితే – చూడగలిగితే నీవు నిందించడానికి ఎవ్వరూ కనపడరు. కానీ ఈ స్థితికి చేరాలంటే చాలా జ్ఞానం కావాలి, ధైర్యం కావాలి, నీకు నువ్వు తెలియాలి! అన్ని బాధ్యతలూ నువ్వే మోయాలి!

కష్టాలను ఎలా తగ్గించుకోవాలి?

ఇప్పుడు నీ సమస్యలను, కష్టాలను గట్టెక్కి – నీ తోటివాళ్లతో నీవున్న పరిసరాలలో శాంతియుతంగా ఎలా జీవించవచ్చో చూద్దాం!

1. సమస్యలను ఎదుర్కోవటం.

ఎప్పుడు సమస్య – దాని ఫలితంగా కష్టం కలిగినప్పుడు ఆ సమస్య మూలాలేమిటి – కారణాలేమై ఉండవచ్చు అని విశ్లేషించుకోవాలి – వాటంతటవే – పరిష్కారమయిపోతాయి అని చేతులు ముడుచుకుని కూర్చోకూడదు – నీ ప్రణాళికలన్నీ, నల్లేరు మీద బండలాగా వెళ్లిపోతాయి అనుకుంటే పొరపాటే! కానీ వీటికి ముఖ్యకారణం నీవు ఆశించే – తృష్ణతో – వెంపర్లాటే

కారణమని గ్రహించాలి! అన్నీ నీకనుకూలంగా – నీవాశించి నట్లుగా జరిగిపోవాలనుకోవటమే నీ నిరాశకు మూలం!

చంద్రుని కళల్లాగా అన్నీ మారుతుంటాయి. అనుకూలంగా కొన్ని, వ్యతిరేకంగా ఎన్నో! అదృష్ట – దురదృష్టాలు – పరిస్థితి పరిసరాలు నీ ఆలోచనా ధోరణినే ప్రతిబింబిస్తాయి. బుద్ధుడు ఎనిమిది సూత్రాలు చెప్పాడు – లాభనష్టాలు, గౌరవాగౌరవాలు, నిందాస్తుతులు, కష్టసుఖాలు – ఇవే నిన్ను – ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్నాయి – అని!

ఈ ప్రపంచం తీరు – ఎప్పుడూ నీకనుకూలంగా ఉండాలని లేదు.

పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నాయనుకుంటే – ఇదే అంతం – ఇక నాకు దారి లేదు అనుకుంటావు! ప్రపంచం అంతా కుట్ర పన్ని నీకు వ్యతిరేకంగా పనిచేస్తుందని వాపోతావు!

నీ చుట్టూ ఉన్న ప్రపంచం కుప్పకూలక ముందే, నీకంటే ఎక్కువ బాధల్లో ఉన్నవారిని గమనించు – కేవలం నీ జేబులో డబ్బు పోయిందని విచారించే ముందు – గొడ్డూ గోదా – కొంపా గోడూ కోల్పోయినవారిని గుర్తు చేసుకో – వారి కష్టాలు, బాధలు ముందు నీది చాలా స్వల్పం అని తెలుసుకో.

నీవు నల్లగానో, అందవికారంగానో పుట్టావని విచారించే ముందు గుడ్డివాళ్లను, వికలాంగులను చూడు – మానసిక రోగులను గమనించు – వారితో పోలిస్తే, నీవి కష్టాలేమీ కాదు – నీవు నీ ధోరణి మార్చుకుంటే నీ లోపాలన్నీ గాలికెగిరిపోతాయి – నీ శాపాలన్ని వరాలుగా దర్శనమిస్తాయి!

చైనాలో ఒక సామెత ఉంది– "నీకేమైనా సమస్య – పెద్ద సమస్య ఉందా? దానిని చిన్నగా చేసి చూడు. నీకేదైనా చిన్న సమస్య ఎదురైందా దానిని అసలు సమస్యే అనుకోకు" – అంతే – సమస్యలన్నీ పటాపంచలైపోతాయి!

నిజంగా నీవు ఆశ్చర్యపోతావు సుమా – సమస్యలను నిజస్వరూపంలో దర్శిస్తే – సరైన వెలుతురులో చూస్తే – అన్ని పటాపంచలైపోతాయి. చీకటి గదిలో దీపం పెట్టినట్లు!

ఒకప్పుడు నీవు అసాధ్యమనుకున్న సమస్యలు తరువాత ఎలా పరిష్కారమయినాయో గుర్తుకు తెచ్చుకుంటే ప్రస్తుత సమస్య కూడా అల్పంగానే కనిపిస్తుంది. చార్లీ చాప్లిన్ అంటాడు – "ఏదీ శాశ్వతం కాదు – చివరికి నీ కష్టాలు కూడా!" అని!

వోల్టేరు అంటాడు– "ఈ ప్రపంచం – నేను రాకముందు ఎలా ఉందో వచ్చిన తర్వాత అలాగే ఉంది. వచ్చిన తర్వాత ఎలా ఉందో – వెళ్లిపోతున్నప్పుడు అలాగే ఉంది" అంటే ఇక్కడ మన ప్రభావం ఎంత ఈషణ్మాత్రమో!

ఇలా ఆలోచిస్తే – నీ సమస్యలు పరిష్కరించుకోవడానికి మానసిక స్థైర్యం దొరుకుతుంది. మనోబలంలో – భౌతిక వనరులతో నీ సమస్యలకు నీవే పరిష్కరించుకుంటావు – ఇంతకంటే పెద్ద సమస్యలను ఎదుర్కొని – దాటుకుని ఇక్కడి వరకూ వచ్చావు కదా! ఇలాంటి పరిస్థితి నీ సమస్యల్ని, అతిగా చేస్తుంది – అసలు సమస్యలే నీకు కష్టాలను తెచ్చిపెట్టవు – నిన్ను మరింత దృఢంగా తీర్చిదిద్దుతాయి.

అందరికీ కష్టాల కోటా ఉంటుంది – ఎవరి సమస్య వారికి పెద్దగా దాటరానిదిగా కనపడుతుంది. ఇవే సమస్యలు మరొకరికి అసలు సమస్యలే కాదనిపిస్తుంది. ఏమిటి వ్యత్యాసం?

అదే – సమస్యలను ఎదుర్కొనే మానసిక పరిస్థితి.

ఇక్కడే మీకు చిన్న కథ చెప్తాను – పదిమంది పరిచయస్తులు కూర్చున్నప్పుడు అందరూ సమస్యల గురించే మాట్లాడుకుంటున్నారు – నాలాంటివాని సలహా – ఎవ్వరి సమస్యలు వారు రాసి ఇక్కడ పెట్టండి – అని. అలాగే చేశారు. అన్నీ కలిపి – ఇప్పుడు తలా ఒక చీటీ తీసుకోండి – అలాగే చేశారు – కానీ అవి చదివిన తర్వాత చివరికి ఎవరు రాసిన చీటీ వారే తీసుకుని వెళ్లారు!

ఈ ప్రపంచం సమస్యలమయం – అందులో నుంచి నవ్వుతూ బయటపడటమే జీవితం! నీ సమస్యలను మరొకరికి బదిలీ చేయకపోవడమే సమాజ సేవ!

2. మానసిక శాంతి – మన బాధ్యత:

మన మానసికస్థితి– మన మనశ్శాంతిని నిర్దేశిస్తుంది. నువ్వు ప్రశాంతంగా ఆలోచిస్తే శాంతిగా ఎక్కువ సమయం ఉంటావు. నువ్వు ప్రతికూలంగా చింతిస్తే మనశ్శాంతి పోగొట్టుకుంటావు.

నీ గర్వాన్ని అదుపులో పెట్టుకోగలిగితే అహాన్ని అణిచి పెట్టగలిగితే – వినయ సంపద పెంచుకోగలిగితే నీ ప్రశాంతికి భంగం వాటిల్లదు – అహంకారంతో ప్రతికూల పరిస్థితులను సృష్టించుకుంటే మస్తిష్కంలో ఊగిసలాట ఇతరులను దూరం చేస్తుంది. నీ ప్రవర్తన ఇతరులు భరించలేని స్థితిగా దాపురిస్తుంది. సంకుచితమైన స్వార్థపూరిత ధోరణి – నీకు శత్రువులను సృష్టిస్తుంది – నీకు హాని చేస్తుంది. మానసిక క్షోభను కలిగిస్తుంది. అదే నీవు – పరిస్థితులు ఎలా ఉన్నా – మనోనిబ్బరంగా అనుకూల ధోరణిలో ఉండగలిగితే సంతోషంగా– స్థిరంగా కాలం గడపవచ్చు. కాని ప్రతికూల పరిస్థితులకు నీవు లొంగిపోయి – వ్యతిరేక ధోరణితో నిన్ను నువ్వు గాయపరచుకోవటమే కాదు – ఇతరులనూ దూరం చేసుకుంటావు.

ఉదాహరణకు – నీవు పనిచేసేచోట నిన్ను విమర్శించే వారున్నారనుకో – నీకు తరచూ అవమానంగా – నీ అభిమానం దెబ్బతింటుంది. నీ అహం చిన్నబోతుంది. ఈ ఆలోచనలు నీ మీద ప్రభావం చూపే ముందు–ఆ విమర్శలలో నిజమెంత అని పరిశీలించాలి. దానిలో సత్యముందని – నీ మేలుకోసమే చెప్తున్నారని తెలుసుకుంటే – అలాంటి విమర్శలను – అంగీకరించాలి– విశ్వాసంతో; వాటిని నీకు ఉపయోగపడే విధంగా మలుచుకోగలగాలి. దానివలన నీకు మేలే జరుగుతుంది కదా!

ఒకవేళ నీమీద అసూయతోనో మరే కారణంతోనో నిన్ను తప్పు పడుతున్నారని నీవు కనుగొంటే – అప్పుడు కూడా నీ ప్రశాంతతను పోగొట్టుకోవలసిన అవసరం లేదు – వాటిని – వారిని నిర్లక్ష్యంగా పరిగణించు – అనత్యాలను నీవు అంగీకరించవలసిన పని లేదు!

నీవు నిబద్ధతతో – నిజాయితీగా నీ కర్తవ్యాన్ని నెరవేరుస్తుంటే ఎటువంటి చెడు ప్రకటనలు లెక్కచేయవలసిన పనిలేదు – నీవు 'ధమ్మా'న్ని నమ్ము.

అదే నిన్ను రక్షిస్తుంది. నీకు నువ్వు నిజాయితీగా ఉన్నావో లేదో నీ 'కర్మ' సరిగా నిర్వర్తిస్తున్నావో లేదో అంచనా వేసుకోవలసింది – నీ మనస్సాక్షి మాత్రమే!

బుద్ధుడంటాడు– "సాత్వికుని – నిజాయితీపరుణ్ణి ఇబ్బంది పెట్టేవాడు–మూర్ఖుడే–ఎందుకంటే–గాలిమీద దుమ్ము జల్లగలవా?"

నిన్ను నువ్వు రక్షించుకోగలవు. ఇతరుల విమర్శలను – నిర్లక్ష్యం చేయగలిగినపుడు.

అంతేకాదు – ఇతరులతో నీవు ప్రవర్తించే తీరు – నీ మానసిక పరిస్థితినిబట్టి ఉంటుంది. ఆందోళనలో ఉంటే వారితో నీ ప్రవర్తనలో సాధారణ పరిస్థితి ఉండదు – ఇతరులకు – కరుణ – క్షమా పంచగలిగితే నీకు అవే తిరిగి వస్తాయి.

వారిని ద్వేషంతో చూస్తే – నీకు అదే ప్రాప్తిస్తుంది. నువ్వు ఎదుటివారిమీద అసహనంతో ఉంటే నీకూ ప్రతికూలంగానే పరిస్థితి తయారవుతుంది.

ద్వేషంతో ప్రేమను పొందగలవా?

అంటే ఈ బాధ్యత నీ మీదే ఉందన్నమాట – ఇతరులతో మంచి సంబంధాలు – సంతోషకర పరిస్థితులను కలిగి ఉంటే – నీవు ప్రశాంతంగా జీవించగలుగుతావు!

3. ఇతరులతో పోలికలు ఎందుకు?

మరొకరితో పోల్చుకోవటం నిన్ను నువ్వు తక్కువ/ఎక్కువ చేసుకోవటమే. దానివలన నీకు లేనిపోని కష్టాలు దాపురిస్తాయి. మరొకరు నీకు స్ఫూర్తిగా ఉంటారనుకుంటే నీకు మేలు జరగవచ్చు – కాని నిన్ను నువ్వే అంచనా వేసుకుని – ఫలానావారికంటే నేను పైమెట్టులో ఉన్నాను – లేదా క్రింద ఉన్నానేమో అని అనుమాన పడటం – నీ అశాంతికి కారణమవుతుంది.

ఇతరులతో సమానంగా ఉన్నాననుకుంటే నీ అభివృద్ధి కుంటు పడుతుంది – వారికంటే తక్కువ స్థాయిలో ఉన్నాననుకుంటే నీ ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. నీ అశాంతికీ ఈ రెండూ కారణమే.

అందుకని పోలికలు మానుకో–

ఎక్కువ – తక్కువ లేదా సమానం – ఇవన్నీ ఎప్పుడూ మారిపోతుంటాయి. స్థిరంగా ఉండే స్థితి కాదు సమయాన్ని బట్టి – సందర్భం – ప్రదేశం కూడా కారణాలు కావచ్చు.

ఈ చరాచర జగత్తులో – జీవన్మరణాల వర్తులంలో – సమయ సందర్భాలనుబట్టి ఉన్నంతగానో – నిమ్నంగానో – ఒకరికొకరు భిన్న సమయాల్లో జీవిస్తుంటాం – ఒక్కోసారి కోటీశ్వరుడు కావచ్చు – మరోసారి బిచ్చమెత్తవచ్చు – ఎవరు చెప్పగలరు?

4. ఎవరినుంచీ ఏమీ ఆశించకు – నీకు నిరాశే ఉండదు!

మనందరికీ ఎన్నో కోరికలు, ఆశలు ఉంటాయి. అవి ఏదోనాడు నెరవేరతాయని ఆశా ఉంటుంది. నీ ఆశా విశ్వాసాలే నిన్ను ముందుకు నడిపేది. కష్టనష్టాలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిచ్చేది. నిన్ను ఉన్నత ప్రదేశాలకు తీసుకువెళ్లేది.

నా కలలు తప్పక నెరవేరతాయి అనే ఆత్మవిశ్వాసం నిన్ను శక్తివంతునిగా – ప్రకాశవంతునిగా నిలుపుతుంది! కాని – కేవలం కలలు – పగటికలలు కంటూ – వాటిని సాకారం చేసుకోవడానికి ఎటువంటి శక్తియుక్తులో, శ్రమా–శ్రద్ధా పెట్టకుండా కూర్చుంటే నిరాశే ఎదురవుతుంది. నీ శ్రమకు తగిన ప్రతిఫలం రాలేదని అనుకోవటం ప్రారంభిస్తే నీకు నిరాశే మిగులుతుంది. కేవలం భ్రమలే నీ శక్తిని హరిస్తాయి.

నీ శక్తిని – నీ శ్రమను ఇతరులకు మంచి చేయటానికి ఎక్కువ ఉపయోగించు. దీనివలన ఎదుటివారిని – నిన్ను నువ్వు సంతోషంగా ఉంచుకోగలవు – మంచి కార్యం చేయటమే – గొప్ప విషయం – గొప్ప ఫలం కూడా – నీవు సంతోషంగా ఉండాలంటే – నీ పరిసరాలు పరివారాన్ని సంతోషంగా ఉంచ గలగాలి. స్వార్థంతో నీకు నువ్వు గూడుకట్టుకుంటే ఒంటరిగా మిగిలిపోతావు!

ఏ సమాజంలోనైనా కృతజ్ఞత గొప్ప గుణం – అరుదైన లక్షణం కూడా – అందుకనే నీవందుకునే – సమాజపరంగా

– దయ – కరుణ – కృతజ్ఞతా ఎంతో విలువైనవి. నిన్ను బాధ్యత గల పౌరునిగా నిలబెట్టేవి. నీ అభివృద్ధికి బాట వేసేవి.

ఇదే సమయంలో నీవు ఇతరులకు సహాయసహకారాలు అందించే సమయంలో ప్రతిఫలం ఏమీ ఆశించకు. అప్పుడు నీకు నిరాశ ఎదురు కాదు. ఒకవేళ అలా ఆశించితే – నిన్ను నువ్వు వారి దయాదాక్షిణ్యాలకు గురిచేసుకుంటున్నట్లు భావించాలి. ఒకవేళ వారు నీకు కృతజ్ఞత చూపకపోతే – అలాంటి వాటిని వారి మతిరుపుగా భావించి మరిచిపోవాలి! నీ సేవలను గుర్తించి నీకు కృతజ్ఞతలు తెలియజేసినవారిని – నీకు మంచి అవకాశం కలిగించిన సజ్జనులుగా గుర్తించాలి. ఇది ఈ ధోరణి అలవాటు చేసుకుంటే నీ మనశ్శాంతికి – నీ సంతోషానికి ఎటువంటి ఆటంకం ఉండదు.

5. ఓర్పు – అర్థం చేసుకునే నేర్పు:



తరచుగా కాకపోయినా అప్పుడప్పుడు మనకు ఇతరులవల్ల కలిగే క్లేశపాశాలు ఇబ్బంది పెడతాయి. మనశ్శాంతిని భంగ పరుస్తాయి. కానీ దానికి మన 'కర్మ', బాధ్యత కారణంకాదు కదా!

అలాంటి సమయంలోనే అమాయకులైన బాధితులు ఒక్క విషయం గుర్తించాలి. ఈ విశాల ప్రపంచంలో అన్నిరకాల మనుష్యులు వారివారి వింత చేష్టలతో మంచివో చెడ్డవో మన చుట్టూ ఉంటారని గుర్తుంచుకోవాలి. మనం మంచిగా ఉన్నా 'చెడుకు' గురి అవుతుంటామని తెలుసుకోవాలి. వాటిని తట్టుకునే శక్తిని, ఓర్పుని అలవాటు చేసుకోవాలి.

దీనికి ఒక ఉదాహరణ చూద్దాం. జాగ్రత్తగా, బాధ్యతగా కారు నడిపేవారుంటారు. అలాగే నిర్లక్ష్యంగా – దురుసుగా నడిపేవారూ ఉంటారు.

బాధ్యతగల చోదకుడు – ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ జాగరూకతతో కారు పోనిస్తాడు. అంతేకాదు – రాబోయే ప్రమాదాలను ముందుగానే అంచనా వేసుకుని జాగ్రత్త పడతాడు. దీనిని మన జీవితానికి అన్వయించుకుంటే – మనం నిర్లక్ష్యపు చోదకుని నుంచి దూరంగా ఉండవచ్చు – అతన్నుంచి తప్పించుకోనూవచ్చు – అతని 'చెడు' నుంచి దూరంగాను మసలవచ్చు! మనం వారిని మార్చలేనప్పుడు – దుష్టులకు దూరంగా ఉండాలి అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. లేదంటే మీరూ ఆ సుడిగుండంలోకి లాగబడతారు!

మీరు నిజంగా శక్తివంతులైతే పరిస్థితి మరోరకంగా మార్చవచ్చు. నిర్లక్ష్యంగా చెడు కర్మలను ఆచరించేవారిని దూరంగా పెట్టకుండా వారిని మంచి మార్గంలోకి తెచ్చే ప్రయత్నాలు చేయవచ్చు. వారి పాపాన వారు పోతారులే అని వదిలివేయకుండా, 'అరె, వీరు మన తోటివారే – వీరికి మంచి మార్గం చూపగల శక్తి మనలో ఉంది' అని విశ్వసించి కార్యోన్ముఖులు కావచ్చు.

ఎవ్వరైనా – తన అజ్ఞానంతో అవిద్యతో తప్పుడు మార్గంలో పయనించవచ్చు – తన సంతోషం కోసం – దాని సాధన కోసం – అదే మార్గమని నమ్మకంతో ప్రవర్తించవచ్చు – సరిగ్గా అలాంటి సమయంలోనే మీ ఆత్మవిశ్వాసం – విద్యా జ్ఞానం వారికి సన్మార్గాన్ని చూపేందుకు ఉపయోగపడాలి. ఓర్పుతో – దయతో వారిని గెలవాలి సుమా – అంతేకాదు – అలాంటి అవకాశం మీకు కలిగించినందుకు – వారికి మీరు కృతజ్ఞత కూడా తెలియజేయాలి. ఇలాంటి సత్కార్యాలు – మీ కష్టాలను – నిరాశలను జయించటానికి ఎంతో దోహదం చేస్తాయి. దుష్కర్మలు ఆచరించే వారు – మీ ప్రవర్తన – మీ బలహీనతగా తీసుకుని – మిమ్మల్ని అవమానపరచవచ్చు – కానీ మీరు దృఢచిత్తంతో – సత్సంకల్పంతో ముందుకు వెళ్తే ఒకరోజున వారే మిమ్మల్ని సరైన వెలుగుతో చూడగలరు. వారి తప్పుల్ని వారు గుర్తించగల రోజు వస్తుంది. అందుకు మీ ఓర్పు – దయాగుణం ఎంతో అవసరం!

6. క్షమించి – మర్చిపోవాలి:

మీకు సమస్యలు తెచ్చిపెట్టేవారిని శిక్షించాలనుకుంటే దాని వలన మరిన్ని సమస్యలు ఎదుర్కోవాలి. ప్రతీకారం – అగ్నిలాంటిది – అది మీ మనసులో రగిలితే కేవలం భ్రమలను వెలిగిస్తుంది. ఆ మంట ఎంతగా పెరుగుతుందంటే – తన

మార్గంలోకి ఎవరు వచ్చినా దహించివేస్తుంది – ముందుగా కాలిపోయేది – మీరే అని గుర్తుపెట్టుకోవాలి. అందుకని ప్రతీకారేచ్ఛ – స్వీయ నాశనానికి దారితీస్తుంది.

ద్వేషం, విషంలాంటిది – నీకు నువ్వు నీ నరాల్లోకి ఎక్కించుకునే కాలకూటం – నీవు ఎవ్వరికో ఇవ్వాలనుకునే నీవు శత్రువుగా భావించేవారికే అనుకున్నా – ఈ లోపుగా దానికి నీవే బలి అయిపోతావు – విషం – ఎవ్వరికైనా విషమే సుమా! మరొకరి మీద బురద జల్లాలంటే ముందు మన చేతులు బురదలో పెట్టాలి కదా!

బుద్ధుడంటాడు– "శత్రువుల మధ్య – శాంతిగా, సంతోషంగా ఉండాలి–మనల్ని ద్వేషించేవారి పట్ల ద్వేషం లేకుండా జీవించాలి."

సంస్కారంతో, తెలివితో మెలగాలి. ద్వేషంతో, కోపంతో కాదు. నిన్ను బాధించేవారిని – దురాశతో, స్వార్థంతో మత్తెక్కి ఉన్నాడని గుర్తించాలి. దానికి వారి అజ్ఞానమే కారణమని క్షమించాలి. అలాంటి పరిస్థితులు అందరికీ – ఎక్కువమందికే ఎదురుకావచ్చు. క్షమించి – మరిచిపోవటం అలవాటు చేసుకోవాలి. దీనికి సాధన అవసరం. ఇలాంటి క్షమ – జాగరూకత సాధనతోనే సాధ్యం – అప్పుడు మీకు మీ తృష్ణ మీద నియంత్రణ ఉంటుంది. మీ 'కర్మ'ను సదాచారంగా నిర్వర్తిస్తారు. మీ బలహీనతలేమిటో – మీ శక్తి ఏమిటో గుర్తిస్తారు. ఇలాంటి జ్ఞానం – మీకు దురాలోచనలను, దురాశల నుంచి దూరం చేస్తుంది. నిన్ను నువ్వు అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తే ఇతరులు నీకు సరైన దారిలో (వెలుగులో) అర్థమవుతారు – వారి లోభం – స్వార్థం – అజ్ఞానం వారి దుష్కర్మలకు ఎలా కారణమో మీకు తెలిసివస్తుంది. వారు అశాంతిని ఎలా పంచిపెడుతున్నారో అవగాహనమవుతుంది. ఆ ఎరుకతో నీతోపాటు వారినీ ఆధ్యాత్మిక మార్గంలో నడపవచ్చు. దాని పర్యవసానం వారి మనసులు దయతో నిండిపోవటానికి అవకాశం ఉంటుంది. వారు సృష్టించిన సమస్యలను సరైన రీతిలో చూడగలిగిన ఓర్పు వస్తుంది. క్షమాగుణం అలవడుతుంది. దీనంతటికీ ఎంతో నేర్పు కావాలి – ఓర్పు ఉండాలి – క్షమించడం సాధన చేయాలి.

బుద్ధుడు బోధించింది – చెడ్డవారు – చెడ్డవారు కాదు – జన్మతః దుర్మార్గులు కారు – వారి దుష్కర్మలకు వారి అవిద్యయే కారణం – దాని మూలంగా వారిని దూరం పెట్టకూడదు. వారిని ఓర్పుతో సన్మార్గంలో నడిపించే ప్రయత్నం చేయాలి అని!

ఈ దయా – ఓర్పు – జ్ఞానం – వీటితోనే దుష్కర్మలు చేసేవారిని – జబ్బుపడినవారికి మందులు ఇచ్చి నయం చేసినట్లుగా సన్మార్గంలోకి నడపాలి. రోగం ఉందని రోగిని బజారులో పడవేయం కదా – అతనికి రోగం నయం చేయించి మంచిగా బ్రతకటానికి మరో అవకాశం కలిగించాలి!

ప్రేమతో – ఓర్పుతో – దయతో ఎంతటి చెడునైనా భరించి – మార్పు తేవచ్చు – నీ శత్రువుల్ని స్నేహితులుగా మార్చుకోవచ్చు.

బుద్ధుని మాట – ద్వేషాన్ని ద్వేషంతో అంతం చేయలేవు – కేవలం ప్రేమతోనే గెలవాలి – ఇది శాశ్వతమైన సూత్రం" అని.

ఎవ్వరైనా నీకు కీడు చేస్తుంటే – అతన్ని సన్మార్గంలోకి మార్చటానికి ప్రయత్నించు – బుద్ధుడు ఎన్నోసార్లు ఇదే చెప్పాడు – "ఎంతగా నాకు కీడు జరుగుతుంటే – అంతగా 'మంచి' నాలో వెలుగుకుంటుంది" అని అంటాడు.

మనకు ఇది సాధ్యమా అని అనుమానం వస్తుంది. మనకు జరిగే కీడుని మంచిగా ఏ విధంగా మార్చగలం అని.

కానీ కీడుకి – కీడు పరిష్కారం కాదు – దానివలన మరింత కీడు జరుగుతుంది – అందరికీ – నీవరకూ నీవు – కీడును, మంచిగా మార్చటానికి ప్రయత్నించు.

దీనిని భౌతికమైన కార్యంగా చూడకూడదు. బౌద్ధిక కర్మగా దర్శించాలి – ఈ ప్రేమ భావాన్ని సర్వజీవరాశులకు వర్తింప జేయగలగాలి.

సదాలోచనలు – సత్ప్రవర్తన – సర్వేజనా సుఖినోభవంతు అనే భావన – నిన్ను శక్తివంతునిగా శాంతి మనస్కునిగా తీర్చిదిద్దుతాయి.

ఇవి ఇప్పటికిప్పుడు కష్టసాధ్యంగా అనిపించినా నిన్ను నువ్వు శాంతంగా నిలుపుకోవటానికి – ద్వేషాన్ని ద్వేషంతో ఎదుర్కోవటం మానుకోవాలి.



మనోధర్మ - సంగీతము

- అమినేని సిద్ధయ్య నాయుడు

ప్రకృతిని పరవశింపజేస్తూ, విశ్వంలో విలీనమై ఆనంద సాగరంలో విహరింపజేసేదే సంగీతము. సర్వజనులకు ఇంపై, మనసును ఉల్లాసపరుస్తూ, శరీర, మానసిక రుగ్మతలను స్పృశించే ఒకానొక ఔషధము లాంటిది. ఒక్కో రాగం ఒక్కో రోగాన్ని నయం చేయగలదని, శాస్త్ర పరిశోధకుల మాట. ఆధునిక వైద్యశాస్త్రం నయం చేయలేని కొన్ని ప్రత్యేక వ్యాధులను సంగీతము ద్వారా బాగు చేయవచ్చునని నిరూపిస్తున్న నేటి విజ్ఞానశాస్త్ర పరిశోధకులు సంగీత సాగరంలోకి అడుగిడితే అదొక అంతులేని అగాధం. అందులోని గాత్ర సంగీతానికి సంబంధించినదే ఈ మనో ధర్మ సంగీతము.

లలిత కళలలో దృశ్య కళలు, శ్రవ్యకళలని ద్వివిధములు. దృశ్యకళలు చూడసొంపైనవి కాగా, వినసొంపైనవి శ్రవ్యకళలు. శ్రవ్యకళలు నాద జగత్తునకు సంబంధించినవి. ధ్వన్యాత్మకము వర్ణాత్మకము సంగీతము రెండు విధములుగా వర్ధిల్లుచున్నది. ధ్వన్యాత్మకమైనది జంత్ర సంగీతము కాగా వర్ణాత్మకమైనది గాత్ర సంగీతము. జంత్ర సంగీతమున వాద్యము మ్రోగునపుడు జనించు ధ్వనియే వినబడుచుండును. మాటలుండవు. జంత్రము మనకు నాదమునే వినిపించును. కానీ అర్థము వ్యక్తపరచదు. అర్థములు మాటలకు చెందినవే కానీ నాదమునకు చెందినది కాదు. నాదము చెవి కింపును, మనసునకు ఆహ్లాదము కలిగించును. గాత్ర సంగీతమున పాడుచున్నపుడు మాటలు వినిపించును. మాటలకు అర్థములు ద్యోక్తమగును. సంగీతమున సాధారణముగ భాషకును, అర్థమునకు ప్రాముఖ్యము కలిగి ఉండుట సహజము. కానీ అచ్చపు సంగీతము వీనిని అతిక్రమించియు వ్యవహరింప గలదు. నాద మధురిమ అందు ప్రధానము. రాగాలాపన, జంత్ర వాద్యపు సంగీతము, మనసును రంజింపజేసి పరవశింప జేయుట ఇందువల్లననే పరవశింపజేయుట ఇందు వల్లననే పరివధిల్లంప (సంఘటిల్ల) చేయబడుచున్నది.

భాషను అతిక్రమింప గలిగినదే నిజమైన సంగీతము. భాష వ్యక్తపరచలేని వాటిని ఇది స్పష్టపరచగలదు. రాగాలాపనలో భాష ఉండదు. భాషకు అతీతమగు సంగీతము విశ్వజనీనము. అది ఏ అర్థమును వ్యక్తపరచదు. ఏ విషయ వస్తువును వివరింపదు. విశుద్ధ ఆనందమును ప్రసాదించుటయే దాని విశిష్ట ప్రయోజనం. శ్రోతల హృదయాలను ఉర్రూతలూగించి ఆనందపరవశులను గావించగలదు.

భారతీయ సంగీతము సామవేదము నుండి ఆవిర్భవించిన దనియు, మహాదేవుడు తన చేతిలోని డమరుకము ద్వారా సంగీతములోని లయను కాపాడు చున్నటులను, బ్రహ, విష్ణువులు భారతీయ సంగీతమునకు ప్రముఖ ప్రవర్తులని, పారంపర్యముగ భారతదేశమున వినబడుచున్నది.

పురారచితము గాక, సద్యస్ఫూర్తితో చేయు రాగాలాపన, తానము, స్వర కల్పనాదులు, మనోధర్మ సంగీతమని వ్యవహరింపబడుచున్నది. శాస్త్రీయ సంగీత కచేరీలలో మనోధర్మ సంగీతము దాదాపు మూడవ వంతు సమయము నాక్రమించును. తక్కిన కాలము కృతి, కీర్తనాది క్రియలకు (రచనలకు) వినియోగింపబడును.

భారతీయ సంగీత చరిత్రలో రాగ భావన ప్రవేశించిన నాటి నుండి మనోధర్మ సంగీత ముండినదనియే చెప్పవచ్చును. ఇటీవల వరకు ఈ సంగీతమున ఒక్కొక్కరు, ఒక్కొక్క శాఖలో ప్రత్యేక నైపుణ్యమును సంపాదించి యున్నారు. విద్వాంసులు ఆయా శాఖలలో నైపుణ్యమును సంపాదించి, ప్రసిద్ధి నొంది, పేరు ప్రఖ్యాతులు గాంచి, ఆయా శాఖల విశిష్ట స్థానము సూచించు బిరుదములతో చరిత్రలో నిలిచిపోయి ఉన్నారు. ఉదాహరణకు 'తోడి' రాగము నాలాపించి వాసికెక్కి, ఆ రాగముతోనే తోడి సీతారామయ్య అని ప్రజల నోళ్ళలో నిలిచి యున్నారు. అలాగే అతాణా అప్పయ్య, శంకరాభరణం నరసయ్య, వీణ కుప్పయ్యర్, పట్నం సుబ్రమణ్య అయ్యర్ బేగడ మొదలగువారు. ఆయా విద్వాంసులు, ఆయా రాగముల ఆలపించుటలో గల ప్రతిభా వ్యుత్పత్తుల సూచించు బిరుదు నామమున పల్లవి గోపాలయ్య, పల్లవి శేషయ్య... పల్లవి గాన సుప్రసిద్ధులు. త్యాగరాజు సైతము పల్లవి రాగాలాపనలో విశిష్ట స్థాన ప్రజ్ఞావంతులైనను, కృతికర్తగా అతడు చూపిన ప్రతిభా విశేషముల ముందు అవి మరుగునపడినవి.

రాగాలాపన చేయుటలో పాటించవలసిన రెండు జాగ్రత్తలు 1. రాగ భావవ్యక్తము, 2. ఇతర రాగ భావము. వ్యక్తము కాకుండా జాగ్రత్తపడాలి. రాగశుద్ధి చెడరాదు.

కర్ణాటక సంగీతమున మనోధర్మ రీతియందు ఐదు విభాగములు గలవు. 1. రాగాలాపన, 2. మధ్యమకాలము (తానము,ఘనము), 3. పల్లవి, 4. స్వరము, 5. నెరవు.

1. రాగాలాపన యనునది ప్రాచీన కాలము నుండి కొనసాగుచున్నది. రాగపద్ధతి క్రమముగా వికాసమునంది మధ్యమ కాలముగ రూపొందినది. పల్లవి, స్వర కల్పనలు రెండు శతాబ్దల ముందు వికాసము నందినవని చెప్పవచ్చు. రాగాలాపన రెండు విధములు. 1. సంగ్రహాలాపన, 2. సంపూర్ణ ఆలాపన.

ఏదైనా ఒక రాగములో రచనలు గానము చేయుటకు ముందు సంగ్రహాలాపన చేయబడును. అందువలన తాను పాడబోయె రచనలోని ప్రత్యేక భావనలు వ్యక్తము కావలెను. రాగాలాపనకు "తదరినంతోం' అను శబ్దము వినియోగింతురు. అర్థరహితములైన ఇతర శబ్దముల వాడుట ఉచితము కాదు. ఆలాపనలో శబ్దముల వెనుగగల నిండైన నాదమే ప్రధానము.

సంపూర్ణాలాపన :- సంగీత సభామధ్యమున పల్లవి పాడుటకు ముందు చేయబడు రక్తిరాగములు విస్తృత రాగాలాపనకు తగినవి. ఘనరాగముల ఆలాపన, మధ్య కాలములు రెండింటికి తగియున్నవి. దేశీయ రాగములు క్లుప్తమైన ఆలాపనకు మాత్రం తగినవి. విస్తృతాలాపన యోగ్యములైన తోడి, కాంభోజ, కళ్యాణి వంటివి బృహద్రాగములు. మిగిలినవి అల్పరాగములు.

రాగాలాపననే రాగవిస్తారమని అంటారు. ఇందు మూడు విభాగములుండును.

1.అక్షిప్తిక పరిచయము : ఇందు ఆలాపన మధ్యమ స్థాయిలో ప్రారంభించి, మంద్ర తారములను స్పృశించుచు రంజక ప్రయోగముల సహాయయుత రాగము పరిచయము చేయబడును. దీనిని సమయానుకూలముగ తారాస్థాయిలో కూడా ప్రారంభించవచ్చును. దీనివలన రాగమంతటిని క్లుప్తముగా ఆలపించినట్లగును.

2. రాగవర్ధని : రాగ విస్తారము యొక్క క్రమ సోపానయుత రాగ వర్ణములు. విస్తృత ఆలాపనలో నాలుగు రాగవర్ణములుండును. ప్రతి రాగవర్ధనియు 'ఎడుప్పు'లను ఎత్తుగడలో ప్రారంభమై 'ముక్తాయి' అను ముగింపుతో ఉండును ఈ ముక్తాయిలకే 'విదారులు' అందురు. రాగవర్ధనికే 'కరణము' అనియు నామము గలదు. ప్రథమ రాగవర్ధని, ద్వితీయ రాగవర్ధని, తృతీయ రాగవర్ధని, చాతుర్థ రాగవర్ధని అని నాలుగు వర్ణములు గలవు.

స్థాయీ సంచారము: ఇది రాగాలాపనలో చివరి అంశము. ఒక స్వరమున ప్రారంభించి హెచ్చుగానీ, తగ్గుకానీ మరో స్థాయిలో అదే స్వరము వరకు సంచారము చేయుట 'స్థాయి' అంటారు. అటుల ప్రారంభించిన స్వయము స్థాయీ స్వరము మధ్య షడ్జమున ప్రారంభించి మంద్రషడ్జము వరకు రెండు మూడు సంచారములు చేసి తిరిగి మధ్యషడ్జమును బట్టుట మధ్య షడ్జస్థాయీ ఆలాపన అని పిలువబడును. ఈ విధంగా మధ్యస్థాయిలోని షడ్జాది స్వరములు క్రమముగా స్థాయీ స్వరములుగ జేసికొని మంద్ర స్థాయిలోని ఆయా స్వరముల వరకు రెండు మూడు సార్లు సంచారము చేసి, స్థాయి స్వరములలో వచ్చి నిలుచును. క్రమముగా తార షడ్జమునకు వచ్చి నిలచుటను ఆరోహణ స్థాయి సంచార మందురు. దీనిలో స్థాయి స్వరములు మాత్రము అవరోహణ క్రమములో ఉండుటను గమనించదగినది.

పిమ్మట మూడు స్థాయిలలోను రాగరంజని ప్రయోగములలో ద్రుతగతిలో సంచారము గావించి రాగాలాపనను ముగింతురు.

2.తానము లేక మధ్యకాలము : తానమనునది రాగాలాపనలోని ఒక ముఖ్య శాఖ. చౌకకాల ఆలాపనకు పిమ్మట మధ్యమ కాలములో ఒక విధమైన లయతో కూడి పాడెడు దానిని 'తానము' అని అంటారు. ఇది శ్రోతలకు నూతనోత్సాహము కలిగించి, ఆసక్తిని పెంపొందించును. తానము బిగువైన నడకతోను, నడుమ నడుమ గతి భేదముల తోను కూడి మిగుల రంజకముగా ఉంటుంది. ఇందులో 'తానంత' 'తానన్న' 'తానమ్మ' అను శబ్దములను వాడుట వాడుకలో ఉంది.

తానమునకు 'మకరిణి' లేక 'వర్తని' అని పేర్లు కలవు. స్వరముల సహాయముతోనే పాడుటను 'స్వరతాన' మందురు. ఇది తానా భ్యాసమునకు ఒక మెట్టు.

ద్రుత కాలములో పాడెడు తానమును 'ఘనము' అందురు. ఇందలి సంగీతము మిగుల వేగముగ నడచును. తానములలో ఎనిమిది విధములైన, వానిని ముఖ్యముగ పరిగణిస్తారు. అవి మానవ, అశ్వ, గజ, మర్కట, మాయూర, కుక్కుట, మండూక, చక్రవాక తానములు.

3. పల్లవి : క్రమ ప్రస్తారముతో చిగురించే సంగీత వాక్యమునే 'పల్లవి' అని పిలుస్తారు. ఇందులోని 'ప' పద గర్భమునకు 'ల' లయకును, 'వి' విన్యాసమునకు చిహ్నములని విజ్ఞుల భావన. సంగీత విద్వాంసులలో పల్లవి విద్వాంసులు

విశిష్టులుగ పరిగణింపబడుచున్నారు. 'పల్లవి'లో ప్రథమాంగము, ద్వితీయాంగమును ముగించు మకుట ప్రాయమైన న్యాసము 'పదగర్భము' అనబడును. ఇచట కొన్ని క్షణముల విశ్రాంతి తర్వాత ద్వితీయాంకము ప్రారంభమగును.

పల్లవి పాడుటలో క్రింది క్రమమును పాటించుట పరిపాటి. 1. ప్రతిపాదన: కచ్చేరి ప్రధాన గాయకుడు రాగము, తానము పాడి ముగించిన తరువాత పల్లవిని ప్రారంభించి, దానిని సహకార వాయిద్యముల వారు చక్కగా అవగాహన మొనర్చుటకు వీలుగా అనేక పర్యాయములు పాడి వినిపింతురు. 2. సంగతులు: ప్రధాన సంగీత వాక్యమును క్రమసంగతులతో పరిపుష్టము చేసి పాడుట పల్లవిలోని రెండో మెట్టు. 3. అనులోమ, ప్రతిలోమములు: తాళమును స్థిరముగ ఉంచి, పల్లవిని రెండు రెట్లు, నాలుగు రెట్లు వేగముతో నడుపుట అనులోమము. పల్లవి వేగమును స్థిరముగ ఉంచి, తాళమును చేతితో రెండు రెట్లు, నాలుగు రెట్లు వేగముతో నడుపుటను ప్రతిలోమమంటారు.

4. త్రిశ్రమ: తగిన పల్లవులతో త్రిశము చేయుట క్రయాంశము.

5. నెరవు: నెరవనగా నింపుటయని అర్థము. పల్లవి భాగములను సంగీతములో అందముగా నింపుచు తిరిగి తిరిగి పాడుటయే నెరవు. దీనిని సాహిత్య ప్రసారమని చెప్పుదురు.

6. స్వర కల్పన : పల్లవిని ప్రస్తరించిన పిదప స్వరకల్పన చేయుదురు. మొదట అర ఆవర్తన స్వరయులత ప్రారంభించి, ఒకటి, రెండు, నాలుగు, ఎనిమిది ఆవర్తనములు కల్పన చేసి తగిన ముక్తాయి స్వరములతో ముగించి, పల్లవిని అందుకొందురు. పిమ్మట పల్లవి నడకను కొంచెం వేగపరచి, మధ్యమ కాలమున కొన్ని ఆవర్తనముల స్వరకల్పన చేసి పల్లవిని ముగింతురు.

పల్లవి ముగిసిన వెనుక చేయు ప్రత్యేక లయ వాద్య విన్యాసము మిక్కిలి జన రంజకముగా వినోదమును కలిగించును.

4. స్వర కల్పన : పల్లవులకును, కృతి కీర్తనాదుల పల్లవి, అను పల్లవి, చరణములలో తగిన పాదములకును స్వరకల్పన చేయుట వలన ఆయా స్వరముల గమకార్యం, కారములతో లయబద్ధ రాగ భావనను ప్రదర్శించుటకు వీలుగా నుండును. ఇందు రాగ భావము ప్రస్ఫుటమై ఉండవలెను. కల్పిత స్వరములు సహజముగ, అందముగను ముగియ వలెను.

5. నెరవు : సంగీత వాక్యములోని భాగములను కొంగ్రొత్త సంగీతములతో ఎప్పటికప్పుడు నింపుచు పాడుటనే నెరవు అందురు. పల్లవిలోనే కాక కొన్ని కృతులలోని విశిష్ట పాదములు నెరవునకు ఎంతగానో తగియున్నవి. నెరవు పాడునపుడు తాళము, సాహిత్యానికున్న స్థానమును తప్పిపోకుండునటుల చూచుకొనవలెను.

నెరవునకు మంచి సాహిత్యము భావావేశము గల కొన్ని పాదములే తీసి యుండును. ఇందలి మాటలను తిరిగి తిరిగి పాడవలసి యుండుట వలన శుభప్రదమైన వాక్యములనే ఎన్నుకొనవలసి యుండును.

(మాన్యులు అమినేని సిద్ధయ్యనాయుడు ఇటీవల పరమపదించారు.)

అమినేని సిద్ధయ్య నాయుడు

మల్లిక్



మల్లిక్

వేలాది కార్టూన్లలో కోట్లాది పాఠకుల్ని రంజింపచేసి మల్లిక్, ప్రత్యేకశైలి గల తెలుగు కార్టూనిస్టు. జనవరి 6వ తేదీన పుట్టిన వీరు కార్టూన్లు మొదలుపెట్టింది 1971 లో. ఆకాశవాణి, ఆంధ్రబ్యాంక్‌లలో ఉద్యోగం చేసిన వీరు ఫ్రీలాన్స్ కార్టూనిస్టుగా మన్నన పొందారు.

నల్లాన్ చక్రవర్తుల మధుసుదనాచార్యులు

నల్లాన్ చక్రవర్తుల మధుసూదనాచార్యులు, కలంపేరు మాధవ్. 1973 మార్చి 7 పుట్టిన తేదీ. 1989 నుండి మొదలు పెట్టి వీరు సుమారు 8000 కార్టూన్లు వేశారు. ఆంధ్రప్రభ (హైదరాబాద్) దినపత్రికలో స్టాఫ్ కార్టూనిస్టుగా పని చేస్తున్నారు.



మధుసూదనాచార్య

(మన కార్టూనిస్టులు – సత్తిరాజు శంకర నారాయణ)



జ్ఞానతంత్రులను మీటే ఆక్స్‌ఫర్డ్

– డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

ఈ ప్రపంచంలో ఒక వందసార్లు చూసినా, నాకు విసుగు పుట్టించని నగరం ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్. ఆకాశాన్ని, భూమిని కలుపుతున్నట్లు కనిపించే గోపురాలతో (స్పైర్స్) అలరారే ఆక్స్‌ఫర్డ్‌ను, మాథ్యూ ఆర్నాల్డ్ అనే విక్టోరియన్ కాలం నాటి ఇంగ్లీష్ కవి 'స్వప్నించే సౌధశిఖరాల నగరం'గా అభివర్ణించాడు. అక్కడ ఉన్న భవనాలు, చర్చ్‌లకున్న గుండ్రని గోపురాలు, కోసుగానున్న సౌధశిఖరాలు ఆకాశంలోకి చొచ్చుకొని పోతున్నట్లుగా ఉండటమే ఈ వర్ణనకి కారణం. నాకైతే ఈ గోపురాలు, సౌధశిఖరాలు అక్కడ విద్యనభ్యసించి ఆకాశమంత ఎత్తుకెదిగిన మహామహులను సూచిస్తున్నాయా! అన్నట్లుంటాయి. ఈ నగరాన్ని 'ఉన్నత ప్రమాణాలతో వెలిగే జ్ఞానాన్వేషకుల నగరం'గా కూడా భావించవచ్చు. బహుశా నేను చేసే ఈ పరిచయం అంతా అనవసరమెమో! కాని దశాబ్దాల తరబడి, ఇంకా చెప్పాలంటే శతాబ్దాల తరబడి 'పాలలో వెన్న' లాంటి విద్యాధికులు, తత్త్వవేత్తలు, శాస్త్రజ్ఞులెందరినో సానబెట్టిన నగరంగా ఆక్స్‌ఫర్డ్ నా మనసులో ఒక స్థిరమైన స్థానంలో ఉంది. ఈ నగరంలో అడుగుపెట్టగానే ఒక విధమైన అభౌతిక స్పృహ మనల్ని తాకుతుంది. అది బహుశా, అప్రాపంచిక విలువలతో, విశ్వాసాలతో, ఉన్నత విజ్ఞానాన్ని శోధించే, విద్యాన్వేషకుల స్వతంత్ర దృక్పథం నుండి వెలువడి, వ్యాపించే భావతరంగాల తాలూకు తాకిడేమో!!

ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ కూడా ఇది ఒక కలల నగరం. విద్యా రంగానికి ప్రపంచంలో ఎలాంటి పరిచయం అవసరం లేని నగరం ఆక్స్‌ఫర్డ్. ఆ పేరెంతో చారిత్రాత్మక ప్రాధాన్యతకు, ఉన్నత ప్రమాణాలకు చిరునామా. పాండిత్య పరాకాష్టానికి నిదర్శనం, పర్యాయపదం కూడా. శతాబ్దాల నుండి వస్తున్న విద్యాసాంప్రదాయాలను గౌరవిస్తూ ఎంతో పరిణతిని సాధించిన ఈ విశ్వవిద్యాలయం ఎంతో మంది విద్యార్థుల్ని మేధావులుగా చేసి, వారిలో ఉన్నత మైన భావాలకి, ఆలోచనలకి బీజాలు నాటి, ప్రపంచ పురో గమనానికి దోహదమయింది.

ఆక్స్‌ఫర్డ్ అంటే చాలా మందికి గుర్తుకు వచ్చేది ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమే. కాని అక్కడకు వెళ్ళిన వారికి 'ఆక్సఫోర్డ్ యూనివర్సిటీ ప్రాంగణం' ఏమీ కనబడదు. నిజానికి స్వయం ప్రతిపత్తి కలిగిన 30 కళాశాలల కూటమే ఆక్స్‌ఫర్డ్ యునివర్సిటీ. ఈ కూటమిలో ఉన్న ఒక్కొక్క కళాశాల ఒక చిన్న విశ్వవిద్యాలయం స్థాయిలో ఉంటుంది. ఆక్స్‌ఫర్డ్ చరిత్ర చూస్తే, క్రీ.శ.1096వ సంవత్సరం నుండి ఇక్కడ విద్యాబోధన జరుగుతూనే ఉంది. 1167వ సంవత్సరంలో కింగ్ హెన్రీ-2 ఇంగ్లీషు విద్యార్థుల ఉన్నత విద్య కోసం పారీస్ వెళ్ళటాన్ని నిషేధించినప్పటి నుండి వారంతా ఆక్స్‌ఫర్డ్ చేరుకోవడంతో ఆక్స్‌ఫర్డ్ మరింత ప్రాచుర్యం లోకి వచ్చింది. ఇంగ్లీష్ మాట్లాడే దేశాలలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యా లయం అతి ప్రాచీనమైనది. ఐరోపాలో నిరంతరాయంగా ఏళ్ళ తరబడి విద్య గరపిన విశ్వ విద్యాలయాలలో ఇటలీలోని బోలోగ్నా యునివర్సిటీ మొదటిదైతే, ఈ విభాగంలో ఆక్స్‌ఫర్డ్ రెండవది.



Oriel College Building

నేను ఇంగ్లాండులోని 'న్యూబరీ' అనే మార్కెట్ టౌన్‌లో ఉంటున్నాను. ఇది లండన్‌కి పడమరగా 45 మైళ్ళలో, ఆక్స్‌ఫర్డ్‌కు దక్షిణం గా 25 మైళ్ళలో ఉంటుంది. న్యూబరీ చుట్టూ సందర్శకులు

చూడ వలసిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. విదేశాల నుండి ఎవరైనా అతిథులు వచ్చిన ప్పుడు మాకొక పద్ధతి ఉంది. నా శ్రీమతి వారికి లండన్ నగరం, దాని పరిసరాలు చూపిస్తుంది. నేను మాత్రం వారిని ఆక్స్‌ఫర్డ్, విన్‌చెస్టెర్, స్టోన్ హెంజ్ తీసుకెళతాను. ఆ విధంగా ఆక్స్‌ఫర్డ్ కళాశాలలు నాకు సుపరిచితం. చుట్టూ కోట గోడలలా కట్టబడిన ఎత్తైన గోడల మధ్య విశాల ప్రాంగణాలు, తరగతి గదులు, గ్రంథాలయాలు, చర్చ్‌లు, ఆర్ట్ గ్యాలరీలు, మ్యూజియంలు, విద్యార్థులు, ఆధ్యాపకుల కోసం వసతి గృహాలు మొదలైన వాటితో ఒక్కొక్కటీ ఒక చిన్న స్వతంత్రమైన ఊరులా ఉంటాయి. నాకు ప్రత్యేకంగా నచ్చేవి కొన్ని కళాశాలలో నేను చూసిన భోజనశాలలు, అక్కడ పురాతన సంస్కృతిని ప్రతిఫలించే సంప్రదాయ దుస్తులలో విద్యార్థులు, అధ్యపకులు కలిసి కూర్చుని మాట్లాడుకుంటూ భోజన సమయం గడపడం నాకు బాగా నచ్చింది. అవి నాకు విజ్ఞానాన్ని స్రవించే తేనెపట్టులా కనపడతాయి. పాతకాలంలో ఘనీభవించిన శిలజాలుగా కనిపించే ఈ భోజనశాలలు మనకు ఎన్నో సినిమాలు, నవలలో నేపథ్యంగా దర్శనమవుతాయి. ఇటీవలి కాలంలో యువతతో పాటు అన్ని వయసుల వారిని ఆకుట్టుకున్న హారీపోటర్, హాగ్‌వర్త్ స్కూల్ డైనిండ్ హాల్ ఇటువంటిదే. హారీ పోటర్ సినిమాలలో గ్రిఫిన్‌డోర్, స్లిథరిన్, రావెన్ క్లా, హఫల్‌వఫ్ అని పిలువబడే నాలుగు విద్యార్థుల కూటములు, ప్రధానోపాధ్యాయుడు డంబుల్ డోర్, ఇంకా ఇతర అధ్యాపకులతో కలిసి కూర్చునే భోజనశాల సినిమా కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దబడిన క్రైస్ట్ చర్చ్ కాలేజీలోనిదే.

తరచుగా అక్కడకు వెళుతుండటం వలన, కొన్ని ప్రత్యేకమైన రోజులలో ఎవరైనా ఇక్కడి విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి డిన్నర్‌కు హాజరవ వచ్చని నాకు తెలిసింది. కానీ అలా వెళ్ళాలంటే ఒక విద్యార్థి గాని, అధ్యపకుడు గాని వారిని ఆహ్వానించాలి. నేను అలాంటి అవకాశం కోసం చాలా రోజుల నుండి ఎదురు చూస్తున్నాను. ఒకసారి అనుకోకుండా నాకు ఇలాంటి అవకాశం వచ్చింది.

ఈ వేసవికాలంలో (2019) నా స్నేహితుడైన డా. సూరిభట్ల శ్రీనివాస్ కుమార్తె రియా, నాకు చిన్నప్పటి నుండి తెలుసు. చాలా తెలివిగల అమ్మాయి. రియా చదువుతోపాటు పాఠ్యేతర రంగాలలో కూడా ఆసక్తి పెంపొం దించుకుంది. ముఖ్యంగా శాక్సోఫోను అనే వాయిద్యం వాయించటంలో కూడా దిట్ట. నేను బ్రిటన్‌లోని భారతీయ మానసిక వైద్యుల కూటమికి ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు నా అభ్యర్థన మేరకు రియా డిన్నర్ సమయంలోఎ బాలీవుడ్ సినిమా పాటలు శాక్సోఫోను మీద ఆలవోకగా వాయించి శ్రోతలను మంత్రముగ్ధులను చేయటం నాకు బాగా గుర్తు. అప్పటికీ ఆమె ఇంకా స్కూల్లోనే చదువుతోంది. ఇప్పుడు ఆమె ఆక్స్‌ఫర్డ్‌లోని ఓరియల్ కాలేజిలో వైద్యవిద్యార్థిని. ఆమె నుండి ఒక గౌరవప్రదమైన విందుకు ఆహ్వానాన్ని అందుకునే కోరిక తీరుతుందని నేను ఊహించలేదు. సాంప్రదాయక దుస్తులలో ఉన్న రియాతో పాటు ఆ అద్భుతమైన ఆక్స్‌ఫర్డ్ భోజనశాలలో అడుగు పెట్టిన క్షణాలు నా జీవితంలో ఎప్పటికీ గుర్తుంచుకో దగ్గవి. ఆమెను చేసి నేనెంతో గర్వపడిన ఆ సందర్భాన్ని ఆమె తల్లిదండ్రులతోనూ, నా ఇతర స్నేహితులతోనూ ఎంతో సంతృప్తిగా చాలా సార్లు పంచుకున్నాను.


Orial College Dining Hall

విశ్వవిద్యాలయాలలో విద్యార్థి దశ ఎవరి జీవితంలోనైనా ఒక మహత్తరమైన దశ. అమాయకంగా జీవితం గురించి ఎన్నో కలలుకనే దశ అది. తరువాత జీవితంలో ఎంత ఉన్నతిని సాధించినా, ఈ దశలో అనుభవించిన దేనినైనా లెక్కచెయ్యని ధైర్యం, చిన్న చిన్న ఆనందాలను మిత్రులతో పంచుకోవటం, అందరినీ కట్టిపడవేసే సౌభాతృత్వం, అమలినమైన సహజ మిత్రత్వం, సంకెళ్ళులేని స్వేచ్ఛతో రెక్కలు విప్పుకొని విహరించే భావఝరి, పగటికలలు కంటూ, మహా స్వప్నాలను ఊహించు కుంటూ తేలిపోయే కాలం అది. ఎవరు ఎక్కడినుండి వచ్చినా అక్కడ మాత్రం అందరం సమానులమే అనే సమతాభావం విద్యార్థి దశకున్న ముఖ్య లక్షణం.

నా చిన్నతనంలో మా నాన్నగారి నుండి నేను అందుకొన్న ఒక అపురూపమైన బహుమానం ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు. 'ఆక్స్‌ఫర్డ్ అంటే ఏంటి నాన్నా?' అని అడిగినప్పుడు ''ప్రపంచంలో చాలా తెలివైనవారు, మేధావులు చదువుకునే ప్రదేశం'' అని వివరించారు. అప్పటి నుండి నాకు ఆక్స్‌ఫర్డ్ గొప్పతనం నా మనసులో తిష్ట వేసుకోవ టమే కాకుండా, తరువాత జీవితంలో

నాతో పాటు పెరుగుతూ వచ్చింది. విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్ళటం, అందని మ్రాని పండులా తోచే 1970-80 సంవత్సరాల కాలంలో భారత దేశంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో పెరిగినవాడిని నేను. ఆ కాలంలో సంపన్న భారతీయ కుటుంబీకులకు, ఉన్నత వర్గాల వారికి విదేశీ విద్య వారి సాంఘిక, ఆర్థిక ఔన్నత్యానికి చిహ్నం. విదేశాలకు వెళతానని కాని, అక్కడ చదువుకుంటానని కాని కలగనటానికి కూడా నాకు అప్పటిలో అర్హత లేదు. కాని మేధావులు తిరిగిన చోటు, వారి జీవించి, జ్ఞానార్జన చేసిన చోటులో నేను కనీసం తిరిగి చూడాలనే బలమైన కోరిక మాత్రం నాకు ఉండేది. 1997వ సంవత్సరంలో నేను విదేశీవైద్యుల వృత్తి పరమైన ప్రాథమిక నైపుణ్యాన్ని, భాషా ప్రావీణ్యాన్ని అంచనా వేసే పరీక్ష (PLAB Test) తీసుకొని ఉత్తీర్ణుడనై, ఉద్యోగం సంపాదించుకున్న తర్వాత గట్టిగా గాలి పీల్చుకొని, మొదటగా నేను ఎప్పటి నుండో చూడాలనుకున్న ఆక్స్‌ఫర్డ్ వెళ్ళాలనుకున్నాను. కాని డ్రైవింగ్ టెస్ట్ పాసై ఒక కారు కొనుక్కుని అక్కడకు వెళ్ళటానికి ఇంకో సంవత్సరం పట్టింది.

కారు చేతిక వచ్చాక బ్రిటన్ అంతా పైనుండి క్రిందికి ఇష్టానుసారం తిరిగే స్వేచ్ఛ వచ్చినట్లనిపించింది. మొదటిసారి ఆక్స్‌ఫర్డ్‌లో అడుగు పెట్టగానే కలిగిన అనుభవం వర్ణనాతీతం. ఆ కళాశాల భవనాలు, వాటి విశాలప్రాంగణాలు, వాటి మధ్య చర్చ్‌లు, కాలంనుండి ఆకాశాన్నంటే వాటి గోపురాలు, వందల సంవత్సరాలుగా మారని సన్నని ఇరుకు వీధులు, వయోవృద్ధులుగా వంగినా ఆధారమిస్తూ నిలబడిన నిట్టాడులతో శిథిలమవుతున్నట్లు కనిపించే చిన్న హోటళ్ళు (పబ్‌లు), పూలపాన్పులా అనిపించే విరబూసిన ఉద్యానవన విశేషాలు, దేశాంతరాల నుండి తరలివచ్చిన విద్యార్థులు, సైకిల్ తొక్కుకుంటూ పోయేవారు, విదేశీ యాత్రికులు, సందర్శకులు, చిన్నచిన్న కొట్లు, పెద్ద పుస్తకాల షాపులు, పురావస్తు ప్రదర్శనశాలలు అంతా మరోలోకంలా అనిపించింది.


Radcliffe Camara

ఆక్స్‌ఫర్డ్‌లో ఏ మూలను తాకినా, ఎన్నో కథలు, విశేషాలు, కట్టుకథలు, పుకార్లు తెలుస్తాయి. 57 మంది బ్రిటిష్ ప్రధాన మంత్రులలో 30 మంది ఇక్కడే ఉన్నత విద్యను అభ్యసించారట. అంతర్జాతీయంగా ముప్పైకి పైచిలుకు ప్రపంచ దేశాల ప్రధాన మంత్రులు, అధ్యక్షులు, రాజులు, రాణులు ఆక్స్‌ఫర్డ్‌లో శిక్షణ పొందినవారే. భారత ప్రధానులు ఇందిరాగాంధీ, మన్‌మోహన్ సింగ్‌లు కూడా ఆక్స్‌ఫర్డ్ పట్టా భద్రులే. పాకిస్తాన్ ప్రధాన మంత్రులలో ఆరుగురు, ఇంకా ఆస్ట్రేలియా, కెనడా వంటి కామన్ వెల్త్ దేశాల ప్రధానులు చాలా మంది కూడా ఈ కళాశాలలో సుశిక్షితులైనవారే. రియా చెప్పినదాని ప్రకారం రాజకీయాలలో రాణించాలనుకునేవారు తప్పనిసరిగా ఇక్కడ రాజకీయ శాస్త్రం, తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రాలలో నిష్ణాతుల వ్యాలనుకుంటారట.

ఒకసారి అధికారికంగా విందుకు ఆహ్వానాన్ని అందుకున్న తరువాత నేను రియా మీద ప్రశ్నల వర్షం కురిపించాను. అందులో మొదటిది విందుకు ఎటువంటి దుస్తులు ధరించాలని. నల్ల టై తప్పనిసరి అట. నలుపు రంగు సూట్, నలుపు రంగు బౌ టై ధరించి, నేను నా కారులో ఆక్స్‌ఫర్డ్‌కి చేరుకొని, 'వెస్ట్ గేట్ కార్ పార్క్' పై అంతస్తులో కారు పెట్టుకొని, ఓరియల్ కాలేజ్ వైపున అడుగులు సారించాను. నేను ఉంటున్న న్యూబరీ నుండి ఇక్కడికి సరిగ్గా అరగంట ప్రయాణం. కానీ కారు పార్కింగ్ నుండి కొన్ని అడుగులు వేయగానే ఏదో మరో ప్రపంచంలోకి వచ్చినట్లుగా ఉంది నాకు ఆ రోజు. ఆక్స్‌ఫర్డ్ క్షితిజరేఖ దిగంతాలను తాకుతూ, ఆ సాయంకాలపు వెలుగులో వినూత్నంగా కనబడుతోంది. అక్కడున్న కళాశాల భవనాల మీద పొడవుగా, కోసుగా ఉన్న నిర్మాణ విశేషాలు (స్పైర్‌లు) ఆకాశంలోకి చొచ్చుకొని పోతున్నట్లుగా కనబడుతున్నాయి. ఆ ప్రాచీన భవనాలను చూస్తుంటే కాలంలో 800 సంవత్సరాలు వెనక్కి విసిరివేయబడిన అనుభూతి కలిగింది నాకు. ఆక్స్‌ఫర్డ్ కాలంలో ఘనీభవించిన శిలాజంలా కనబడుతోంది. ఆ వీధులలో అక్కడక్కడా కొన్ని కార్లు, కొన్ని ప్రకటనా బోర్డులను మినహాయిస్తే మిగతా అంతా మధ్య యుగాలనాటి ఇంగ్లీష్ పట్టణప్రాంతంలా కనబడుతోంది. ముఖ్యంగా చిన్న చిన్న రాళ్లు పరిచిన ఇరుకు వీధులు, కళాశాలల భవనాలు, వాటి నిర్మాణ కాలపు విశిష్ట లక్షణాలు... ఇవేమీ మారకుండా పరిరక్షింపబడుతూ ఉంటాయి. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ పట్టణాలలో విద్యార్థులు కార్లకు

బదులుగా సైకిళ్ళు వాడటాన్ని ప్రోత్సహిస్తారు. వీధులలో సైకిళ్ళు వెళ్ళటానికి ప్రత్యేకమైన సదుపాయం ఉంటుంది. ఈ ఊళ్ళలో వందలకొద్దీ సైకిళ్ళు కనపడతాయి.

ఓరియల్ కాలేజీకి వెళ్ళే దారిలో 'చెకర్స్' అనే హోటల్ (పబ్) ఒకటి కనబ డింది. ఎంతో పురాతనంగా, కాలంలో కూరుకుపోయినట్లున్న ఈ పబ్ నన్ను బాగా ఆకట్టుకుంది. లోపలికి వెళ్ళి చూడకుండా ముందుకు సాగలేకపోయాను. లేపలికి వెళ్ళాక, అక్కడి వాతావరణంతో పాటు దాని చరిత్ర కూడా నన్ను ఆశ్చర్య పరిచింది. చూశాను. ఈ పబ్ గత 500 సంవత్సరాలుగా నిరంతరాయంగా నడుస్తూనే ఉందట. ఒక్కసారిగా గతకాలంలో అక్కడ తిరుగాడిన విజ్ఞానఖనులు నా కళ్ళముందు మెదిలారు. సాయం సమయాలలో సంకెళ్ళు విదిలించుకుని, స్వేచ్ఛగా మేధను విహరింపచేసే విద్యార్థులూ, విజ్ఞానం తొణికిసలాడుతూ వెలిగిపోయే అధ్యాపకుల మధ్య ఇక్కడ జరిగిన వందలాది భేటీలు ఊహించుకుంటే ఒక్కసారిగా నా వెన్ను జలదరించింది.

ఆక్స్‌ఫర్డ్ పబ్‌ల గురించి ప్రస్తావించినప్పుడల్లా నాకు రెండు అనుభవాలు గుర్తొస్తాయి. 2015 వేసవిలో మిత్రుడు, ప్రొఫెసర్ ఆదినారాయణ మా ఇంటికి వచ్చినప్పుడు ఆయనతో పాటు ఆక్స్‌ఫర్డ్‌లోని 1381వ సంవత్సరం నాటి 'టర్ఫ్‌టావెర్న్' అనే పబ్‌కు వెళ్ళాము. ఆయన విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్సిటీలో లలిత కళల (ఫైన్ ఆర్ట్స్) విభాగంలో ఆచార్యుడు. ఆయనకు పాదయాత్రలంటే ఎంతో ఇష్టం. ఇండియాలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ కొన్ని వేల కిలోమీటర్లు కాలినడకన పయణించి ఎంతోమందిని కలుసుకొన్న పాదయాత్రికుడు. తన ప్రయాణ విశేషాలను తెలుగులో పుస్తకాలుగా రూపొందించి వెలువరించారు. ఆయన ఈ పబ్ విశేషాలను విని ఆశ్చర్యపడి, ఆ మధ్యాహ్నమంతా ఆక్స్‌ఫర్డ్ పబ్‌లన్నింటికీ, అల్మారాలు జోలికి పోకుండా తిరిగి చూడాలని నిర్ధేశించారు. ఈ కార్యక్రమంతో పాటుగా, ఆ సాయంత్రం క్రైస్ట్‌చర్చ్ కాలేజీలోని గాలరీలో ఉన్న మైఖెల్ అంజెలో, లియనార్డో డావిన్సీ మొదలైన విశ్వవిఖ్యాత చిత్రకారులు సృజించిన కళాఖండాలను చూస్తున్నప్పుడు లలితకళల ప్రొఫెసర్ గారి విశ్లేషణాత్మక వివరణ వెలుగులో ఆ చిత్రాల ఆంతర్యాలు క్రొత్తగా, మరింత విశేషంగా, అందంగా కనిపించాయి.


Hertford College building

నా మెదడు పొరల్లో మెదిలే మరొక అనుభవం పదిహేను సంవత్సరాల నాటిది. మా మామగారు పరుచూరి రామలింగేశ్వర రావుగారు, వారి మిత్రులైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి గారి (ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర లెజిస్లేటివ్ అసెంబ్లీ స్పీకర్)తోపాటు ఇంగ్లాండు వచ్చినప్పుడు వాళ్ళిద్దరినీ ఒక రోజంతా ఆక్స్‌ఫర్డ్‌లో నడిపించి చూపించాను. వాళ్ళిద్దరూ బాల్యస్నేహితులు. యాదృచ్ఛికంగా ఆ రోజు గ్రాడ్యుయేషన్ డే. అంటే పట్టా ప్రధానం చేసే రోజు. నూతన పట్టాభద్రులంతా రంగురంగుల సాంప్రదాయిక స్నాతకోత్సవ దుస్తులలో, దేశ విదేశాల నుండి వచ్చిన తల్లి దండ్రులు, బంధువులతో పాటు కలిసి తిరుగుతున్నారు. ఆ రోజు మేము 'నైట్ హార్స్ పబ్'లో లంచ్‌కి 'షిప్ అండ్ చిప్స్' తీసుకున్నాము. భారంగా వంగిపోతున్న దూలాలు, పాతకాలపు చెక్క తాపడం చేసిన గోడలతో ఉన్న ఈ పబ్‌కి 500 సంవత్సరాల చరిత్ర ఉంది. ఏ కారణం చేతనో ఎప్పటి నుండో ఈ పబ్ అమెరికన్ విద్యార్థులను బాగా ఆకర్షిస్తుందట. అమెరికన్ మాజీ ప్రెసిడెంట్ బిల్ క్లింటన్ ఇక్కడ చదివే రోజుల్లో ఎక్కువ సమయం ఈ పబ్‌లోనే అధిక సమయం గడిపేవాడట. మేము కూడా ఆయన యథా ప్రకారం రోజూ కూర్చునే టేబుల్ కావాలని అడిగి మరీ కూర్చుని, చిన్న పిల్లల్లా సరదాగా నవ్వుకున్నాము. ఇలాంటి చిన్న చిన్న సరదాలే ఆక్స్‌ఫర్డ్ సందర్శకులను ఉత్సాహపరుస్తాయి.

ఈ రెండు అనుభవాలను తలచుకుంటూ కాస్త ముందుకి నడిచిన తర్వాత ఓరియల్ కాలేజి వద్దకు వచ్చాను. అక్కడికి అనుకున్న సమయం కంటే కొంచెం ముందు చేరుకోవటం వలన, రియా చెప్పినట్లుగా 'పోర్టర్స్ లాడ్జ్' వద్ద ఆగాను. ఇందలోనే రియా వచ్చి నన్ను కలుసుకుని, ఓరియల్ కాలేజీ గురించి క్లుప్తంగా చెప్పింది. ఓరియల్ కాలేజ్ ఆక్స్‌ఫర్డ్ కాళాశాలలలో ఐదవ పురాతన కాలేజీ. 1326వ సంవత్సరంలో రెండవ ఎడ్వర్డ్ రాజు హయాంలో దీనిని స్థాపించారు. రెండవ ఎలిజబెత్ రాణి దీనిని రివాజుగా దర్శించడం వలన ఇది రాయల్ కాలేజీగా గుర్తింపు పొందింది. ఓరియల్ కాలేజీ

ముద్రిక అయిన మూడు సింహాల చిహ్నాన్ని ఇంగ్లీష్ పాలకులు తమ రాజముద్రికగా స్వీకరించారు.

రియా ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కాలేజిలో చదువుతుంటే, ఈ ఓరియల్ కాలేజీతో ఎలా సంబంధం ఏర్పడిందో నాకు ఆర్థంకాక ఆమెను అడిగాను. మెడికల్ కాలేజీలో చదివే ప్రతివారూ ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్న 30 కాలేజీలలో ఏదో ఒకదానితో అనుసంధాన మౌతారట. ఆ సంవత్సరం ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓరియల్ కాలేజీకి చెందిన ఆరుగురు వైద్య విద్యార్థులలో రియా కూడా ఉంది. వారికి సంబంధిత అంశాలను బోధించటానికి ప్రత్యేకమైన పరిజ్ఞానం కలిగిన గురువులుంటారట. ముగ్గురేసి విద్యార్థులకు వారానికొకసారి ఈ గురువులతో భేటీ ఉంటుందట. రియాకు ప్రతివారం ఇటువంటి భేటీలు 3-4 ఉంటాయట. వీటికి హాజరవటానికి ముందు ప్రతిసారి రియా ముందుగానే సూచించబడిన / బోధించబడిన వైద్య విద్యకు సంబంధించిన అంశం మీద కూలంకషంగా విషయసేకరణ చేసి, ఒక వ్యాసం వ్రాసుకుని వెళ్ళాలట. 'లెక్చర్స్' ద్వారా విద్యాబోధన చేయటం ఆక్స్‌ఫర్డ్ ప్రత్యేకత. సంవత్సరానికి దాదాపు 150 లెక్చర్స్ జరుగు తాయట. ఒకసారి ఓరియల్ కాలేజీతో అనుసంధానమైన తరువాత ఈ సంబంధం జీవితాంతం కొనసాగుతుంది. ముందు ప్రస్తుత విద్యార్థిగా ఆ తర్వాత పూర్వ విద్యార్థిగా 'అలూమ్ని'గా చదువు కున్న సంస్థతో విధేయతతో కూడిన సత్సంబంధం, విద్యార్థులకు భావికాలంలో వృత్తిపరమైన పురోగతికి అవసరమైన సౌభ్రాతృత్వాన్ని సమకూర్చుతుంది కూడా. అదేవిధంగా జీవితంలో ఉత్తమ స్థాయి కెదిగిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న సంస్థకు అండగా నిలబడతారు. ఇటువంటి పరస్పర శ్రేయస్సుకు కారకమైన సత్సంబంధాల వలన పూర్వ విద్యార్థుల నుండి అందే ఆర్థిక అండదండల వలన ఈ రోజుకు కూడా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ కాలేజీలు సుసంపన్నంగా అక్కడ తలపెట్టిన విద్యా పరిశ్రమకు ఆర్థిక సమస్యలు లేకుండా విలసిల్లు తున్నాయి.

రియా తాను ఉంటున్న హాస్టల్‌ని చూపించింది. దాన్ని 'రోడ్స్ బిల్డింగు' అంటారు అని చెప్పింది. రోడ్స్ ఓరియల్‌కి చెందిన పూర్వ విద్యార్థి. 'సిసిల్ రోడ్స్' క్వీన్ విక్టోరియా కాలంలో ఆఫ్రికా ఖండంలోని వనరులను అన్వేషించాడు. బ్రిటీషు వారి రాజ్య విస్తరణలో భాగంగా వారికి చాలా విశాలమైన భూముల్ని సంపా దించగలిగాడు. ఇప్పుడు జింబాబ్వే అని పిలువ బడుతున్న దేశాన్ని గతంలో 'రోడిషియా' అని పిలిచేవారు. ఇటీవలి కాలంలో విమర్శకు గురి అవుతున్న రోడ్స్ సామ్రాజ్య వాద ఆలోచనా విధానం అప్పటి బ్రిటీష్‌వారి అభివృద్ధికి దోహదం చేసింది. ఆ కాలపు ఆలోచన లకు, దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణమైన వ్యక్తి రోడ్స్. ఆ విధంగా అతడు బ్రిటిషు-ఆఫ్రికా చరిత్రలో ఒక ప్రముఖమైన వ్యక్తిగా గుర్తించ బడ్డాడు. ఆయన జీవితంలో ఎప్పుడు పెళ్ళి చేసుకోలేదు. అతనికి వారసులు లేరు. అందు వలన అతని సంపదనంతా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకమైన 'రోడ్స్ ఫెలోషిప్' కు ధారపోసి, తన పేరును శాశ్వతం చేసుకున్నాడు. దీని ద్వారా ఆ రోజుకూ, సంవత్సరానికి 80మంది అంతర్జాతీయ విద్యార్థులకి ఆక్స్‌ఫర్డ్‌లో పైసా ఖర్చు లేకుండా చదవటానికి అవకాశం దొరుకుతుంది. ఈ రోడ్స్ ఫెలోషిప్ ద్వారా లబ్ధిపొందిన ప్రతిభా వంతులలో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఆస్ట్రేలియా ప్రధానులు బాబ్‌హాక్, మాల్కమ్ టర్న్‌బుల్, టోనీ అబ్బాట్‌లున్నారు. భారతీయుల్లో ఆర్థిక శాస్త్రవేత్త మానెక్ సింగ్ ఆహ్లువాలియా, ప్రముఖ పాత్రికేయురాలు సాగరికా ఘోష్, భౌతిక శాస్త్రవేత్త అనితా మెహతా కూడా రోడ్స్ ఫెలోషిప్ పొందారు. ఇటీవల మరణించిన సుప్రసిద్ధ భారతీయ నటుడు, రచయిత గిరీష్ కర్నాడ్ కూడా ఈ రోడ్స్ ఉపకార వేతనం అందుకున్న కళాకారుడే.



Bridge of Sighs

రియా నాకు ఓరియల్ కాలేజీ మొత్తం ఒక టూర్ గైడు మాదిరిగా చూపిస్తూ అది చిన్న కాలేజీ అని చెప్పింది. కానీ నాకు మాత్రం చాలా పెద్దదిగా కనిపించింది. మూడు చతురస్ర విభాగాలుగా కట్టబడిన ఈ కాలేజీ భవనాలు, చుట్టూ గదులు, మధ్యలో పచ్చని పచ్చికతో ఆహ్లాదం గా ఉంటాయి. వీటిని తేనె రంగులో ఉండే కాట్స్‌వోల్డ్ సౌండ్‌స్టోన్‌తో నిర్మించారు.

రెండు సంవత్సరాల క్రితం నా ఫ్రెండ్ / సహాధ్యాయిని అయిన అనితారాణి కుమార్తె 'వినిత' అమెరికా నుండి వచ్చి, అక్కడ సమ్మర్ కోర్స్ చేస్తున్నప్పుడు నేను వాధామ్ కాలేజీకి వెళ్ళాను. అక్కడి పూల తోటలు విశేషంగా ఉన్నాయి. నా స్నేహితుల కుటుంబంతో అక్కడకు వెళ్ళడం నాకు మరువలేని అనుభవం. ఆ కాలేజీలోని ప్రతి గోడ, ప్రతి స్తంభం కూడా చరిత్ర పాఠాలలో మనకి వినిపించే వారి పేర్లను ప్రతిధ్వనిస్తుంటాయి. ప్రఖ్యాతి గాంచిన వాస్తుశిల్పి, ఖగోళ శాస్త్రవేత్త క్రిస్టఫర్ వ్రెన్ వాధామ్ కళాశాల పూర్వ విద్యార్థి.



Dr. Sheshagiri Rao & Ms. Ria

ఇంగ్లాండులో కొన్ని గొప్ప భవనాల నిర్మాణానికి అతడు రూప కల్పన చేశాడు. లండన్‌లోని సెయింట్ పాల్స్ కథీడ్రల్, ఆక్స్‌ఫర్డ్‌లోని షెడోనియన్ థియేటర్లు అతని విద్వత్తుకు అద్దం పట్టే మచ్చు తునకలు.

గత వెయ్యి సంవత్సరాలలో జరిగిన ముఖ్యమైన ఘట్టాలకు ఆక్స్‌ఫర్డ్ కాలేజీలు సాక్షిభూతంగా నిలుస్తాయి. ఉదాహరణకు.. ప్రతిష్టాత్మకమైన రాయల్ సొసైటీలో సభ్యత్వం సొందటం చాలా మంది శాస్త్రవేత్తలకు ఒక జీవితాశయం. ఈ సంస్థ సంస్థాపనకు 1650 లో వాధామ్ కాలేజీలోనే బీజం పడింది. అప్పటి ఆ కాలేజీ వార్డెన్ జాన్ విల్కిన్స్, ఆక్స్‌ఫర్డ్‌లోని కొందరు శాస్త్రవేత్తలు, తత్వ వేత్తలు సంఘటించి, ఆ తరంవారు ఎదుర్కొంటున్న సమకాలీన సమస్య లను చర్చించేవాడట. కాలక్రమంలో అదే రాయల్ సొసైటీగా రూపాంతరం చెందింది. ఇంతకు ముందు ప్రస్తావించబడిన క్రిష్టఫర్ రెన్, మైక్రోస్కోప్‌ని, దాని ద్వారా జీవకణాన్ని (సెల్) కనుగొన్న రాబర్ట్ హుక్, బోయిల్స్ సిద్ధాంతాన్ని ప్రతి పాదించిన రాబర్ట్ బోయిల్, వ్యక్తి స్వాతంత్ర్యానికి భావ ప్రకటనకు పెద్దపీట వేసిన జాన్‌లాక్, మానవ శరీరంలో నరాల ప్రాధాన్యతను ఒక శాస్త్రంగా మార్చిన థామస్ విల్లిస్ (మెదడు క్రింది భాగంలో గుమా కూడుకుని ఉన్న రక్తనాళాలను, 'సర్కిల్ ఆఫ్ విల్లిస్' అంటూ ఇతని పేరే పెట్టారు.) మొదలైనవారంతా అప్పట్లో జాన్ విల్కిన్స్ ఆధ్వర్యంలో జరిగే సమావేశాలకు హాజరయ్యేవారట.

ఈ కాలేజీ వాళ్ళు రోయింగ్ (పడవ నడపటం)లో కూడా నూపుణ్యం గలవాళ్ళని తెలియజేయింది రియా. ఈ క్రీడను ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ (ఆక్స్‌బ్రిడ్జ్) విద్యార్థులు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు. ప్రతి సంవత్సరం జరిగే పోటీల్లో పతకాలు మేమే కైవసం చేసుకుంటామని గర్వంగా చెప్పింది రియా. అలా గెలిచిన వారికి ఓరియల్ కాలేజీ లోపలి గోడ మీద ఏది కావాలంటే అది (గ్రాఫిటీ) వ్రాసుకునే అవకాశం కలుగుతుంది. అలా ఇంతకు ముందు వ్రాయబడిన గ్రాఫిటీని రియా నాకు చూపించింది. కొంచెం దూరంలో రోయింగ్ టీమ్ కెప్టెన్‌కు ప్రత్యేకంగా కేటాయించబడిన గది ఉంది. కిటికీలో నుండి పడవ నడిపే తెడ్లతో సహా, ఆ పనికి సంబంధించిన ఇతర వస్తువులు అలంకరణలుగా కనిపించాయి.

మేము డైనింగ్ హాల్ చేరుకునే సరికి, మాంచెష్టరు నుండి వచ్చిన 'ప్రతీక్' కలిశారు. అతను అప్పుడే ఇంజనీరింగ్ పరీక్షలు పూర్తిచేశాడు. అతను తన చెల్లిని గెస్ట్‌గా తీసుకువచ్చాడు. ఆమె పేరు త్రిష. డైనింగ్ హాల్ కొన్ని వందల సంవత్సరాల నాటిది. కొద్దిసేపట్లో అది పూర్తిగా నిండిపోయింది. అధ్యాపకులంతా ఎత్తుగా ఉండే కుర్చీలలో కూర్చున్నారు. అందరూ డ్రస్‌కోడ్ పాటించారు. డిన్నర్ మొదలయ్యే ముందు కాసేపు సంగీతం వినిపించారు. ఆ వాతావరణం అంతా మా అనుభవాన్ని ఇనుమడింప జేసింది. మేము నలుగురం కలిసి ఎన్నో విషయాలు మాట్లాడు కుంటూ ఆ రాత్రి భోజన కార్యక్రమాన్ని అపురూపంగా అనుభవించాము. ఆ రోజు మాకు అందించిన వైన్ చాలా విశిష్టంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్ కళాశాలలకు మంచి వైన్ మాళిగలున్నాయట. రియా ఇచ్చిన ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలియజేశాను. ఎప్పటినుంచో కంటున్న కల నిజమైంది. అదొక గొప్ప అనుభూతి. ఆమెకు జీవితంలోనూ, ఉద్యోగంలోనూ, తన సంగీత వ్యాపకం లోనూ ఇతోధికమైన అభివృద్ధిని కోరుకుంటూ శెలవు తీసుకొన్నాను.

ఇంగ్లీష్ మూలం : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
అనువాదం: ప్రా. ఆదినారాయణ (భ్రమణ కాంక్ష)
జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)

జనవరి సంచికలో పప్పు వేణుగోపాల రావు గారి వ్యాసం 'అనర్ఘరత్నాలు', ఫిబ్రవరి సంచికలో గార రంగనాథం గారి 'గువ్వల చెన్న శతకం అల్లసానిదా' అన్న లేఖ రెంటినీ చదివాను. వ్యాసం రెండు అంశాలను స్పృశించింది. తెలుగు సంస్కృతాల్లో తెలుగు గొప్ప భాష అని, మధురమైన భాష అని భర్తృహరి శ్లోకాన్ని దానికి ఏనుగు లక్ష్మణకవి చేసిన అనువాద పద్యాన్నీ పోల్చి వివరించారు. రెండవ అంశం అల్లసాని పెద్దన గారి కోరికననుసరించి బండెడు కట్టెలు కొట్టి తెచ్చిన గువ్వల చెన్నడు కవిగారు పారితోషికంగా యివ్వబోయిన పసిడి నాణేన్ని వద్దని ఒక పద్యాన్ని చెప్పమన్నాడట. అందుకు కరిగిపోయిన పెద్దనగారు ఈ క్రింది కంద పద్యాన్ని పలికారట.

గుడికూలును నుయి పూడును
పడి నీళ్ళంజెరువు చెగును వనమును ఖిలమౌ
చెడని పద్యంబొక్కటె
కుడి ఎడమల కీర్తిగన్న గువ్వల చెన్నా!

కట్టెలు కొట్టడం ద్వారా గువ్వల చెన్నుడు కీర్తి గడించాడా? సందేహాస్పదం. పై కథనాన్ని కళ్ళకు కట్టినట్టు వ్రాశారు వేణు గోపాలరావు గారు వారు ఆ సందర్భాన్ని చూడకపోయినా...

ఇక రంగనాథం గారు పై పద్యాన్ని 'గువ్వల చెన్న' శతకంలోనిదని స్పష్టపరిచారు తమ లేఖలో. చిత్రం ఏమిటంటే లేఖా రచయిత సంబంధిత శతకాన్ని చదవలేదు. కనీసం చూడలేదు. మరి చాలా వివరాలు ఆ శతకం గురించి ఎలా చెప్పగలిగారు? బహుశః ఎవరో చెప్పిన విషయాల్ని తన పరిశీలనా ఫలితంగా పాఠకుల్ని భ్రమింపజేస్తూ వ్రాసిన లేఖ అది. ఎవరు చెప్పి ఉంటారు? అది రంగనాథం గారికే తెలుసు. సంపాదకులు ఈ పాటికి గ్రహించే ఉంటారు.

ఈ లేఖతో పాటు చెన్నపురి వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వారిచే 1928వ సంవత్సరంలో ప్రకటితమైన శతకంలోని నాలుగు పుటల జిరాక్సు కాపీలను జతపరుస్తున్నాను.

చరిత్ర వక్రీకరణకు గురైంది కదా! అని నిట్టూర్చిన రంగనాథం గారు వాస్తవాన్ని మరుగు పరచడమెందుకో!

ఈ శతకంలో 111 పద్యాలు ఉన్నాయి (113 కాదు). వేణుగోపాల రావు గారు ఉదహరించిన పద్యం 110వది. 'కుడియెడమల చూడకన్న గువ్వల చెన్నా' అని శతకంలో ఉన్నది గాని 'కుడియెడమల కీర్తిగన్న గువ్వల చెన్నా' అని లేదు. తొలిపద్యం ఇది.

గువ్వల చెన్నా!

– కె. దినకర్

శ్రీ పార్థసారథీ! నేఁ
బాపాత్ముఁడ నీదుపాలఁబడినాఁడ ననుం
గాపాడు మనుచు నాంతర
కోపాదులదలచి వేడు గువ్వల చెన్నా!

ఈ శతకంలోని పద్యాలు ప్రజాబాహుళ్యంలో ప్రచారంలో ఉండినప్పటికీ పూర్ణ లిఖితప్రతులు మాత్రం కొరవడినట్టు కనిపిస్తుంది. ప్రచురణకర్తలు వచించినట్లు ఈ శతక రచన పదునేడవ శతబ్దాంతమునగాని పదునెనిమిదవ శతాబ్ది తొలినాళ్ళలోగాని జరిగి ఉండవచ్చు. ఆంగ్లేయుల పరిపాలన మన దేశంలో సాగిన కాలంలో వెలువడిన రచన యిది అన్న అభిప్రాయం కలుగడానికి పద్యాల్లో ప్రయోగింపబడిన అన్య దేశ్య పదాలే నిదర్శనం.

వకీలు (పద్యసంఖ్య 23,34,35,64,84,100), టోపి (91), శిఫార్సు (49), షికారు (53), తనఖా (58), ప్లీడరు (64), ఘోషా (70), సబ్బు (91,94)

ఈ శతకం పీఠికలో పేర్కొనబడిన మరియొక ముఖ్య విషయం.

'చెన్నపురి నీ గువ్వల చెన్నాడే కట్టించి యట శివప్రతిష్ఠ గావించెనని శతకములోని 39, 40 పద్యముల నాధారపఱచి కొందరు చెప్పుచున్నారు. గాని యది సందర్భశుద్ధి లేనిమాట. చెన్నపురి గట్టించిన చెన్నరాయఁడు, గువ్వల చెన్నఁడు ప్రత్యేక వ్యక్తులని ఆంగ్ల పాఠశాలలోని దేశ చరిత్రము నెఱింగిన వారందఱు గ్రహించిన యంశమె.'

పైన పేర్కొనిన పద్యముల నిట పేర్కొంటున్నాను.

"చెన్న" యను పదము మునుగల
చెన్నగురుపమొకటి దీని చెంతను వెలయున్
సన్నుతులు వేల్పు సుతులును
గొన్నా తని కరుణ చేత గువ్వల చెన్నా (39)
ధర నీపేర పురంబును
గిరిజేశ్వర పాదభక్తి కీర్తియు నీయు
ర్వర సుతులుఁగాంతు నిదియొక
గురువరముగ నెంచుకొనుము గువ్వల చెన్నా (40)

పై విషయం పరిశీలనార్హము. నా వ్యక్తిగత అభిప్రాయం

మాత్రము ఈ శతక మకుటంగా భాషిస్తున్న గువ్వల చెన్నుడు చెన్నపురిని కట్టించిన చెన్నరాయుడేనని నా అభిప్రాయానికి ఆలంబనగా నిలిచిన ఒక అంశాన్ని పేర్కొనే ముందు గువ్వల చెన్న శతకాన్ని గురించి కొంచెం ప్రస్తావిస్తాను.

డాక్టర్ జి. నాగయ్య (తెలుగు శాఖాధ్యక్షులు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయము తిరుపతి) గారు తమ గ్రంథం తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటం (నవ్య పరిశోధక ప్రచురణలు తిరుపతి ప్రచురణ 1985)లో పుట 572లో ఇలా వ్రాశారు.

"గువ్వల చెన్నడు అపారమైన లోకానుభవము కలవాడు. గువ్వల చెన్న శతకమునందు సాంఘిక దురాచారములు, దుర్జనుల చిత్తవృత్తి, విఫుల దురాచారములు నిశితముగ విమర్శింపబడినవి."

గువ్వల చెన్న శతకము ప్రధానంగా నీతి శతకము. చివరి పద్యం ఆ విషయాన్ని స్పష్టంగా చెప్తుంది.

ఇప్పద్యములన్నిటిలోఁ
జెప్పిన నీతులను మదినిఁజేర్చి తెలిసినన్
దప్పక పదుగురితోఁగడు
గొప్పక నీతిపరుఁడగును గువ్వల చెన్నా (111)

సుమతీ శతకం ఈ శతక రచనకు ప్రేరణ కలిగించి ఉండవచ్చు శతకకర్తకి. ఈ శతకంపై డాక్టర్ జి. నాగయ్యగారి సమీక్ష అక్షరసత్యం. పద్యాల్లో నీతి, లోకరీతి, భవిష్యదర్శనం, కొంత భక్తి, సుంత వైరాగ్యం కూడా ప్రతిధ్వనిస్తూ ఉంటాయి.

అనుభవము లేని విభావము
లను భావ్యము కానియాలు నార్యాసుమతిన్
గనని స్వభావము ధర్మముఁ
గొనని సిరియు వ్యర్థమెన్న, గువ్వల చెన్నా (8)
వెలకాంత రెంద త్రైనుఁ
గులకాంతకు సాటిరారు కల వలయమందున్
బలు విద్యలెన్ని నేర్చినఁ
గుల విద్యకు సాటిరావు గువ్వల చెన్నా (10)

సుస్థిర గ్రామీణ వ్యవస్థ నెలకొన్న రోజుల్లో కుల విద్యలు జీవనాధారంగా నిలచినప్పుడు వెలువడిన రచనయిది.

తెలిసియుఁదెలియని వానికిఁ
దెలుపంగలఁడే మహోపదేశికుఁడైనన్ (12)
అపరిమిత వాహనాదిక
మపూర్వముగనున్న యల్పుఁడధికుండగునా (14)
పందిరి మందిరమగునా?
వందిజనంబాప్త మిత్ర వర్గంబగునా?
తుందిలుఁడు సుఖముఁగనునా?
గొంది నృపతి మార్గమగున? గువ్వల చెన్నా (15)
మిత్రుని విపత్తు నందుఁగ
క్షత్రమును దరిద్రదశను భ్రాతలగుణమున్
చాత్రాది విభక్తంబున
గోత్రను గనుఁగొనఁగ వలయు గువ్వల చెన్నా (16)
కలిమిఁగల నాఁడే మనుజుఁడు
విలసనమగు కీర్తిచేత వెలయఁగవలెరా!
కలిమెంత యెల్లకాలము
కులగిరులా కదలకుండ? గువ్వల చెన్నా (20)
ధనమతిఁగ గల్గియన్నను
దనయలు దనయులును గల్గి తనరుచునున్నన్
ఘనలోభియు నిఱుపేదయు
గుణముల సరియగుదురెన్న గువ్వల చెన్నా (26)
అతిచనువిచ్చి మెలంగఁగ
సుత సతులైన నిరసించి చులకన చేతుర్
మతమెరిఁగి చరింపందగు
గుతుకముతో మనుజుఁడెపుడు గువ్వల చెన్నా (38)
నీచున కధికారంబును
బాచకునకు నా గ్రహంబుఁ బంకజముబీకిన్
వాచాలత్వము బుధ సం
కోచముఁగడు బాధకములు గువ్వల చెన్నా (43)
కలిమిగల లోభికన్నను
విలసితమగు పేదమేలు వితరణియైనన్
జెలమైన మేలు కాదా?
కులనిధి యంభోధి కన్న గువ్వల చెన్నా (48)
ధనమే మైత్రినిఁదెచ్చును
ధనమే వైరమును దెచ్చు ధనమే సభలన్
ఘనతను దెచ్చును నెంతటి
గొనముల కుప్పలకునైన గువ్వల చెన్నా (60)
తనహితవుఁగోరు సతిగల
దనుకనె గృహనివసనంబు తగుఁ బురుషునకున్ (69)
ఎంతధికారంబున్నను
సంతతమును బరులయెడల సత్కుల జాతుం
డెంతయు నమ్రతఁజూపును

గొంతైనను మిడిసిపడఁడు గువ్వల చెన్నా (72)
నీతియెఱుంగని నీచున
కాతత రాజ్యము లభింపనధికుండగునా
నాతివలెను నటియించునె
కోతికి స్త్రీ వేషమిడిన గువ్వల చెన్నా (75)
గురినెన్న ధనంబు తిరమె? గువ్వల చెన్నా (77)
లోభికి వ్యయంబు త్యాగికి
లోభిత భీరునకు యుద్ధ లోలత్వమ్మున్
వైభవమ పతికిఁ భ్రాణ
క్షోభంబుగఁ దోఁచుచుండు గువ్వల చెన్నా (88)
చింతలఁ జివుకుచు నున్నను
స్వాంతము నెపుడైన హరుని యందుంచఁదగున్
అంతట నాఁచున్న సరసి
గొంతట రేవైన భంగి గువ్వల చెన్నా (96)

పై పద్యంలో కవి యొక్క అద్భుత పరిశీలనాత్మక భావన ప్రతిఫలిస్తుంది.

వెలయాండ్ర వలెను బనిపా
టలు విడి సంగీతమును నటన మభినయమున్
గుల విద్యలుగాఁగైకొని
కులసతులు చరింతు ముందు గువ్వల చెన్నా (97)

పై పద్యంలో కవిగారి భవిష్యద్దర్శనం గోచరిస్తుంది. కవి క్రాంతదర్శి అన్న సూక్తికి సాక్ష్యమిది. అలనాడు కులసతులకు లలిత కళలు నిషేధమే కదా.

విజయనగరంలో హరికథా పితామహుడు అష్ట భాషా ధురీణుడు శ్రీ మహదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారు. కన్యాశుల్క నాటకకర్త వ్యావహారిక భాషా మహోద్యమంలో గిడుగు రామమూర్తి పంతులు గారికి సై దోడుగా నిలిచిన గురజాడ అప్పారావు పంతులు గారు అప్పుడప్పుడు వారి యిండ్లకు వెళ్ళి స్ఫూర్తిని పొందిన వారే.

గువ్వల చెన్న శతకంలోని ఈ పద్య భాగాన్ని పరికించండి.

సంగీతము నాట్యము గణి
కాంగనలవిగాని యవి కులాంగనలవియా? (80)
భువినొకఁడు చెడును మతియొకఁ
డవిరళముగ వృద్ధిఁబొందు నదివిధివశమౌ
రవియుద యించును నొకడెసఁ
గువలయపతి క్రుంకునొకెడ గువ్వల చెన్నా (102)
ఎవ్వరికెయ్యది చెప్పిన
నెవ్వరు వినరెయ్యదియును నెట్టెట్టినరుల్
మవ్వముగఁజూచు చుండుము
గువ్వలనఁ జరింత్రుముందు గువ్వల చెన్నా (103)

పై పద్యంలో కూడా కవిగారి భవిష్యద్దర్శనం ద్యోతక మవుతుంది. పక్షులు అనే అర్థంలోనే గువ్వలు అనే అచ్చ తెలుగు పదాన్ని ప్రయోగించడం జరిగింది.

జరయును మృత్యువు మొదలుగ
మరలఁగ రాకుండు నట్టి మార్గంబేదో
గురుతెఱుఁగఁ జేయుమని శ్రీ
గురుగురుని భజింపవలయు గువ్వల చెన్నా (105)

పై పద్యంలో కైవైల్యాన్ని కాంక్షిస్తాడు కవి. గురునికి గురువు దైవమే.

పాపము లంటఁగనీయక
ప్రాపొసఁగి శరీరమొసఁగి పరమపదంబున్
జేపట్టి యొసఁగి కృష్ణుఁడు
గోపికలన గరుణుఁగాచె గువ్వల చెన్నా (108)

కవి గారి దైవం కృష్ణుడే. ప్రారంభ పద్యంలో కూడా కృష్ణుడ్నే వేడుకున్నాడు శతక కర్త.

త్రిలిఙ్గ (త్రిలింగ) ప్రతికా వ్యవస్థాపకులును సంపాదకులునైన శ్రీ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి గారి నభినందిస్తూ సాహిత్య చర్చలకును, మత, రాజకీయ, ఆర్థిక, శాస్త్ర జ్ఞానాభివృద్ధికిని పాటుపడిన ఈ చిన్న వారపత్రిక అవిచ్ఛిన్నముగ వెలువడి 25 సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భముగ త్రిలింగ రజతోత్సవ సంచికను ప్రచురించి రజితోత్సవ కమిటీ వారు తే. 14-08-1941దీ నాడు వారికి కానుకగా ఇవ్వడం జరిగింది. వేయిపుటలు పై బడిన ఈ సంచికలో వివిధ సాహిత్య సాహిత్యేతర విషయాలపై ఉద్దండ పండితులచే వ్రాయబడిన 75 వ్యాసములు 201 ప్రముఖుల అభిప్రాయములు గలవు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తొలి ఉపకులపతి డా. సర్వేపల్లి రాధకృష్ణన్ ప్రభృతుల లేఖలు ఉన్నవి.ఈ సంచిక ఒక విజ్ఞాన సర్వస్వం వంటిది. (వీలైతే త్వరలో ఈ సంచిక గురించి చిన్న వ్యాసాన్ని వ్రాయగలను).

పై సంచికలో ఒక వ్యాసం పేరు ఆంధ్రవాఙ్మయము – శతకములు రచయిత శ్రీ అయల సోమయాజుల కృష్ణమూర్తి గారు (శ్రీమహా రాజావారి సంస్కృత కళాశాల, విజయనగరం) ఈ వ్యాసం పుట 120 నుండి పుట 145 వరకు విస్తరించింది. ఈ వ్యాసంలోని నాల్గవ పేరాలో ప్రారంభ వాక్యం ఇది.

శతకాల్లో ప్రతిపద్యం 'దాశరథీ కరుణా పయోనిధీ'

మొదలైన దైవముల పేరులతోకాని, 'బద్దె భూపతీ' 'గువ్వల చెన్నా' మొదలైన ప్రభువుల నామములతో కాని 'సుమతీ' త్యాది సామాన్య సంజ్ఞలతో కాని పూర్తి చెందుతుంది. ఆ కొసను వచ్చే సంబోధనాంత పదములనే మకుటంగా మనం వాడుతున్నాం.

వ్యాస రచయిత గువ్వల చెన్నుని ప్రభువుగానే భావించడం జరిగింది. చెన్నపురిని కట్టించిన చెన్నరాయుడే ఈ గువ్వల చెన్నుడని నా ఊహ (Hypothesis) దక్షిణ భారతదేశ చరిత్ర సంస్కృతుల పట్ల అవగాహన అభినివేశం ఉన్న వేత్తలు పరిశీలించగలరు.

ఈ సందర్భంలో తెలుగులో శతక సాహిత్యాన్ని గురించి రేఖామాత్రంగా వివరిస్తాను. తెలుగులో పరిశోధన (రజతోత్సవ సంచిక) అన్న ఉద్గ్రంథం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఏర్పడి ఇరువై ఐదు సంవత్సరాలు పూర్తియైన సందర్భాన్ని పురస్కరించుకొని ముద్రితమైంది (ప్రథమ ముద్రణ ఆగష్టు 1953). అందులో ఒక వ్యాసం 'శతకాలు, ఉదాహరణలు మొదలగు ప్రక్రియలపై పరిశోధన' రచయిత: చల్లా రాధాకృష్ణ శర్మగారు అందులోని కొన్ని విషయాల్ని నా మాటల్లో క్రింద పొందుపరుస్తాను.

శతక ప్రక్రియలో వెలువడిన సాహిత్యాన్ని సేకరించి పరిశీలించి శతక కవుల చరిత్ర సంతరించిన వారు వంగూరి సుబ్బారావు గారు (1886–1973). ఆ గ్రంథం రచయిత పీఠిక తోను కాశీనాథుని నాగేశ్వరరావుగారి పీఠికతోను 1923లో వెలువడింది. ద్వితీయ ముద్రణ వంగూరి సుబ్బారావు గారి కుమారుడు నరసింహారావుగారి కృషివల్ల 1951లో జరిగింది. నిడుదవోలు వేంకటరావు గారు శతకాలపై సంతరించిన అదనపు సమాచారాన్ని నిడుదవోలు వారు వ్రాసిన మరియొక పీఠికను ద్వితీయ ముద్రణలో చేర్చడం జరిగింది. తర్వాత వేదము వెంకట కృష్ణశర్మగారు శతక వాఙ్మయ సర్వస్వాన్ని ప్రచురించారు. ఆంధ్రప్రతిక ప్రథమ సంవత్సరాది సంచికలో (1910) శ్రీ కేశానపల్లి చెంగయ్యగారు ఆంధ్రశతకములు అనే విపుల వ్యాసం వెలువరించారు. డా. కె. గోపాలకృష్ణ రావు గారు విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగు శతకాలను పరిశోధనాంశంగా స్వీకరించి 1960 నుండి 1965 వరకు పరిశోధన సాగించి ఆ సంవత్సరం తమ సిద్ధాంత వ్యాసానికి (ఆంధ్ర శతక వాఙ్మయము, ఉత్పత్తి వికాసాలు, సమకాలీన జీవనము) డాక్టరేటు పట్టం పొందారు. ఇందులో అయిదు వేల శతకాలు పరిశీలించబడ్డాయి. దాని సంగ్రహ రూపం 'ఆంధ్ర శతక సాహిత్య వికాసము' పేరుతో 834 పుటల గ్రంథంగా 1976లో వెలువడింది. భారతి రజతోత్సవ సంచిక (జనవరి 1949)లో నిడుదవోలు వెంకటరావు గారు వ్రాసిన 'వీర శైవ వాఙ్మయము' అను వ్యాసంలో స్పష్టపరిచిన విషయం మల్లికార్జున పండితుని మల్లికార్జున శతకం తొలిశతకం (అందులో ఒక పద్యం మాత్రమే లభ్యమైంది.) పూర్తిగా లభించిన తొలి శతకం పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకం.

తెలుగు భాష గురించి నాకు తెలిసిన విషయాల్ని మీతో ముచ్చటించాలి అని అనిపిస్తోంది. భర్తృహరి శ్లోకంలోని ఒక పాదం 'మణినా భూషితస్సర్పః' (ఇది గాయత్రి ఛందం అనుకుంటాను. కాకుంటే అనుష్టుప్ ఛందం) అన్న దాన్ని ఏనుగు లక్ష్మణకవి తన తేటగీతి పద్యానువాదంలో చారు మాణిక్య భూషిత శస్త మస్తకంబు గల పన్నగము అని అన్నాడు. అదీ తెలుగు సౌందర్యం అని నొక్కి వక్కాణించారు వేణుగోపాల రావు గారు.

ఈ సందర్భంలో నాకొక ఆంగ్ల కవి విమర్శకుని పంక్తులు గుర్తుకు వస్తున్నాయి.

"Words are like leaves, where they most abound Little fruit of sense is beneath found"

(మాటలు ఆకుల వంటివి అవి అధికమైతే అల్పమైన భావ ఫలం మరుగున పడిపోతుంది.) పాల్కురికి సోమన కూడా అల్పాక్షరముల అనల్పార్థ రచననే ప్రస్తుతిస్తాడు. ఇక రంగనాథం గారు 'శస్త మస్తకంబు గల పన్నగము' అన్నది తప్పు. వాస్తవంగా 'శస్తమస్తకంబైన పన్నగము' అన్నది మూలం అని అంటారు. నిజానికి వారు పేర్కొన్న మూలం అన్న పాదం తేటగీతి ఛందస్సుకు ఒదగదు. వేణుగోపాల రావు గారు వ్రాసిన పాదం ఛందస్సుకు అనుగుణంగా ఉంది.

ముగ్గురు ఆంగ్ల పండితులు, భాషా శాస్త్రజ్ఞులు తెలుగు భాష గురించి వెలువరించిన అమూల్యమైన అభిప్రాయాలను క్రింద పేర్కొంటున్నాను (నా Note Book నుండి) "Telugu can be looked upon as the northern most member of the southern languages or southern most member of the northern languages, and it has the advantages of both groups with few, if any of the defects. It is adaptable, dynamic, abnortlive, grammatically simple and euphonically exceptionally beautiful even when using foreign words. It has never suffered from narrow proventialism"

- G. HOMEFIELD ME LEOD

"Telugu is singularly melodious. It is the sweetest and most musical of all the Dravidian tongues and it sounds harmonious even on the lips of the most illiterate. It has justly been calld the Italian of the East and though Tamil may, perhopes, be a richer language and note wealthy in classical litarature, Tulugu confessodly bears the palm for its exquisite melody and grace." - HENRY MORRIS

"You cannot keep out foreign words as you keep our foreign manufactuerd goods. Perhaps Telugu accepts them more easily than any other Indian language,and this will certainly help is make it a rival is Hindi in teaching Science, Medicine and Engineering." - J.B.S. HALDANE

తెలుగు లయాత్మకమైన భాష (Lyrical language) తెలుగు చాలా ప్రౌఢగా మారింది సంస్కృత భాషా సంపర్కం వల్లనే. తబలాలా సుతారంగా సవ్వడి చేస్తుంది. మృదంగ ధ్యానాన్నీ వినిపిస్తుంది. వేణువులా వీణియలా జోలలు పాడుతుంది; ఎలక్ట్రిక్ గిటారు జ్వాలలు రేపుతుంది.

కళా ప్రపూర్ణ ఆచార్య గంటి జోగి సోమయాజి గారు రచించిన బృహద్గ్రంథం (1946) 'ఆంధ్ర భాషా వికాసము' నందలి 'తెలుగు నందలి మాండలిక భేదములు' అను ప్రకరణం నుండి కొన్ని పంక్తులను ఈ దిగువ పేర్కొంటున్నాను.

"తెనుఁగున మూడు వంతులు సంస్కృత సమములు. క్రొత్త భావములకు సంస్కృత సంజ్ఞలు కల్పించుకొని తెనుఁగునఁ జేర్చికొనుట మనయలవాటు. మన పూర్వుల కలవడిన మార్గము. మనమా మార్గమునే నేఁడవలంబించు చున్నాము. కాని జాతీయ నాగరికతకు బ్రాధాన్యము తగ్గిన వెంటనే సంస్కృత భాషా పాండిత్యమును తగ్గినది. ఆ చదువునకు విలువ లేదు. కావున దానినభ్యసించు వారును తగ్గిరి. చెప్పు వారునుఁ గూడ లేకుండ బోవుచున్నారు. రామణీయకము, రమణీయము, సహాయము, సామాయ్యము, స్వతంత్రము, స్వాతంత్ర్యము మొదలుగ జంటలకుఁగల యర్థ భేదములు తెలియక యొకదానికొకటి గ్రంథములలోఁ బ్రయోగించుట సంభవించుచున్నది"

పై గ్రంథానికి FORE WORD సమకూర్చిన డా. కట్టమంచి రామలింగారెడ్డి అభిప్రాయం పరికించండి.

"BISHOP CALDWELL and the majority of priblogis is have traced it (Telugu) is 'Dravidian Sources' and given it a Dravidian offiliation, though of course it has absorbed ink inself other elements, more especially those is Sanskrit and Prakrit and is still continuing to adsorb and assimilate foreign matter, as is but matured to a language living and growing and full of vitality."

కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామి వారు 1973వ సంవత్సరంలో తమ పర్యటనలో భాగంగా ఢిల్లీలో చేసిన అనుగ్రహ భాషణాల్లో వివిధ విషయాలను ప్రస్తావించారు. వారి ప్రవచనాలు తమిళ, సంస్కృత, తెలుగు, హిందీ భాషల్లో సాగాయి. వాటిని Oriental Cultural Education Society, Madrasకు చెందిన శ్రీ ఎస్. బాలసుబ్రమణియన్ (S. Bhala subramanian) ఇంగ్లీష్ షార్టు హ్యాండ్‌లో లిఖించి 255 పుటల పుస్తకంగా ప్రచురించారు.

స్వామివారు తెలుగు దేశం గురించి, తెలుగు భాషా విపుల గురించి ప్రస్తావించారు. (సంబంధిత 4 పుటల జిరాక్స్ కాపీలను జతపరిచాను) తమిళనాడుకు చెందిన ప్రసిద్ధ సంస్కృత పండితుడు శివాద్వైతి శ్రీ అయ్యప్ప దీక్షితుల వారి ప్రఖ్యాత శ్లోకాన్ని ఉదహరించారు. దక్షిణాన శ్రీకాళహస్తి, పశ్చిమాన శ్రీశైలం, ఉత్తరాన ద్రాక్షారామం శైవ క్షేత్రాలను అనుకొని ఉన్న ప్రాంతం త్రిలింగదేశంగా ప్రాచీనకాలంలో వ్యవహరింపబడేదని చెప్పారు. శ్రీ కాళహస్తి క్షేత్రం విషయంలో స్వామివారు పొరబడ్డారేమో, అది కాళేశ్వర క్షేత్రం. క్రీస్తుశకము 14వ శతాబ్దపు మొదటి పాదంలో కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానమందుండిన విద్యానాథకవి తన ప్రతాపరుద్రీయమున ఈ దేశపు పేరును త్రిలింగం అని వ్యవహరించి శ్రీశైల కాళేశ్వర ద్రాక్షారామములలోని మూడు శివలింగముల వలన ఈ దేశమునకు ఆ పేరు కలిగినట్లు సూచించెనని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తమ వ్యాసం 'ఆంధ్ర – తెలుగు'లో పేర్కొనినారు. (విజ్ఞాన సర్వస్వము మొదటి సంపుటి) ముద్రణ తెలుగు భాషా సమితి హైదరాబాదు (1983) తెలుగు ప్రాంతంలో బౌద్ధ, జైన మతాల తర్వాత శైవమే ప్రబలంగా ఉండేది. ఒరిస్సాను అనుకొని ఉన్న శ్రీముఖ లింగంలో కూడా ప్రసిద్ధ శైవాలయాలు ఉన్నాయి. అది కూడా గొప్ప శైవక్షేత్రం. తిరుపతి తిరుమల క్షేత్రం కూడా శైవ

క్షేత్రమేనని చిలుకూరి వీరభద్రరావుగారు తమ ఆంధ్రుల చరిత్ర (మధ్యయుగము) ద్వితీయ భాగంలో (ముద్రణ 1912) పేర్కొన్నారు. విశాఖ జిల్లాలోని సింహాద్రి అప్పన్న క్షేత్రం కూడా శైవక్షేత్రమే. (అప్పన్న అన్నది దేవాలయ నిర్మాణ బాధ్యత వహించిన శిల్పిపేరు)

"రెండవ విజయాదిత్యుడు 108 యుద్ధాలు గెలిచి 108 శైవ దేవాలయాలు నిర్మించారు. విశాఖ జిల్లా ఎలమంచిలి దగ్గర సర్వసిద్ధి అనే గ్రామం ఉంది. అక్కడి శిల్పాచార్యుల్ని సర్వసిద్ధి శిల్పాచార్యులనే వారు. వారు సృషించిన శిల్పాలు కళింగ దేశం దాకా ప్రసిద్ధి వహించాయి." ఈ పంక్తులు డా. పెదపాటి నాగేశ్వర రావు గారి రచన 'శిల్పాగమ చంద్ర చాంద్రి' అను గ్రంథంలోనివి పుట:26 ముద్రణ (మార్చి 2000). రచయిత సాహిత్యంలోనే కాకుండా వాస్తు శిల్ప శాస్త్రాల్లో పండితుడు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ, కన్నడ, మరాఠీ భాషల్లో 25 గ్రంథాలు రచించారు. 'మానసార' అన్న వాస్తుశాస్త్ర ఉద్గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు సంస్కృతం నుండి. ఇద్దరు రాష్ట్రపతుల చేత సన్మాణితులు (1976, 1985) శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారి అభిప్రాయం తెలుగు భాష లిపుల గురించి అతి ముఖ్యమైనవి. తెలుగు భాష లిపులు శివపార్వతులకు అతి సన్నిహితమైనవి. పరమాత్మ యొక్క స్త్రీ రూపమే పరాశక్తి అని, పరాశక్తికి చెందిన యంత్రాల్లో (తంత్ర సంబంధమైనవి) ముద్రకు అనువైనది తెలుగు లిపి అని పేర్కొంటారు. దేవతలకు 'వామవార్త' పూజ అనుగుణమైనది కనుక తెలుగు లిపిలోని అక్షరాలు ఎడమవైపుకు వక్రరేఖలతో గుండ్రంగా ఎడమ వైపుకు వస్తాయి కాబట్టి దేవతామూర్తులకు నిర్దేశించిన యంత్రాలలో ముద్ర (Impression) కు తెలుగు లిపే సరియైనదని స్వామివారి భాషణ. ఇతర భాషల్లో వక్ర రేఖలు కుడి వైపు వస్తాయని స్పష్టం చేస్తారు.

త్రిలిఙ్గ రజతోత్సవ సంచికలో ఆంధ్రము – ప్రాఙ్నన్న పార్య యుగము అన్న శీర్షికతో ఒక వ్యాసం ఉంది. రచయిత: విద్వాన్ కె.వి. సుబ్బ రాఘవ కవిగారు. మాంబళము, మద్రాసు. అందులో ద్వాదశములైన గ్రంథములను పేర్కొనడం జరిగింది.

1) ఆంధ్రము
2) ఆంధ్రేయణము
3) కోసలాంధ్రము
4) హేరంభకాంధ్రము
5) కళింగాంధ్రము
6) మల్లకాంధ్రము
7) ద్రమిళాంధ్రము
8) గుహకాంధ్రము
9) రౌద్రకాంధ్రము
10) గుహ్యకాంధ్రము
11) కాంచకాంధ్రము
12) పీఠకాంధ్రము

ఇవి మాండలికాలు (Dialects) కావచ్చు. ఇటీవలి తెలుగు భాషాశాస్త్ర గంధ్రాల్లో వీటి ప్రసక్తి లేదు.

తమిళ మహాకవి సుబ్రమణ్య భారతి చెప్పినట్టు మనది సుందర తెనుంగు. ప్రపంచ లిపుల్లో తెలుగు లిపికి ద్వితీయ స్థానం లభించింది. భవిష్యత్తులో తెలుగు భాషకు అద్వితీయ స్థానం లభించాలని ఆశిద్దాం. భాషలన్నీ వాగ్దేవి పుత్రికలే. దేనినీ చిన్న చూపు చూడవలసిన అవసరం లేదు.

కె. దినకర్
ఋషికొండ, విశాఖపట్నం,
సెల్: 9032447413

మొక్కుబడి

ముఖారిరాగము – చావుతాళము

ఇన్ని విధముల బూజించేర సామి! – యింతి నను గూర్చుమీ!
ని న్నెంతగా వేడు కొన్నందుకు నాకు
నెంజిలి దీర్చు సుమీ! నాసామీ॥
కన్నెమోము నేను గనుగొన గలిగిన
పున్న మొక్క ప్రొత్తుండేర! సామి!
కన్నులు ముద్దాడ గలిగితే జంట
కలువపువ్వుల బూజించేర! సామి!
సన్ననూగా రంటగలిగిన నాగుల
చౌతి వ్రతము లుండేర సామి!॥
తియ్యని మో వాన గలిగిన ననజుంటి–తేనె లార గింపించేర! సామి!
శయ్యపై దాని నన్నెనయ జేసిన వసంత చతుర్ధశి చెల్లించేర! సామి!
నొయ్యారి జిగిచూపుల నన్నుజూచిన
మెప్పుగ నారతు లెత్తేర! సామి! ॥
బాల నన్ను బిలిచిన నిన్ను మువ్వగో – పాల రాయడని పిలిచేర! సామి
చాల ప్రొద్దు వేడుక నుండగలిగిన – జాగరములు గావించేర! సామి!
వాలుగంటి యెద నుండ గలిగిన నే
వేళ నిన్ను నే దలచేర! సామి!॥

(క్షేత్రయ్య పదాలు – శ్రీనివాస చక్రవర్తి)


కోలాచల సీతారామయ్య

రసాయన శాస్త్రవేత్త, మహామనీషి కోలాచల సీతారామయ్య

– నాగసూరి వేణుగోపాల్

కెమటోలజి (Chematalogy) అంటే ఏమిటో చెప్పగలరా? పోనీ 'ట్రైబో కెమిస్ట్రీ' (Tribo-Chemistry) అంటే వివరించగలరా?

నిజానికి రెండూ ఒకటే! ఒకటి రష్యాలో పిలుచుకునే పేరయితే, రెండవది పాశ్చాత్య ప్రపంచం వాడే పేరు. కదలిక వున్నప్పుడు కలిగే ఘర్షణ, దాన్ని తగ్గించడానికి వాడే కందెన (లూబ్రికెంట్)ల గురించి తెలిపే శాస్త్ర, సాంకేతిక విభాగం 'ట్రైబోలజి' అందులోని ఒక భాగమే – పైన పేర్కొన్నది. దీని కన్న ఆసక్తికరమైన విషయం – 'కెమటాలజి' విభాగానికి శ్రీకారం చుట్టింది. ఒక తెలుగు వ్యక్తి కావడం!

కృష్ణానది ఒడ్డున జన్మించిన కొలాచల సీతారామయ్య అమెరికాలో తన జీవన సమరం సాగించి రష్యాలో పరిశోధనా లతలు పూయించి వైజ్ఞానిక ప్రపంచంలో చిరస్మరణీయు డయ్యారు. విజ్ఞానం, సాహిత్యం, సమాజం లోతులు ఎరిగిన మానవీయ శిఖరం ఆయన. అందుకే రష్యాలో సీతారామయ్య గతించినపుడు – అప్పటి భారత రాయబారి శ్రీ ఐ.కె.గుజ్రాల్ యిలా అన్నారు – "ఒక గొప్ప శాస్త్రవేత్త, ఒక గొప్ప భారతీయుడు, ఒక గొప్ప ప్రపంచ పౌరుడు అయిన సీతారామయ్యకు కడపటి వీడ్కోలు చెబుదాం"!

అది యుద్ధ సమయం మాస్కోలో, ఎయిర్ – రెయిడ్ వార్డన్‌గా సీతారామయ్య అపార్ట్‌మెంట్ టెర్రస్ మీద ఉద్యోగ బాధ్యతలు నెరవేరుస్తూ వున్నారు. ఆ సమయంలో నాజీలు వేసిన బాంబు దాదాపు మీదబడ్డది. అది పూర్తి బాంబు అయివుంటే ప్రమాదం జరిగి వుండేదే. ఉద్యోగం అయిపోయాక ఆరోజు యింటికి తిరిగి వస్తున్నారు. మెట్రో రైళ్ళు మారాలి. ఎస్కలేటర్ – ప్లాట్ ఫారాలు ఎక్కడానికి, దిగడానికి శ్రమలేకుండా చేరే ఆధునిక యంత్రం–ముందు జనంమధ్య చిక్కుకున్నారు సీతారామయ్య.

తనకి ముందు అగుపడిన దృశ్యం – దారీ తెన్నూ లేకుండా అన్ని దిశల్లో కదులుతున్న తలలు. అది 'బ్రౌనియన్' చలనంలో అణువుల కదలికను తలపిస్తోంది. సోవియట్ టాంకుల యింధనాలు, కందెనలకు సంబంధించి సామర్థ్యం గురించి పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్త మన సీతారామయ్య అంతకు ముందు చాలాసార్లు ఆ దృశ్యం పరిశీలించినా ఈ ఆలోచన రాలేదు. అది కందెనలో జరిగే చర్యను తలపిస్తోంది. మాధ్యమం (మీడియం)లో అణువులు పరస్పరం చర్య జరుపుకోవడం అనేది ఆ మాధ్యమం మీద ఆధారపడుతుంది. ఈ చర్యవల్ల మాధ్యమమే మారిపోవచ్చు. అంతే ఆలోచనల్లో తేలిపోతున్న, తూలి పోతున్న సీతారామయ్య యిల్లు చేరుకోగానే దుస్తులు కూడా తీయకుండా తన ఆలోచనలను కాగితం మీద చిత్రించడం ప్రారంభించారు. అంతవరకు వివరించడానికి ప్రయత్నించిన సైద్ధాంతిక నమూనాలన్నీ మాధ్యమం – అణువుల మధ్య జరిగే చర్యను పట్టించుకోలేదు. అందువల్ల పూర్తిగా అర్థం చేసుకోవాలంటే కొత్త చూపు అవసరమని భావించారు సీతారామయ్య.

టెర్రస్ మీద పడిన బాంబులను టాంగ్స్‌తో తీసివేసి, యిసుక డబ్బాలో వేసిన విషయం గుర్తుకు వచ్చింది. అలా వేస్తున్నపుడు కనబడిన మెరుపులు, కందెనలతో సంబంధం కలిగి వున్నాయనిపించింది. అవి వెల్డింగ్ చేస్తున్నపుడు ఎగిసే అలల్లా వున్నాయి. భూగర్భంలో కదిలే శిలాద్రవం (మాగ్మా) గుర్తుకు వచ్చింది. అలాగే కళ్ళముందు తేలియాడే సూర్యుళ్ళు. వాటి నుంచి నాలుకలు చాచే మంటలు కనబడ్డాయి. పదార్థానికి మరో స్థితి వుండాలని తలంచారు. దాన్ని 'ప్లాస్టిక్' అన్నారు. అదే తర్వాత 'ప్లాస్మా' (Plasma) అని పిలువబడింది. ఈ స్థితిలో పదార్థం ఆవేశభరిత అణువులు (అయోనైజ్‌డ్ స్టేట్)గా వుంటుంది. ఈ స్థితిలో దాని వాహకత్వం చాలా ఎక్కువ. ఇదే 'కెమటాలజి'కి అంకురార్పణ. 1966 నుంచి పాశ్చాత్య దేశాల్లో ఈ 'కెమటాలజి', 'ట్రైటోకెమిస్ట్రీ'గా ప్రసిద్ధి చెందింది.

1899 జూలై 15న కృష్ణా జిల్లా ఉయ్యూరులో ఒక పురోహితుడి యింట వెంకట కృష్ణశాస్త్రి, మూర్తమ్మ గార్లకు సీతారామయ్య జన్మించారు. అతని చిన్నప్పటి పేరు లాల్ గోవింద్. ఆ ప్రాంతం అప్పట్లో హైదరాబాదు నైజాం రాష్ట్రానికీ, మద్రాసు సంస్థానానికీ మధ్య సరిహద్దు ప్రాంతం. తండ్రి నుంచి సత్యాగ్రహ భావనను సీతారామయ్య అందుకున్నారు. లేకపోతే సమాజంలోని అన్యాయాలను చూసి తీవ్రవాదిగా మారి వుండేవారు. పాఠశాల విద్య కాగానే, మద్రాసులో చదువుకోవాలని తలపోశారు. విశ్వ విద్యాలయం ప్రవేశ పరీక్షలో అతనికి అన్యాయం జరగకుండా వుండాలని, సమీప బంధువు ఒకాయన ఒక ఉత్తరం రాసిచ్చారు. విశ్వవిద్యాలయంలో చేరాక క్రీడాకారుడుగాను రాణించారు. భౌతిక రసాయన శాస్త్రాలను చక్కగా అభ్యసించారు.

తండ్రి మరణశయ్యపై వున్న వర్తమానం అందింది.

స్టీమరెక్కి వెళ్ళేసరికి కడచూపు దక్కలేదు. కేవలం చితిమంటలు దర్శనమిచ్చాయి. విదేశాలకెళ్ళి చదువుకోవాలని చెబితే అన్న సముద్రాలు దాటి భ్రష్టుడివి కావద్దన్నారు. ధూమపానం, మద్యపానం, మగువను తాకకూడదని అన్నారు. మద్రాసులో గురుతుల్యుడయిన మిత్రుడు, వామపక్ష కార్యకర్త అయిన వ్యక్తి సాయంతో ఓడ కెప్టెన్‌తో ఒడంబడిక కుదిరింది.

మద్రాసులో మరో ఆంగ్ల వ్యక్తి అమెరికాలోని వ్యక్తికి ఉత్తరం యిచ్చారు. ఓడ కెప్టెన్ కొంత ధనం అడిగాడు. తండ్రి నుంచి సంక్రమించిన రెండువేల రూపాయలను ఓడలో ప్రయాణం చేసే వాడికి– డాలర్లగా మార్చమని యిచ్చారు. ఎందుకంటే కెప్టెన్ డాలర్లే కావాలన్నారు. డబ్బులు తీసుకున్న వ్యక్తి అదృశ్యమయ్యారు. దాంతో క్రూరుడు అయిన కెప్టెన్ స్టీమర్ పొయ్యిలో దూకమన్నారు. మధ్యధరా సముద్రం దాటేసరికి అనారోగ్యం పాలుకాకుండా చేరింది సీతారామయ్య మాత్రమే.

న్యూయార్క్ చేరాక ఒక హోటల్‌లో గిన్నెలు తోమడానికి, పదార్థాలు యివ్వడానికి పనిలో కుదిరారు. తర్వాత చికాగోలోని విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో చేరారు. అక్కడ అతని పరిస్థితి బికారి కన్న తక్కువ. తన దగ్గరున్నది అప్పులకో, పుస్తకాలకు అవిరయ్యింది. మాడే కడుపుతో, పార్కులోని బెంచి మీద గడిపిన రాత్రులున్నాయి. అలా ఉన్నపుడు గస్తీదారులు తరిమిన రోజులున్నాయి.

అది యుద్ధ సమయం. వేరే గత్యంతరం లేదు. తాను బ్రతకాలి, చదువు పూర్తి చేయాలి. శ్రీలంకకు చెందిన మిత్రుడి ద్వారా భారతీయులు పరిచయం అయ్యారు. ఒక పార్టీలో 'సిండి' అనే వనితను కలిశారు. అతని ఆకర్షణీయమైన కళ్ళు ఆమెనాకర్షిస్తే, ఆమె అందమైన కళ్ళు అతన్ని ఆకట్టుకున్నాయి. ఆమె ఖాళీచేసిన యిల్లు అతనికిచ్చింది. ఆకర్షణ అనురాగంగా, అనురాగం వివాహంగా మారింది. సిండి ద్వారా పరిచయమైన వారి సాయంతో ఫెలోషిప్ వచ్చింది.

1924 జూన్‌లో చికాగో విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎస్. డిగ్రీ పొందారు. మోటారాయిల్‌కు సంబంధించిన పరిశోధనకు గుర్తింపు వచ్చింది. దాంతో ఉద్యోగం వచ్చింది. అపుడు సిండి అతని గురించి తల్లిదండ్రులతో మాట్లాడుతానంది. సీతా రామయ్యకు ఆమె కాదు, ఆమె పరిమితులు, ఆ దేశ పద్ధతులు అర్థం కాలేదు. దాంతో అతను రెచ్చిపోయి "మా దేశం రాగలవా?" అని రెట్టించాడు. ఆమె మౌనం వీడలేదు. దాంతో సీతా రామయ్య తన వస్తువులతో బయటపట్టాడు. యేల్‌లో చేసిన పనికి రెండవ డిగ్రీ స్నాతకోత్తర పట్టా చాలా తక్కువ సమయంలో లభించింది. అక్కడ ఇంధనాలు, కందెనల గురించి శోధన జరుగు తోంది. వాడే విధానం మారినపుడు, ఇంధనమే మారుతుందని ఆలోచన. అక్కడ ఉద్యోగం కాంట్రాక్టు ముగిశాక, అధిక జీతం యిస్తామన్నా అవసరం లేదని రష్యా పయనమయ్యారు. అప్పటికీ వామపక్ష భావలమీద మక్కువ పెరిగింది. సిండిని, బిడ్డను వారితో పాటు తన సంపాదనను వదలి రష్యా చేరారు.

రష్యాలో పెట్రోలియం సంస్థకూ, ట్రాక్టర్ సంస్థకు అధిపతి అయ్యారు. సాంకేతిక నైపుణ్యం కొరవడినా అక్కడి వారిలో చిత్తశుద్ధి లోపించలేదు. సమస్యలు ఎదురయినపుడు సిండి మదిలో మెదిలేది. ఒకసారి వచ్చి కలిసింది సిండి. అయితే సీతారాముడిని తనతో తీసుకెళ్ళలేకపోయింది. అదే చివరి కలయిక. ఆమె వెనుదిరిగి వెళ్ళిపోయింది. జర్మనీ అంతర్యుద్ధపు కరువు. ఆకలి ఫలితంగా 'ఎకటెరినా బవనోవ్నా' అనాధగా రష్యాలో తారసపడింది. ఇద్దరి నేపధ్యాలు ఆకర్షించుకున్నాయి. పెళ్ళయ్యింది. రష్యా భాష నేర్చుకోవడానికి ఆమె తోడ్పడింది.

హిట్లర్ తన తుపాకులు రష్యావైపు గురిపెట్టారు. జర్మనీ యుద్ధ ట్యాంకులకన్నా, సీతారామయ్య రూపొందించిన ట్యాంకులు, యింజన్లు నమ్మకంగా, సమస్యలు లేకుండా మెరుగ్గా పని చేశాయి. అలా కొత్త యింధనాలు గురించి పరిశోధన చేస్తున్న సమయంలో 'ఎస్కలేటర్' సంఘటన జరిగింది. యంత్రంలో ఘర్షణ మీద కందెన ప్రభావం గురించి సీతారామయ్య భావనలకు 1951లో డాక్టరేటు లభించింది. తర్వాత 15 సంవత్సరాలు అది 'ట్రైబోలజి'గా ప్రాచుర్యంలోకి వచ్చింది. సీతారామయ్య భారతీయుడు కావడం వల్ల తగినంత గుర్తింపు రాలేదు. మాస్కోలోని ఆటోమొబైల్ ఇన్‌స్టిట్యూట్ 'నామి' అధిపతిగా మాత్రమే పదవీ విరమణ చేశారు.

అదే సమయంలో సాహిత్యంలో కూడా కృషి చేశారు. తెలుగు – రష్యా నిఘంటువు కొరకు శ్రమించారు. ఏటుకూరి బలరామ మూర్తిగారి పుస్తకం 'ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర'ను రష్యాభాష లోకి అనువదించారు. రష్యా ఆంధ్రుడు, మాస్కో ఆంధ్రుడు, సోవియట్ ఆంధ్రుడు అతని యితర పేర్లు, అతని 'ది థియరి ఆఫ్ ది ప్లాస్టిక్ మీడియం' కేవలం ప్రసంగాల్లోనే వుండిపోయింది. అతని మౌలిక భావనలతో సంకలన్ అతను గతించాక పుస్తకంగా వెలువడింది. 1977లో సీతారామయ్య మరణించారు.

డా. నాగునూరి వేణుగోపాల్
సెల్ నెం : 9440732392



రేడియో సూపర్ స్టార్
శారదా శ్రీనివాసన్

– అశ్వినీకుమార్

ఒక మాధ్యమానికి సూపర్ స్టార్‌గా తెలుగు శ్రోతలు మిమ్మల్ని పరిగణించారు. "వెండితెరకు సావిత్రిగారు రేడియో స్వరానికి శారదగారు". అంతటి శారద గారిని ఏవో ప్రశ్నలు వేసి పాఠకులకు పరిచయం చేయటం ఈ మాటామంతీ ఉద్దేశం కాదు. ఇక్కడకు వచ్చే ముందు రెండు రోజులుగా మీ అనుభవాలు – జ్ఞాపకాలు చదువుతూనే ఉన్నాను. ఇక్కడికి వస్తూ మీతో పాటు పనిచేసిన, మీ తర్వాత రేడియోతో అనుబంధం ఉన్న ఇద్దరు మిత్రులను తోడు తెచ్చుకున్నాను. ఎంత హోం వర్క్ చేశానో చూశారా. ఈ హోం వర్క్ ప్రతి పాత్రకు చేశానని మీరు కూడా మీ జ్ఞాపకాల్లో చెప్పారు. అంటే సాధన చేయటం వేరు సాధించటం వేరు. ప్రసార మాధ్యమాలకు మరో శారద దొరకరు. మీకు స్వరం సహజంగా లభించింది. ఆ స్వరాన్ని మీరు సాధనతో స్వాధీన పరుచుకొని తెలుగు శ్రోతలను మూడు దశాబ్దాలకు పైగా పండిత పామరులను అలరించారు, పులకింపచేశారు. విలపింపచేశారు. మీ గళంతో గొప్ప గొప్ప వ్యక్తులను దర్శింప చేశారు. ఎన్నో భావోద్వేగాలను పలికింప చేశారు. ఆ బాధ మీరు అనుభవించారు. మాకు పంచి పెట్టారు. ఈ సంధ్యా సమయంలో అవన్నీ తిరగతోడటం నా ఉద్దేశ్యం కాదు కానీ, మీరు బాగా ఆనందించిన సన్నివేశాలు కొన్ని, విషాదాలు కలిగించిన పాత్రలు, అనుభవాలు మీ స్వరంలో వినాలని వచ్చాం. ఈ సమావేశాన్ని మీ ప్రతిస్పందనతో మొదలు పెడదాం.

శారదా శ్రీనివాసన్: మీరు చాలా బాగా చెప్పారు నన్ను గురించి. చాలా సంతోషం. నా ఒక్కొక్క స్టేజ్ గురించి చాలా ఉద్వేగంగా చెప్పారు మీరు. దానికి చాలా సంతోషపడుతున్నాను.

మిసిమి : శారదా శ్రీనివాసన్ గారూ మిసిమి మీకు స్వాగతం పలుకుతోంది. మీరు తణుకు నుంచి వచ్చారు. తణుకు అంటే నన్నయ్య పీఠం వెలిసిన పట్టణం, తిలక్ తిరిగిన బాటలు.. ఇక మీరు మీనాటక ప్రస్థానాన్ని మొదలుపెట్టిన నేల. అప్పటి ముచ్చట్లేవన్నా చెప్పండి.

శారదా శ్రీనివాసన్ : తప్పకుండా చెబుతానండీ. తణుకులో మా నాన్నగారు ఉద్యోగం చేశారు. రిటైర్మెంట్ తర్వాత అక్కడే స్థిరపడ్డారు.నాటకానికి సంబంధించి నా జ్ఞాపకాలు అడిగారు మీరు. నా నాటక ప్రస్థానం గురించి చెప్పాలంటే నాకు తెలీదు అప్పటికి నాటకం అంటే ఏమిటో. అప్పటికి చాలా చిన్నదాన్ని కూడాను. నన్ను బాలసరస్వతి స్త్రీ సమాజం బడిలో చేర్చారక్కడ.

నాకు తెలీదు కానీ నన్ను కన్నార్పకుండా చూసి ఈ అమ్మాయిలో ఏదో ప్రతిభ ఉందని గమనించిన వారు దేవులపల్లి సత్యవతమ్మ గారు. వారితోపాటు ఇంకో ఇద్దరు. మొత్తం ముగ్గురు.. ముగ్గురు వైధవ్యం పొందినవారే. ఆడపిల్లల మీద ప్రేమతో ఈ సమాజాన్ని నడిపిస్తుండేవారు. మూడేళ్ళు చదివానేమో అక్కడ. ఒక సంవత్సరం వాళ్ళు నన్నడిగారు. శారదా నువ్వొక డ్రామాలో వేయాలి అంటూ. మా నాన్నగారికి ఇలా ఆడపిల్లలు నాటకాలు వేయటం అస్సలు ఇష్టం ఉండేది కాదు. అదే చెప్పాను.

అదేమిటి స్కూల్ డ్రామాయే కదా. పైగా అందరూ ఆడ పిల్లలే వేస్తున్నారు అంటారు వాళ్ళు. ముగ్గురూ నడిచి వచ్చేశారు మాఇంటికి. అప్పుడు జట్కా బళ్ళు, ఎడ్ల బండ్లు.. ఇవే ఆధారం ఎక్కడికి వెళ్ళాలన్నా. రిక్షాలు కూడా ఇంకారాలేదు. అప్పటికింకా మనకు స్వాతంత్ర్యం రాలేదు. ఇది ఏ సంవత్సరంలోనో చెప్పలేదు కదూ. అది 1945వ సంవత్సరం.

సరే వాళ్ళు నడిచి మా ఇంటికొచ్చారని చెప్పాను కదా.

ఇన్స్పెక్టర్ గారు, మీరు మీ అమ్మాయిని నాటకంలో వేయవద్దని అన్నారుట. అలా అంటే ఎలా అండీ. ఇది ఆడ పిల్లల స్కూల్, ఆడపిల్లలే నాటకంలో వేస్తున్నారు, మీరు ఒప్పుకోవాలి అని అడిగారు. పైగా మీ అమ్మాయికి టాలెంట్ ఉంది అన్నారు. ఆడవాళ్ళు ముగ్గురొచ్చి అడిగితే మా నాన్న గారు కాదనలేకపోయారు. పదిహేను నిమిషాలు నాటకాలు మూడో, నాలుగో వేశారు. వత్సరాజు అనే సంస్కృత నాటకంలో వత్సరాజు పాత్ర. ఆ తర్వాతో హిందీ నాటకం. ఆ తర్వాత మరో నాటకం చంద్రగుప్తుడు. అందులో చంద్రగుప్తుడు పాత్ర. ఇలా అన్నింటిలోను మగవేషాలే. పొడుగ్గా ఉండేదాన్ని కదా అందుకని. (నవ్వు). ఆ తర్వాత డాన్స్ బాలే. అది రజనీకాంతరావు గారు రాసింది. గాయని వసంత గుర్తుందా. తను అప్పుడు మద్రాసు మహిళా సభలో చదువుతుండేది.అప్పుడెందుకో తణుకొచ్చింది.

వసంతా వీళ్ళకు డాన్స్ బాలే నేర్పంటూ తనకా బాధ్యత అప్పగించారు.ఆ బాలే పేరు వసంతాగమనం. అందులో వసంతుడి పాత్రనాది. మాచిరాజు రాజ్యలక్ష్మి అని మరోఅమ్మాయి కూడా వేసింది. ఇంకా తుమ్మెదల పాత్రలుండేవి.వేరే అమ్మాయిలు వేశారు. అన్నీ ప్రధానపాత్రలే నాకు ఇచ్చేవారు. వారేం చూసి ఇచ్చేవారో నాకు తెలీదు. నాలో టాలెంట్ ఉందని కూడా నాకు తెలియదు.

మర్చిపోయాను. ఒక తెలుగు నాటికలో కూడా వేశాను. అప్పట్లో చిర్రావూరి సుబ్రహ్మణ్యం గారని తెలుగు మాస్టారు ఉండేవారు. చాలా చిన్నవారు ఆయన అప్పుడు. ఆయన్ని తెలుగు నాటిక రాయమంటే, ఆ అమ్మాయి వేస్తే రాస్తానన్నారు ఆయన. అప్పటికే ఈ అమ్మాయి చాలా వాటిల్లో ఉందని చెప్పినా వినలేదాయన. అమ్మ అనే నాటిక రాశారు. అందులో మాత్రం అమ్మ పాత్ర వేశాను. నాకన్నా పొడుగ్గా ఉండేది నండూరి లలితని. ఆ అమ్మాయి నాన్న. ఇవన్నీ ప్రదర్శించిన తర్వాత స్వాతంత్ర్య సమరయోధుడు ఒకాయనను ముఖ్య అతిథిగా పిలిచారు. ఆయన మాట్లాడుతూ ఒక మాటన్నారు.

ఈ అమ్మాయి ఎవరోకానీ భవిష్యత్తులో పెద్ద ఆర్టిస్ట్ అవుతుందని జోస్యం చెప్పారు. ఆయన మాటలు విని నవ్వుకున్నా మందరమూ ఆరోజున.సరే అదంతా అయిపోయింది.అదొక సంఘటన డ్రామాల గురించి..

మా తెలుగు మాస్టారుని (చిర్రావూరి సుబ్రహ్మణ్యం గారు కాదు) నేను చాలా చికాకు పెడుతుండేదాన్ని. ఆయనేదడిగినా నేను సమాధానం చెబుతుండేదాన్ని. మూడుసార్లు వెరీ గుడ్ అన్నారు. నాలుగోసారి ఆయనకు కోపం వచ్చింది. నువ్వెందుకు చెబుతావు అని కోప్పడ్డారు. అవన్నీ నాకు తెలిసేంత తెలివి తేటలు లేవు కానీ, ఇంటి ప్రభావం, ఇంటి వాతావరణం కొంత ఉండేది. దానివలన చెప్పేస్తూ ఉండేదాన్ని.

కొన్నాళ్ళు పోయింతర్వాత మా మాస్టారు నువు నా క్లాస్‌కు రావొద్దు.. వెళ్ళిపో అన్నారు. దాంతోటి ఆ స్కూల్ ఆవరణలో తిరుగుతుండేదాన్ని. క్లాసు పోయిందన్న బెంగలేకుండా తిరుగుతుంటే సత్యవతమ్మ గారు వాళ్ళు చూసి అడిగారు

శారదా క్లాసుకు వెళ్ళటం లేదేమిటి అంటూ..

విషయం చెబితే మాస్టారుని వారడిగారు. మాస్టారేమో ఈ అమ్మాయి ఇలా చేస్తోంది, వద్దన్నా సమాధానాలు చెబుతోంది అని వారికి చెప్పారు. వాళ్ళకీ అర్థం కాలేదు. ఎందుకీ అమ్మాయి ఇలా చేస్తోందని..

ఈలోగా అక్కడే సేవాసదన్ ఇంకా కొన్ని స్కూళ్ళు ఉండేవి. ఆ సేవాసదన్ వారు నన్నయ్య మీద ఓ కార్యక్రమం చేస్తున్నారు. వాళ్ళు సత్యవతమ్మగారిని అడిగారు. నన్నయ్య రాసిన ఓ ఘట్టం గురించి చెప్పగలిగే వాళ్ళుంటే పంపించమని. అది మా తెలుగు మాస్టారే చూస్తున్నారు. ఆయన పిల్లలందరికీ నువ్వు ఇది చదువు, నువ్వు ఇది చదువు అంటూ ఎవరెవరికి ఏం చదవాలో చెప్పేశారు. ఒక్క నాకే ఏం చెప్పలేదు. వాళ్ళందరూ రిహార్సల్స్ చేస్తుంటే నేను ఖాళీగా తిరుగుతుండే దాన్ని. మళ్ళీ సత్యవతమ్మ గారే నన్ను చూసి నేనెందుకు చదవటం లేదో కనుక్కుని, నువ్వెళ్ళి మాస్టారినడుగు అని నావెంటే వచ్చారు. నేవెళ్ళి అడిగాను, నాక్కూడా ఏదయినా ఇవ్వరా మాస్టారు చదవటానికి అని.

ఆయనేమో నువ్వేదోకటి చదివేయమ్మా, నీకిష్టమయింది అనేశారు. సరే నేను బయటకొచ్చేసి భారతంలో ఏది చిన్నగా ఉందో చూసి అది నేర్చుకోవాలనుకున్నాను. భారతం మొదటిలోనే ఒక శ్లోకం కొంచెం వచనం కలిపి ఉన్నది ఎంచుకున్నాను. నాకు బట్టీపట్టడం రాదు.. మిగిలిన వాళ్ళకు ఘట్టాలిచ్చేస్తున్నారు. నేను మొదటిలో ఉన్న జనమేజయుని వఅత్తాంతం తీసుకుని మాస్టారుకి చూపించాను. ఆయనమో పూర్తిగా చూడకుండానే ఆ.. ఆ తీసుకో.. ఆ.. వెళ్ళు అని నిర్లక్ష్యంగా అన్నారు.

నేను కూడా మాస్టారు క్షమించండి, ఇంకెప్పుడు చేయను అని ఏదో ఒకటి అడగాలి కదా.. అలా అడగాలన్న జ్ఞానం కూడా లేదు. పెద్దవాళ్ళంటే గౌరవం లేకకాదు.. జ్ఞానం లేక..

ఆ తర్వాత ఇంట్లో కూచుని చదువుతుంటే మానాన్న గారు ఏమిటే ఆ చదవటం.. రామునితోక పివరుండిట్లనియే

అన్నట్టు అని వేళాకోళమాడి చదివేటప్పుడు ఎక్కడెక్కడ ఆపాలన్న పంక్చుయేషన్ చూపించి, అర్థపుష్టితో చదవటం నేర్పించారు.

మా నాన్నగారు తణుకులో ఉన్న క్లబ్‌లో టెన్నిస్ ఆడుతుండేవారు. నాన్నగారు నేనూ కలిసే వెళ్ళాము ఆ పోటీకి. నాన్నగారు నన్ను దింపేసి అటెళ్ళిపోయారు

నేను మిగిలిన వారితో కలిసి ఆ పోటీకోసం వెళ్ళాను.

అక్కడ కూడా మా తెలుగు మాస్టారు నాపై కోపం చూపించారు (నవ్వు). ముందు నా పేరిచ్చారు.

బందా కనకలింగేశ్వరరావు గారు ఇంకా ఎవరో ఉన్నారు. బందా గారి పేరు, స్థానం వారి పేరు తెలుసప్పటికి. దానికి కారణం మా నాన్నగారు స్టేజ్ నాటకాలు చూస్తుండేవారు. వీరందరి పేర్లు చెబుతుండేవారు. సరే విషయంలోకి వస్తాను. కొంచెం ప్రాక్టీస్ చేసివెళ్ళాను కదా చదివేసాను. నా తర్వాత వాళ్ళకి పెద్దపెద్ద ఘట్టాలు ఇచ్చారని చెప్పా కదా. బట్టీపట్టడం సులభం కాదు కదా. ఏదో చదివేశారు కానీ, ఇప్పుడనిపిస్తుంది వారికెంత శిక్షో కదా అది అని.

మిసిమి: మీకు మీ మాస్టారివలన మేలే జరిగింది (నవ్వు)

శారదా శ్రీనివాసన్ : అవును, నన్నెంత ఆశీర్వదించారో కదా అనిపిస్తుంది, ఇప్పుడు ఆ రోజుని తలుచుకుంటే. రిజల్ట్స్ ప్రకటించారు. నా పేరు ఫస్ట్ ప్రైజ్‌గా అనౌన్స్ చేశారు. తెల్లబోయాను నేను. నేనేనా, నాకేమిటి అనుకున్నాను. చక్కగా బొట్లు పెట్టిన భారతం పుస్తకం బహుమతిగా ఇచ్చారు. చాలాకాలం దాచుకున్నాను ఆ పుస్తకాన్ని. ఆరోజు ఆ ఫంక్షన్ అయ్యాక నేనూ, మా నాన్న గారు ఇంటికి నడిచివస్తున్నాం. ఆయన టెన్నిస్ ఆడి క్లబ్ నుంచి వచ్చారు. ఈలోగా మేమంతా చదవటం, ప్రైజులివటం అయిపోయింది. ఆయనకిదంతా తెలియదు.

ప్రైజ్ ఎవరికొచ్చిందని మా నాన్నగారు అడిగితే బావుండని నేను చూస్తున్నాను. చిన్నపిల్లని, నా అంతట నేను చెప్పే ధైర్యం లేదు. ఇల్లు దగ్గర పడ్డాక అప్పుడడిగారు.

"ఎవరికిచ్చారు ప్రైజ్" అని.., "నాకే నాన్నగారు"

ఇలా అనగానే షాక్ కొట్టినట్టు వెనక్కి తిరిగి చూశారు.

నా చేతిలో భారతం పుస్తకం చూశారు.

"ఆ.. మొక్కలేని చోట ఆముదం మొక్కే మహా వృక్షమయి పోయిందన్న మాట" అన్నారు. ఇది చిన్నతనంలోని మాటయినా నాకు బాగా గుర్తుండి పోయింది.

దీనికి ఏమిరాదు కదా ఫస్ట్‌ప్రైజ్ ఎలా వచ్చిందని ఆయన అభిప్రాయం. అదే ఇప్పుడు చూడండి. పిల్లలు కాస్త గొంతు విప్పగానే ఎమ్మెస్. సుబ్బలక్ష్మంటున్నారు. కాస్త కాలు కదపగానే శోభానాయుడు అంటున్నారు. అలా పొగిడితే వాళ్ళెదుగుతారా!

ఇంకా బాగా పాడాలి, ఇది మహా విద్య, ఇంకా నేర్చుకోవాలని వారికి చెపితే, వారికి దారి చూపించినవారవుతాం.

మిసిమి : బావుందండీ, మీ చిన్ననాటి విషయాలు బాగా చెప్పారు. రేడియోలో మీరెలా ప్రవేశించారు. అదొక సాంకేతిక మీడియం. భూతంలా కనిపించే మైక్‌ని మీరెలా వశపరుచుకున్నారు?

శారదా శ్రీనివాసన్: నేను దానిగురించి ఆలోచించలేదు.. అందువలన (నవ్వు).

మిసిమి : అంటే అది పెద్ద విషయంగా మీరు భావించలేదు. అంతేనా

శారదా శ్రీనివాసన్: అవునండీ అది మైకు, అదో భూతం అనుకోలేదు.

నేనెలా చేస్తాను అనుకున్నానే కానీ, మైక్ గురించి నాకెప్పుడూ బెంగలేదు. ఆడిషన్‌కు వెళితే ఎవ్వరూ ఉండరు, భయమేస్తుంది అంటారు.. నేను ఆడిషన్‌కు వెళ్ళినప్పుడు అమ్మా చదువు అన్నారు, చదివేశాను. చేతులు దులుపుకుని బయటకు వచ్చేశాను. భయపడలా. అట్లాంటి తత్వమెందుకో నాకు ఉండేది.

మిసిమి : బావుంది! మీకు భయం లేకపోవటం గొప్పవరం, మీకు స్వరంతో పాటు!

మీకు రచయితలిచ్చిన పాత్రల అంతరంగాన్ని మీ స్వరంలో ఎలా పలికించగలిగారు! ద్రౌపది, కుంతి.. ఇలా ఏ పాత్రనయినా.. ఎలా పలకరించగలిగారు! ఇది కేవలం ఒక భౌతిక ప్రక్రియగా నేను భావించడం లేదు. ఒక intuition, ఒక మనోధర్మంతో సాధించారని నేననుకుంటున్నాను.

శారదా శ్రీనివాసన్: కరెక్టేనండీ అది మనోధర్మమే.. ముఖ్యంగా పాత్ర స్వభావమేమిటన్నది నేను శోధిస్తాను. ఆషామాషీగా తీసుకోను. చిన్నపాత్రయినా సరే ఆషామాషీగా తీసుకోను. అది నౌకరాణీ అయినా, ముసలవ్వయినా

నాకర్థం కాని పాతనాటకాల్లోని పాత్రయినా సరే. నాకా కథలు, కాకర కాయలు ఏమీ తెలీవు. ఆ పాత్ర హిస్టరీ తెలియదు. తెలియకపోయినా ఆ పాత్ర గురించి ఒక పిక్చర్ ఏర్పరుచుకుంటాను. అందులో ఆ పాత్ర స్వభావమేమిటి, ఆ పాత్ర లక్షణాలు, గుణాలు ఏమిటి ఆ పాత్ర స్వరూపమేమిటో ఇలా అన్నీ అర్థం చేసుకుంటాను. అలా అర్థం చేసుకున్నదాన్ని పలికించటానికి ప్రయత్నం చేస్తాను.

మిసిమి : ఆ ప్రయత్నం మీరెలా చేస్తారు!

శారదా శ్రీనివాసన్: ప్రయత్నమంటే అది అర్థం చేసుకోవటంలో ఉంటుంది. మీరో ప్రశ్న వేశారు. ఆలోచించి సమాధానం చెప్పాలి కదా. ఎలా చెబుతున్నారంటే ఏం చెప్పగలను. అది అర్థం చేసుకోవటంలో ఉంటుంది. అలాగే ఒక పాత్ర యొక్క సంభాషణలు పలికించటాన్ని సీరియస్‌గా తీసుకుంటాను. ఆస్కార్ అవార్డు పొందిన The Elephant Whishperers డాక్యుమెంటరీ నిర్మాత మాట్లాడుతూ ఆవిడ చాలా పుస్తకాలు చదివిందిట. వాటిల్లోని ఒక కొటేషన్ ఆవిడనెంతో inspire చేసిందట. అది నా తత్వమే అని నాకనిపించింది. ఎందుకంటే ప్రతిభ ప్రతి మనిషిలోనూ ఉంటుంది. ఆ ప్రతిభను ఉపయోగించుకోవటానికి మనమెంత సాధన చేశాం, ఎంత కృషి చేశాం, ఎంత కష్టపడ్డామన్నది ముఖ్యం. వీటిమీదే ఆ ప్రతిభ యొక్క ఫలితం ఆధారపడి ఉంటుంది. ఇది నేను నమ్ముతాను.

మిసిమి : మీరు సాధన ఎక్కువ చేస్తారు. హోంవర్క్ ఎక్కువ చేస్తారు. అలా ఆ పాత్రను అర్థం చేసుకుంటారు. అంతేనా..

శారదా శ్రీనివాసన్: అవునండీ.. సాధన, కష్టపడటం.. అవే ముఖ్యం. నేనో ముసలివేషం వేశాననుకోండి. మైక్ ముందుకు వెళ్ళగానే ఆ పాత్ర సంభాషణలను అచ్చం అలాగే పలుకుతాను. అందుకు చేసిన కృషి అలా పలికిస్తుంది. ఒకసారి నా వయసు కన్నా చిన్నగా ఉండే వేషం వేశాను. ఆవిడ చేత ఆ రోల్ వేయించట మేమిటని మా ఆఫీసు వాళ్ళే కామెంట్ చేశారు. ఆ పాత్ర వయసు పదహారు, పద్దెనిమిదేళ్లుంటాయి. కానీ ఆ పాత్రను పలికించ టానికి కష్టపడ్డాను. నా గొంతును ఆ దిశగా సాధన చేశాను. నా ప్రయత్నం ఫలించింది. ఏంచేశారు మీరు, ఫాల్స్ వాయిస్‌లో చదివారా అన్నారు. ఒక కేరక్టర్‌ను అంతసేపు ఫాల్స్ వాయిస్‌లో చదవగలమా! అని వారికి చెప్పాల్సి వచ్చింది. అది నేను చేసిన సాధన, కృషి. ఎందుకంటే అలా వాయిస్ మార్చగల టెక్నాలజీ రేడియోలో లేదు.

మిసిమి : ఒక కార్యక్రమం చేయటంలో అంటే అది నాటకం కావచ్చు, ఫీచర్ కావొచ్చు, ప్రసంగం కావొచ్చు, యువవాణి ప్రోగ్రాం కావొచ్చు.. దానికి మీకు ఎందరి సహకారమో కావాలి, కానీ వ్యక్తిగతంగా విజయం సాధించటం మాత్రం మీ చేతిలో ఉంటుంది, అంటే మీ స్వరంలో ఉంటుంది.

ఈ రెంటినీ మీరు ఎలా సమన్వయం చేయగలిగారు. ఎలా సాధించారు. అంటే ఇంకొంచెం వివరంగా చెప్పాలంటే ఒక కార్యక్రమం రూపొందాలంటే ఒకరు రికార్డు చేయాలి, మరొకరు ఎడిట్ చేయాలి, సాంకేతిక సమస్యలు లేకుండా చూసుకోవాలి, ఆ ప్రోగ్రాంకి ఒక ఇన్ఛార్జ్ ఉండి ఆ రచనను ఎంపిక చేయాలి ఇలా ఎన్నో దశలుంటాయి కదా.. ఇదంతా ఒక టీం వర్కే అయినా, చివరికి శ్రోతను చేరేసరికి ఒక్క శారదా శ్రీనివాసన్ గొంతు లేదా స్వరమే అందరిలోనూ నిలిచి పోతుంటుంది. ఆ క్రెడిట్ మీరు ఎలా తీసుకు రాగలిగారు.. అది మీ వ్యక్తిగత విజయం కదా

శారదా శ్రీనివాసన్: మీరన్నది నాకర్థమయింది. మీరన్నట్టు ఎవరో స్క్రిప్ట్ రాస్తారు. వేరెవరో దానిని ఎంపిక చేస్తారు. నా ప్రమేయమేమీ ఉండదు. నా దాకా వచ్చేసరికి ఈ పర్టిక్యులర్ రోల్ మీరు వేయాలి అని నాకు చెబుతారు. అది నాటకమయితే ఓ ప్రొడ్యూసర్ ఉంటారు. ఓ ఇంజనీర్ ఉంటారు. అప్పుడు నేనేం చేస్తానంటే నా పాత్రతోపాటు మిగిలిన పాత్రలను గమనిస్తాను. వాటి స్వభావానికి తగినట్లుగా ఆర్టిస్ట్‌లు పలుకుతున్నారా లేదా అని. ఆమధ్య చేసిన ఆమ్రపాలి నాటకాన్ని గుర్తు చేస్తాను. అందులో మంత్రి పాత్రధారి సంభాషణలు ఓ స్నేహితుడు పలుకుతున్నట్టుంటే కరెక్షన్ చెప్పాల్సి వచ్చింది. రాజు దగ్గర ఆ హక్కు ఒక విదూషకునికి మాత్రమే ఉంటుందని వివరించాల్సి వచ్చింది. ఇలా ఓవరాల్‌గా కూడా ఒక కార్యక్రమం బాగా రావటానికి కూడా నా వంతు కృషి నేను చేస్తాను. అందరూ తమతమ పాత్రల స్వభావాన్ని ఆవిష్కరించగలిగితే ఆ నాటకం శ్రోతలను ఆకట్టుకుంటుంది. రంజింపచేస్తుంది.

మిసిమి : మీ నాటకాల్లో మీరు వేసిన పాత్రలతోనే ఆ నాటకా లను అపురూపంగా ఆవిష్కరిస్తారు మీరు.. శారదా శ్రీనివాసన్ లేరక్కడ. ఆ పాత్రలే ఉంటాయి అదే మీ విజయంగా భావించాలి. పురూరవ నాటకం ఎందుకు గుర్తుంచుకుంటున్నారంటే అక్కడ ఊర్వశే ఉంది. శారదా శ్రీనివాసన్ లేదక్కడ.. అంతేనా?

శారదా శ్రీనివాసన్: అవునండీ.. ఈ సందర్భంగా ఊర్వశి జ్ఞాపకం మీతో పంచుకోవాలని అనిపిస్తోంది.. పురూరవ నాటకం శ్రీ గోపాల్ (కె.ఎస్. గోపాలకృష్ణ, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్)

ప్రొడ్యూస్ చేద్దామనుకున్నారు. నేను ఊర్వశిగాను, చిరంజీవి గారిని పురూరవుడు గాను ఆయన నిర్ణయించుకున్నారు. ఇందుకు గాను ఆయనోసారి తిరువణ్ణామలై వెళ్ళి పురూరవను రేడియోలో ప్రసారం చేయటం కోసం చలంగారిని ఒప్పించి కాంట్రాక్టు పై సంతకం చేయించానని చిరంజీవి గారికి చెప్పారు. మీరిద్దరు ఆ పాత్రలు పోషిస్తున్నారని చిరంజీవిగారికి చెప్పేశారు. వేరే ఆర్టిస్టుల్ని బుక్ చేస్తానని చిరంజీవి గారు చెబితే నో.. నో.. నో... మీరిద్దరే ఆ వేషాలు వేయాలని ప్రకటించేశారాయన. నన్నడగితే

నేను వేయలేనండీ, ఆర్టిస్టులకు నేర్పించే బాధ్యత నేను తీసుకుంటాను అని చెప్పినా ఆయన ఊరుకోలేదు. శ్రీ గోపాల్ ఎంత పట్టు బట్టాడంటే చివరికి ఒప్పుకోక తప్పలేదు. ఎలాంటి వేషంవేసినా ఆ పాత్రకు అన్యాయం చేయకూడదనేది నా తత్వం. ఈ విషయం చెప్పానింతకముందే మీకు. నా ఇష్టాఇష్టాలు పాత్రల మీద ప్రయోగించకూడదు. పాత్రకు పూర్తి న్యాయం చేయాలి. అలా చేశాను కాబట్టే ఆ నాటకాలు ఈ రోజు వరకూ నిలబడ్డాయి. నాటకం ప్రసారమయ్యాక శ్రీగోపాల్ తిరువణ్ణామలై వెళ్ళచ్చారు. మిమ్మల్ని చలంగారు చాలా మెచ్చుకున్నారని నాకు చెప్పినప్పుడు నేను నమ్మలేదు. రేడియో అంటేనే ఇష్టంలేని మనిషి చలంగారు. ఆయన ఈ నాటకాన్ని మెచ్చుకోవటం ఏమిటనుకున్నాను. అట్లాగే కల్నల్ ఒకాయన కూడా ఆ నాటకాన్ని చలం గారికి వినిపించారు. ఆయన కూడా అదే చెప్పారు. చలంగారు మిమ్మల్ని బాగా మెచ్చు కున్నారంటూ. నాటకం విన్న తర్వాత ఎవరైనా మొహమాటానికి అదే చేస్తారు కదా అనుకున్నాను. కానీ ఎప్పుడయితే నేను, భార్గవీ రావు (రచయిత్రి) కలిసి భీమ్లీ వెళ్ళామో నా అభిప్రాయం మారింది.. అక్కడాశ్రమంలో చలం గారమ్మాయి సౌరీస్‌ను చూద్దామని వెళ్ళాం. ఆవిడ కళ్ళు మూసుకుని సంగీతం వింటున్నారు. ఎవరొచ్చినా కనులు తెరవటం లేదు. అప్పుడు భార్గవీరావు గారు, నేను భార్గవీరావుని,

మిలీనియం కథలు పుస్తకం కోసం మీ కథ తీసుకున్నాను అంటే ఆవిడ ఊ కొడుతున్నారు కానీ కళ్ళు తెరవలేదు. ఈవిడ శారదా శ్రీనివాసన్ కూడా వచ్చింది అని నాపేరు చెప్పారు. అంతే ఆవిడ ఠక్కున కళ్ళు తెరిచి ఎవరు ఊర్వశా అని అడిగారు. అవునండీ నేనేనండీ ఆ వేషం వేసిందని

చెప్పాను.. నాన్నగారికి చాలా ఇష్టమమ్మా మీ నవ్వంటేను అన్నారు. అప్పుడనుకున్నాను, చలంగారికి నిజంగా ఆ నాటకం, అందులో ఊర్వశి వేసిన శారదా శ్రీనివాసన్ చాలా ఇష్టమని అలా చలంగారి ఆ ప్రశంస నాకు అవార్డుతో సమానం.

మిసిమి : చలం గారి ఊహల ఊర్వశికి మీరో రూప మిచ్చారు కదా

శారదా శ్రీనివాసన్: నిజమే మీరన్నది. ఈమధ్య ఆయన ఒక పువ్వు పూసింది కథ చదివాను ఎంత గొప్పగా రాశారో.. గొప్ప ఊహలు ఆయనివి. గొప్ప భావుకుడాయన.

మిసిమి : ఇప్పుడు పురాణ పాత్రలకొద్దాం. ఆ పాత్రల ఆవిష్కరణలో ఆ పాత్రల నేపథ్యం గురించి మీరు తెలుసుకునే వారా! ఈ ప్రశ్న ఎందుకడుగుతున్నానంటే ఒక ప్రముఖ సినీనటిని ఇంటర్వూ చేస్తున్నప్పుడు ఈ ప్రశ్న అడిగాను. ఆవిడ కుంతిపాత్ర పోషించింది, గాంధారి ద్రౌపది పాత్రలను వేసింది. అందుకు ఏ విధంగా హోంవర్క్ చేసిందోనన్న కుతూహలంతో అడిగాను. ఆవిడ సమాధానం నన్ను నివ్వెరపోయేలా చేసింది. నాకు వాళ్ళెవరో తెలీదండి. డైరెక్టర్ ఎలా చేయమంటే అలా చేస్తాను అన్నారావిడ. నేను ఒక్కమాట ఎక్కువ చెప్పలేదు. తక్కువ చెప్పలేదు.

శారదా శ్రీనివాసన్: నేను అలా ఉండనండీ. నాకు పురాణ పాత్రల గురించి ఎంతో కొంత తెలుసు. కుంతి గురించి తెలిసినా, ఆ నాటకంలో ఆవిడ పోషించే పాత్ర ఏమిటో చూస్తాను. ఆ నాటకంలో ఆ పాత్ర ఏం చెప్పదలుచుకున్నది చూస్తాను. అదేవిధంగా ద్రౌపది గురించి కానీ, గాంధారి గురించి కూడా. ఆ నాటకంలో ఆ పాత్ర స్వభావమేమిటి అన్న అంశంపైనే దృష్టి పెడతాను.

మిసిమి : మనకు స్వాతంత్ర్యం సిద్ధించాకే రేడియోకి ప్రాచుర్యం పెరుగుతూ వచ్చింది. జాతి పునరుజ్జీవనంలో రేడియో ముఖ్యపాత్ర పోషించింది కదా. భారతీయ సంస్కృతిని, తెలుగు సంప్రదాయాలను, వ్యవసాయ జనజీవనాన్ని ప్రజలకు దగ్గర చేసింది రేడియో. ఒక నైతిక జీవనాన్ని అలవాటు చేసింది. అభివృద్ధి పథాన్ని చూపింది. రేడియో దేశ సంఘటిత శక్తిగా మారింది. అలాంటి మాధ్యమంలో మూడున్నర దశాబ్దాల పాటు మీరున్నారు.ఆ సాంస్కృతిక పునరుజ్జీవనంలో నేనూ ఒక భాగం అనే అనిర్వచనీయమైన భావన మీలో ఉందేదా?

శారదా శ్రీనివాసన్: ఒక వయసొచ్చాక మీరన్నట్టు ఆ స్పందన నాలో కలిగింది. అందుకు కారణం చిరంజీవిగారే. ఒక రకంగా వారు నా గురుస్థానంలో ఉంటారు. ఆయన కమ్యూనిస్ట్ అలా అని కమ్యూనిజం గొప్పదని చెప్పేవారు కాదు. ఏది మంచో ఏదో చెడో తెలుసుకోవాలనేవారు. నాటకం గురించి వివరిస్తూ కేరక్టరైజేషన్ గురించి తెలియచేసేవారు. రష్యన్ నాటకాలు వేసినప్పుడు ఒకటీ అరా విషయాలు రష్యా గురించి చెప్పేవారంతే. ఒకమనిషికి చాలా తెలుసనుకున్నప్పుడు ఆ వ్యక్తి పై మంచి అభిప్రాయం ఏర్పడి కొన్ని విషయాలు తెలుసు కునే ప్రయత్నం చేస్తాం. అలా చిరంజీవి గారు నాకు సాయ పడ్డారు.

రేడియో చేసిన గొప్ప పనులు కూడా నాకు తెలుసండీ. కులమత భేదాలు రూపుమాపేందుకు ఎంతో కృషి చేసింది. పేదరిక నిర్మూలనకు చేపట్టిన పథకాలను ప్రచారం చేస్తూ కుటుంబ నియంత్రణ, ఆరోగ్యం వంటి అంశాలను, చిన్న

కుటుంబాల ప్రాధాన్యతను అందరి వద్దకు తీసుకెళ్లగలిగింది. ఒకప్పుడు ఎయిడ్స్ వ్యాధి పేరు ఉచ్చరించాలంటేనే జనం వణికి పోయేవారు. అలాంటి సమయంలో ఎయిడ్స్ వ్యాధిపై ఆకాశ వాణి కల్పించిన ప్రచారం ప్రజల్లో అవగాహన పెంచింది. వీట న్నిటిలో మేం పాలు పంచుకునే అవకాశం కలిగింది. ఒకప్పుడు రేడియోకి లైసెన్స్ ఫీజు కట్టేవాళ్ళం. ఇప్పుడది లేదు కదా. ట్రాన్సిస్టర్ల వలన ఇంకా చేరువయింది. బడ్డీకొట్లలో వినిపించేది. గుడిసె వాసులకు వినోదం, విజ్ఞానం, సమాచారం కలిసిన సాధనం ఆ రోజుల్లో రేడియోనే. ఇప్పుడయితే ఫోన్‌లోనే విసే సౌకర్యమొచ్చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే రేడియో ఒక విశ్వవిద్యాలయం లాంటిదండీ. అందులో మేం చదువుకున్నాం.

మిసిమి : మీరు చదువుకోవటమే కాదు, మీరు చదువు కూడా చెప్పారు.మామూలు జనానికి చాలా చెప్పారు.

శారదా శ్రీనివాసన్: అవునండీ.. వారికి చెబుతూ నేను నేర్చుకున్నాను.

మిసిమి : ఆ తర్వాత మహామహులు మీతో నటించాలని ఉబలాటపడేవారు. ఉత్సాహపడేవారు. అక్కినేని నాగేశ్వర రావు, గుమ్మడి వెంకటేశ్వరరావు వంటివారు ఆ కోరిక అనేక సందర్భాల్లో వెలిబుచ్చేవారు. ఆ సమయంలో మీరు నేనేమిటి అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకునేవారా, లేక నాకా అర్హత ఉందని ఆత్మ విశ్వాసంతో ఉండేవారా

శారదా శ్రీనివాసన్: ఆ రెండూ కూడా చేయలేదు. అంటే నేనేదో గొప్పదాన్నని అనుకోలేదు. వాళ్లొచ్చి నటిస్తామంటే చాలా సంతోషం, వేయటానికి సిద్ధం అనుకున్నానంతే. అలాగని ఇంత గొప్పవాళ్ళచ్చి నాతో నటిస్తామంటున్నారు అన్న ఫీలింగ్ కూడా లేదు..వాళ్ళని చిన్నబుచ్చటం కాదు కానీ

వాళ్ళు వాళ్ళ ఫీల్డ్ లో చాలా గొప్ప వాళ్ళు. నా రంగంలో నాకున్న స్థానం నాకుంది. గుమ్మడి గారు ఎక్కడ కనిపించినా అమ్మా నేన్నీ ఫాన్ నమ్మా అనేవారు. నిజంగా నాకు సిగ్గుగా ఉండేది. ఇంత పెద్దవారు నాదగ్గరకొచ్చి ఇలా చెబుతున్నారే అని. మా మురళీకృష్ణతో ఒకసారి అన్నారుట. వారితో ఒక నాటకంలో నటించాలని.

అంతకు ముందెప్పుడో పెద్ద మనుషులు అనే నాటకంలో వేశాం. అయితే అందులో మేమిద్దరం మాట్లాడుకునే సీన్స్ లేవు.

మిసిమి : 2014లో అక్కినేని నాగేశ్వరరావు గారు ఆకాశ వాణి స్టూడియోకి వచ్చినప్పుడు కూడా శారదా శ్రీనివాసన్‌గారు నటిస్తే నేను రేడియో నాటకం లో పాల్గనటానికి సిద్ధం అన్నారని మిత్రుడు రాంబాబు చెబుతున్నాడు.మీకంత ఫాలోయింగ్ ఉంది అప్పటికి ఇప్పటికీ

శారదా శ్రీనివాసన్: అవునా నాకు తెలియదు అయితే దాశరథి కృష్ణమాచార్య ఒకసారన్నారు. అమ్మా నీ నాటకాలన్నీ అక్కడ మద్రాసులో వారికి వినిపిస్తున్నారు, సంభాషణలు ఎలా పలకాలో నేర్చుకోమంటున్నారు అని. ఆయన అన్నీ యాక్షన్‌తో చెప్పేవారు. చాలా బోళా మనిషి.

మిసిమి : వహీదా రెహమాన్ చాలా కాలం తర్వాత బంగారు కలలు సినిమా చేసినప్పుడు, ఆవిడకు డబ్బింగ్ మీరే చెప్పాలని దర్శక, నిర్మాతలు మిమ్మల్ని సంప్రదించారు కదా!

శారదా శ్రీనివాసన్: ఇక్కడ ఒక విషయం చెప్పాలి.

మొదటగా కమలాకర కామేశ్వరరావు గారు నన్ను సినిమాలో నటించమని అడిగారు. ఇదెలా తెలిసిందంటే ఒకరోజు డా.సి. నారాయణరెడ్డిగారు కారిడార్‌లో కనిపించి అడిగారు." అమ్మా, కమలాకర కామేశ్వరరావు గారు అడుగుతున్నారు, వారి సినిమాలో వేషముంది, వేస్తావా" అంటూ. నాకు సినిమా అంటే అస్సలు ఇష్టం లేదని చెప్పాను. అలాగే మా దగ్గర గ్రామీణ కార్యక్రమాల్లో పాల్గొనే ప్రసాదరావుగారు కూడా అడిగారు. ఆయన అప్పటికే రెండు మూడు సినిమాల్లో నటించారు. అమ్మా తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారు అడుగుతున్నారు. మీకోసం ఒకవేషం రెడీగా ఉందని. మీకు ఇష్టమేనా అని అడిగారు. వద్దండీ, నాకిష్టం లేదని చెప్పేశాను. ఇక్కడో తమాషా జరిగింది. చాలా కాలం క్రితం

ఒకసారి సి.ఆర్.ఫౌండేషన్ చూడ్డానికివెళ్ళాను. అప్పుడు నన్ను చూడటానికి అందరూ వచ్చేశారు. కృష్ణమూర్తిగారు, ఆయన భార్య కూడా వచ్చారు. అప్పుడాయన నేనేనమ్మా, మిమ్మల్ని సినిమాలో వేషం ఉందని రమ్మని పిలిచాను, మీరు రాలేదు అన్నారు. సరదాగా నవ్వుకున్నాం. అప్పుడప్పుడు అనుకుంటాను.. వెళ్ళుంటే ఎలా ఉండేదా అని. కానీ వెంటనే గుర్తొస్తుంది. సరస్వతీదేవి నా నాలుక చివర నిలబడి నాచేత వద్దు అని చెప్పించింది అని

మిసిమి : మీరు సినిమాలో పాల్గొన్న ఒకే ఒక్క సందర్భం. బంగారు కలలు చిత్రంలో వహీదా రెహమాన్ పాత్రకు మీ గళంతో ప్రాణప్రతిష్ట చేయటం.

మీరు మొదట్లో చెప్పినట్లు పాత్ర స్వభావాన్ని ప్రతి ఫలించటం తప్ప శారదా శ్రీనివాసన్ గొంతు కనిపించకపోవటం. అలాగే అక్కడ వహీదా రెహమాన్ కనిపిస్తుంది తప్ప శారదా శ్రీనివాసన్ కాదు.

శారదా శ్రీనివాసన్: బంగారు కలలు చిత్రం తర్వాత నేను డబ్బింగ్ చెప్పిన ఒకే ఒక్క సినిమా అక్కినేని కుటుంబరావుగారి

తోడు సినిమా. అది కూడా కుటుంబరావు గారు పదేపదే కోరారు మీరు వాయిస్ ఇవ్వాలని నాకిష్టం లేదని చెప్పినా వారు వినలేదు. ముందు మీ వాయిస్ ఇవ్వండి. తర్వాత మీకు నచ్చకపోతే ఆలోచిద్దాం అన్నారాయన. సరే నాకు నేను చెప్పింది నచ్చలేదు అనిపిస్తే వెళ్ళిపోతానన్న కండిషన్ మీద వెళ్ళాను. సరిగ్గా రావటం లేదండీ అని నేనన్నా కుటుంబరావుగారు వినలేదు. ఫస్ట్‌క్లాస్‌గా వస్తోందనటంతో అదొక్కటి చెప్పాను. ఆ తర్వాత మరి అటు వెళ్ళలేదు. బాలమురళిగారు తోడు సినిమాకు సంగీతం సమకూర్చారు. ఒకసారెక్కడో ఆయన కనిపించారు. వెంటనే ఆయన శారదా ఇలా రా అని పక్కకు పిలిచారు." నిన్ను చూసి నేను గర్వపడుతున్నానోయ్" అంటూ అభినందించారు. ఎంత పెద్ద ఆర్టిస్ట్ ఆయన. నన్ను చూసి అంత ప్రశంసించటమేమిటి. అంతకుమించి ఇంకేం అవార్డు కావాలి. అలాగే ఈ సందర్భంలోనే ఆత్రేయ గారి జ్ఞాపకాన్ని గుర్తు చేసుకోవాలి.

ఒకసారి ఆత్రేయ గారు మీకు సన్మానం చేయాలమ్మా అని ఫోన్‌చేసి చెప్పారు. దానికి కారణం ఆయన పురూరవ నాటకం వినటం. ఆ నాటకం విన్న ఆయన మీరెంత బాగా చెప్పారు డయిలాగ్స్ అన్నారు. ఆయన రేడియోలో వింటుండగా పక్కన ఎవరో మాట్లాడుతున్నారుట. అదాయనకు డిస్టబెన్స్‌గా అనిపించి, రేడియో పట్టుకుని బెడ్రూంలోకి వెళ్లి తలుపేసుకొని విన్నారుట.

పురూరవలోని ఊర్వశి ఆయన్ని అంతగా కదిలించింది.

తరవాత ఆయన ఇంటికి వచ్చి మాట్లాడుతూ ఒక కాగితం అడిగారు.

అడ్రస్ గురించో, ఫోన్ నెంబర్ గురించో అనుకున్నాను.

ఇంత పిసరు కాయితం ముక్క దొరికితే ఇచ్చానండీ. దానిమీద రాశారు.

కలదు ఆ శారదకు వీణ కరములందు
కలదు ఈ శారదకు వీణ గళమునందు
కలదు ఆ శారద కవుల కవితలందు
కలవు కవితలే ఈమె గళమునందు
శారద కాని శారదకు శారదలో సత్కళా సుధా
శారదకున్ విశారదకు
సాదరపూర్వక నమస్సుమాంజలుల్
-ఆత్రేయ 19/06/1977

అలాగే కందుకూరి రామభద్రరావుగారు ఎంత అభిమానంతో రాశారో. అలాగే శశాంక రాసిన రాట్నమే శ్రీరామరక్ష రూపకంలో కుటుంబ పెద్దగా చేశాను. స్వాతంత్ర్య సమరయోధులపై రూపొందించిన కార్యక్రమం అది.

మిసిమి : మీరు చాలా నవలలను నాటకాలుగా రూపొందించి ఆ సాహిత్యాన్ని అజరామరం చేశారు. అలాగే రేడియోలో నాటకం, స్త్రీల కార్యక్రమాలు, పిల్లల కార్యక్రమాలు, వ్యవసాయ కార్యక్రమాలు, సంగీత కార్యక్రమాలు.. ఇలా అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. పాల్గొన్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేశానని మీ జ్ఞాపకాల్లో చెప్పారు. మీరు ఎక్కువ ఇష్టపడిన కార్యక్రమం ఏమిటి?

శారదా శ్రీనివాసన్: ఒక మంచి నాటకంలో పాల్గొనటం ఇష్టముంటుంది. ఒక మంచి పాట పాడటం ఇష్టముంటుంది. ఒకమంచి వ్యాసం చదవటం ఇష్టముంటుంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికి నాచేత చదివించటం ఇష్టముండేది. అందుకోసం రాత్రి ప్రసారమయ్యే సాహిత్య కార్యక్రమంలో పెద్దలతో కలిసి చదువుతుండేదాన్ని. ఏది ఇష్టం కాదని చెప్పమంటారు. నా పురూరవ నాటకాన్ని చలంగారికి వినిపించిన కల్నల్ గారే, నేను పాల్గొన్న వ్యవసాయ కార్యక్రమాల గురించి స్టేషన్ డైరెక్టర్ గారికో ఉత్తరం రాశారు. మీరు పన్నీరులో పేడకలిపి కళ్ళాపి చల్లుతారు అని అందులో రాశారు. నిజంగా ఆయనకు తెలీదు.. నాకు ఆ వ్యవసాయ విషయాలను చదవటం ఎంత ఇష్టంగా ఉండేదో.

మిసిమి : మీరు పనిచేసిన కాలంలో రాత్రి ప్రసారమయ్యే జాతీయ వార్తల ముందు పిల్లల కోసం నాలుగు నిమిషాల కథ చెప్పేవారు కదా.

శారదా శ్రీనివాసన్: దానికో నేపథ్యం ఉంది. అప్పట్లో కేంఫర్ అని ఒక స్టేషన్ డైరెక్టర్ ఉండేవారు. ఆయన సి.బి.యస్. డైరక్టర్‌గా చేశారు. ఆ కేంఫర్‌గారు మావారు శ్రీనివాసన్ గారితో

మీ ఆవిడ వాయిస్ చాలా బావుంటుంది. ఇలాంటి వాయిస్ నేనొక్క కాశ్మీర్‌లో మాత్రమే విన్నాను. ఇంకెక్కడావినలేదు. అంత మంచి వాయిస్ మీఆవిడది అన్నారుట. ఆయనకు తెలుగు తెలీదు. అయినా వాయిస్ జడ్జ్ చేయగలిగారు. శ్రీనివాసన్ గారు నీ వాయిస్‌ను చాలా మెచ్చుకున్నాడని చెప్పగానే ఎప్పటిలానే విని ఊర్కున్నాను. అవన్నీ మాములుగానే ఉండేవి నాకు. తర్వాత ఆయన హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్‌గా ట్రాన్స్ఫర్‌అయి వచ్చారు.వచ్చాక రాత్రిపూట 7గం. నుంచి 7గం 5ని.ల వరకూ ఒక కథ చెప్పమన్నారు. ప్రతి రోజూ ఒక కథ ఎంతోమంది ఆ కథలను రాశారు. శశాంకలాంటి బయట వాళ్ళు రాశారు. లోపలి వారయిన భరద్వాజ, రామచంద్రమూర్తి వంటివారు రాశారు. చదవటానికానుగుణంగా ఆ కథలను కొంచెం మార్చుకుంటూ చదివేదాన్ని.ఎందరో ఆ కథలకోసం కూర్చునేవారు.

మిసిమి : ఆ కథ చివరిలో మీరో మాట అనేవారు "అదర్రా కథ" అని

శారదా శ్రీనివాసన్: అవును. ఆ మాటతో కథ పూర్తయ్యేది. ఎంతోమంది పెద్దవారు కూడా వినేవారు. అడవి రామారావు గారని ఓ లాయర్ గారు ఉండేవారు. పెద్దవాళ్ళం మేమంతా వింటున్నాం కదా, మీరు అలా ఎలా అంటారు అని విసుక్కునే వారు (నవ్వు). ఆ ఒక్క మాట పిల్లలకోసం అంటున్నానని అనుకోండి అనేదాన్ని. కథ చివరిలో ఒక ముక్తాయింపు ఉండాలి కదా. అలా అది నేను సృష్టించుకున్నదే.

మిసిమి : మీరు చారిత్రక పాత్రలు వేశారా.. వేస్తే కొన్ని చెప్పండి. దుర్గేష్ నందిని వేశారా

శారదా శ్రీనివాసన్: దుర్గేష్ నందిని వేయలేదు. కొన్ని చెప్పాలంటే రుద్రమదేవి, మాంచాల, ఝాన్సీలక్ష్మీబాయి ఇలా కొన్ని వేశాను. కోణార్క్ దేవాలయం మీద ఒక నాటకం ప్రొడ్యూస్ చేశాను.

మిసిమి : టాగోర్ స్త్రీ పాత్రలేమన్నా వేశారా

శారదా శ్రీనివాసన్: నౌకాభంగం (నౌకాడుబే) వంటి నాటకాల్లో వేశాను. టాగోర్ నాటకాల్లో స్త్రీ పాత్రలన్నీ హీరోయిన్‌లా కాకుండా ఒక అక్క గారిలానో, వదిన గారిలానో ఉంటాయి. అలాగే కొన్ని శరత్ నవలల రేడియో నాటకాల్లో కూడా వేశాను.

మిసిమి : మీరు ఒకప్పుడు నవలా ప్రవంతి కార్యక్రమం ద్వారా అనేక నవలలు చదివారు కదా.

శారదాశ్రీనివాసన్: అవునండీ శ్రీదేవిగారి కాలాతీతవ్యక్తులు రంగనాయకమ్మ గారి స్త్రీ వంటివి చదివాను. దాశరథి గారు కాలాతీతవ్యక్తులు నవలను నాటకంగా ప్రొడ్యూస్ చేశారు. నేను ఇందిర పాత్ర వేశాను. అందులో గోరాశాస్త్రి గారున్నారు. వారు జర్నలిస్టు కావటంతో విలేకరులను తీసుకొచ్చారు. వారందరికీ వినిపించారు. అప్పుడు పేపర్లలో ఈ నాటకం గురించి రాశారు. అదో విశేషం ఆరోజుల్లో.

కాలాతీత వ్యక్తులు రెండుసార్లు నాటకంగా రికార్డు చేశారు. రెండోసారి సీరియల్‌గా తురగా జానకీ రాణి గారు ప్రొడ్యూస్ చేశారు.

మిసిమి : మీ కెరీర్‌లో రెండు విషాదాలు నన్ను కదిలించాయి. నాటకం జరుగుతున్నవేళ ఒక ఆర్టిస్టు ఆత్మహత్య చేసుకోవటం.

శారదా శ్రీనివాసన్: మల్లాది విజయలక్ష్మి అనే ఆర్టిస్ట్ ఆత్మహత్య చేసుకుంది. చాలా దుఃఖం మిగిల్చింది.

మిసిమి : రెండవది మీ నాన్నగారు మీ కార్యక్రమాలేవీ వినలేదు. మీరు ఎట్లా జీర్ణించుకున్నారు దాన్ని.

శారదా శ్రీనివాసన్: అలా అనకండి.. పాతవాళ్ళు కొన్ని విలువలతో బతికారు. మేం నాటకం వేసినప్పుడు కొన్ని intimacy ఉన్న సంభాషణలు చదువుతాం. అవి చదివేటప్పుడు ఆ మూల, ఈమూల నిలబడి చదువుతాం.

వాళ్ళు స్టేజ్ నాటకాలు చూసుంటారు. ఒకరినొకరు పట్టుకోవడం, దగ్గరగా రావటం అవే గుర్తొస్తాయి వారికి. అలాంటి అభిప్రాయం ఆయనకీ ఉండొచ్చు. అందుకని

మా నాన్నగారు ఎప్పుడూ నా కార్యక్రమాలు వినలేదే అని అనుకోనండి. వారి చివరిరోజుల్లో మంచాన ఉన్నప్పుడు చూడటానికి వెళ్ళాను. అప్పుడాయన "అమ్మా దగ్గరకి రా అన్నారు. నా చేతిమీద చేయివేసి అమ్మా నిన్నుచూసి గర్వ పడుతున్నానమ్మా" అన్నారు. అదొక్కటిచాలు నా జీవితానికి (శారదా శ్రీనివాసన్ గారి గొంతు పూడుకుపోయింది దుఃఖంతో).

మళ్ళీ మా అమ్మ వినేది నేను ఏది చదివినా, ఏ కార్యక్రమంలో పాల్గొన్నా వినేది.

మిసిమి : మీవారు శ్రీనివాసన్ గారి గురించి చెప్పండి.

శారదా శ్రీనివాసన్: శ్రీనివాసన్ గారు మంచి హాస్య ప్రియులు. ఏది చెప్పినా సరదాగా చెబుతుండేవారు. ఆయన గొప్ప సంగీతకారులు. Universality of Music అనే ఫీచర్ ఆయన ప్రొడ్యూస్ చేశారు. దానికి ఆకాశవాణి నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. ఆకాశవాణి హైదరాబాద్ కు వచ్చిన మొదటి అవార్డు అది.

మిసిమి : మీరు అక్షరాన్ని స్వరంగా, స్వరాన్ని దృశ్యంగా ఒక మాయగా మార్పు చేసి శ్రోతలను ఒక రసజగత్తులో ఓలలాడించారు. ఏ సన్మానాలు, సత్కారాలు వద్దనుకున్నారు.

శారదా శ్రీనివాసన్: సన్మానాలు వద్దనుకోలేదు. ఎవరూ చేయలేదు (నవ్వు). తొలిరోజుల్లో ఒక్క ఆత్రేయ గారు చేస్తానంటే వద్దన్నానంతే. అది నేను వేసిన ఊర్వశి వేషానికి ఒక హోటల్లో..

అది సినిమా పరిశ్రమ మీద ఉన్న ఒక డౌట్ వలన.

ఆ తర్వాతెప్పుడూ వద్దనలేదండీ..

మిసిమి : మీ నలభై ఏళ్ల ప్రయాణంలో కాసులపేర్ల కన్నా కీర్తి తురాయిలే ఎక్కువ సంపాదించారు.

శారదా శ్రీనివాసన్: ప్రజల అభిమానాన్ని మించిన ధనమేముంటుంది చెప్పండి. స్టేజ్ ప్రోగ్రాంలకు పిలిచేవారు కానీ, నాకది ఇష్టం లేదు.. వెళ్ళలేదు. అలా చేసుంటే నాలుగు కాసులొచ్చేవేమో కానీ,నేను వాటికి వ్యతిరేకిని.

మిసిమి : మీరు సత్కారాల పొందడం కన్నా సత్కార్యాలు ఎక్కువ చేశారు. ఉదాహరణకు కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ..

శారదా శ్రీనివాసన్: ఎవరయితే వాటిని పెట్టారో వారికి సపోర్ట్‌గా నిలిచామని చెబుతాను.

మిసిమి : మీ ప్రారంభం అంతా హిందీతో జరిగింది. కుటుంబమేమో తెలుగు. మీరు దక్షిణ భారత హిందీ సభకు ఎందుకు వెళ్ళారు. హిందీ ఎందుకు నేర్చుకున్నారు.

శారదా శ్రీనివాసన్: నేను తణుకులో చదువుతున్నప్పుడు మా తెలుగు మాస్టారు చిర్రావూరి సుబ్రహ్మణ్యం గారు హిందీ కూడా చెబుతుండేవారు. మా అన్నయ్య కృష్ణుడు హిందీ నేర్చుకుంటూ హిందీలో మాట్లాడుతుంటే నాక్కొంచెం కుళ్ళుగా ఉండి, నాక్కూడా నేర్చుకోవాలనిపించింది (నవ్వు). హిందీ సులభంగా నేర్చుకోగలిగాను. నేరుగా మాధ్యమకు వెళ్ళి పోయాను. నాకు ఆటలమ్మ వచ్చి ఇంట్లో ఉండిపోతే మాణిక్యాంబ అనే అమ్మాయి ఇంటికొచ్చి నాకు హిందీ పాఠాలు చెబుతూ ఉండేది. ఆ అమ్మాయి ఏం ధైర్యంతో ఇంటికొచ్చిందా అనుకునేదాన్ని. ఆటలమ్మ తగ్గాక స్నానం చేయిస్తారు కదా. ఆ స్నానంచేసి పరీక్షకు వెళ్ళి పోయాను. పాసయిపోయాను. దాంతోటి నాకో ధైర్యమొచ్చేసింది. అప్పుడు మేము కలువపూడి అగ్రహారం వెళ్ళి పోయాం. ఆ వూరిలో ఒకాయన ఎవరికో హిందీ నేర్పుతుంటే నేనూ నేర్చుకుని తర్వాత పరీక్షకు వెళ్ళాను. అలా ప్రవీణ దాకా వచ్చేశాను. అంటే రాష్ట్ర విశారద తర్వాత ప్రవీణ పరీక్ష ఉండేదని గుర్తు.

మిసిమి : మీ రేడియో ప్రారంభానికి త్రిమూర్తులు ముగ్గురుండే వారు కదా. వేమూరి రాధాకృష్ణగారు, మీకు దక్షిణ భారత హిందీ సభ ద్వారా పరిచయం. వారే నీ వాయిస్ బావుంటుంది, రేడియోలో చేరమని ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతో మీరు ఆడిషన్‌కు వెళ్ళారు. అందులో ఒకాయన ఈ అమ్మాయి వాయిస్ బావుంద న్నారు. ఆయనే జనమంచి రామకృష్ణ. ప్రోగ్రాం ఆఫీసర్. ఈ రెండు అయ్యాక మీకు సంబంధంలేదని సంస్కృతంలో మీ కెరీర్ ప్రారంభించారు. అది పింగళి లక్ష్మీకాంతం గారి వలన. ఈ ముగ్గురు మీరు రేడియోలో రావటానికి కారణమే కదా

శారదా శ్రీనివాసన్: ఇక్కడ రజనీ గారి గురించి కూడా చెప్పుకోవాలి. రజనీగారి సూచనమేరకే సంస్కృతం వైపు వెళ్ళ గలిగాను. ఏ వాయిస్ ఎందుకు పనికొస్తుందో ఆయన చెప్పేస్తారు. లేకపోతే హొసబాంకా బహుమతి పొందిన కొండనుంచి కడలిదాకా రూపకానికి నన్ను హైదరాబాద్ నుంచి విజయవాడ పిలవటమేమిటి. అందులో గోదావరినది పాత్ర నాకివ్వటమేమిటి. ఆయనకు వాయిస్‌మీద అంతకమాండ్ ఉండేది. మీరన్నట్టు నేను రేడియోలో తెలుగులో ఆర్టిస్ట్‌గా స్థిరపడటానికి ముందు హిందీ, సంస్కృతం మెట్లెక్కి రావలసి వచ్చింది. అందుకు మీరు చెప్పినట్లు వేమూరి రాధాకృష్ణ గారు, జనమంచి రామకృష్ణగారు, పింగళి లక్ష్మీకాంతం గారు, రజనీ గార్ల ప్రోత్సాహమే కారణం.

మిసిమి : ఆకాశవాణి సంపర్కం కలగకపోతే హిందీ టీచర్ అయ్యేవారేమో

శారదా శ్రీనివాసన్: ఎంతోమంది గొప్పగొంతు ఉన్నవారు న్నారు. వారెవరికీ కలగని అదృష్టం నాకు కలిగింది అనుకుంటాను.

మిసిమి : రేడియోలో కూడా ఎంతోమంది ఆర్టిస్ట్‌లున్నారు. కానీ వారికి మీకు తేడా.. మీరు చేసిన సాధన, కృషి.. అందు వలనే ఊర్వశి లాంటి పాత్ర చిరస్థాయిగా నిలిచిపోయింది.

శారదా శ్రీనివాసన్: నేను నాటకాలు వేసినప్పుడు సహజంగా చెప్పడానికి ప్రయత్నించాను. అలాగే పదిమంది మాట్లాడుతున్నా, ఇద్దరు ముగ్గురు మాట్లాడుతున్నా వాయిస్ పిచ్ ఎలా ఉందో పరిశీలించేదాన్ని. అది నాకు చాలా ఉపయోగపడింది.

మిసిమి : సినిమా స్టార్స్ బయటకు కనపడతారు కానీ మీరు కనపడరు. మీ గొంతు తప్ప మీరెలా ఉంటారో తెలీదు సామాన్య ప్రజలకు. కానీ మీకు చాలా మంది అభిమాను లుంటారు ఈనాటికీ. అట్లాంటి ఒక అభిమాని మీ గురించి ఏమి రాశారో చూడండి!

మనం నక్షత్రాలమా.. దూర దూరంగా ఉంటూనే కలవం
మీరు నాకు కాన్‌స్టెంటు!
మీ స్వరం మధురం.. ఎప్పుడూ వినాలనే ఉంటుంది
నువు గునిసినా గుసగుసలాడినా
అవి సముద్రపు అలల్లా నన్నుదాటిపోవు
కానీ తుఫాన్ ఎపుడొస్తుందో
నీ చూపులు నాకు దీపాలు.. గాలి తగలకుండా చూస్తాను
గాలి కనిపించని పూలపరిమళాలను మోసుకొస్తుంది
నీ స్వరం తెలియని దేవతను చూపిస్తుంది
మనల్ని లోకం ఏమంటుంది
మన బంధం ఏ పేరుతో పిలవాలి
ఎవరు నువ్వు ఇంతకీ? నాకేమవుతావు?
స్వప్న మేఘాలలో తిరుగాడే దేవతవా
స్వప్నాల్లోని మేఘాల్లా చెదిరిపోయే కలవా
నిన్నెలా స్పర్శించాలి – నిన్నెలా దర్శించాలి
అందుకే ఆరాధిస్తా ..

మిమ్మల్ని అభిమానించి చూడలేని అందరి అభిమానుల తరఫున ఈ కవిత మీకు సమర్పిస్తున్నాం.

మాకు రెండు గంటలు సమయమిచ్చి అన్ని జ్ఞాపకాలు కాకపోయినా అనేక జ్ఞాపకాలను మా పాఠకులకు పంచారు **మిసిమి** పత్రికను ఆశీర్వదించండి.

మీకు అనేకానేక ధన్యవాదాలు.

(ఈ మాటామంతీ రాతప్రతిని రూపొందించిన సీతా రాంబాబుగారికి, నాకు తోడుగా వచ్చిన వోలేటి పార్వతీశంగారికి ధన్యవాదాలు.)

అందమా.. అందవా..?

ఎక్కడో చీకటి ఖండం నుంచి ఒక్క వెలుగు రేఖ పలుకరించింది. ఆ స్వరంలో ఉద్వేగపు తంత్రులు, తెలుగు మీద ప్రేమ, చెప్పలేకపోతున్నానని వెరుపు, ఏదో చెప్పానని తృప్తి – ఓ తెలియని వ్యక్తి శ్రద్ధగా వింటున్నాడని ఆనందం... ఇవన్నీ లోలోతుల నుంచి ఉబికి వచ్చే సౌందర్యానికి ప్రతీకలు. "ఇన్నర్ గ్లో" ఒక చైతన్యం.. అందానికి నిర్వచనం చైతన్యం. నాలుగేళ్ళ నా మనువరాలు ఎంత చైతన్యవంతంగా సౌందర్యంతో చిప్పిలుతుంటుంది. ప్రతి కదలికా అందానికి అలంకారమే! అప్పుడెప్పుడో ఆమెను కలిసి పగలంతా గడిపినప్పుడు ఆమె ఎంత సౌందర్యవతో.. ఆమె యౌవనంలో ఉన్నప్పటి సౌందర్య రాశి – రాశి పోసినట్లు నా ముందు కూర్చుంది.

నిన్నగాక మొన్న కలిసిన శారదాశ్రీనివాసన్ ఎంతటి స్వర సౌందర్యవతో, ఆమెను ఆవహించి ఉన్న అందాన్ని అనుభూతికి తెస్తుంది. అలా లాబీలో కూర్చుంటే ఉదయపు గాలులు పూల పరిమళాలు మొసుకొస్తుంటాయి. ఆ పరిమాళాల సౌందర్యం ఆఘ్రాణించి అనుభవించాలి. అవన్నీ ప్రాణ వాయువులు – ఒక వీణ మంద్రంగా పలుకరించినప్పుడు – హృదయ తంత్రి గతి తప్పదా – ఒక సితార సన్నటి పిలుపు – వలపులు చిలికించవా? ఒక వేణువు నిస్వానం శ్వాసనింపదా? నా ఒక్క సెల్ కేకతో 'సెల్ తెరపీ' లాగా దిగిన ఆ గ్రీకు సుందరి – పాలరాతి మందిరంలా గొడుగుపట్టిన ఆత్మబంధం అందం కాదా? ప్రతి ఉదయం శుభోదయం అంటూ సందేశం పంపే ఆచార్యుని సౌందర్యం సూర్యోదయం లాంటిది కాదా! నిండు నవ్వుతో పలుకరించే రాంబాబు చైతన్యంలో ఎంతటి అందం పొంగుతుంటుంది?

నిన్నగాక మొన్న బెజవాడ – ఆత్మీయ మిత్రుని సంస్మరణ సమావేశంలో మాట్లాడిన వారి విషాదంలో – ఎంతటి అందం అంతర్లీనంగా మిత్రుని జ్ఞాపకాలు ప్రవహించాయి. నాకయితే ఆయన చిలిపి నవ్వులు వినిపించాయి. మరో విచిత్రం అప్పుడే అక్కడే నాకు పరిచయం లేని వ్యక్తి వచ్చి మిమ్మల్ని కలువడానికే వచ్చాను. మీరు రాసే ప్రతి పదం అందంగా ఉంటుంది. ప్రతి భావనా సౌందర్యవంతంగా వెలుగుతుంటుంది. ఇప్పుడు మిమ్మల్ని చూస్తున్నాను. మీ వర్ఛస్సు(?) నన్ను అబ్బురపరుస్తుంది. ఇంకా చాలా చెప్పారు. –

నేను మీ పేరు అని అడగలేదు. ఆయన (పరిచయం లేని) అన్నాను – కానీ ఇప్పుడు వెలిగింది – అది నేనే అని. అలాంటి స్థితిలో నేనెన్ని సార్లు లేను? ఈయన ప్రమోద్‌కుమార్, జగన్నాధరావు, చాట్ల – సిద్ధయ్యనాయుడు – నాగేశ్వర్ రావు – వీరందరూ ఈ రూపంలో పలకరిస్తున్నారు. వీరందరూ అమరులే కదా – అమరులంటే అందమే కదా!!



మొన్న వందేభారత్‌లో...

నాతో ఎన్నో ప్రయాణాలు చేసిన అయ్యవారూ.. మీకు పద్మాలు చూపించనా అన్నాను. ఆయన నవ్వి – మీరు మరీనూ – అని సాగదీసి కాఫీ ఇప్పింతురూ అన్నారు. ఇదిగో అయ్యంగారి పడుచు – ఆ నయన పద్మాలు అవలోకించండి– 'పద్మదళాల వర్ణశోభితం – సౌందర్యం' మన ప్రబంధకవులు – ఎంతగా పరికించారో కదా! అవునవును – మీరు మాత్రం తక్కువా? అని చురకలేశారు. ఇంతలో కాఫీ వచ్చింది.

కొస మెరుపు : పార్వతీశ ఖర్వాట సౌందర్యం అమరనాథ్ లింగ సదృశ్యం కాదూ?



కథాకథన చక్రవర్తి
శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

– భమిడిపాటి గౌరీశంకర్

ఓ రచయిత రచనలు ఏం చెబుతాయి? అతడి నుండి పాఠకులు ఏం ఆశిస్తారు? ఈ ప్రశ్నలు ఈనాటవి కావు. సాహిత్యం ప్రారంభమైన తొలినాళ్ళ నుండి ఉన్నవే... కొన్ని వేల మంది రచయిత(త్రు)లు రచనలు చేశారు, చేస్తున్నారు. పాఠకులకు తెలిసిన వారు ఎంతమంది? గుర్తున్నవారు ఎంతమంది? రచయితలకు లక్ష్యం ఎంత అవసరమో... ప్రతిభా సహిత్యం అంతే అవసరం. వీటి వలననే అతని రచనలు వన్నె తీరుతాయి. తరతరాలకు కీర్తి తరగని వస్తువుగా మిగిలిపోతాయి. రచయిత సమాజం వేరు... సమాజాన్ని రచయిత గమనిస్తున్న తీరు వేరు కావచ్చు... కానీ... తన రచనల్లో రచయిత తనెంచుకున్న లక్ష్యం దిశగానే 'సమాజపు' తీరు తెన్నులను చిత్రిస్తాడు. పాఠకులను తనవైపు తీసుకుంటాడు. రచయిత కల్పనలకు ఓ భాష ఉంటుంది. ఏదైనా జరగవచ్చు, ఏమైనా చేయవచ్చు కానీ... రచయిత ప్రతిభ సమాజాన్ని విడిచి 'నేల విడిచి సాము చెయ్యదు'... చేయకూడదు. కాలం, సమాజం వంటివి రచయితపైన ప్రభావం చూపుతాయి. చివరిగా... రచయితలో తపన, ప్రతిభా, సాధన అనేవి అతనని శిఖరాగ్రాన నిలుపుతాయి. ఇన్ని గొప్ప సుగుణాలున్న రచయిత శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి.

శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి గారిది ఓ విశిష్ట రచనా వైదుష్యం. ఆయన రచనల్లో 'సంభాషణలు' కథను వి(క)నిపిస్తాయి. దృశ్యమానమైన భాషాపరబంధాలు ఆయన ప్రత్యేకత. బహుగ్రంథచదువరి. 'పురుషుల భాష అయినా, ఇప్పటిలా ఇంగ్లీష్ మొదలైన పరభాషతో సంకరం అయి, పలుకుబళ్ళులేనిది కాదప్పుడు. అయినా పురుషుల భాషలో కంటే, స్త్రీల భాషలో మాధుర్యము, హృదయాలను పట్టివేసే జాతీయత కనపడింది నాకు. వారి మాటల పొందిక, వారి హావభావ ప్రదర్శనచాతుర్యమూ తెనుగుభాషలో నాకు మాతృభిక్ష ప్రసాదించాయి'. మరో సందర్భంలో 'ముప్పయి సంవత్సరాలుగా నిర్విరామంగా రాస్తున్నాను. వ్యావహారికం అయినా నాదింకా సాధకావస్థగానే వుంది'. అంటారాయన తెలుగు సాహిత్యజగత్తులో 'శ్రీపాద' వారు ఏవర్గానికి 'సరిపడని' వారు. శ్రీశ్రీ, చలం, కొడవటిగంటి, గురజాడ, కందుకూరి, విశ్వనాథ ఇలా వీరందరూ ఏదో ఒక సిద్ధాంతానికి కట్టుబడినవారు... ఆయా వర్గాలకు ఆరాధ్యులు. వారిని అనుసరించినవారు, అనుకరించినవారున్నారు. కానీ శ్రీపాద వారిని అనుసరించిన వారు తక్కువ. మతం, వైదికత, సమాజం, జాతీయత వంటి వాటిని మిగిలినవారు విడివిడిగా తీసుకొని తమ రచనా అజెండాలుగా చేసుకున్నారు. కానీ... శ్రీపాదవారు వాటిని విడివిడిగా చూడలేదు. బహుశా ఆయనలోని ప్రజాస్వామిక భావజాలం ఇందుకు వేదిక అయిందనుకోవాలి. డా॥వేదగిరి రాంబాబు గారు 'తెలుగు జాతి, భాషలపట్ట అభిమానంతో – సాహిత్యసహకారంతో, విశిష్టసేవల్ని అందించిన అద్వితీయమూర్తి శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రి' అంటారు. శ్రీపాద వారు 20వ శతాబ్దపు తెలుగు కథకుల్లో విశిష్టమైన వ్యక్తి. ఏప్రిల్ 23, 1891లో అనపర్తి మండలం పొలమూరులో జన్మించారు. ఫిబ్రవరి 25, 1961 రాజమండ్రిలో మరణించారు. //2//

శాస్త్రి, వాచస్పతి, తార్కికుడు, వసంతుడు, కుమారకవి సింహుడు, భటాచార్యుడు, కౌశికుడు అనేవి ఇతనికున్న పేర్లు. తన అత్త కూతురునే వివాహం చేసుకున్నాడు. ఆమె పేరు 'సీత' తండ్రి లక్ష్మీపతిసోమయాజులు, తల్లి 'మహాలక్ష్మిసోదెమ్మ' వైదికవిద్యలో విద్యాభ్యాసాన్ని ప్రారంభించి, స్మార్తం పూర్తి చేసి, పెద్దన్న గారి దగ్గర రఘువంశ పాఠము నేర్చారు. తర్వాత సంస్కృత పాఠం కోసం గుంటూరు సీతారామశాస్త్రి గారి దగ్గరకు ఊరు విడిచి 'వల్లూరు' వెళ్ళారు. 'తెనుగులో మంచి పాండిత్యం సంపాదించాలి' అని నిశ్చయించుకొన్న శ్రీపాద వారి పట్టుదల తెలుగు అభిమానులకు షడ్రసోపేత

సాహితి విందును అందించింది. ఆయన తన కథల్లో వినిపించే 'సంస్కరణవాదం' తెలుగు కథకు సువాసనలద్దింది. ఆయన కథలు చదివిన వారు శ్రీశ్రీ, చలం, విశ్వనాధం వారిని ప్రక్కనపెట్టేసి, ఈయన కథల్లో వారందరి 'వాదాల'ను చూస్తారు. ఈయన 'కొత్తచూపు' కథ చిన్నదే... కానీ.. కథలో అన్నపూర్ణ వేసిన ప్రశ్న నాటిది... నేటిది కూడా... 'ఆడపెళ్ళి వారిని దాష్టికం చేసే మగపెళ్ళి వారిని ఉద్దేశించి భారతీయ స్త్రీలెందరో మానభంగాలకులోనయారు. ఉత్తరాంధ్ర భూముల్లో మనవాళ్ళెందరికో అలాంటిది తటస్థపడుతుంది. తెలుగు స్త్రీలది చావుబ్రతులకు సమస్య. మేమిది చూసీ చూడకుండా విడిచిపెట్టిడానికి వల్ల కాదు. మరి మీ కళ్ళయెదుట మీ ఆత్మీయులకున్నూ అలాంటిదే తటస్థ పడితే, తరువాత మాటయేదయినా, ముందు కళ్ళు మూసుకొని శత్రువుల మీద పడగలరా? అన్నారు. ఇంకో సన్నివేశంలో 'తెనుగు కన్యలం మేమిప్పుడు చూసుకోవలసి సరియోగ్యత చక్కదనం కాదు. చదువు కాదు. ఐశ్వర్యం అసలే కాదు. ఇవన్నీ తెలుగు యువతిని బానిసని చేసాయి. ఈ లక్షణాలున్న తెలుగు యువకులింత వరకు చక్రవర్తులుగా చలామణి అయ్యారు ఇలాంట వారు వివాహానికి అర్హులు కారు. అనిపిస్తారు కూడా' అంటుంది. ఇది నేటికి కూడా వాస్తవమే. కోటీశ్వరులైన యువకులకు సహితం వివాహం కాని స్థితి నేడుంది. ఈ సంభాషణలు గమనిస్తే శ్రీపాద వారు స్త్రీల విషయంలో ఎంత బలీయమైన అభిప్రాయంలో తన రచనల్లో ఆయా పాత్రలను చిత్రించారో... శ్రీపాద వారు రాసిన 75 చిన్న కథల్లో ప్రతీదీ సమాజ దర్పణంగానే నిలిచింది. 'కలుపు మొక్కలు' 'గులాబి అత్తరు' 'అరికాళ్ళ క్రింద మంటలు' 'ఇలాంటి తవ్వాయి వస్తే' 'గుర్రప్పందేలు', గూడుమారిన కొత్తరికం, విమానం ఎక్కబోతూనూ, తాపిమేస్త్రీ, రామదీక్షితులు బి.ఎ, పుల్లంపేట జరీచీర, జూనియర్ కాదు, అల్లుడు, రామలక్ష్మి ఇలా ప్రతీ కథ గొప్పతనం ఆ కథనేనని చెప్పాలి. ఇవన్నీ చదివితే పాఠకుల మనుసు, మెదడు విశాలమవుతుంది. మల్లారామకృష్ణశాస్త్రి గారు 'తెలుగు వాళ్ళకి మాత్రమే శ్రీపాద వారి కథలు చదివే అదృష్టముంద'న్నారు. గొప్ప సత్యమిది. వైదికపరిభాష, ఆయుర్వేద యోగవైద్యముక్తావళి లాంటి వైద్యగ్రంథాలు, భాషకి సంబంధించిన ఎన్నో వ్యాసాలు రాసారు. 'ప్రేమపాశం' 'నిగళబంధనం' 'రాజరాజు' 'కలంపోటు' వంటి నాటక నాటికలు రాసారు. వీటిలో 'రాజరాజు' గొప్ప ప్రసిద్ధి పొందింది. //3//

రామాయణం, మహాభారతాలను సహితం తనదైన దృక్కోణం నుంచి రస్మాతకంగా తీర్చిదిద్దారు. ఎన్నెన్నో కొత్త కోణాలను ఆవిష్కరించారు. ఆయన తన అత్మ కథను 'అనుభవాలు – జ్ఞాపకాలునూ'గా రాసారు. ఇదో అద్భుత కావ్యమనే చెప్పాలి. తెలుగు ఆత్మకథల్లో ఇది అగ్రస్థానంలో నిలవగలిగేదనే చెప్పవచ్చు. 'ప్రబుద్ధాంధ్ర' పత్రికను నిర్వహించారు. గిడుగు వారి లాగానే భాషావాది. అనేక 'అష్టావధానాలు' చేసారు. 1956లో కనకాభిషేకం కూడా అందుకున్నారు. వీరి మొదటి కథ 'ఇరువురము ఒక్క చోటికే పోదాము' 1915 లో ప్రచురితమైనది. 'మిథునానురాగము' వీరి మొదటి నవల. 1923 వరకు గ్రాంథిక రచనలే చేసారు. 1925 నుంచి పూర్తి వ్యవహారిక భాషలోనికి వచ్చేసారు. హింది – గాంధీ – ఖద్దారు వంటి వాటికి పూర్తి వ్యతిరేకి – చివరి వరకు తను నమ్మిన సిద్ధాంతాంపైనే నిలిచారు. 'తెనుగు దేశమే దేశం' 'తెనుగు భాషే భాష' 'తెనుగు మనుష్యులే మనుష్యులు' 'తెనుగు వేషమే వేషం' 'ఏ జాతి యెదటా ఏ సందర్భంలోనూ ఎందున్నానా తెనుగు జాతి తీసిపోదు'... అని సత్యాలను నినదించిన అచ్చతెనుగు కవి, నాటక, నవలా కథ, వ్యాస రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. ఆయన రచనా నిబద్ధత సాటిలేనిది.

చివరిగా....

"నేను చెయ్యగలిగినా చెయ్యలేకపోయినా దేశీయులది గుర్తించినా, గుర్తించలేకపోయినా, నా జాతికి నేనే చెయ్యవలసినదేదో కొంత ఉంది. రచనే అందుకు సాధనం నాకు. అది సాగించాలంటే కాలూ, చేయీ ఆడాలి. అలా ఆడ్డానికి బువ్వ కావాలి. కళాజీవి అయిన వాడికి బువ్వ ప్రయోజనం అంతే... నాకు ఎప్పుడూ ఉంటున్నదే డబ్బు ఇబ్బంది. అనివార్యంగా కాదు అభిమానం ముందుకు రావడం వల్ల యేర్పడుతోందని' అని తన గురించి తనే చెప్పుకొన్నారు. శ్రీనాథుడైనా... శ్రీపాదవారైనా 'కవికి' తప్పని వేదానభరిత వ్యాఖ్యనాలివని అనిపిస్తుంది. 'మనసు ఫౌండేషన్' వారు శ్రీపాద వారి సర్వలభ్యరచలను నాలుగు సంపుటాలుగా వెలువరించారు.

శ్రీపాద రచనలను చదివినవారే అదృష్టవంతులు...

భమిడిపాటి గౌరీశంకర్
సెల్: 9492858395



శృంగార నైషధంలో హంస

– టి.ఎన్. రసూల్

ప్రసిద్ధి చెందిన మహాభారతంలో సరమ అనే పేరు గల కుక్క కథ ఆదిపర్వంలో ఉంది. పరీక్షిత్తుని కొడుకు జనమేజయుడు సత్రయాగం చేస్తుంటాడు. ఆ సమయంలో సరమ కొడుకు సారమేయుడు ఆ యజ్ఞం దగ్గరకు వచ్చి తిరుగాడుతుండగా జనమేజయుని తమ్ములు దాన్ని కొట్టి తరిమారు. ఆ కుక్కపిల్ల ఏడుస్తూ వచ్చి తల్లికి జరిగిన విషయాన్ని చెబుతుంది. అప్పుడు సరమ తన కొడుకును వెంటబెట్టుకుని జనమేజయుని యజ్ఞశాల వద్దకు వచ్చి ఇలా అంటుంది.

క. **"క్షితినాథ! కడునకరుణా**
న్వితులై నీ తమ్ములతి వివేక విదూరుల్
మతిదలపక నా పుత్రుకు
నతి బాలకు ననపరాధనడిచిరి పెలుచున్".

(శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం 1వ ఆశ్వాసం-84)

ఓ రాజా! మిక్కిలి జ్ఞానహీనులై నీ తమ్ములు, దయలేనివారై చిన్నవాడని ఆలోచించకుండా ఏ తప్పు చేయని కుమారుణ్ణి కొట్టారు.

క. **"తగునిది తగదని యెదలో**
వగవకసాధులకుఁబేదవారలకెగ్గుల్
మొగిఁజేయు దుర్వినీతుల
కగుననిమిత్తగామంబులయిన భయంబుల్".

(శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం 1వ ఆశ్వాసం-85)

ఈ పని యుక్తమైంది, యుక్తమైంది కాదు అని మనస్సులో ఆలోచించకుండా పేదవారికి, ఆశక్తులైనవారికి, మంచివారికి అపకారాలు కావాలని చేసే నీతిరహితులకు కారణం లేకుండానే ఆపదలు వస్తాయి.

ఈ విషయాన్ని గమనించిన మనకు కలిగే ఆశ్చర్యమేమంటే కుక్క పిల్ల ఏడుస్తూ వెళ్లి రాకుమారులు కొట్టిన విషయాన్ని తల్లికి చెప్పడం, తల్లి కుక్క యజ్ఞం జరిగే ప్రాంతానికి వచ్చి జనమేజయునితో మాట్లాడటం, అతనికి శాపాన్ని ఇవ్వడం. కుక్కకు మానవ లక్షణమైన మాటలను కవి ఇవ్వడం ఇక్కడ కన్పిస్తుంది. అందుకు కారణం దేవతా కుక్క అని చెప్పడం గమనించదగిన అంశం. కుక్కలు మాట్లాడలేవు. కుక్క పిల్ల మనిషిలాగా ఏడవనూ లేవు. మానవ లక్షణమైన మాట్లాడటాన్ని కేవలం సరమే కాదు మహాభారతంలో చాలాచోట్ల జంతువులను పాత్రలుగా చేసుకుని వాటికి మనుష్య సంభాషణలను కల్పించి కథను నడిపించడం గమనించవచ్చు. ఆయా జంతుపాత్రలు అచ్చం మనిషే అన్నట్లు మనకు కన్పిస్తాయి. ఇలా ఒక రచనలో జంతువులకు మానవ లక్షణాలను ఆరోపించడాన్ని "Anthropomorphism" అని అంటారు. తెలుగులో దీన్ని 'మానవ రూపం' అనవచ్చు.

ఈ Anthropomorphism అన్నమాట రెండు గ్రీకు పదాల నుండి వచ్చింది. Anthropos, morphe అనే రెండు పదాల కలయిక ఈ పదం ఏర్పడింది. Anthropos అంటే మానవులు, morphe అంటే రూపం. ఈ Anthropomorphism ను ఈ విధంగా నిర్వచించవచ్చు.

1. The Attribution of human characteristics or behavior to god, animal or object. (Oxford Dictionary)

2. The showing or treating of animals, gods, and objects as if they are human in appearance, character, or behavior (Cambridge Dictionary).

మానవ పాత్రలను, గుణాలను, జంతువులకుగాని, దేవుళ్ళకు గాని, వస్తువులకుగాని ఆపాదించడం Anthropomorphism.

మానవులు కాని వాటన్నిటికి, చివరకు దేవుళ్ళకు కూడా మానవరూపాన్ని, గుణాలను ఆపాదించి చాలా ప్రాచీన కాలం నుండి సాహిత్యాన్ని వెలువరిస్తూనే ఉన్నారు. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాలను గమనించిన మనకు ఈ విషయం తెలుస్తుంది.

గ్రీకు ప్రసిద్ధ ఇతిహాసాలైన ఇలియడ్, ఒడిస్సీ దగ్గర నుండి రామాయణ, మహాభారతాలు, పురాణాలు, కావ్యాలు మొదలగు వాటిలో ఈ రకమైన ఆపాదింపు కన్పిస్తుంది. మనుషులు కాని జంతువులు, వస్తువులు, దేవతలుగా భావింపబడేవారు అచ్చం మానవుడిలా వ్యవహరించడం ఒక సాహిత్య విధానంగా భావించవచ్చు.

కవులు, రచయితలు ఈ Anthropomorphismను కథను నడపడానికి ప్రముఖమైన దానిగా భావించి ఉపయోగించడం ప్రపంచంలోని అన్ని సాహిత్య రచనల్లో చూడొచ్చు. పైన ఉదాహరించిన సరమ పాత్రను కూడా ఈ మానవరూపం అనే దాంట్లో నుండే చూడొచ్చు. జనమేజయునికి శాపం ఇవ్వడానికి కవి ఋషి పాత్రను అక్కడ ఉంచవచ్చు కాని కుక్కను ఆ స్థానంలో ఉంచి పాఠకుడికి కథ పట్ల ఆసక్తిని, ఆనందాన్ని కలిగించడం చేశాడు. ప్రాచీన సాహిత్య రచనల్లో ఇలాంటి విధానం ఎక్కువగా కానవస్తుంది. మన ప్రాచీన సాహిత్యంలో ముఖ్యంగా జానపద, కథాసాహిత్యాలలో ఈ రకమైన విధానం చాలా అంటే చాలా ఎక్కువ. పంచతంత్ర కథలు, జాతక కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు ఇంకా అనేక జానపద, పౌరాణిక కథల్లో ఈ మానవరూపం ఒక కథాకథనంగా ప్రధానపాత్ర పోషించిన విధానం, పాఠకులను విపరీతంగా ఆకర్షించిన తీరు మనం గమనించవచ్చు.

ఆంగ్ల సాహిత్యంలో కూడా ఈ Anthropomorphism ఎక్కువగా కన్పిస్తుంది. ఆంగ్లంలో నవలల్లో ఈ రకమైన సాహిత్య అనుభూతిని పాఠకుడికి కల్పించడం కన్పిస్తుంది. మనిషి పాత్ర లేకుండా అన్ని జంతువుల పాత్రలతో రాసిన రచనలు కొన్నైతే, మనుషులతో పాటు జంతువులను పాత్రలుగా ఉపయోగించి వాటికి మాటలను ఆపాదించి రచనలు చేసినవి మరికొన్ని మనకు కన్పిస్తాయి. అలాంటి రచనలన్నీ ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. అలాంటి వాటిలో Alices Adventure in Wonderland, Jungle Book, Animal Form, Call of Wild, The Hobbit, The Lord of Ring మొదలైనవి ఉన్నాయి. ఆంగ్ల రచనల్లో ఎక్కువగా చిన్న పిల్లలకు చెందిన రచనల్లో ఈ మానవరూపం కన్పిస్తున్నా, వ్యంగ్యరచనల్లోనూ, సాహస కథలలోనూ కూడా కన్పిస్తుంది. ఇలా కాకుండా మనిషి ఇతర జంతువుగా మారినా మానవ రూపాన్ని అంటిపెట్టుకుని ఉండే రచనలు ఉన్నాయి. అలాంటి వాటిలో Franz Kafka రాసిన Metamorphosis, Neil Gaiman రాసిన Sandmanలను పేర్కొనవచ్చు.

ఆధునిక యుగంలో ఈ Anthropomorphismను విరివిగా ఉపయోగించుకుని అనేక సినిమాలను నిర్మించడం జరుగుతున్నది. Kung pand, Lion King, Cars the Brave, Little Toaster, Beauty of the Beast, The Wizard of Oz మొదలైన సినిమాలు యానిమేషన్ ఆధారంగా రూపొంది చిన్నపిల్లలను, పెద్దలను ఆకర్షించడం అందరికీ తెలిసిందే. బాలలకు చెందిన సాహిత్యంలో ఈ మానవరూపంను ఎక్కువగా ఉపయోగించినా, అనేక ప్రముఖ రచనల్లో కూడా ఇది ప్రముఖంగానే ఉంది. చదివే వారి ఉత్సుకతను మరింత పెంపొందించడానికి ఈ మానవరూపం బాగా ఉపయోగపడుతుంది.

మత గ్రంథాల్లో మానవరూపం: కేవలం సాహిత్య గ్రంథాల్లోన్నే కాకుండా మత సంబంధమైన గ్రంథాల్లోనూ, కథల్లోనూ ఈ Anthropomorphism కన్పిస్తుంది. భగవద్గీత, బైబిల్, ఖురాన్, తోరా, జెందా అవెస్థ లాంటి గ్రంథాల్లో అద్భుత రసావిస్కరణ కోసం ఈ విధానాన్ని ఉపయోగించిన సందర్భాలున్నాయి. మత సంబంధమైన రచనల్లో దైవత్వానికి గొప్పతనాన్ని ఆపాదించడానికి మహిమలను, అద్భుతాలను ఎక్కువగా చెప్పేటప్పుడు దేవునికి మనిషి మాటలను అందించడం గమనించవచ్చు. దేవుళ్ళకు కోపం రావడం, మానవుడిలా ఆలోచించడం, పక్షపాత ధోరణి మొదలైనవి దేవుళ్ళకు ఆపాదించిన సంఘటనలు మత గ్రంథాల్లో చూడొచ్చు.

Anthropomorphism కు Personification కు తేడా : Anthropomorphismకు Personificationకు చిన్నపాటి తేడా ఉంది. మానవరూపం జంతువులను, వస్తువులను, దేవతలను అచ్చం మానవుడిలా ఉండేటట్లు చేస్తే, Personification మూర్తిమత్వ లక్షణాలను ఆపాదించి మానవీకరణ చేస్తుంది. Anthropomorphism లిటరల్ అర్థాన్నిస్తే, Personification ఆలంకారిక భాషగా ఉపయోగపడుతుంది. "మేఘం కునకు తీస్తోంది" అన్నప్పుడు మేఘానికి మానవుడి లక్షణం కునుకును ఆపాదించడం మానవీకరణ. ప్రారంభంలో పేర్కొన్న సరమ మాట్లాడటం మానవరూపం. మానవీకరణలో మాట్లాడటం తప్పమిగిలిన అన్ని లక్షణాలను ఆలంకారికంగా చెప్పవచ్చు.

శృంగార నైషధంలో Anthropomorphism :

సంస్కృతంలో శ్రీహర్షుడు రాసిన నైషధీయమ్‌ను శ్రీనాథ మహాకవి శృంగార నైషధం పేరుతో తెలుగు చేశాడు. నలదమయంతుల కథను చెప్పే ఈ కావ్యం ఎనిమిది ఆశ్వాసాలు. ఈ కావ్యంలో ఉన్న పాత్రల్లో ఒకానొక ముఖ్యపాత్ర హంస.

సుమారు వంద పద్యాల్లో ఈ హంస పాత్ర మనకు కన్పిస్తుంది. ఈ హంస పాత్రను తీర్చిదిద్దడంలో కవి చూపించిన నేర్పు మానవరూపంగా ఎలా పరిణమించినదో పరిశీలిద్దాం.

దమయంతి పట్ల అనురక్తుడై ఉన్న నలుడు ఒక రోజు వన విహారానికి వెళ్ళి, అక్కడి సరోవరంలో ఉన్న బంగారు రంగులో మెరిసిపోతున్న ఒక హంసను పట్టుకుంటాడు. ఆ హంస తప్పించుకోవడానికి అనేక ప్రయత్నాలు చేసి, విఫలమై మానవ భాషలో నలునితో మాట్లాడుతుంది. హంస పక్షి జాతికి చెందినది. మాటలు రానిది. మానవ ఆలోచనలు, ప్రవర్తనలు, లక్షణాలు ఏవీ కలిగి ఉండనిది అయిన హంస నలునితో మాటలు కలిపింది. "రెక్కలఁకొనలం గలిగిన యిక్కాంచన మాసపడియదే నృప"? (శు.నై 1-105) అని ప్రశ్నిస్తుంది. మానవ సంబంధమైన నీతి విషయాలను చెప్పి తనను విడిచి పెట్టమని అడుగుతుంది. తన ప్రయత్నాలన్నీ విఫలమవ్వగా నలునికి జాలి కలిగేలా తన కుటుంబ దీనస్థితిని ఈ విధంగా చెబుతుంది.

సీ. తల్లిమదేక పుత్రక, పెద్దకన్నులు గానవిప్పుడు,
మూడుకాళ్ళ ముసలి
ఇల్లాలు గడు సాధ్వి ఏమియు
నెఱుగదు పరమపాతివ్రత్య భవ్యచరిత
వెనుక ముందర లేరునెనరైన చుట్టాలు
లేవడి యెంతేని జీవనంబు
కానక కన్న సంతానంబు శిశువులు
జీవనస్థితికే నతావలంబు

తే. కృపఁదలంపఁగదయ్య యో నృప వరేణ్య !
యభయ మీవయ్య యోతుహినాంశు వంశ !
కావఁగదవయ్య యర్థార్థి కల్పశాఖి,
నిగ్రహింపకుమయ్య యో నిషధ రాజ. (శు.నై 1-109).

ఈ పద్యంలో హంస తన తల్లిని గురించి చెబుతున్నది. హంస తల్లి పడుతున్న కష్టాలన్నీ మానవులకు చెందినవే. మానవులు తప్ప వేరే వారు వాటిని గురించి చెప్పలేరు. హంస ప్రస్తావించిన పెద్దకన్నులు కానదు, మూడుకాళ్ళ ముసలి, ఇల్లాలు, కడుసాధ్వి, పాతివ్రత్య భవ్య చరిత, చుట్టాలు లేకపోవడం, మొదలైన విషయాలు మానవులకు చెందినవి. అవి హంసకు తెలియదు. ఇక్కడ హంస చేత కవి మాట్లాడించడం మనం గమనించాల్సిన విషయం. చివరకు నలుడు హంసను విడిచిపెడతాడు. తనను విడిచినందుకు హంస నీకు నొక్క ప్రియంబు చేసెద (2-8) అనిపల్కుతుంది. దమయంతి సౌందర్య వర్ణన చేసి నలునికి ఆమె పై మోహాన్ని కలిగేటట్లు చేయడం కథాపరంగా అతి ముఖ్యమైన సందర్భం. అందుకు కవి హంస చేత దమయంతి కథను చెప్పి ఆమె అంగాంగ వర్ణన చేసి కవిలా తోస్తుంది. హంస ద్వారా దమయంతి వర్ణన చేయటం, హంసకు మానవ భావనలను ఉండేటట్లు కల్పించడం ఇక్కడ మనం గమనించవచ్చు. కేవలం మామూలు మాటలనేకాదు కవిత్వ నైపుణ్యాన్ని, వర్ణనా వైదుష్యాన్ని, ఆలంకారిక సామర్థ్యాన్ని కలిగిన పాత్రగా హంస కన్పిస్తుంది. హంస ఇక్కడ తెలుగు, సంస్కృత భాషలలో పాండిత్యాన్ని, వ్యాకరణజ్ఞానాన్ని కలిగిన వ్యక్తిగా, ఆ పాండిత్య, కవితా నైపుణ్యంతో దమయంతిని వర్ణించడం గమనిస్తే అది హంస కాదు మనిషే అన్న అభిప్రాయం కలుగుతుంది. కొన్ని ఉదాహరణలను పరిశీలిస్తే గాని ఆ హంస ఎంతటి కావ్య నిపుణత్వం కలిగిందో అవగతం కాదు.

తే. రాజబింబంబు నందు సారము హరించి
చేయఁబోలు విధాత యా చెలువ మోము
నడిమి రంధ్రంబు నందుఁగానవచ్చు
ఖనిజ నీలిమ యది నిదర్శనము గాదె. (2-13)

దమయంతి మోమును తయారు చేయడానికి బ్రహ్మ చంద్రుని నుండి సారాన్నంతటిని తీశాడు. అంచేత చంద్రుని మధ్యలో ఒక రంధ్రం పడి నల్లగా కన్పిస్తున్నది. ఒక హంస ఇల్లాంటి ఊహ చేయడం జరగదు. అది మనుష్య భాష తెలిసింది కావడం వల్ల ఈ విధమైన ఊహ చేయడం సాధ్యమైంది. సంస్కృత పద భూయిష్టమైన వాక్యనిర్మాణంతో దమయంతిని ఇలా వర్ణించింది –

మ. వనజాతేక్షణ యూరు యుగ్మమున లావణ్యంబునం గేళికా
నన సంక్రందన పట్టణ ప్రకట జన్మ స్థానలన్ రంభలన్
ధనదా పత్య తపఃఫల స్తనుల నత్యంతాభిరామాంగులన్
మనుజాధీశయధఃకరించు; బోగడన్ మా బోంట్లకున్ శక్యమే? (2-19)

ఈ పద్యంలో దమయంతి ఊరువులను వర్ణిస్తున్నది హంస. శృంగార వర్ణనలు చేయటంలో కూడా హంస నేర్పరిలా కనిపిస్తూనే, మాలాంటి వారికి ఆ వర్ణన సాధ్యమా! అని గడుసు దనంతో మాట్లాడుతుంది. కథాపరంగా నలునికి దమయంతి పై ప్రేమ కలిగే చేయడానికి కవి హంసపాత్రకు మాటలను, కవిత్వాన్ని, చాతుర్యాన్ని ఇచ్చి పాఠకులకు కథపై ఆసక్తి కలిగేలా చెయ్యడం కవి ఉద్దేశంగా కన్పిస్తున్నది.

కేవలం దమయంతిని వర్ణించడమే కాదు నలుని తరుపున దమయంతి వద్దకు దూతగా వెళ్ళడానికి సిద్ధ పడుతుంది. దూతగా వెళ్ళి నలునిపై మొహంగా ఉన్న దమయంతి వద్ద నలుని వర్ణించి దమయంతిని మరింత మోహానికి గురిచేస్తుంది. కవి ఇక్కడ హంసను దూతగా ఉపయోగించుకున్నాడు. సాధారణంగా దూతతనానికి తెలివి గలవాళ్ళు, వాక్చాతుర్యం ఉన్నవారు, సంయమనం కోల్పో కుండా కార్యాన్ని చక్కబెట్టే సమర్థులుగానూ ఉండేవాళ్ళను ఎంపిక చేసుకుంటారు. ఇక్కడ హంసను ఎంపిక చేసుకోవడం వల్ల అవన్నీ హంసకు ఉన్నట్లు భావించాలి. కవి ఇక్కడ హంసకు మానవరూపాన్ని ఆరోపించడం చూడవచ్చు. హంస దమయంతి వద్దకు వెళ్ళి తాను ఎంత గొప్పదాన్నో ఇలా తెలియజేస్తుంది.

సీ.నలిన సంభవు సాహినము వారువంబులు కులము
సాములు మాకుఁగువలయాక్షి,
చదలేటి బంగారు జల రుహంబుల తూండ్లు
భోజనంబులు మాకుఁబువ్వుబోణి,
సత్యలోకము దాఁక సకలలోకంబులు నాటపట్టులు
మాకు అబ్జవదన,
మధురాక్షరములైన మా మాటలు వినంగ
నమఁతాంధసులె యోగ్యులనుపమాంగి,
తే.భారతీ దేవి ముంజేతి పలుకుఁజిలుక సమద
గజయాన సబ్రహ్మ చారి మాకు,
వేదశాస్త్ర పురాణాది విద్యలెల్లఁ దరుణి నీయాన ఘంటా
పథంబు మాకు. (2-49)

ఈ పద్యంలో తాను దేవతా పక్షినని మనుష్య భాషతో చెబుతుంది. ఈ పద్యంలో ఒకపక్క దేవతా పక్షినని చెబుతూనే మరొకపక్క మనుష్యులు నేర్చే విద్యలను నేర్చానని చెప్పుకుంటుంది. ఎదుటివారిని ఆకర్షించే మాటల నైపుణ్యం హంసకు ఉంది. ఇలా స్వోత్కర్ష మనుషులు తప్ప హంసలు చేసుకోవు. కాబట్టి ఇక్కడ హంసకు మానవరూపంను కవి ఆపాదించాడన్న మాట. ఇవన్నీ దమయంతని ఆకట్టుకోవడానికి హంస తన గొప్పతనాన్ని, దైవత్వాన్ని దమయంతి తెలిపి దమయంతి తన మాటలు వినేట్లు చేసుకున్నది. నలుని పరాక్రమాన్ని చెబుతూనే సందర్భం చూసుకొని తన గొప్పతనాన్ని దమయంతికి చెప్పి తన మాటమీద గురి కుదిరేలా చేసుకుని నలునిపై దమయంతికి అనురక్తి కలిగేలా చేయడానికి హంస ప్రయత్నిస్తుంది. నిషధ రాజు తప్ప వేరొకరు నిన్ను పెళ్ళాడటానికి తగినవారు కాదని,ఆవిషయాన్ని బ్రహ్మే స్వయంగా తనతోటి చెప్పాడని చెబుతుంది.

ఉ.
అడిగితినొక్కనాఁడు కమలాసను తేరికి వారువంబునై
నడుచుచు నుర్విలో నిషధ నాథునికెవ్వతె యొక్కొ భార్య య
య్యెడు?నని చక్ర ఘోషమున నించుక యించుక గాని యంత యే
ర్పడ వినఁగాని నీ వనుచు, బల్కిన చందము దోఁచె మానినీ!
(2-58)

హంస ఈ విధంగా దమయంతికి భర్త అయ్యేది నలుడేనని రూఢీ పరిచేటట్లు తన వాక్చాతుర్యంతో చెబుతుంది. మరొక పక్క దమయంతి అందచందాలను పొగుడుతుంది. నీకు తగినజోడి నలుడే, అతణ్ణి వివాహం చేసుకోవడానికి నేను సహాయం చేస్తానని చెబుతుంది. ఎంతసేపైనా దమయంతి నిర్ణయం తీసుకోలేనిదని గ్రహించి "బాలికల చిత్తములంబు తరంగ లోలముల్" (2-67) అనిదెప్పుతుంది. తన మాటల గారడీతో దమయంతి నలుణ్ణి పెళ్ళాడేటట్లు ఒప్పిస్తుంది.

దమయంతిని పెళ్ళికి ఒప్పించడమే కాదు, పెళ్ళి జరిగాక జరిగే మన్మధ విషయాలను దమయంతికి తెలియపరుస్తుంది. ఈ హంస కామశాస్త్రమందు కూడా నిపుణురాలు. దూతగా వచ్చి కార్యం సాధించి తిరిగి నలుని వద్దకు వెళ్ళి దమయంతి పై అనురాగాన్ని పెంచుకున్న నలునికి కార్యం నెరవేరిందని చెబుతుంది. ఒక హంస పాత్రకు ఇంత ప్రాధాన్యత ఇచ్చి కవి కథను నడిపించడంలో ఉన్న ముఖ్యమైన అంశం హంసకు మానవ రూపాన్ని ఇవ్వడం.

కేవలం హంసే కాకుండా దేవతాలకు కూడా మానవ రూపాన్ని ఇవ్వడం శృంగార నైషధంలో చూడొచ్చు. ఇంద్రాది దేవతలు దమయంతి స్వయంవరంకు వచ్చి నలుణ్ణి తమ దూతగా దమయంతి వద్దకు పంపుతారు. ఇక్కడ దేవతలైన ఇంద్రాది దేవతలు మనుష్య భాషను ఉపయోగించడం, మానవ సంబంధమైన ఆలోచనలతో దమయంతిని పెళ్ళి చేసుకో వాలనుకోవడం మానవరూపంలో భాగమే.

డా. టి. ఎన్. రసూల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడేరు,
సెల్ నెం : 9490170661

వెలుదండవారి 'అక్షరమాల'

– డా. దత్తయ్య అట్టెం

"అభిప్రాయాలు దేనిమీదనైనా ఇవ్వవచ్చు. ఎవరు పడితే వారు ఇవ్వవచ్చు. అమూల్యాభిప్రాయాలు మాత్రం అర్హులే ఇవ్వాలి. చాలా మంది ఇచ్చే అభిప్రాయాలు మారని నాణాలు, గుడ్డి గవ్వలు, అధికారుల అభిప్రాయాలకు ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు చెలామణి ఉంటుంది..." (కృష్ణశాస్త్రి వ్యాసావళి -4. పుట.01)అని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారన్నట్లు అందరివి అమూల్యాభిప్రాయాలు కాలేవు. అన్నిచోట్ల పనికి రాలేవు. అమూల్యాభిప్రాయాలను సాధారణంగా సమకాలీనులు, దగ్గరినుండి లోతుగా అధ్యయనం చేసినవారు మాత్రమే తెలుప గలరు. అభిప్రాయాల్ని ఎవరు దేనిమీద అయినా తెలువచ్చు. కాని అమూల్య అభిప్రాయాల్ని మాత్రం అందరూ అన్నిటిమీద చెప్పడానికి వీలులేదు. సాహిత్యంలో రచయిత మీదనో, కవి మీదనో, రచన మీదనో తెలిపిన కొన్ని అమూల్యాభిప్రాయాలు వారిని, వాటిని అంచనా వేయడానికి కొలమానాలుగా నిలుస్తాయి. ప్రాచీన సాహిత్యంలో నన్నయ గురించి తిక్కన "ఆంధ్ర కవిత్వ విశారదుడు, విద్యాదయుతుడు..." అని, తిక్కనను గురించి "కవిత జెప్పి యుభయకవిమిత్రు మెప్పించు..." అని కేతన వంటి ఎందరో మహనీయుల వాక్యాలు వారివారి వ్యక్తిత్వానికీ, సాహిత్యవ్యాసంగానికీ కొలమానాలుగా నిలిచాయి.

ఇలాంటి అమూల్యాభిప్రాయాలను సుదీర్ఘకాలంగా ఆచార్యులుగా పనిచేస్తున్న వెలుదండ నిత్యానందరావుగారు 'అక్షరమాల' పుస్తకంలో చాలావరకు వెలిబుచ్చారు. వీరు ప్రారంభం (1978) నుండి రాసిన అన్ని వ్యాసాలను కలిపి ఏడు సంపుటాలుగా వెలువరించారు. ఆ సంపుటాలలో రెండవది 'అక్షరమాల'. ఇది 124 వ్యాసాల సమాహారం. దీనిని వ్యక్తిత్వ సౌరభం, సాహిత్య సౌరభం అని రెండు భాగాలు చేశారు. వీటి విశేష ఎంపికతో కూడిన కూర్పు కూడ ఒక విశిష్ట ఆలోచన. మూడు దశాబ్దాల ఆచార్యత్వంలో మూడు తరాల వారితో సన్నిహిత పరిచయం గల వెలుదండవారు సాహిత్యానికి ఒక మహావారధి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో అనుభవాలు, మరెన్నో అనుభూతులు, ఇంకెన్నో అభిప్రాయాలు. వీటన్నిటిలో నుండి కొన్ని అమూల్యాభిప్రాయాలు వినూత్న విషయాలను వ్యక్తపరుస్తాయి. వీటిలో వ్యక్తులను గురించి, పుస్తకాలను గురించి, సాహిత్య ప్రక్రియలను గురించిన అద్వితీయ వాక్యాలు కొత్త ఆలోచనలకు మార్గంవేస్తాయి.

ఆరుద్రను గురించి రాస్తూ "సహజ ప్రాప్తమైన ప్రతిభ, ప్రతిభను మించిన వ్యుత్పన్నత, వ్యుత్పన్నతను మించిన అభ్యాసబలం ఆరుద్రను అజరామరుణ్ణి చేశాయి..." (పు.25) అంటారు. వేల పుటల సాహిత్యాన్ని ఒంటి చేతిమీద రాయ గలిగాడంటే ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలు ఏ స్థాయిలో ఉంటే సాధ్యపడుతుందో తేల్చి చెప్పారు. వారి ఆలోచనప్రకారం ఈ మూడు ఒకరిదగ్గర ఉండడం కష్టసాధ్యం. ఆ అపూర్వ కలయికనే ఆరుద్రను అజరామరుణ్ణి చేసిందంటారు. సాహితీ సృజనకారులకు వారి పద్ధతిలో చేయూత నిచ్చినవారు చేకూరి రామారావుగారు. వారి విమర్శను 'అభిప్రాయ భేదాలు ప్రకటించినపుడు నైతం ముఖం మాడ్చుకోకుండా అందులో విషయమేమిటి? చెప్పే పద్ధతేమిటి అని విశ్లేషించే ప్రజాస్వామ్య వాది ఆయన..." (పు.14) అంటారు.

అంతేకాదు "వారి దృక్పథంలో పడకపోతే విశ్వంభరవంటి కావ్యాన్నైనా సరే, ఎంతటి ఆధునిక మహాభారతాన్నైనా సరె బుట్ట దాఖలు చేస్తారు" (పు.29) అని వాస్తవికాన్ని చెప్పడానికి సాహసం కూడా చేస్తారు. చేరాతల సమయంలో శంఖంలో పడిన తీర్థంవలే వారి కలస్పర్శకు పాకులాడిన వారెందరో! అయినప్పటికీ పెద్దపెద్ద రచయితలు అనుకున్న వారి రచనలను కూడా వారి దృక్పథంతోనే తడిమాడనేది వాస్తవం. వీరు పేర్కొన్న ఒక్క వాక్యం చదివిన కొత్తవారు చేరాసాహిత్యాన్ని మరోసారి తిరిగేయలేక ఉండలేరు. పుల్లెల వారి గురించి రాసిన వ్యాసంలో "జీవితాన్ని సతతసరస్వతీ సమారాధనలో పునీతం చేసుకోవడంలో రామ చంద్రుడుగారి వైశిష్ట్యం ఉంది..." (పు.47) ఏకవాక్యంలో వారి సాహిత జీవితాన్ని సార్థకాన్ని తూచగలిగారు.

"ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యుల విమర్శక వ్యాసాలు మేమెంతో మొనగాళ్ళం లోతైన ఆలోచన గలవాళ్ళం అనుకొనే వారిని వారిలోతు ఎంతో పరీక్షించుకోమంటాయి..."(పు.45) సాహిత్యంలో ఇలాంటి మాటలు అరుదు. వాస్తవ విషయాలను ఎందరికో చెంపపెట్టు వాక్యాలుగా రాయగల ధైర్యం ఉన్న వారు మృగ్యం. ఒకరిని చూపిస్తూ మరెందరికో మార్గదర్శకం చేయడం అంటే వారి సాహిత్యంపై వీరి అంచనా ఎంత వరకుందో ఊహించవచ్చు. వీరినే కాదు కోవెల సంపత్కుమార సాహిత్య, వ్యక్తిత్వ ప్రత్యేకతలను కూడా వ్యక్తపరిచారు. ఆచార్య

ఎన్. గోపిగారిని గురించి చెప్తూ "రాంనగర్ గోపి జీవితం సాధన దశ అయితే రామంతపూర్ గోపి జీవితం వైభవ దశ. సాధన దశ, వైభవ దశ రెండూ సమకూడిన వారిదే ఫలవంత మైన జీవితం..." (104) మరోచోట వారు విమర్శ రంగాన్నీ, సృజనాత్మక కవితా వ్యాసంగాన్ని సమాంతరంగా, సమానంగా నిలుపుకోవడంలో శ్రద్ధచూపినారు..." అంటారు. ఈ వాక్యం ద్వారా కవులుగా నిలబడ్డవారు విమర్శకులుగా రాణించలేరు కాని ఈ రెండు విషయాల మీద గోపిగారు మాత్రం 'శ్రద్ధ' చూపారంటారు. ఈ శ్రద్ధ అనే పదం కొంత ఆలోచింపచేస్తుంది. 'జానపదాన్ని జ్ఞానపథంగా మార్చిన పరిశోధక పరమేష్ఠి బి.రామరాజు' (పు. 260) అనే వాక్యం గాలిలో బ్రతుకుతున్న సాహిత్యాన్ని గ్రంథాల్లోకి ఎక్కించి జానపదానికి ప్రాణం పోయడం నేర్పిన వారుగా రామరాజు గారు చిరకాలం నిలిచిపోతారు. 'తెలంగాణ తేట తెనుగులోనైనా, గ్రాంథిక గాంభీర్యంలోనైనా సమప్రజ్ఞతో సంభాషించ గలిగిన విదుషీమణి. పి.యశోదారెడ్డి..." (పుట. 260) అందరికి సాధ్యం కానిది సమప్రజ్ఞ. ఈ అరుదైన ప్రతిభను గురించి మాట్లడం అనేది అరుదైన అభిప్రాయమే.'సంప్రదాయ పరిజ్ఞాన విశ్లేషణలో, ఆధునిక విజ్ఞానవివేచనలో తనకు తానే సాటి అనిపించుకున్న ప్రతిభామేస్త్రి కేతవరపు వెంకట రామకోటిశాస్త్రి..." (పు. 260). కేతవరపువారు అరుదైన పరిశోధకులు. వారిలో సంప్రదాయ పరిజ్ఞానం, ఆధునిక విజ్ఞానం రెండూ సమపాళ్లలో మేళవింపబడ్డాయి.

"ప్రతిభ కులజన్యం అనుకునే అమాయకపుటాలోచనలను తుత్తునియలుచేసి సాధికారికమైన వ్యాఖ్యానాత్మక రచనలు చేసిన సాహిత్య సవ్యసాచి..." (పు. 454) వెలుదండవారు ప్రతిభకు అగ్రస్థానమిస్తూ బోయిభీమన్నను సాహిత్య సవ్య సాచిగా కీర్తిస్తారు."భారతీయ నవలా వాఙ్మయానికి మూల స్తంభాలనీ పితామహులనీ పిలువదగిన వారిద్దరు– బంకిం చంద్రచటర్జీ ప్రథముడైతే, ద్వితీయులు శరత్‌చంద్ర చటర్జీ...." (పు. 343)...."శేషేంద్రశర్మ ఏదో శాపవశాత్తు యోగసాధనలో సంభవించిన కించిత్ లోపంతో మానవలోకంలో జన్మించిన ఒక గంధర్వుడు. ఆయన ధిషణ, ఆయన భావుకత, ఆయన కవితా విన్యాసం, ఆయన కళాత్మకరీతి, ఆయన వదన వర్చస్సు, ఆయన కున్న దాచుకోలేని రాగద్వేషాలు అన్నీ ఆయనలోని గంధర్వాంశను నిరూపించే అంశాలే..." (పు. 477). 'ఉవ్వెత్తున ఎగిసిన అకవిత్వపు కాలుష్యంపై ఎత్తిన కత్తి, సాహసానికి చిరునామ పేర్వారం జగన్నాథం..." (పు. 261). 'అమరేశం రాజేశ్వర శర్మగారు వ్యాకరణ వారాశిని పుక్కిట బట్టిన అపరకుంభ సంభవులు.." (పు. 262) "సంస్కృత సరోవరంలో నిర్ణిరోధంగా స్వేచ్ఛగా విహరించే తెలుగు రాజహంస... ఆచార్య రవ్వా శ్రీహరి" (పు. 263) ... "చాలా మంది కవుల్లో జీవితపార్శ్వం, సాహిత్యపార్శ్వం భిన్నమైన రంగాలుగా విభజించడానికి వీలవుతుంది. కానీ కాళోజీ జీవితం, కాళోజీ సాహిత్య వేర్వేరు కావు..." (494) వంటి వెలుదండవారి వాక్యాలు వారి లోతైన అవగాహనకు, విశ్లేషణ సామర్థ్యానికి కరదీపికలు.

కొన్ని వ్యాసాల శీర్షికలే అమూల్యాభిప్రాయాల పతాకలుగా దర్శనమిస్తాయి. అందులో అమ్మంగి వేణుగోపాల్ గారిని గురించి "అభివ్యక్తిలో మార్దవం, నిర్ణయాల్లో స్థైర్యం..." (పు. 248). "అక్షర శిఖరాగ్రరోచిష్ణుడు రాళ్ళపల్లి అనంత కృష్ణుడు" (పు. 222), 'చరిత్రపొట్ట విప్పిన ఎం.వి.ఆర్.శాస్త్రి' (పు. 147). 'అనువాదం ఆమె జీవననాదం.." (పి. భార్గవీరావు గారిని గురించి) (పు. 84). 'తెలుగు సాహిత్య విమర్శకు చెరగని సంతకం వడలి మందేశ్వరరావు..." (పు. 118). 'విద్వద్విమర్శకులు పెదపాటి నాగేశ్వరరావు' (పు. 194). 'మధుర వచస్వి కూరెళ్ళ' (పు. 99) అనే వ్యాస శీర్షికలే వారి వారి సాహిత్య కృషిలోతులను తెలిపే కొలమాన సాధనాలు.

వెలుదండ వారు స్వతహాగా చమత్కారప్రియులు. విలువైన అభిప్రాయాలను కూడా కొన్నిచోట్ల చాలా చమత్కారంగా, అలవోక గా చెప్తారు. అది రెండోసారో, మూడోసారో చదివినప్పుడు దాని ప్రాధాన్యాన్నో, విశేషాన్నో గుర్తిస్తాం. వాటిలో మచ్చుకు "జయధీర్ తిరుమలరావు మేధనూ పెంచారు, గడ్డాన్ని పెంచారు.." (పు. 113) "స్వయంప్రభతో ఎదిగిన మా గురువు గారు.."(186) అని ఎస్వీ రామారావు గారిని ఉద్దేశించి రాసారు. ఇక్కడ స్వయంప్రభ అంటే రామారావుగారి జీవనసహచరి అని తెలిస్తేగానీ ఆ చమత్కారం బోధపడదు. "సినారె మహర్జాతకులు. జ్యోతిష విద్యాసక్తులు పరిశీ లించాల్సిన విశిష్టజాతకం ఆయనది. గజకేసరి యోగమంటారో... మరేమంటారో..." (పుట. 199) ఎంతటి వారిమీద అయినా వారి అభిప్రాయాన్ని వారి పంథాలో చెప్పకుండా ఉండలేరు."తెలుగు విశ్వవిద్యాలయ స్థాపన వల్ల తెలుగు అధ్యాపకులకు ఉపాధ్యక్షుల నిపించుకునే అవకాశాలు మెరుగయ్యాయి..." (పు. 278) తెలుగు విశ్వవిద్యాలయం అనేది రాకపోతే జియన్ రెడ్డి, సి.నారాయణరెడ్డి, కొలకలూరి ఇనాక్ గారల తర్వాత ఎంతమందికి ఉపాధ్యక్షపదవీ సౌభాగ్యం సిద్ధించేదో ఊహించుకోవలసిందే! ఈ అభిప్రాయాలు చమత్కారంగా కనిపించినప్పటికీ సత్యవిదూరాలు మాత్రం కావు.

సుతిమెత్తగా కనిపించే నిత్యానందరావు వాక్యాలు కొన్ని సార్లు చురుక్కుమనిపించవచ్చు కూడా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాసిన 'ద్రౌపది' కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా రాసిన వ్యాసంలో "తెలుగు సాహిత్యం గొడ్డు పోయిందన్నట్టుగా ఇంత హేయమైన నవలకు ఈ సంవత్సరం ఉత్తమ గ్రంథ పురస్కారం ఇచ్చి కేంద్ర సాహిత్య అకాడమీ తన విలువల వలువలను తానై తాను ఊడ్చేసుకుంది..." (పుట. 100). ఈ విషయం వెనుక చాలా చర్చలున్నాయి అయినప్పటికీ కొన్ని అస్తిత్వ సాహిత్యాలను బేరీజువేసి చెప్పగల శక్తి, సాహసం కొందరికే సాధ్యం. అంతేకాదు మరొకచోట "ఆధునికాంధ్ర సాహిత్యచరిత్ర పుటలన్నింటిని భిన్న భిన్న సాహిత్య, రాజకీయ ప్రేరిత సాహిత్య ఉద్యమాలు 'డామినేట్' ఆక్రమించుకొన్నాయి. ఏదో ఒకరకం ఉద్యమానికి అనుయాయిగా ఉన్న వాని కవితా రచనకే స్థానం లభించింది..." (పు. 355) అనే వాక్యాలు సాహిత్య చరిత్ర నిర్మాణ క్రమానికి వెన్నుపూస వంటివి."దిగంబర కవిత్వం ఉద్యమం కాదు. అది ఒక పేడకుప్పమీద రాయివేసి సంచలనం సృష్టించి ఆకర్షించడంకోసం చేసిన పనిలాంటిది..." (పు. 390) అంటారు. వారి భావజాలం, పదజాలం, ఆవేదన అనేవి దేనిని లక్ష్యంగా చేసుకుని వచ్చాయో స్పష్టతలేని ఒక సాహిత్యోద్యమం గురించి పేడకుప్పమీద రాయివేయడం వంటిదనడానికి ఒక స్పష్టమైన అంచన గలవారు. "నానాటికి కొడిగట్టుకపోతున్న జాతీయ భావనా చండాంశుని జాజ్వల్యమానమొనర్చి భాషాభిమానము, దేశాభిమానము, జాత్యభిమానము పునఃప్రతిష్ఠించుటయే రాయప్రోలువారి ఆంధ్రవళి గీతావళికిగాని, విశ్వనాథ ఆంధ్ర ప్రశస్తికిగాని కొడాలి హంపీక్షేత్రమువంటి రచనలకుగాని ప్రయోజనము. వాటి లక్ష్యమదియే..." (పు. 331). దిగంబర కవిత్వాన్ని మాత్రమే ప్రశ్నించాడనుకోవల్సిన పనిలేదు. జాతీయ వాదం గురించి కూడా మాట్లాడుతారు. రాజకీయ నాయకులను కూడా వదలకుండా ఒకచోట "అసాధ్యాలైన అసంభవాలైన పిచ్చిపిచ్చి వాగ్దానాలు చేయడం నాయకులకు అలవాటు..." (పు. 465) అంటారు. ఈ విధంగా వెలుదండ వారు సాహిత్యాన్ని, సమాజాన్ని ఒక అంచనా వేస్తూ వ్యక్తీకరించిన అభిప్రాయాలు ఎంతో ఆలోచనీయమైనవి.

కొన్ని ప్రశ్నార్థకాలు యావత్ సాహితీ పండితులనే ఆలోచన లో దింపుతాయి. అందులో కొన్ని శీర్షకలే నేరుగా 'ఆనందమఠం అనువాదకులెవరు?..." (పు. 396) "ఈ అధ్యాపకుని గురించి తెలిస్తే చెప్పండి?" (పు. 592). 'ఈయన గుర్తున్నారా?' (పు. 57). ఒక గొప్ప నవలమీద వచ్చిన అనుమానాన్ని ముందరవేసుకుని సాహితీలోకాన్ని ప్రశ్నిస్తూనే వారు సమాధానం చెప్తారు. ఒక పెద్ద విద్యాసంస్థలో పనిచేసిన ఒక ఆచార్యులు రికార్డులలో మాత్రమే కనిపిస్తే ఆయన ఏమైపోయాడు, ఎలాపోయాడు అనే విషయాన్ని తెల్చడం కోసం చేసిన పరిశ్రమలో ఒక వ్యాసాన్ని ఆ శీర్షికతోనే రాయడానికి సిద్ధపడ్డారు. ఒక మహాకవిని పాఠక లోకం, పరిశోధనలోకం మరిచిపోయింది. అటువంటి వారి సాహిత్య పరిమళాన్ని పరిచయం చేస్తూ 'ఈయన గుర్తున్నారా?' అని ఆవేదన వ్యక్తం చేస్తారు.

నిత్యానందరావు గారు "అభిప్రాయ విభేదం సమీక్షలో అనివార్యం. చెప్తే రచయిత తిడ్తాడు. చెప్పకపోతే సాహిత్యానికి అపచారమవుతుంది మనసు ఊరుకోదు..." (పు. 388) "ఈ రోజు కావ్యాలు చదివేవారు కరువయ్యారు. అర్థం చేసుకొని ఆస్వాదించే జిజ్ఞాసువులు తగ్గిపోయారు.."(322).."సాధారణంగా సృజనాత్మకత అతిశయించినవారు విమర్శరంగంవైపు వెళ్ళరు. విమర్శరంగంపట్ల ప్రీత్యధకమైనవారు సృజనరంగాన్ని పట్టించుకోరు..." (284)... "కదిలే ఊహలకు అక్షరాకృతినిస్తే అది కవిత్వం. కదిలే ఊహలకు నాదాకృతి కలిగిస్తే అది సంగీతం. కదిలే ఊహలకు స్పర్శాను కూల్యాన్ని కలిగిస్తే అది శిల్పం. కదిలే ఊహలకు రేఖాకృతి కలిగిస్తే అది చిత్రలేఖనం..." (పు. 294). "నవలకు వాస్తవికత ప్రాణం. కవితకు భావుకత మూలం..." (పు. 408).

"కులాన్ని బట్టిగానీ, ద్వేషం ప్రాతిపదికగాకానీ, ఉత్తమ సమాజాన్ని నిర్మించుకోలేం. అన్ని వర్గాలను కలుపుకొని సమన్వయ దృక్పథంతో, సహనశీలంతో దోపిడీ లేని విధంగా..." (పు. 476)

సాహిత్యాంశాలే కాదు లోతైన తాత్వికాంశాలను కూడా ప్రబోధించగల ప్రేరకులు వెలుదండవారు. "జీవితం సాధన క్రమం. ఒక్కొక్కమెట్టు ఎక్కడానికి నిరంతరం ప్రయత్నం చేస్తుండాలి. జంతుస్థితి నుండి నరస్థితికి, నరత్వస్థితినుండి విశ్వనరత్వ స్థితికి ఎదగడానికి ఎన్నెన్నో వదులుకోవలసి వుంటుంది..." (పు. 498) ఇది జాషువాగారిని గురించి రాసిన సందర్భంలో అన్నప్పటికీ సర్వవ్యక్తులకు, సార్వకాలీనంగా ఉపయోగపడుతుంది. అందరివలె ఎన్నెన్నో నేర్చుకోవాలి. అనకుండా ఎన్నెన్నో వదులు కోవాలి అంటారు. వారి ఉద్దేశ్యంలో మనిషిలో మంచిగుణాలతో పాటు చెడువి కూడా అంతర్లీనంగా ఉంటాయి. వాటిని వదులు కుంటే మంచివి మనిషి ఎదగడానికి ఉపకరిస్తాయి.

డాక్టర్ దత్తయ్య అట్టెం
సహాయాచార్యులు, ఢిల్లీ విశ్వవిద్యాలయం, 9494715445

డా. జివాగో - యూరి బోరిస్ పాస్టర్ నాక్

అనుసృజన: **వేలూరి కృష్ణమూర్తి**



బోరిస్ పాస్టర్ నాక్

1958 లో నోబల్ పురస్కారం పొంది, జగద్విఖ్యాతమైన 'డా. జివాగో' నవలను రచించిన బోరిస్ పాస్టర్ నాక్ (రష్యన్ భాష తెలిసినవారికి బోరిస్ లియినాదవిచ్ పాస్తెర్నాక్) జన్మించినది 1890 ఫిబ్రవరి 10న. ఇతడి తండ్రి లియనీద్ ఆసిపోవిచ్ పాస్టర్ నాక్, ఆనాటి కాలంలో ప్రముఖ చిత్రకారుడు. ఇతని తల్లి రోసలీనా ఒక సుప్రసిద్ధ సాంగీతరాజ్ఞి. అత్యుత్తమమైన పియానో వాదకురాలైన ఈమె ఇంపీరియల్ సంగీత సంస్థలో అధ్యాపకురాలుగా వుండేది. బోరిస్ పాస్టర్ నాక్ తండ్రికి అనేకమైన ప్రతిష్ఠ వ్యక్తుల పరిచయముండినది. వారిలో ప్రముఖుడంటే కౌంట్ లియో టాల్స్ టాయ్.

టాల్స్ టాయ్ గారి అనేక సాహిత్య కృతులకు అసిపోవిచ్ చిత్రాలను గీసి యిచ్చారు. బోరిస్ యింటిలో 'సంగీత సాయంత్రం' (Musical Evening) ఏర్పాటు చేయడం సర్వ సామాన్యం. బోరిస్ అపుడు యింకా శిశువు. బోరిస్‌కు ఏడు సంవత్సరాలు నిండినపుడు అతడిని ఐదవ సంఖ్య (Number 5) మాస్కో గ్రామర్ పాఠశాలలో చేర్పించారు. ఈ పాఠశాలలో ప్రవేశం లభించడం ఆకాలంలో చాలా క్లిష్ట సాధ్యంగా వున్నా, బోరిస్‌కు పవేశం లభించినది. 1903 తరువాత బోరిస్ సంగీతం నేర్చుకోవడానికి ఆసక్తి చూపాడు. ఈంగల్స్‌గారి వద్ద సంగీతం నేర్చుకోవడానికి ప్రారంభించాడు.

1905లో మాస్కో నగరంలో జరిగిన ఒక ఘటన యువకుడైన బోరిస్ పై చాలా ప్రభావం చూపించినది. శాంతి యుతంగా నివేదనను చెల్లించడానికిపోతున్నవారిపై సైనికులు చేసిన దౌర్జన్యం గురించిన ఘటన అది. ఈ ఘటనపై బోరిస్ '1905 వ సంవత్సరం' అన్న ఒక కవితను కూడ రచించాడు.

1908లో 8 సంవత్సరాల విద్యాభ్యాసాన్ని విజయవంతంగా (బంగారు పతకంతో సహా) ముగించాడు బోరిస్. అనంతరం అతడిని మాస్కో విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అధ్యయనానికి చేర్చారు. బోరిస్ తన తండ్రి స్నేహితుడొకడి సలహా మేరకు న్యాయశాస్త్రం నుండి భాషా శాస్త్ర విభాగానికి మార్పించుకొన్నాడు.

వీటి మధ్య బోరిస్ తన తల్లిదండ్రులతో జర్మనీలో 1906 నుండి కొంతకాలం అక్కడే వుండాల్సిన పరిస్థితి ఏర్పడి, అతను తనకు మొదలే నేర్చివున్న జర్మన్ భాషలో తన పాండిత్యాన్ని అభివృద్ధి చేసుకొన్నాడు. బోరిస్ పాస్టర్ నాక్ ప్రముఖంగా ఒక కవి. అతడి అనేకమైన అందమైన కవితా సంకలనాలు ప్రకటించబడ్డాయి. ఇక అతను తన జీవనాధారానికి అవలంభించిన వృత్తి అనువాదం చేయడం. అతడొక ప్రసిద్ధి చెందిన అనువాదకుడు. అతను గద్యంలో వ్రాసినది చాలా తక్కువే. సాహిత్యంలో చాలా ఆసక్తి పొందివున్న బోరిస్ తన మిత్రుడైన ఎస్. బబ్రోవ్ మరియు ఎస్. అసేవ్‌లతో కలిసి 'సెంట్రీఫ్యూజ్' అన్న ఒక గుంపును ఏర్పరిచాడు. బోరిస్ పాస్టర్ నాక్‌కు లభించిన మొట్టమొదటి అనువాదపు పని, జర్మన్ భాషలో హెన్రిక్ క్లీస్ రచించిన హాస్య ప్రధానమైన ప్రహసనం 'పగిలిపోయిన కూజా'. ఈ హాస్య ప్రధానమైన కృతిని అనువాదం చేయడానికి అతడు చాలా శ్రమించాల్సి వచ్చింది. 1915లో ఇది ప్రకటించబడ్డది. అనంతరం వచ్చిన యుద్ధం ఈ కవిపై తీవ్రమైన ప్రభావం కలిగించినది. ఆ సమయంలో అతడు యుద్ధానికి సంబంధించిన 'చెడ్డకల' మొదలైన ఎన్నో కవితలను రచించాడు. రష్యా క్రాంతి అనంతరం మక్సిం గోర్కీ ప్రేరణతో రష్యా దేశపు పురాతన సంస్కృతిని రక్షించ డానికి ఒక మండలిని ఏర్పాటుచేశారు. బోరిస్ పాస్టర్ నాక్‌కు అందులో పనిచేసే అవకాశం లభించినది. బోరిస్, ఇదే సమయంలో జర్మన్ ప్రముఖ రచయిత హెన్రిక్ క్లీస్ గారి మరొక కృతిని, అలాగే బెన్ జాన్సన్ గారి 'ఆల్కెమిస్ట్' కృతుల అనువాదాన్ని చేశాడు.

ఈ సమయానికి పాస్టర్ నాక్‌కు కమ్యూనిస్ట్ క్రాంతి పరిణామం వేడి ముట్టసాగినది. రచయితల సంఘంవారు

తెలిపిన చట్రంలో సృజనశీల కవులను బంధించారు. వీరినుండి బోరిస్ కు ఒక విధమైన మనోవేదన ప్రారంభమైంది. ఉన్నదున్నట్టు వ్రాయడానికి సాధ్యం కాని, ఊపిరి కట్టివేసే వాతావరణం సృష్టియైనది. ఆనాటి అత్యంత ప్రముఖ కవి మాయ్ కోవిస్కి ఆత్మహత్య పాస్టర్ నాక్ పై అత్యంత గంభీరమైన పరిమాణం కలిగించినది. మాయ్ కోవిస్కి ఒక శ్రేష్ఠ కవి అని ఆనాటి రోజులలో కీర్తి గడించాడు. ఈ సమయంలో బోరిస్ రచించిన 'కవి మరణం' కూడ మడివంతులైన కమ్యూనిస్టుల మన్ననకు యోగ్యత సంపాదించలేదు. ఈ సందర్భంలో బ్రతుకు సాగించడానికి కూడ కష్టకరమైన పరిస్థితి ఎదురైనది. 1932లో మరలా మక్సిం గోర్కివారి సహాయంతో ఈ కష్టాలు కొంత వరకు కడతేరి బోరిస్ మరలా సాహిత్య క్షేత్రంలో లీనమవడానికి సహాయపడింది. ఇదే సమయంలో అతని కృతి ఒకటి సులభంగా ఎన్నోమార్లు రచయితల సంఘానికి వెళ్ళి రావాల్సి పడినది. అతడి మరొక కృతి 'వజ్దుష్ నియ పూతి' (వాయుమార్గం) ప్రచురణ అయినది. కాని దానిలోని ఒక భాగమైన 'ఆఖ్రానియె గ్రమోత (చదువు వ్రాతల సంరక్షణ) అన్నదాన్ని పూర్తిగా తొలగించి వేశారు.

ఆ రోజులలో స్వతంత్ర కృతి రచనకు ఒకింతా అవకాశ ముండేది కాదు. అపుడు జరుగుతున్న సాహిత్య రచనలన్నీ సమాజవాది తత్వం పరిమితిలో వుండాల్సిన అవశ్యకత వుండేది. 1933లో బోరిస్‌కు జార్జియన్ భాష కవితల సంగ్రహాన్ని రష్యన్ భాషకు అనువాదం చేసే అవకాశం లభించినది. (జార్జియన్, స్టాలిన్ మాతృ భాష). 1934లో రచయితలసంఘంలో పాస్టర్ నాక్‌ను సభ్యుడిగా తీసుకొన్నారు. కాని ఇలాంటి సంఘాలు కవుల, సాహితీకారుల సృజనశీల శక్తికి అఘాతకారి అన్నది బోరిస్ అభిప్రాయమైంది. అలాంటి ఒక సమ్మేళనంలో అతడు చేసిన ఒక ఉపన్యాసం ఈ విధంగా వుండినది: "సాహిత్యకారుల ఈ సమ్మేళనం ఫాసిసంకు విరుద్ధమేమో సరి. కాని ఇలాంటి సంఘాల వల్ల సాహిత్యాభివృద్ధికి బదులుగా సృజనశీలతయొక్క హత్య జరుగుతుంది (రచయితల సంఘాల నుండి) అది సాహిత్యం కానీండి, కళ కానీండి, దానిని స్వతంత్రంగా వృద్ధిపొందడానికి అవకాశమివ్వకపోవడం పెద్దతప్పవుతుంది. 1789లో, 1848 లో, 1917లో ఇలాంటి రచయితల సంఘాలు వుండేవి కాదు. కాని ఆ కాలంలో ఎన్నో గొప్ప ప్రపంచ ప్రసిద్ధమైన కృతులు రచింపబడ్డాయి."

బోరిస్ పాస్టర్ నాక్‌కు జగత్ ప్రసిద్ధి తెచ్చిన కృతి 'డా. జివాగో' నవల... దీని రచన ఎలా జరిగినదన్నది చాలా స్వారస్యకరంగా వున్నది. 1945లో జార్జియన్ భాష ప్రఖ్యాత కవి కీ.శే. నికోలాజ్ 100వ జన్మదినం ఆచరించే సభలో బోరిస్ పాస్టర్ నాక్ పాల్గొన్నాడు. ఈ సభ తిబ్లిక్ నగరంలో జరిగినది. బోరిస్ పాస్టర్ నాక్ అక్కడి ప్రఖ్యాత కవి తబీజిగారి భార్యను కలిశాడు. కవి తబీజిని అప్పటికే సమాజ విరోధి అని కారాగృహంలో వుంచారు. కవిగారి భార్య తన భర్త యిచ్చిన ఒక హస్తప్రతిని బోరిస్‌కు యిచ్చినది. అందులో డా. జివాగో అన్న కృతికి సంబంధించిన ఒకే ఒక అధ్యాయ ముండినది. ఈ ఒక అధ్యాయం బోరిస్‌ను తన మేరు కృతిగా రచించడానికి ప్రేరణ కలిగించినది. చాలా ఉత్సాహంతో అతను ఈ కృతి రచనలో లీనమయ్యాడు. ఆ సమయంలో బోరిస్ తన మిత్రుడికి వ్రాసిన ఉత్తరంలో ఈ విధంగా చెబుతాడు... 'ఇది నా స్వంత అనుభవంతో ప్రేరితుడినై రచించిన కృతి. ఇందులో రష్యాదేశం గడిచిన 40సంవత్సరాల చరిత్రను అత్యంత సహజంగా చిత్రించడానికి ప్రయత్నించా. మన దేశం ఈ పర్వకాలం చరిత్ర ఇది. నా దృష్టి మాత్రమే కాదు, దీనిలో అందరి దృష్టికోణాలూ యిమిడి వున్నాయి. క్రాంతికారుల, క్రాంతిని విరోధించేవారి, యూదుల, అలాగే ఏ తంత్రాలకు లోబడని సామాన్య జనులు అందరి ఆలోచనలు కూడ ఇందులో వున్నవి.

1947 చివరి వేళకు ఈ కృతికి సంబంధించిన 10 కవితలను కూడ సిద్ధం చేశాడు బోరిస్ పాస్టర్ నాక్. అపుడు బోరిస్ ఆ పుస్తకానికి 'ఇనోకెంతి దూదరోవ్' అన్న పేరు పెట్టాడు. దీని తరువాత ఈ కృతి 3వ అధ్యాయాన్ని సిద్ధం చేసిన బోరిస్, దాని పేరును మార్చి 'రిన్ వే' (నదిపేరు) అని నిర్ణయించాడు. ఈ పేరు అతనికి తృప్తినివ్వలేదు. దానితో 'మండిపోయిన మైణపు వత్తి' అని దాని పేరును మార్చాడు. 1948కి దగ్గర దగ్గర ఈ కృతి 4వ అధ్యాయం ముగియడంతో 'డా. జివాగో' అని మరొక మారు పేరు మార్చాడు.ఈ పేరును మరెపుడూ మార్చలేదు. ఈ మధ్య 1952లో బోరిస్ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడి, కోలుకొన్నాడు.

చివరికి బోరిస్ పాస్టర్ నాక్ 'డా.జివాగో' నవలను వ్రాసి ముగించాడు. ఈ నవలలో 1903 నుండి 1929 వరకు రష్యాలో వున్న పరిస్థితులను అత్యంత సహజంగా చిత్రించాడు. 1929లో ఈ నవల నాయకుడు డా. యూరి జివాగో మరణంతో నవల ముగుస్తుంది. ఈ నవలను 'క్రొత్త ప్రపంచం' (New World) పత్రిక ప్రకటించాల్సినది. (రష్యన్‌లో నోవియమీర) కాని, 1956వ సెప్టంబర్ నెలలో ఆ పత్రిక వారు ఈ కృతిని ప్రకటించ డానికి సాధ్యంకాదని అంటూ ఒక ఉత్తరంతో 'డా.జివాగో' హస్తప్రతిని రచయితకు వెనుదిరిగించారు. ఆ పత్రంలో ఇలా

వ్రాయబడి వుండినది:

మీ కృతి ఆసాంతమూ చిత్రితమైన ధోరణులు మన సమాజవాది క్రాంతిని తూర్పారబట్టే రీతిలో వున్నవి. అక్టోబర్ క్రాంతి, రష్యా నాగరీక యుద్ధం.. వీటివల్ల మన దేశానికి, మన దేశంలోని దరిద్రులకు కష్టాలు కలిగాయి తప్ప వేరే ఏదీ కాలేదన్న భావన కలిగిస్తుంది మీ కృతి. ఇది సత్యానికి చాలా దూరంగా వున్న విషయం. మీ నవల నిజ సంగతులకు వెల యివ్వలేదు. అసత్యంలోనే మునిగి వున్నది. క్రాంతివల్ల ఎవరికీ ఎలాంటి లాభమూ లభించలేదని ప్రతిపాదించే ప్రయత్నం గోచరిస్తుంది. ఇక మీ నవలను చదివితే రష్యా అనాటి మేధావంతులను హీనకరంగా నిర్లక్ష్యించారని లేక వారిని దైహికంగా నిర్మూలం చేశారనిపిస్తుంది. ఈ కారణాల వల్ల మీ నవలను ప్రకటించలేమంటూ వెనుదిరిగిస్తున్నాము'. ఆ పత్రంలో ఎ. అగాపోవ్, బి. లావ్రెనేవ్ మొదలైనవారి చేవ్రాలు వుండినవి. బోరిస్ పాస్టర్ నాక్ 'క్రొత్త ప్రపంచం' పత్రికకు తన హస్తప్రతి పంపించేటపుడే మరికొన్ని ఇతర దేశాలకు కూడ తన నవల హస్తప్రతిని అనువాదం చేసి ప్రకటించడానికి పంపించాడు. అలా అయి, ఒక పోలిష్ పత్రిక డా.జివాగో నవలను మొదటి రెండు అధ్యాయాలను ప్రకటింప చేసింది. దీనితో అనాటి రష్యన్ పాలకులు కుపితులయ్యారు. బోరిస్ పాస్టర్ నాక్‌కు ఇటలీ మొదలైన చోట్ల ఈ నవల ప్రకటన కాకుండా చూడాలని పత్రం వ్రాశారు. 1958లో ఈ కృతి జర్మన్, ఇంగ్లీషు, స్విస్ భాషలలో కూడ ప్రకటించబడింది.

1958 సంవత్సరానికిగాను ఈ కృతికి నోబెల్ బహుమతి ఘోషించారు. రష్యా ప్రభుత్వం ఈ బహుమానాన్ని తిరస్కరించమని బోరిస్ పాస్టర్ నాక్‌కు సలహా యిచ్చినది. బోరిస్ పాస్టర్ నాక్‌కు ఇది సరి అనిపించలేదు. అదే సంవత్సరం అక్టోబర్ 27 నుండి రష్యా దేశపు రచయితల సంఘం మహాసభ జరిగినది. అక్కడ జరిగిన చర్చల అనంతరం బోరిస్ పాస్టర్ నాక్‌ను రచయితల సంఘం నుండి తీసివేయాలన్న నిర్ణయం చేశారు. 'ఇతడు మన దేశం వాడు. మనం ఎన్నుకొన్న సమాజ వాదానికి సోవియత్ ప్రభుత్వ వ్యవస్థకు అపచారం చేసేటటువంటి కృతిని రచించాడన్న ఏకైక కారణానికి వీరికి నోబెల్ బహుమతి యిచ్చి మన దేశం అలాగే ఇతర యూరోప్ దేశాల మధ్య శీతల యుద్ధాన్ని ఎక్కువ చేసే ఉద్దేశాన్ని పొందినదని అభిప్రాయపడ్డారు. అనాటి మహాసభలో ఇంతకు మునుపు బోరిస్ మిత్రులుగా వున్నవారు కూడ వీరికి విరుద్ధంగా మాట్లాడారు. కేవలం రచయిత త్వర్దోవ్ స్కి మరియు ఎన్. గ్రిబాజేవ్ వీరి పరంగా మాట్లాడారు. ఓటు వేసే సమయంలో కొందరు రచయితలు పాల్గొనలేదు.

దీనితో కోపగించుకొన్న బోరిస్ పాస్టర్ నాక్ రచయితల సంఘానికి ఈ విధంగా ఒక పత్రాన్ని వ్రాశాడు: 'మీరు చేస్తున్నది సరికాదన్నది మీకు తెలుసు, నాకూ తెలుసు. ప్రభుత్వం అధీనంలో వున్న ఇలాంటి సంస్థ నుండి మరి దేనినీ ఆపేక్షించలేను. మీవల్ల నాకు న్యాయం లభిస్తుందని నేను కలలో కూడా ఆలోచించను. 'మీకు కావాలనుంటే నన్ను గుండుపెట్టి కాల్చి చంపవచ్చు, ఉరి తీయవచ్చు, మీకు యిష్టం వచ్చినట్టు చేయవచ్చు. నేను మిమ్ములను ఖచ్చితంగా ముందుగానే క్షమిస్తున్నా. కాని, ఒక విషయం మాత్రం జ్ఞాపకం వుంచుకోండి. ఒక నాడు కాకపోతే ముందెపుడైనా మీరు నా స్థానమానాలను మరల స్థాపిస్తారు. ఇది మీకు క్రొత్త విషయమేమీ కాదు.

ఇది జరిగిన మీదట పాస్టర్ నాక్ తనకు నోబెల్ బహుమతిని పొందే కోరికలేదని నోబెల్ సంస్థకు సవినయంగా విన్నవించాడు. కాని ఆ సంస్థకు దాని నిజమైన కారణం తెలిసింది. బోరిస్ పాస్టర్ నాక్ నడవడి అలాగే అతనికి అంతర్జాతీయ మట్టంలో లభించిన ఖ్యాతివల్ల అసూయగొన్న రష్యన్ రచయితల సంఘం సభ్యులు మరింత మండిపడ్డారు. బోరిస్ పాస్టర్ నాక్‌కు ఎలాంటి పనిని యివ్వలేదు. చివరకు బోరిస్‌ను దేశం నుండి బహిష్కరించాలని, ఆలోచిస్తున్నారన్న వదంతి కూడ ప్రచారమైంది. ఇది ఈ సాహిత్యకారుడి అత్యంత కష్టపు రోజులైవుండినవి. బోరిస్ పాస్టర్ నాక్ రష్యా అధ్యక్షుడు ఖ్రుశ్చేవ్ గారికి ఒక ఉత్తరం వ్రాసి రష్యానుండి తనను బయటికి పంపకండని విన్నవించుకొన్నాడు. ప్రపంచంలోని ఎన్నోచోట్ల నుండీ బోరిస్ పరంగా ధ్వనులు వినపడ్డాయి. కాని, ఎం. జి. పావెల్ పీట్స్ గారి ప్రకారం, బోరిస్ పాస్టర్ నాక్‌కు నిజంగా సహాయం చేసిన ఒకే ఒక ఉత్తరమంటే, భారతదేశపు అప్పటి ప్రధాని పండిత్ జవహర్లాల్ నెహ్రూ రష్యా అధ్యక్షుడు ఖ్రుశ్చేవ్‌కు వ్రాసిన ఉత్తరం వల్లే. 'బోరిస్‌కు రష్యాలో వుండడానికి అవకాశమివ్వాలని, నోబెల్ బహుమతివారు యిచ్చిన కొంత డబ్బును బోరిస్ ఉపయోగించు కోవడానికి అనుమతి యివ్వాలని, ఇది తన వ్యక్తిగతమైన ప్రార్థనని ఆ ఉత్తరంలో నెహ్రూ వ్రాశారు. నెహ్రూ మాటలకు వెల యిచ్చి ఖ్రుశ్చేవ్ అతని కోరికను నెరవేర్చారు. ఆ సమయం లో పాస్టర్ నాక్ రచించిన 'నోబెల్ బహుమతి' అన్న పద్యం ఈ విధంగా వుంది.

'బోనులోని మృగంలా చిక్కులుకొన్నా
జనులు, స్వతంత్రం, వెలుగు అన్నీ వున్నా,
నా వెంట వచ్చేవారి శబ్దం వినపడుతున్నది
బయటికి పోయే మార్గం లేదు ఇక్కడినుండి.

వేలూరి కృష్ణమూర్తి, బెంగుళూరు, ఫోన్: 944 897 7877.

తెలంగాణం జానపద కళానిలయం

– ధరంసోత్ సరిత

తెలుగు సంస్కృతుల్లో తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది. కాలగమనంలో ఆంధ్ర సంస్కృతి దీన్ని నష్టపరిచినప్పటికీ, ఇవాల్టి సందర్భంలో తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనం పొందుతోంది. భౌగోళికంగా బాగా సుసంపన్నమైన తెలంగాణకు తూర్పున కందికల్ గుట్టల వరుస, పడమట బాలాఘాట్ పర్వతశ్రేణులు, ఉత్తరాన గోదావరి, దక్షిణాన కృష్ణానదులు ఉన్నాయి. ఇలా ఎన్నో వనరులు ఉన్న ప్రదేశం కావడం వల్ల స్థానికంగా చరిత్ర, నాగరికత, సంస్కృతి ఇక్కడ వికసించినాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మిగతా సంస్కృతులకు ఇంత విస్తృతి లేదు. తెలంగాణా ఘనవారసత్వానికి ప్రతీకలైన కళారూపాలకు, కళాకృతులకు ఆలవాలం వరంగల్ జిల్లా.

తెలంగాణ జానపదకళలు తెలంగాణా సంస్కృతి నిలయాలు. ఈ కళలు మట్టిలో మాణిక్యాలు, కులాశ్రయాలు, వారసత్వ కళానిధులు. జానపదులకు ఇవే వినోద సాధనాలు, విజ్ఞాన ప్రదాతలు. పల్లెపల్లెనా వీధివీధినా ప్రదర్శించబడి, ఇంటింటా సంభావనలు పుచ్చుకున్న ఈ కళలు ఒకనాడు పల్లీయుల ఆదరణలో కళకళలాడినా, నేటి ఆధునిక సామాజిక పరిస్థితుల్లో సంక్షోభంలో పడ్డాయి. వెలవెలపోతున్నాయి. పొట్టకూటి కోసం అలమటిస్తున్నారు. సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన ఈ ప్రాంతంలో జానపద కళారూపాలు వందకు పైగా ఉన్నాయి. ఇవి ఇక్కడి విశిష్ట సంస్కృతికి అద్దం పడుతున్నాయి. ఒక కులం సంస్కృతీ సంప్రదాయాలను, ఆ కుల పుట్టు పూర్వోత్తరాలను ఈ కళారూపాలు వివరిస్తాయి. ఈ కళారూపాలు ప్రదర్శించే వారిని ఉపకులాలకు చెందిన వారిగా, హక్కుదార్లుగా పిలుస్తూ, వారి కళారూపాలను ఆశ్రిత కళారూపాలుగా పిలుస్తున్నారు.

ఈ కళారూపాల ప్రదర్శన విధానాన్ని బట్టి తొమ్మిది రకాలుగా వర్గీకరించవచ్చు. అందులో బొమ్మలాటలు, అనుష్టాన కళా రూపాలు, వాద్య కళారూపాలు, పటం కథలు, ఇంద్రజాల ప్రదర్శనలు, నృత్యాలు, కథాగాన కళారూపాలు వేషాలతో కూడిన కళారూపాలు, భజన సంప్రదాయ కళా రూపాలు తదితరాలు ఉంటాయి.

బొమ్మలాటలలో తోలుబొమ్మలాట, చెక్క బొమ్మలాట, మందెచ్చు బొమ్మలు, అనుష్టాన కళారూపాల్లో బతుకమ్మ, బోనాలు, దుబ్బుల కొలుపులు, పంబా, ఎల్లమ్మవేషం, వీరముష్టి, వాద్య కళారూపాల్లో డప్పు, ఒగ్గుడొల్లు, బుడగ, రుంజలు, పటం కళారూపాల్లో పద్మశాలీ వారి మార్కండేయ పురాణం, మాదిగవారికి జాంబపురాణం, మాలవారికి భేతాళపురాణం, చాకలివారికి మడెలుపురాణం, గౌడవారికి గౌడపురాణం, కుమ్మరి వారి బ్రహ్మపురాణం, యాదవుల మల్లన్న కథ, ముదిరాజుల పాండవుల కథలు ప్రసిద్ధాలు. ఇక జానపద నృత్యాల విషయానికి వస్తే బంజారాల సుగాలి నృత్యం, గోండు గుస్సాడి నృత్యం, కోయకొమ్ము నృత్యాలు, ధింసా, రేలా, దండారి లాంటి నృత్యాలు కనబడుతాయి. వీటితో పాటు పండుగలకు సంబంధించిన నృత్యాలు ఆయా సందర్భాల్లో ప్రదర్శిస్తారు.

కథాగాన కళారూపాల్లో రామాయణ, భారత, భాగవత కథలను పురాణాలుగా చెప్పేవారిలో చిందుయక్షగానం, గొందేళి వీధి భాగోతం, దాసరి భాగోతం, వీధి భాగోతాలు వీధి నాటకాలు ఈ కోవలోకి వస్తాయి. ఆ కథలకు సంబంధించి పాత్రలు వేషధారణతో కథలను రక్తి కట్టిస్తారు. వీటిలో హాస్యగాడి పాత్ర అందరిని ఆకర్షిస్తుంది. వేషాలతో కూడిన కళారూపాల్లో పగటి వేష కళాకారులు ముప్పైకి పైగా వేషాలు వేసి ప్రదర్శన ఇస్తారు. ఇందులో అర్ధనారీశ్వర, అదేవిధంగా, పులివేషాలు లాంటివి ఉంటాయి. అదేవిధంగా, పులివేషాలు, కాళిక వేషం వంటివి ఇందులోకి వస్తాయి. పగటి వేషకళాకారులు రోజుకొక వేషం వేస్తూ ఊళ్ళో ప్రదర్శన ఇస్తారు. ఇందులో తుపాకి రాముడి వేషం తెలంగాణాలో ప్రత్యేకం.

కొన్ని కళారూపాలు అనూచానంగా, తరతరాలుగా ప్రదర్శన కళలుగా ప్రచారంలో ఉన్నాయి. ప్రతి సామాజిక వర్గంలోనూ కొన్ని కుటుంబాలు ఈ కళారూపాల ప్రదర్శనే వృత్తిగా జీవనం సాగిస్తున్నాయి. రెడ్డి తదితర కులాల వారిని యాచించి బతుకు వెళ్ళదీసే వీరముష్టలు, జంగాలు పాడుకునే శారద కథ పాట. గొల్లకురమల గొల్లసుద్దులు, ఒగ్గుకథలు, పిచ్చుక గుంట్లు, జంగాలు అనాదిగా పాడుకుంటున్న తందానా కథ, ఒకనాడు జానపదమై ప్రస్తుతం సంప్రదాయం నృత్యంగా మారుతున్న పేరిణి శివతాండం, అతిప్రాచీనమైన యక్షగానం, భాగవతాలు, వీధినాటకాలు, చిరుతల రామాయణం, చిరుతల భాగవతం వంటివి అనేక వందల సంవత్సరాలుగా జానపద ప్రజామనో రంజన సాధనాలుగా నిలిచాయి.

ఈ కళారూపాలే కాక విప్రవినోదులు, కాటికాపలవారు, సాధనాశూరులు అనేవారు ఇంద్రజాల, మహేంద్రజాల విద్యలు

తెలిసిన కళాకారులుగా తెలంగాణలోనే కనిపిస్తారు. ఇంకా చిందు మాదిగలు వీధినాటకాలను ప్రదర్శిస్తారు. ఒగ్గు గొల్లలు, బవనీలు అనే తెగలవారు ఎల్లమ్మ దేవత కథను ప్రదర్శిస్తారు. జోగువారికి నృత్యమాడడమే వృత్తి. వీటిని ఆశ్రితకులాల కళారూపాలు అని చెప్పవచ్చు. ఆశ్రితేతర కళారూపాల కళాకారులు కేవలం ఒక కులానికిమాత్రమే పరిమితం కాకుండా అన్ని కులాలను ఆశ్రయించి ప్రదర్శనలిస్తూ జీవిస్తాయి. ఇందుకు ఉదాహరణగా చెక్కబొమ్మలాట, తోలు బొమ్మలాట, కాటిపాపలు, చిరతల రామాయణం, పగటి వేషాలు మొదలైనవి. ఆశ్రిత జానపద కళారూపాలను ప్రదర్శించే కళాకారులు ఒక నియమిత కులానికి చెంది సంప్రదాయమైన కట్టడి కలిగి ఉంటారు. వీరికే భిక్షుక గాయకులు, వృత్తి గాయకులు, అర్థి బిడ్డలు, ఆశ్రిత గాయకులు, హక్కుదార్లు, ఉపకులాలు, కులం బిడ్డలు ఇట్లా రకరకాల పేర్లున్నాయి. వీరు ఏ కులాన్ని అయితే ఆశ్రయిస్తారో ఆ కులాన్ని పోషక కులమని, ధాతృ కులమని, ప్రధాన కులమని వ్యవహరిస్తారు.

ముదిరాజ్‌లను ఆశ్రయించే కాకి పడిగెలవారు, నాయీ బ్రాహ్మణులను ఆశ్రయించే అద్దపువారు, మాలలను ఆశ్రయించే గుర్రపువారు, గౌడ కులాన్ని ఆశ్రయించే గౌడజెట్టీ, ఏనాటి వారు, రజకులను ఆశ్రయించే మాసయ్యల వారు, పద్మశాలి కులాన్ని ఆశ్రయించే సాధనాశూరులు వంటి ఆశ్రితకులాలు పోషక కులాల ఉత్పత్తి, వికాసాలను, చరిత్రను వర్ణిస్తూ కథాగానాలు చేస్తున్నాయి. ప్రదర్శనలో ఆయా ఆశ్రిత కళారూపాలు మౌఖికంగా వారికి సంక్రమించిన సాహిత్యాన్నే ఆసరాగా చేసుకొని ఆ సంప్రదాయాన్నే కొనసాగిస్తూ నేటికీ వస్తున్నారు.

జానపదులకు ఆశ్రిత జానపద కళారూపాలున్నట్టుగానే, గిరిజన తెగలకు కూడా ఆశ్రిత కళారూపాలు పట్టెడ, డోలి, తోటి, పర్‌ధాన్, కొర్రాజులు, పూజారి, భాట్, ధాడి వంటి కళారూపాలు విభిన్నమైన ప్రక్రియలతో ప్రధాన తెగలను ఆశ్రయిస్తూ జీవిస్తున్నాయి. ఈ కళారూపాలు కూడా ప్రధానతెగకు కట్టడి కలిగి ఉన్నాయి.

జానపద కళారూపాల ప్రదర్శనలో సామెతలు, పొడుపు కథలు సందర్భోచితంగా ప్రయోగిస్తూ తాము చెప్పే కథాంశాన్ని ప్రేక్షకునికి నిరాసక్తి లేకుండా, హాస్యాన్ని జోడించి అందిస్తారు. కళాకారులు తమ ప్రదర్శనతో విభిన్న సంస్కృతులను భిన్న సమూహాలను ఏకం చేయడానికి వీరి సాహిత్యమే దోహదం చేస్తున్నది. అంతేగాక తెలంగాణా యాసకు చెందిన అనేక పదాల భాండాగారం ఆశ్రిత జానపద కళారూపాల సాహిత్యమే.

నాటకాలు లేదా యక్షగాన రూపంలో ప్రదర్శించే ఆశ్రిత కళారూపాలు భాగవతం, రామాయణ, భారతకథలను ఆయా పోషక కులాల దగ్గర ప్రదర్శిస్తూ అందులోని నీతిని నియమాల్ని, రాజనీతిని, భక్తిని, విశ్వాసాలను తమ తమ నైపుణ్యంతో ప్రేక్షకులకు అందిస్తూ, ఇతిహాసాల గొప్పతనాన్ని ప్రసరింపజేస్తూ మనుగడ సాగిస్తున్నాయి. వీరి సాహిత్యంతో సమాజంలో మానవీయ విలువల్ని పెంచే దిశగా తరతరాలుగా కృషి చేస్తున్నారు.

జానపద కళారూపాల్లో కొన్ని తమ ప్రదర్శనలో ప్రేక్షకులకు అర్థంకాకుండా ఉండేందుకు, ప్రదర్శనలో ఏదైనా తప్పు దొర్లినా, సమయానికి తోటి కళాకారున్ని అప్రమత్తం చేయడానికి కళాకారులు మరుగు భాష మాట్లాడుకుంటారు. వీరు ఉపయోగించే భాషాపదాల్లో చిత్రవిచిత్రమైన పదాలతో పాటు, కొన్ని సంస్కృత పదాలే ఉన్నప్పటికి వీరు ఉచ్చరించేటప్పుడు ఆ పదాల మూలాన్ని కాకుండా ఒక కొత్త రూపంలో పలుకుతారు. ఇది ఎవరికి అర్థం కాకుండానే ఉంటుంది.

తెలంగాణా సంస్కృతికే మకుటంగా నిలిచే జానపద ఆశ్రిత కళారూపాల సాహిత్యం ఎంతో ప్రాచీనమైనదిగా తెలుస్తున్నది. అంతేగాక విభిన్నమైన ప్రక్రియలతో, భిన్నమైన కథావస్తువుతో పోషక కులాలను ఆశ్రయిస్తూ మనుగడ సాగిస్తున్న కళారూపాలు వరంగల్ ప్రాంతంలోనే ఎక్కువగా ఉండటం ఈ ప్రాంత సంస్కృతీ ప్రాచీనత గొప్పతనమే. వీటి సాహిత్యంలో ఒక సమాజం లేదా ఒక కులం మనుగడకు కావల్సిన, ఆత్మస్థైర్యాన్ని, ఆత్మనూన్యతా భావాన్ని తొలగించేందుకు కావల్సిన పలు అంశాలు ఉన్నవి. అంతేగాక కులాల ఐక్యతకు దోహదం చేసేదిగా ఉంది. అలాగే వృత్తులకు కులాలకు గౌరవాన్ని కలిగించే విధంగా వీరి సాహిత్యం నిర్మింపబడింది. ఇటువంటి సాహిత్య విలువలు కలిగిన వీరి సాహిత్యాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ఎంతైన ఉన్నది. భవిష్యత్తు తరాలకు వీరి గొప్పదనాన్ని, వీరి సాహిత్యాన్ని భద్రపరచాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కొన్ని ఆశ్రిత కళారూపాలు కనుమరుగయ్యాయి. కొన్ని కనుమరుగయ్యే స్థితిలో ఉన్నవి.

నేటి ఆధునిక నాగరికత వ్యామోహంలో, ప్రపంచీకరణ నేపథ్యంలో, ప్రసార మాధ్యమాల ధాటిలో జానపద కళల ఠీవి కొడిగట్టింది. ఫలితంగా ఈ జానపదకళలు గాలికి కొట్టుకు పోతున్నాయి. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఈ జానపద కళల సంరక్షణ సంస్కృతి పరిరక్షణలో విస్మరించ రాని ఒక భాగం. ఈ బాధ్యతను విస్మరిస్తే ఒకనాటి సంస్కృతి ఆనవాళ్లు కాలగర్భంలో కలిసిపోతాయి. మనం వెనక్కితిరిగి చూసుకుంటే మనదైన సాంస్కృతిక వారసత్వంలో ఒక వెలితి కనిపిస్తుంది. ఈ కళల పరిరక్షణ ప్రజల, సమాజపు, ప్రభుత్వాల బాధ్యత.

ధరంసోత్ సరిత, హైదరాబాద్. ఫోన్: 630 042 8155.





ఇచ్ఛామతీ తీరాన...

– డా. నల్లపనేని విజయలక్ష్మి

విశ్వమంతా దాగి ఉన్న మాతృ హృదయాన్ని దర్శించాలన్నా, ప్రాపంచిక జీవితానికి దూరం జరగనవసరం లేకుండానే భగవంతునితో అనుసంధానాన్ని అనుగ్రహించ గల మంత్రోపదేశాన్ని ఇచ్ఛామతి తరంగాల అమృత సంగీత ధ్వని నుండి అందుకోవాలన్నా, ప్రతి జీవితమూ విలువైనదే, అవసరమైనదే అన్న ఎరుకను పొందాలన్నా తప్పక చదవవలసిన నవల **"ఇచ్ఛామతీ తీరాన"**.

విభూతి భూషణ్ బందోపాధ్యాయ బెంగాలీ భాషలో రచించిన 'ఇచ్ఛామతి' నవలకు అనువాదమిది. ఎన్నో నవలలు, సాహిత్య పుస్తకాలను తెలుగులోనికి అనువదించడం, "చూపు" పత్రికను నిర్వహించడం ద్వారా రచయిత్రిగా, అనువాదకురాలిగా, పత్రికా నిర్వాహకురాలిగా తెలుగు పాఠకులకు సుపరిచితురాలైన కాత్యాయని ఈ నవలను తెలుగులోనికి అనువదించారు. దీనికి ముందుగా ఆమె విభూతిభూషణ్ రచించిన "అపరాజితుడు", "చంద్రగిరి శిఖరం" నవలలను కూడా తెలుగులోనికి అనువదించారు. రచయితలోని తాత్వికతను, ప్రకృతి సౌందర్యారాధనను, వైవిధ్యభరితమైన మానవ వ్యక్తిత్వ చిత్రణను చక్కని భాషలో అద్భుతంగా ఆవిష్కరించిన కాత్యాయని గారి ప్రతిభ అభినందనీయం.

ప్రముఖ బెంగాలీ రచయిత విభూతిభూషణ్ 1894లో కలకత్తాకు ఉత్తరంగా వందమైళ్ల దూరంలో ఉన్న ముఱాటిపూర్ గ్రామంలో జన్మించాడు. 1922లో "అరణ్యక" నవలతో రచయితగా ప్రయాణం ప్రారంభించిన ఆయన 20 కథా సంకలనాలతో కలిపి యాభై వరకు పుస్తకాలు ప్రచురించాడు. ఆయన రచించిన "పథేర్ పాంచాలి" (Song of the little road), "అపరాజిత" నవలలను ఆధారం చేసుకొని సత్యజిత్ రే తీసిన మూడు సినిమాలు (పథేర్ పాంచాలి, అపరాజిత, అపూర్ సంసార్) ప్రపంచం దృష్టిని ఆకర్షించటమే కాక విమర్శకుల ప్రశంసలందుకున్నాయి.

'ఏ గుర్తింపూ లభించని నోరు లేని ప్రజల గాథలను ఈ దేశచరిత్రగా చూడాలే తప్ప రాజుల, చక్రవర్తుల విజయ గాథలను కానేకాదు' అని నమ్మిన విభూతిభూషణ్ 'ఇచ్ఛామతీ తీరాన' నవలలో వారి గాథలనే వినిపించాడు. భారతదేశాన్ని, ఈనాటి బంగ్లాదేశ్‌ను కలుపుతూ ప్రవహించే ఒక నది ఇచ్ఛామతి. ఆ నదీ తీరంలోని జెస్సోర్‌లో తన బాల్యాన్ని గడిపాడు విభూతిభూషణ్. ఇచ్ఛామతీ నదీ తీరంలోని చిన్న చిన్న గ్రామాల్లో ఏ గుర్తింపూ లేకుండా జీవించి, మరణించిన మానవుల సుఖదుఃఖాలనూ,తన బాల్యస్మృతుల్లో ముద్రించుకు పోయిన ఆ ప్రాంత ప్రకృతి సౌందర్యాన్నీ దృశ్యమానం చేసే ఒక రచనను చేసి దానికి 'ఇచ్ఛామతి' అనే పేరు పెట్టాలని కోరుకున్న ఆయన ఈ నవలతో తన కోరికను నిజం చేసుకున్నాడు. ఆయన రచించిన చివరి నవల ఇది. ఆయన మరణానంతరం ఈ నవలకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 1951లో రబీంద్ర పురస్కారాన్ని ప్రకటించింది.

తెల్ల దొరలు రైతులు ధాన్యం పండించుకునే వ్యవసాయ భూముల్లో బలవంతంగా నీలిపంట సాగు చేయించటం, దాని వల్ల తిండి గింజలు కరువై, నీలిపంటకు గిట్టుబాటు ధర అందక రైతులు ఆర్థికంగా చితికిపోవటం, చివరికి వారు తిరుగుబాటుచేయటం (ఇండిగో రివోల్ట్‌గా చరిత్రలో నమోదైన ఘట్టం) ప్రధాన అంశంగా తీసుకొని ఒక చిన్న గ్రామం నేపథ్యంగా అనామక ప్రజల గాథలను వినిపించడానికి పూనుకున్నాడు విభూతిభూషణ్.

స్థానికులు "నీలకుటి" అని పిలుచుకునే మొల్లాహాతీ నీలిమందు ప్లాంటేషన్, దానిలో పనిచేసే ఉద్యోగులు, వారితో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధమున్న వ్యక్తులు ఈ నవలలోని పాత్రలు. నీలకుటి సమీపంలోనే ఉన్న ఇచ్ఛామతీ నదీతీరంలోని పాంచ్‌పోతా గ్రామం ప్రధాన కథాస్థలి. ఈ నవలలోని కథలో నాలుగు పార్శ్వాలు సమానంగా సాగుతాయి. భవానీ కథ, నలూ పాల్ కథ, గయ కథ, రామ్ కనయ్ కథ – ఈ నాలుగూ సమాంతరంగా సాగడం వల్ల, ఈ నవలను ఒక పాత్రకు చెందిన జీవితకథగా చూడలేము. అయితే రచయితకు ప్రతినిధిగా గొప్ప తాత్వికచింతనను పాఠకులకు చేరవేయడం వల్ల భవానీ పాత్రను ప్రధానపాత్రగా భావించవచ్చు.

భవానీ బరూజీ యాభై సంవత్సరాల వయసు వరకు ప్రాపంచిక విషయాలతో పెద్దగా సంబంధం లేకుండా సన్యాస జీవితం గడిపినవాడు. పాంచ్‌పోతాలోని చంద్ర చటర్జీకి అల్లుని వరస. రెండు మూడు రోజులు మామ ఇంట

గడపడానికి వెళ్ళిన అతడు చంద్ర చటర్జీ ప్రోత్సాహంతో దీవాన్ రాజారామ్ ముగ్గురు చెల్లెళ్లనూ వివాహమాడాడు. ఆనాడు కులీన మహిళలకు సకాలంలో తగిన వరునితో వివాహం కావడం పెద్ద సమస్యగా ఉండేది. అందువల్లనే దివాన్ రాజారామ్ ధనవంతుడైనా తన చెల్లెళ్లకు వయసు మీరే వరకు వివాహం చేయలేకపోయాడు. కులీన మహిళలు అనుభవిస్తున్న బాధల ముందు తాను ఆశించిన వైయక్తిక ముక్తిమార్గం అల్పమైనదని భవానీ భావించడం వల్ల ఆ వయసులో అతడు వైవాహిక జీవితంలో ప్రవేశించాడు. దీనులూ, నిస్సహాయులూ అయిన మనుషులకు ఏ మాత్రం సాయపడగలిగినా చాలనుకున్నాడు. తనను నమ్మి తన జీవితంలోకి ప్రవేశించిన స్త్రీలకు ఉత్తముడైన భర్తగా ప్రవర్తించడమే తన జీవితానికి సార్థకతగా అతడు భావించాడు.

ఒక వ్యక్తి ఒకరి కంటె ఎక్కువమంది స్త్రీలను వివాహ మాడినపుడు ఎంత ప్రయత్నించినా అందరినీ సమానంగా ప్రేమించగలగడం సాధ్యం కాదన్న విషయం భవానీ పాత్ర ద్వారా స్పష్టమౌతుంది. అసంకల్పితంగానే అతడు తిలూను ప్రేమించాడు. తిలూలోని మానసిక పరిణతి, తన పట్ల చూపే ప్రత్యేకమైన శ్రద్ధ, ఆమె సౌందర్యం–ఏది అతడిని అంతగా ఆమెకు కట్టి పడేసిందో స్పష్టంగా చెప్పలేము. కాని ఆమెతో సమయం గడపడాన్ని, ఆమెకు తత్త్వశాస్త్రంతో సహా అనేక విషయాలు బోధించడానికి, ఆమెలో దేవతా స్వరూపాన్ని తిలకించి బ్రహ్మానందాన్ని పొందడానికి అతడు తపించిన విషయాన్ని రచయిత అనేక సందర్భాల్లో ప్రస్తావించాడు. అయితే దీని వల్ల నీలూ, బిలూలకు బాధ కలుగుతున్న విషయాన్ని భవానీ గుర్తించాడు. తనకు చేతనైనంతలో వారిని సంతోషపెట్టటానికి ప్రయత్నించాడు. కులీన కన్యలకు మేలు చేద్దామనే ఉద్దేశంతో తాను చేసుకున్న వివాహాలు వారికి సంతోషాన్ని మిగల్చలేక పోతున్నందుకు బాధపడ్డాడు కూడా.

బావమరిది రాజారామ్ మరణించాక అతడి ఆస్తి కంతటికీ తన కొడుకే వారసుడైనా, ఆ ఆస్తిని స్వీకరించడానికి భవానీ ఇష్టపడలేదు. తన కొడుకుకు దురాశ ఉండకూడదని, అతడు ధర్మానికి, సత్యానికి కట్టుబడి నిరాడంబరంగా పెరగాలని కోరుకున్నాడు.

సంసారిగా మారినప్పటికీ భవానీ తన ఆధ్యాత్మిక, తాత్త్విక చింతనకు దూరం కాలేదు. విశ్వాంతరాళమంతటా దాగి ఉన్న మాతృహృదయాన్ని, అన్ని జీవులలోనూ నెలవై ఉన్న భగవంతుని అతడు దర్శించగలిగాడు. తన బిడ్డలోనూ, అతడి స్వచ్ఛమైన చిరునవ్వులోనూ, అమాయకత్వం నిండిన వచ్చీరాని మాటల్లోనూ అతడు దివ్యత్వాన్ని దర్శించాడు. ఆ బాలుడి ప్రేమను పొందటమూ, తిరిగి వాడిని ప్రేమించటమూ అనే చర్యలు భగవంతునితో అనుసంధానం వంటివేనని భావించాడు.

"ప్రతి వ్యక్తీ తనకు స్వభావసిద్ధమైన మార్గం గుండా పయనించి ఫలసిద్ధిని పొందటానికి అవకాశమున్నది. ఈ ప్రయత్నంలోనున్న మనల్ని ఆ మహాశక్తి ప్రేమతో తల్లిదండ్రుల వలె కాపాడుతూనే ఉంటుంది." అంటూ కర్మ మార్గం పట్ల ఆదరణ కనబరిచాడు. భగవంతుడు రాతి కట్టడాల్లో ఉండడు అని చెప్పడమే కాకుండా, "మన చుట్టూ ఆవరించిన ప్రకృతిని మనం ప్రేమించాలి. ప్రకృతి లయతో లీనమై, దానిలోని ప్రతి అంశాన్నీ ప్రేమించగలిగితే, ఆ ప్రకృతి మన కొక గొప్ప శక్తిని అందించి, అంతరికమైన దివ్యలోకాలకు తీసుకువెళు తుంది" అంటూ బ్రహ్మానందాన్ని పొందగలిగే మార్గాన్ని ఉపదేశించాడు. ఆనందమన్నది ఆంతరికమైనదే తప్ప బాహ్య జీవితంలో లభించేది కాదు అని స్పష్టం చేశాడు.

రచయిత ఆధ్యాత్మిక, తాత్త్విక భావజాలాన్ని పాఠకులకు చేరవేయడానికి ఈ పాత్ర ఒక వాహకంగా ఉపయోగపడింది.

రామ్‌కనయ్ చార్‌పరా గ్రామవాసి. ఆయుర్వేద వైద్యుడు. నిరుపేద బ్రాహ్మణుడు. ధర్మం తప్పి నడిస్తే భగవంతునికి సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని నమ్మినవాడు. ఛోటా సాహెబ్, దివాను ఎంతగా నిర్బంధించినా, హింసించినా అతడు దొంగసాక్ష్యం చెప్పడానికి ఒప్పుకోలేదు. ప్రతి నెలా పది రూపాయల జీతంతో కూడిన నీలకుటి ఆస్థాన వైద్య పదవి గాని, మరో పది రూపాయల జీతం పెంపు గురించిన ప్రలోభం గాని అతడిని లొంగదీసుకోలేక పోయాయి. దాదాపు ఏడాది పాటు తనకు తిండి గింజలు కూడా పుట్టనివ్వకుండా దివాను ఇబ్బంది పెట్టినా అతడు ధర్మం తప్పలేదు. దివాను వల్ల అంతగా ఇబ్బంది పడినా అదేమీ మనసులో పెట్టుకోకుండా అతడి చెల్లెలు కొడుకుకు వైద్యం చేశాడు. దివాను మీద దాడి జరగబోతుందని తెలిసి అతడిని కాపాడడానికి ప్రయత్నించాడు. భవానీ ద్వారా భగవంతుని తత్త్వం తెలుసు కోవాలని ప్రయత్నించాడు.

నలూ పాల్ దైవభక్తి, బ్రాహ్మణుల పట్ల గౌరవం కలిగిన వాడు. సంతకు వెళ్లి తమలపాకులు, వక్కలు అమ్ముకోవడంతో వ్యాపారం ప్రారంభించాడు. అతడి తెలివితేటలకు పెరిగిన

రవాణా సౌకర్యాల వల్ల నగరాలతో ఏర్పడిన అనుసంధానం తోడవడంతో వ్యాపారం మూడు పూవులు, ఆరు కాయలుగా వర్ధిల్లింది. గొప్ప ధనవంతుడయ్యాడు. అయినా గర్వాన్ని తలకెక్కించుకోలేదు. మొల్లాహోతి జమిందారీ సొంతమైన తరువాత కూడా అతడు తన వేషభాషలను కాని, తన జీవన విధానాన్ని గాని మార్చుకోలేదు. భార్య ఏ మంచి పని తల పెట్టినా అడ్డు చెప్పని మంచి మనసు అతడి సొంతం.

ఈ నవలలోని ప్రతి పాత్రా దాని కదే ప్రత్యేకమైనది. ఆయా పాత్రలు జీవితంలో వాటికి ఎదురైన పరిస్థితులకు స్పందించే తీరును అత్యంత సహజంగా ఎటువంటి వ్యాఖ్యానం చేయకుండా రచయిత మన ముందుంచాడు. రచయిత భవానీ బరూజీ ద్వారా పలికించినట్టు ప్రతి జీవితమూ విలువైనదే. భవానీ ద్వారా రచయిత తాత్వికత వెల్లడైనప్పటికీ ఆయుర్వేద వైద్యుడు రామ్ కనయ్, గయా మేమ్‌ల పాత్రలు శిఖరాయమానమైన వ్యక్తిత్వాలతో భవానీని కూడా దాటేస్తాయి. ఆ పాత్రల జీవితాల్లో ఎదురైన పరీక్షలు, వారు అనుభవించిన మానసిక సంఘర్షణ భవానీ జీవితంలో లేవు. ప్రతికూల పరిస్థితుల్లోనూ విలువలను కోల్పోని దృఢమైన వ్యక్తిత్వం ఆ పాత్రల సొంతం. కుటుంబానికి ప్రేమపాత్రునిగా ఉన్న రాజారామ్ ఒక అధికారిగా పేద రైతుల పట్ల చూపిన కర్కశత్వం, రైతులను దోచుకున్న ప్రసన్న చక్రవర్తి తన జీవితంలోని ప్రేమ రాహిత్యం వల్ల పొందిన వేదన, ఎన్నో భయంకరమైన దోపిడీలు, హత్యలు చేసిన హలా పెకీలో మానవత్వపు కోణం, సున్నితమైన స్పందనలు, సామాజిక నియమాలను తోసిరాజన్న నిస్తారిణి లోని ప్రపంచాన్ని ధిక్కరించే శక్తి స్వరూపం–వీటిని చూపడం ద్వారా రచయిత మంచి–చెడుల విభజనకు లొంగని వైవిధ్య భరితమైన వ్యక్తిత్వాలను దర్శింపజేశాడు. సున్నితమైన మానవ సంబంధాలకు సంబంధించిన అతి సూక్ష్మమైన అంశాలను సైతం భిన్న కోణాల నుండి దర్శింపచేయడంలో ఆయనకు గల నేర్పు ఈ నవలలోనూ స్పష్టంగా కనిపిస్తుంది.

విభూతిభూషణ్‌కు స్త్రీల పట్ల గల గౌరవం ఈ నవలలో చక్కగా స్పష్టమౌతుంది. తిలూ, తులసి, గయ, నిస్తారిణి మొదలైన పాత్రలను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దాడు.

గొప్ప సౌందర్యం, అంతకు మించిన బలం, అవసర మైనపుడు ప్రాణాలకు తెగించే సాహసం, కార్యనిర్వహణా సామర్థ్యం, శ్రమించే తత్వం, చక్కని మానసిక పరిణతి మూర్తీభవించిన మహిళ తిలూ. ఆమెకు కత్తి – డాలు ప్రయోగించడంలో, కర్రసాములో నైపుణ్యం ఉంది. నీలకుటిలో బాగా పేరున్న లాఠీయాల్ అయిన అక్బర్‌అలీ ఒక్కసారి కూడా తిలూని ఎదుర్కోలేకపోయాడు. ఈతలోనూ ఆమెకు మంచి నైపుణ్యం ఉంది. భవానీతో కలసి ఈతకు వెళ్లినపుడు అతడు నది అడుగున ముళ్లకంపలో చిక్కుకున్నాడు. తనను మొసలి పట్టుకుందని భావించి ఆమెను అక్కడ నుండి పారిపోయి ప్రాణాలు కాపాడుకొమ్మని చెప్పాడు. ఆ సమయంలో తిలూ చూపిన తెగువ గొప్పది. భర్తను రక్షించుకోవడమో, మొసలికి ఆహారం కావడమో తేల్చుకోవాలనుకున్నది. గొప్ప స్థైర్యంతో దగ్గరకు వెళ్లి చూసి అతడిని ఆ ముళ్లకంప నుండి విడిపించింది. సగం స్పృహతప్పిన స్థితిలో ఉన్న భర్తకు ధైర్యం చెబుతూ తన శక్తి నంతా కూడగట్టుకొని ఒడ్డుకు చేర్చింది. అంత శక్తివంతురాలూ భర్తకు ఏమైనా జరిగి ఉంటే ఏమయ్యేది... అనే ఊహకే గజగజా వణికిపోవటం గమనించినపుడు తిలూ భర్తను ఎంతగా ప్రేమించిందో అర్థమౌతుంది. భర్తతో పాటు ఉపనిషత్తులను అధ్యయనం చేసి అతడి తాత్విక చింతనలోనూ సహధర్మచారిణిగా, భర్తకు ప్రియమైన భార్యగా నిలిచింది.

గొప్ప ధనవంతులైన తరువాత కూడా వినయాన్ని కలిగి తోటివారికి చేతనైనంత సాయాన్ని చేసిన మహిళ తులసి. ఆడపడుచును, ఆమె కుటుంబాన్ని ఆదరించడమే కాక ఆమె స్పర్ధను భరించిన సహనశీలి. గృహకృత్యాలకు బందీ అయిన జీవితంలోని ప్రేమరాహిత్యాన్ని భరించలేక అక్రమ సంబంధాల వైపు మొగ్గు చూపిన యువతి నిస్తారిణి. గ్రామంలోని ఇతరుల్లో కనబడే సంకుచితత్వం, మూఢ విశ్వాసాలు, పిరికితనం, అజ్ఞానం వంటి దుర్లక్షణాలు లేని సాహస యువతిగా ఆమెను దర్శింపజేస్తాడు రచయిత. అక్కను ప్రేమించినంతగా భర్త తమను ప్రేమించడం లేదని గ్రహించి బాధపడినా, ఆ బాధ వల్ల కుటుంబంలో పొరపొచ్చాలు రాకుండా సర్దుకు పోయిన గృహిణులు నీలూ, బిలూ. ఆడపడుచులకు తగిన వరుడు గ్రామంలో ఉన్నాడని వినగానే ఆ విషయం భర్తకు తెలిపి, వారి వివాహం జరిగేలా చూడడమే కాకుండా, ఆ కుటుంబాన్ని ఎంతగానో ఆదరించిన మహిళ జగదంబ.

తెల్లని ఛాయ, అందమైన పెద్ద కళ్లతో కళకళలాడే ముఖంతో ఆకర్షణీయమైన రూపం గలది. ఆమెను బుర్రా సాహెబ్ షిప్టన్ చేరదీయడంతో మొల్లాహోతీ వ్యవసాయ భూముల్లో పనిచేసే ప్రతి రైతూ దొరసాని వలె గౌరవించేవాడు.

తన వద్ద ఉన్న డబ్బు, వస్త్రాలు, ఆహారపదార్థాలు అవసరంలో ఉన్నవారికి ఇచ్చేయ్యడానికి క్షణం కూడా సందేహించని ఉదాత్తురాలు. ఆమె పట్టించుకొని సాయం చేయడం వల్లనే రామ్‌కనయ్ బతికి బట్ట కట్టగలిగాడు. ఆమెను వలలో వేసుకోవడానికి ఎంతోమంది ప్రయత్నించారు. దృఢచిత్తంతో వారిని తిరస్కరించింది. బుర్రాసాహెబ్ మరణించిన తరువాత ఒకప్పుడు తన చుట్టూ తిరిగిన సొంత కులం వాళ్ళు కూడా ఆమెను వెలివేయడంతో ఎన్నో ఇబ్బందులు పడింది. అయినా స్థైర్యాన్ని కోల్పోలేదు. తన పట్ల అభిమానాన్ని కనబరచిన ప్రసన్న చక్రవర్తితో జీవితం పంచుకోవాలని ఆశ పడింది.

కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం దోపిడీ దొంగల మీదకు బల్లెంతో దాడికి దిగిన సాహస యువతి గురించి, ప్రతి ఏడాదీ రెండు వందలమంది యాత్రికులతో యాత్రలను నిర్వహిస్తున్న కుముదినీ జెలీ గురించి రచయిత ప్రస్తావించడం స్త్రీలు ఎంతటి సాహసులో, కార్యనిర్వహణా సమర్థులో తెలియ జేయడం కోసమే.

"భవిష్యత్ జీవన సంగీతంలోని స్వరాల వంటి ఈ మహిళలు ముందు తరం ప్రతినిధులు. అరికాళ్ళకు అరుణ వర్ణపు లత్తుకను అలంకరించుకొని – ఉత్తి పాదాలతో నడిచి వెళ్తున్న వారి అడుగుల మృదు ధ్వనుల తరంగాలను వినగలిగినవారు ఏ కొద్దిమందో!" అంటారాయన.

రచయిత అనేక సామాజిక పరిణామాలను ఈ నవలలో రికార్డ్ చేశాడు. ఇండిగో రివోల్ట్‌కు దారితీసిన పరిస్థితులను, సర్ విలియం గ్రే నివేదిక వల్ల అనేక నీలిమందు ప్లాంటేషన్‌లు రద్దయిన తీరును, జర్మనీ నుండి దిగుమతి అయిన నకిలీ నీలిమందు తక్కువ ధరకే దొరకడం వల్ల మిగిలి ఉన్న ప్లాంటేషన్లు సైతం మూతపడటాన్ని రచయిత ప్రస్తావించాడు. నగరాల్లో కిరోసిన్ దీపాలు వాడకంలోకి రావడం గురించి, అప్పుడప్పుడే అందుబాటులోకి వస్తున్న రైళ్లు, మోటారు బోట్లు, పిండి మిషన్ల గురించి ఆయన వివరించాడు. అప్పటివరకూ డబ్బులా చెలామణి అయిన గవ్వలు విలువను కోల్పోవడం, వాటి స్థానాన్ని రాగి నాణాలు ఆక్రమించడం, అప్పటివరకూ ఆంగ్లానికి దూరంగా ఉన్న గ్రామీణులు తమ పిల్లలను ఆంగ్లంలో చదివించాలని, వారు పట్టణంలో ఉద్యోగం చేస్తుంటే చూడాలని కోరుకోవడం వంటి మార్పులను కూడా రచయిత రికార్డ్ చేశాడు.



అసలు సిసలు జీవితాలకు అద్భుతమైన ముగింపు లేవీ ఉండవు. అవి అలా అలా సాగిపోయి అనంత విశ్వంలో అదృశ్యమవుతాయి. అచ్చంగా ఒక నదీ ప్రవాహం సాగిపోయి సముద్రంలో లీనమైనట్టుగా. అందుకే రచయిత నవలకు స్పష్టమైన ముగింపును ఇవ్వలేదు. వైవిధ్యభరితమైన జీవితా లను, వ్యక్తిత్వాలను, వ్యక్తుల బహిరంతర సంఘర్షణలను చిత్రించడం, వాటి గురించి పాఠకులను ఆలోచించేలా చేయడం రచయిత లక్ష్యం.

రాజులు, చక్రవర్తుల గాథలు మనకు వారి రాజ్యవిస్తరణ కాంక్షను, కీర్తి కాంక్షను, భోగాసక్తిని వెల్లడిస్తాయి. సామాన్యుల గాథలు అలా కాదు. అవి అత్యంత సంకట పరిస్థితులలోనూ జీవితాశను విడనాడకుండా పోరాడటమెలాగో మనకు నేర్పిస్తాయి. సత్యాచరణ మార్గాన్ని మనకు చూపుతాయి. ఉన్నత విలువ లతో కూడిన ఆలోచనలను మనలో నింపుతాయి. అందుకే రచయిత అతిసామాన్యుల గాథలను, కాదు కాదు వ్యక్తిత్వంలో అసామాన్యుల గాథలను మనకు వినిపించాడు. అదే సమయంలో చెట్లు, పుట్టలు, సమస్త జీవరాశుల పట్ల అభేదాన్ని దర్శించి, ఆనందాన్ని అందుకోగలిగే అద్భుత మంత్రాన్ని ఉపదేశించి సహృదయ పాఠకులకు సంకుచిత బంధనాల నుండి విముక్తినీ ప్రసాదించాడు.

డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి
తెలుగు అధ్యాపకురాలు, గుంటూరు
సెల్ నెం : 9701667350



నీటి రంగుల చిత్రం

జార్జియా ఓ కీఫ్

వాటర్ కలర్ పెయింటర్!

(George O' Keeffe) (1887-1986)

– టి. వి. ప్రసాద్

ఆధునిక చిత్రకళలో ప్రముఖంగా చెప్పుకోదగిన అమెరికా పెయింటరు. ప్రకృతి సహజ రూపాలను రంగుల్లో పెద్దవిగా చూపించడంలో–ముఖ్యంగా పూలు, ఎముకలు, ఆకృతి దృశ్యాలను చిత్రించిన ఉత్తర మెక్సికోలోని ఏకైక పెయింటర్, న్యూయార్క్ ఆకాశ హర్మ్యాలను, వాస్తుకళను పెయింటింగులలో చూపించిన ప్రతిభాశాలి, జార్జియా ఓ కీఫ్.

జార్జియా ఓ కీఫ్ విస్కాన్‌సిన్‌లోని సన్ ప్రయరీ వద్ద 1887లో జన్మించింది. తల్లిదండ్రులు ఏడుగురి సంతానంలో రెండవది. 1905 నాటికి హైస్కూలు విద్య పూర్తి చేసుకున్న తర్వాత షికాగో న్యూయార్క్‌ల్లోని ఆర్టుస్కూళ్ళలో సాంప్రదాయ చిత్రకళను అభ్యసించింది. ఆర్టిస్టుగా బ్రతకాలని అంతకు ముందే నిర్ణయించుకుని చిత్రకళలోని మెళకువలను ఆకళింపు చేసుకుంటుంది. ఆర్థర్ వెస్లీడోవ్ విప్లవాత్మకభావాలు ఆమెలో అనుకోని మార్పుకు కారణమవుతాయి. చిత్రకళలో సాంప్రదాయ పద్ధతికి, భావాలకు ప్రత్యామ్నాయం ఆలోచించడాన్ని ప్రోత్సహిస్తాడు. ఆ ప్రభావంతో నైరూప్య చిత్రకళలో రెండు సంవత్సరాలు ప్రయోగాల చేసింది. కొంతకాలం వ్యాపార చిత్రాలు కూడా వేసింది. వర్జీనియా, టెక్సాస్ ఆర్ట్ స్కూళ్ళలో చిత్రకళను బోధించింది. ఆ సమయంలో వాటర్ కలర్ చిత్రాలు, చార్‌కోల్ చిత్రాల్లో తన భావాలను నూతన శైలిలో ప్రదర్శించే మార్గాన్ని వెదుక్కుంది. ఆల్ఫ్రెడ్ స్టెయిగ్లిజ్జి ఫోటో గ్రాఫర్, చిత్రకళావ్యాపారి 1917లో జార్జియా ఓ కీఫ్ చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తాడు. అతని కోరిక మేరకు ఆమె 1918లో న్యూయార్క్ చేరుకుని చిత్రకళా జీవితాన్ని ప్రారంభిస్తుంది. అతని సహకారంతోనే ఆమె కళాప్రతిభ పూర్తిస్థాయిలో వికసిస్తుంది. రెండు సంవత్సరాల్లోనే కీఫ్ అమెరికాలో విజయవంతమైన ఆర్టిస్టుగా పేరు తెచ్చుకుంటుంది. వృత్తిపరమైన సంబంధంతో మొదలైన వారి పరిచయం క్రమంగా వ్యక్తిగత సాన్నిహిత్యానికి, పెండ్లికి దారితీస్తుంది. అప్పటికే వివాహితుడైన స్టెయిగ్లిజ్జి భార్యనుండి విడాకులు తీసుకున్న తర్వాత 1924లో వారి వివాహంజరుగుతుంది. అమెరికా ఆధునికతకు సంకేతాలుగా నిలిచే ఆకాశహర్మ్యాలే కాక పూవుల పెయింటింగులూ వేసింది.

1929 ఓకీఫ్ నైరూప్య కళారూపాలను, పువ్వులలోని సూక్ష్మాంశాలను దగ్గరి నుండి చూసి వాటిని పెద్దవిగా చిత్రించింది. భూతద్దంలో పరిశీలించినంత వివరంగా పువ్వుల సహజ రూపాలను, రేకులను, ముడతలను చాలా దగ్గరగా, చాలా పెద్దవిగా చూచింది. ఆధునిక సాంకేతికతతో ప్రకృతి సోయగాలను పువ్వుల్లో చూపించడంలో కృతాకృత్య రాలైంది. 1928లో టైం పత్రిక కీఫ్ పువ్వులను చిత్రించడంలో చూపిన ప్రతిభను ప్రత్యేకంగా కొనియాడింది.

ఉత్తర అమెరికా పర్యటనలో అక్కడి ప్రకృతి దృశ్యాలు, అమెరికా హిస్పియానో సంస్కృతులు కలిగించిన ఉత్తేజం చిత్రకళలో కొత్తపుంతలు తొక్కడానికి దోహదం చేస్తుంది. రెండు దశాబ్దాల పాటు న్యూమెక్సికోలో వేసవి శలవులు గడుపుతూ లాండు స్కేపులు, జంతు కళేబరాలు, ఎముకలు, కొమ్ములు మొదలైన బొమ్మలు వేస్తూ గడిపింది. భర్త చనిపోయిన తర్వాత, 1949 నాటికి మెక్సికోనే ఆమె నివాసంగా మారిపోయింది.

అమెరికా మోడర్నిస్టులు స్థానిక దృశ్యాలకు ప్రాధాన్యత నిస్తూ జాతీయ భావాలను ప్రదర్శించడంలో ప్రత్యేకతను చూపిస్తారు. కీఫ్ అంతర్జాతీయ పర్యటనలో తనను ఆకర్షించిన అద్భుతమైన దృశ్యాలను, ప్రదేశాలను స్కెచ్‌లను, కొన్ని పెయింటింగులు వేసింది. పరూ పర్వత శిఖరాలు, జపాన్ ఫ్యూజీ పర్వతాల మబ్బులు, మేఘాల విహంగ వీక్షణ దృశ్యాలను పెయింట్ చేసింది. 1972 నాటికి కంటిచూపు మందగించినా ఎవరి సహాయంలేకుండా పెయింటింగులు వేస్తూనే వుంది. ఐనా వాటిని సృజించడంలో లోటు కన్పించదు. 90 ఏండ్ల వయసులో, 'నేను ఏమి చిత్రించదలచుకున్నానో అది నాకు బాగా కన్పిస్తుంది, ఇంకా సృజించవలసినవి చాలా వున్నాయి అని చెప్పుకుంది.

జీవితపు చివరిదశలో దాదాపు చూపు కోల్పోయిన స్థితిలో కూడా సహాయకులతో పెయింటింగు కొనసాగించింది. వాటిలో తన అభిమానపాత్రమైన విషయాలను, రూపాలను జ్ఞాపకాలను పొందుపరచింది. అమెరికా జాతీయస్థాయి పెయింటర్‌గా కీర్తి నార్జించిన కీఫ్ శాంతాఫే లో 89 సంవత్సరాల వయసులో

మరణించింది. ఇటీవలి కాలంలో కీఫ్ చిత్రాల పట్ల విదేశాల్లో మోజు పెరిగిపోయింది. జార్జియా ఓ కీఫ్ మ్యూజియంలో 150 వరకు ఆమె పెయింటింగులు, వందల కొలది పెన్సిల్, చార్‌కోల్ చిత్రాలు, స్కెచ్‌లు, ఆమె సేకరించిన వస్తు సముదాయం, తనకూ, తన కాలానికి చెందిన ముఖ్యమైన ఫోటోలు, డాక్యుమెంట్లు పదిల పరచబడి వున్నాయి.

ఫెమినిస్టులు – ఓ కీఫ్‌ను ఫిమేల్ ఐకాన్‌గా గుర్తించినా, కీఫ్ స్త్రీ కళా వుద్యమంలో పాలుపంచుకోవడానికి గానీ, ఇతర మహిళా వుద్యమాలకు సహకరించడానికి కానీ యిష్టపడలేదు. తనను ఆర్టిస్టుగా కాకుండా మహిళా ఆర్టిస్టుగా గుర్తించడాన్ని నిరశించింది. కేవలం ఆర్టిస్టుగా పిలిపించుకోవడానికి యిష్టపడింది.

కీఫ్ పొందిన అవార్డులు: 1938లో ఫైన్ ఆర్ట్స్‌లో గౌరవ డాక్టర్ అవార్డు, అమెరికా కళాసాహిత్య అకాడమీ సభ్యత్వానికి ఎంపిక, 1966లో అమెరికా ఆర్ట్స్, సైన్స్ అకాడమీ ఫెలోగా, కారీథామస్ అవార్డు; 1971లో హార్వర్డ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేటు, 1977లో ప్రెసిడెంట్ జెరాల్డ్ ఫోర్డు చేతుల మీదుగా ఫ్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్, 1985 ప్రెసిడెంట్ రోనాల్డ్ రీగన్ ద్వారా నేషనల్ మోడల్ ఆఫ్ ఆర్ట్స్, నేషనల్ వుమన్స్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకుంది.

1996 యు.ఎస్. పోస్టల్ సర్వీస్ 32 సెంట్ల స్టాంపు, 2013 లో శతజయంతి సందర్భంగా 'ఆర్మరీ స్టాంపు', విడుదల చేయగా, అంతకుముందు 2009లో అమెరికన్ టివి కీఫ్ బయోపిక్ నిర్మించింది. జిమ్‌సన్ వీడ్ పేరిట చిత్రించిన ఉమ్మెత్తపువ్వు లాంటి పువ్వును 1936లో పెయింట్ చేసిన 180 × 212 సెం.మీ. కాన్వాసు ఆయిల్ పెయింటింగు 2014 సథ్ బీ వేలంలో 44.4 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయి రికార్డు సృష్టించింది. 1920లో మొదలైన ఆమె పెయింటింగు ప్రస్థానం 1950ల వరకు కొనసాగింది. 200 పువ్వులని, 2000ల పెయింటింగులని చిత్రించింది.

సింబాలిజం : బ్లాక్ ఐరిస్, రెడ్ కేనా పువ్వులు స్త్రీ జననాంగాలకు ప్రతీకలుగా కన్పిస్తాయి. విమర్శకులు కీఫ్ పుష్పాల పెయింటింగులన్నీ మర్మాంగాలకు ప్రతీకలని నిరాకరించారు. అలాగే ఫెమినా చిత్రకారులు కూడా కీఫ్ పుష్పాల్లో స్త్రీలైంగిక అవయవ నిర్మాణాన్ని ప్రముఖంగా చూపించిందని భావిస్తారు. కీఫ్ మాత్రం తను ఆ వుద్దేశంలో చిత్రించలేదనీ, వాటిని లైంగిక ప్రతీకలుగా భావించడంతో తన పెయింటింగుల ప్రాధాన్యత తగ్గిపోతుందని అంటుంది. భర్త కీఫ్ చిత్రాలకు సెక్స్ కొటేషన్లు జోడించి వాటిని పచ్చి శృంగార చిత్రాలుగా చెప్పుకుని వ్యాపారం చేసేవాడు. కళాత్మక ప్రముఖురాలిగా స్ఫూర్తిదాయక వ్యక్తిగా అందరి హృదయాల్లో నిలుస్తుంది. "గొప్ప మహిళా పెయింటర్‌గా ముద్రవేసి నన్ను తక్కువ చేశారు. నేను ఉత్తమ శ్రేణి పెయింటర్లలోనే వుంటాను" అని చెప్పుకున్న కీఫ్ నూతన శైలిలో విజయవంతమైన పెయింటర్‌గా, గుర్తింపు పొందింది.

నీటిరంగుల్లో పూల పెయింటింగులు : తాను పూలలో ఏయే రంగులను చూసిందో వాటిని యధాతథంగా చూపించడానికి కీఫ్ వాటర్ కలర్స్‌ను ఎన్నుకుంది ఇతరులు ఆమె చిత్రాల్లో శృంగార భావాల్ని ఇంద్రియ లోలత్వాన్ని చూడడాన్ని, వాటిని స్త్రీ మర్మాంగాలతో పోల్చడాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం అంటుంది. "నా చిత్రాలను సుదీర్ఘంగా పరిశీలించిన తర్వాత మీమీ భావాలను నా చిత్రకళకు ఆపాదిస్తారు. అది మీ దృక్పథం, ఆలోచనల ఫలితం, గాఢమైన ఎరుపు, పసుపు, ఆరెంజి రంగులు దానికి కారణమై వుండొచ్చు" అని వ్యాఖ్యానించింది.

జార్జియా ఓ కీఫ్‌ను గురించిన మరికొన్ని విశేషాలు

- రెడ్‌కేనా – వికసించిన పూలు $19^{3}/_{9}$ × 13" పేపర్ మీద చిత్రించిన వాటర్ కలర్ పెయింటింగు.
- అమెరికా మాడర్న్ 'ఐకాన్', 'మదర్ ఆఫ్ మోడర్నిజం' అని పేరు పొందింది.
- ప్రకృతి దృశ్యాలన్నా, ప్రకృతి అన్నా ఎంతో యిష్టం. పువ్వుల క్లోజప్ చిత్రాలు పెయింటు చేసింది.
- ప్రకృతిలోని ఏ ఋతువైనా చిత్రించగల ప్రతిభ ఆమె సొంతం.
- భర్త ఆల్ఫ్రెడ్ ఆమె కన్నా వయసులో చాలా పెద్దవాడు. (అతని వయసు 52. ఆమె వయసు 28).
- స్టిల్ లైఫ్ చిత్రాలు కీఫ్‌కు బాగా పేరు తెచ్చాయి. విమర్శకుల దృష్టిలో అవి స్త్రీ మర్మాంగాలు లేదా వాటి ప్రతీకలు.
- చిత్రలేఖనంలో ప్రయోగాలు ఏనాడూ ఆపలేదు.
- ఆమె అభిమాన పాత్రమైన అంశం టేబిల్ మౌంటెయిన్ 28 పెయింటింగుల్లో కన్పిస్తుంది.
- న్యూయార్క్ పురుషాధిక్య కళా ప్రపంచంలో పోటీని తట్టుకొని నిలిచింది, గెలిచింది.
- వాటర్ కలర్సులో పెయింట్ చేసిన అదికొద్దిమంది పెయింటర్లలో ప్రముఖురాలిగా గుర్తింపు పొందింది.
- కీఫ్ ఇతరులతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు (1915 – 1933) 700 పేజీల పుస్తకంగా వెలువడింది.
- 1972 నాటికి పూర్తిగా అంధురాలై పోయింది.
- అమెరికన్ ఫ్యాషన్ మాగజైన్ వోగ్ (Vogu) 1945లో జార్జియా ఓ కీఫ్ మీద ప్రత్యేక వ్యాసం ఫోటోతో సహా ప్రచురించి గౌరవించింది.

టి. వి. ప్రసాద్, సెల్ నెం : 7981398250

తమిళ సాహిత్య సేవ చేసిన కె.ఎ. వెంకట రామయ్య

– పి.ఎస్. గోపాల కృష్ణ

తెలుగువారై పుట్టినా తెలుగులోకాక తక్కిన భాషలలో సాహిత్య కృషి చేసినవారు ఎందరో. అటువంటి వారిలో ఒకరు తెలుగువారై పుట్టి తమిళభాషలో విశేషకృషి చేసిన కారంబాకం మంత్రవాది వెంకటరామయ్య గారు. ఆయన తల్లిదండ్రులు వెంకట సుబ్బమ్మ, కృష్ణయ్య గార్లు. మద్రాసు పోరూరు సమీపంలోని కారంబాకం అనే ఊళ్లో ఉండేవారు. వెంకట రామయ్య గారికి ముగ్గురు అక్కలు. ఇద్దరు తమ్ముళ్లు. 1911 ఏప్రిల్ 4 నాడు పుట్టిన వెంకట రామయ్యగారికి పదమూడవ ఏటనే అన్నపూర్ణగారితో పెళ్లి జరిగింది.

వెంకట రామయ్యగారి విద్యాభ్యాసం మద్రాసు సమీపంలోని పూందమల్లి ప్రభుత్వ పాఠశాలలో మొదలయింది. మద్రాసు లయోలా కళాశాలలో ఆర్థికశాస్త్రం ప్రధానాంశంగా బి.ఏ. చదివారు. తెలుగులో ప్రాథమిక విద్యాభ్యాసం జరిగిన తమిళంలో ఆసక్తి పెరిగి–తమిళ పుస్తకాలు విరివిగా చదవడం మొదలుపెట్టారు. ఆ ఆసక్తి ప్రాచీన రచనల పట్ల కూడా ప్రసరించడంతో ప్రాచీన తమిళ రచనలు రెండింటిని కొనితెచ్చుకోవడం కోసం 'తమిళం తాత' (తమిళ్ తాత్తా)గా ప్రసిద్ధులయిన ఉ.వే. స్వామినాథ అయ్యర్ గారి ఇంటికి వెళ్లారు. ఆయన – వెంకట రామయ్యగారి చదువు గురించి ప్రశ్నించి తమిళ సాహిత్యంలో విశేష కృషి చేయడానికి ప్రయత్నించమన్నారు. స్వామినాథ అయ్యర్ గారి ప్రేరణతో వెంకట రామయ్యగారు తమిళసాహిత్యం ప్రధానంశంగా మొదట బి.ఒ.ఎల్ (ఔచిలర్ ఆఫ్ ఓరియంటల్ లెర్నింగ్) పట్టా, ఆ తర్వాత ఎం.ఏ పట్టా సాధించారు. ఆ తర్వాత వెంకట రామయ్యగారు చెంగల్పట్టు లోని సెయింట్ కొలంబా ఉన్నత పాఠశాలలో తమిళ ఉపాధ్యాయులుగా ఉద్యోగం జీవితం మొదలుపెట్టారు. దాంతోబాటు సాహిత్య సభలలో పాల్గొని ఉపన్యాసాలు చేసేవారు. అట్లా ఒకసారి ఆయన పక్షితీర్థంలో ఒక సభలో తమిళ శైవ సాహిత్యానికి సంబంధించిన విషయం గురించి ఉపన్యసించారు. ఆ ఉపన్యాసం, ఆ సభా ప్రాంగణం వైపు కారులో ప్రయాణం చేస్తున్న కాశీవాసి శ్రీ అరుణంది తంబిరాన్ స్వామివారిని ఆకర్షించడంతో ఆయన ఆ ఉపన్యాసాన్ని కారు ఆపి విన్నారు. శ్రీ అరుణంది తంబిరాన్ స్వామి తమిళనాడులోని తంజావూరు జిల్లాలోని తిరుప్పనందాళ్ లోని శ్రీకాశీమఠం అధిపతి. ఆయనకు తమిళ భాష పట్లా, శైవ సిద్ధాంతం పట్లా భక్తిశ్రద్ధలు ఎక్కువ. ఆయన వెంకట రామయ్య గారిని తమ మఠం తిరుప్పనందాళ్‌లో నిర్వహిస్తున్న స్వామినాథ స్వామివారి తమిళ కళాశాల (స్వామినాథస్వామిగళ్ సెందమళ్, కల్లూరి) ప్రిన్సిపల్‌గా పని చేయడానికి ఆహ్వానించారు. అట్లా 1945 లో తిరుప్పనందాళ్ చేరిన వెంకటరామయ్యగారు 28సంవత్సరాలు అక్కడి కళాశాలలో సాహిత్య సేవ సాగించారు. ఎందరెందరికో తమిళ సాహిత్య విద్యాబోధన చేశారు. దాంతోబాటు ప్రాచీన తమిళ గ్రంథాలు ఎన్నిటినో పరిష్కరించారు.

వెంకటరామయ్యగారు తిరుప్పవనందాళ్‌లో పన్నెండు 'తిరుముఱైగళ్' అని ప్రసిద్ధి గడించిన శైవ రచనలకు వ్యాఖ్యానం రాసి ప్రచురించారు. తిరుముఱైలకు వ్యాఖ్యానం రాస్తే చనిపోతారని అప్పట్లో కొందరు వెంకట రామయ్యగారిని హెచ్చరించారు. ఆయన తమిళ శైవ సాహిత్యంలో మూడు మహా పురాణాలుగా ప్రసిద్ధాలయిన కందపురాణం, తిరువిళయాడఱ్ పురాణం (తిరు విళయాడల్ పురాణం), పెరియ పురాణం మూడింటినీ మూల తాళప్రతులలోని పాఠభేదాలు పరిశీలించి విపులమైన సూచనలతో ప్రచురించారు. 'తిరుక్కుఱళ్ ఉరైక్కొత్తు' (తిరుక్కురళ్ వ్యాఖ్యానాల గుత్తి) పేరిట ఆయన మణక్కుఱవర్ రాసిన కుఱళ్ వ్యాఖ్యానాన్ని ఆ వ్యాఖ్యానం ప్రాతిపదికగా పరిప్పెరుమాళ్ రాసిన వ్యాఖ్యానాన్నీ ఎంతో శ్రద్ధగా పరిష్కరించారు.

తమిళ సాహిత్యం గురించే కాక చరిత్ర గురించీ వెంకట రామయ్యగారు ఎన్నో పరిశోధనలు చేశారు. ఆ ప్రయత్నంలో ఎన్నెన్నో శాసనాలను పరిశీలించి వాటి గురించి మౌలిక రచనలు చేశారు. ఆయన వ్యాసాలతో వెలువడిన రచనలలో ఇలక్కియక్కేణి (సాహిత్య తటాకం), చోళర్‌కాల అరశియల్ తలైవర్‌గళ్ (చోళుల నాటి రాజకీయ నాయకులు), కల్లెళుత్తుగళిల్ (శిలాక్షరాలలో) మొదలయినవి కొన్ని.

1973లో వెంకటరామయ్యగారు ఉద్యోగ విరమణ చేశారు. విశ్రాంతి వేతనం విషయంలో కొందరు ఆయనను ఇబ్బంది పెట్టారు. ఆయన విశ్రాంతి వేతనం గురించి ఆందోళన పడకుండా సాహిత్యకృషిలో మునిగిపోయారు. అప్పట్లో తమిళనాడు గవర్నర్‌గా

ఉన్న కె.కె.షాగారు – వెంకట రామయ్యగారితో తమిళ సాహిత్యం గురించి చర్చిస్తూ తమిళ సంస్కృత భాషల వ్యాకరణాలను తులనాత్మకంగా పరిశీలిస్తే బాగుంటుందని సూచించారు. వెంకటరామయ్యగారు రెండేళ్ళబాటు ఆ తులనాత్మక అధ్యయనం చేసి ఒక సిద్ధాంత గ్రంథం రాశారు. ఆ రచన అచ్చు కాలేదు. ఆయన ఎంతో శ్రమపడి రాసిన పరిశోధన గ్రంథాలు మరికొన్ని కూడా వెలుగు చూడలేదు.

కళాశాల ఉద్యోగం విరమించిన తర్వాత ఆయన సెట్టినాడు రాజా ముత్తయ్యగారు తమిళం, సంస్కృతం తక్కిన భాషలలో పరిశోధనల కోసం నెలకొల్పిన కేంద్రంలో మూడెళ్లకు పైగా పరిశోధకులుగా పని చేశారు. ఆ తర్వాత చిదంబరం అణ్ణామలై విశ్వవిద్యాలయంలో తిరుక్కుఱళ్ పీఠంలో ప్రధాన పరిశోధకులుగా చేరారు. అక్కడ తిరుక్కుఱళ్‌కూ వైష్ణవ భక్తి రచనల నాలాయిర దివ్య ప్రబంధానికీ మధ్య ఉన్న తారతమ్యాల గురించి తులనాత్మకంగా పరిశోధించారు. చిందబరంలోనే ఆయన ఇంకా రెండు పరిశోధనలు చేశారు. ఆయన రాసిన ఈ రచనలూ అచ్చు కాలేదు.

శతాబ్దాల ముందు దక్షిణ ఆఫ్రికాకు వెళ్లి అక్కడ స్థిరపడినా తమిళ శైవమత విధానాలను అవలంబించే వారి కోసం వెంకట రామయ్యగారు రోమన్ లిపిలోనూ తమిళ లిపిలోనూ కొన్ని ప్రాచీన రచనలు ప్రచురించారు. అవి నేటాల్ తమిళ వైదిక సభవారి సభ్యుల కుటుంబాలలో మరణించిన వారి కోసం ప్రాచీన తమిళ శైవ రచనల పారాయణానికి సాయపడుతున్నాయి. ఆ రచనల ప్రచురణకు వెంకట రామయ్యగారి పెద్ద కుమారులు కృష్ణమూర్తిగారు పూనుకున్నారు. దక్షిణ ఆఫ్రికా తమిళులు సులభంగా ఇంగ్లీష్ సాయంతో తమిళం నేర్చుకోవడానికి వీలుగా వెంకట రామయ్యగారు 'ఎళియ ముఱైయిల్ తమిళ్' (సులభ పద్ధతిలో తమిళం) అనే రచన చేశారు. 1982లో ఆయన భార్య మరణించారు. అపుడు ఆయన తంజావూరులోని తమిళ విశ్వవిద్యాలయంలోని వ్రాతప్రతుల పరిశోధనా విభాగంలో గౌరవ ఆచార్యులుగా, డీన్‌గా ఉన్నారు.ఐదు సంవత్సరాలబాటు తంజావూరులో ఉన్నప్పుడు అక్కడి సరస్వతీ మహల్ గ్రంథాలయంలోని అరుదైన తాళపత్రులనూ పరిశీలించారు. స్వయంకృషితో మోది భాష నేర్చుకోని తంజావూరులో మోదీలిపిలో లభ్యమైన రచనలు పరిశోధించి వాటి సాయంతోనూ మెకంజీ కైఫియత్తుల సాయంతోనూ తంజావూరు పరాధా రాజ చరిత్ర రాశారు. అట్లాగే అప్పటి సాంఘిక స్థితిగతుల గురించీ ఒక రచన చేశారు.

జైన సాహిత్యాన్ని శ్రద్ధగా పరిశీలించి ఆయన తిరుక్కుఱళ్ జైన వ్యాఖ్యానాన్ని పరిష్కరించారు. అది సరస్వతీ మహల్ ప్రచురణగా వెలువడింది. వడలూర్ శ్రీ రామలింగస్వామి సాహిత్యం గురించి వెంకట రామయ్యగారు మూడు రచనలు చేశారు.

తమిళ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పని చేసిన ఆచార్య వి.ఐ. సుబ్రమణ్యంగారు తిరువనంతపురంలో నెలకొల్పిన ద్రావిడ భాషల సమితి (ద్రావిడియన్ లింగ్విస్టిక్ అసోసియేషన్) లో పరిశోధకులుగా చేరారు వెంకటరామయ్యగారు. అప్పటికి ఆయన వయస్సు 80 సంవత్సరాలు. ఆయన తమ వయసుతో నిమిత్తం లేకుండా ఎంతో ఉత్సాహంగా సాహిత్య పరిశోధనలో మునిగిపోయారు.

వెంకట రామయ్యగారికి ఐదుగురు కుమారులు. నలుగురు కుమార్తెలు. కుమారులలో నలుగురు రచయితలుగా, తమిళ పండితులుగా పేరొందినారు. ఒక కుమారుడు ప్రచురణ కర్త.

1994లో జనవరి 31నాడు తిరువనంతపురంలోని తమ బసనుంచి ఆయన తమ కుమారుడికి ఒక ఉత్తరం పోస్ట్ చేయడానికి బయలుదేరారు. వెనుకనుంచి వచ్చిన ఒక ఆటో తగిలి, కింద పడిపోయారు. ఆ ఆటో డ్రైవర్ ఆయనను దగ్గరలో ఉన్న వైద్యశాలకు తీసుకువెళ్లి చేర్చాడు. ప్రమాదం సంగతి తెలిసి ఐ.వి. సుబ్రహ్మణ్యంగారు వెంకట రామయ్యగారిని చూడటానికి వచ్చారు. తమ చేత ఉన్న ఉత్తరాన్ని సుబ్రహ్మణ్యంగారి చేతిలో పెట్టి వెంకట రామయ్యగారు కన్నుమూశారు.

ఆ ఉత్తరం తమిళ సాహిత్యంలో ప్రసిద్ధురాలయిన అవ్వయ్యార్‌ను కేరళలో పూజించడానికి సంబంధించినది. జీవితం చివరిక్షణం వరకు సాహిత్య కృషి చేసిన వెంకట రామయ్యగారు మరణించిన తర్వాత ఆయన సహ సంపాదకత్వంలో ప్రాచీన తమిళ రచన 'తొల్ కాప్పియం' పాఠభేదాల పరిశీలన వెలువడింది. అట్లాగే తమిళనాడు చరిత్ర గురించిన ఇంగ్లీష్ రచన కూడా ఆయన మరణం తర్వాతే వెలువడింది.

వెంకట రామయ్యగారు తెలుగు కథలు కొన్నింటిని తమిళంలోకి అనువదించారు. ఆ కథలు తమిళ పత్రికలలో వెలువడ్డాయి. 2011లో వెంకట రామయ్య గారి శతజయంతి ఉత్సవాల వేళ తమిళనాడు ప్రభుత్వంవారు ఆయన వారసులకు 15లక్షల రూపాయలు అందజేసి ఆయన రచనలను జాతీయ సంపదగా ప్రకటించారు. వెంకట రామయ్యగారి అరుదైన సాహిత్యకృషికి అదొక గొప్ప గుర్తింపు. వ్రాతప్రతులలోనే మిగిలి పోయిన ఆయన రచనలు అన్నీ అచ్చయితే ఆయన కృషి ఎంత గొప్పదో తెలుస్తుంది.

డాక్టర్ పి.ఎస్. గోపాల కృష్ణ,
సెల్ నెం : 9492058970

చిత్రగీతాలు
జావళీలు

– ఎమ్. పురుషోత్తమాచార్య



53. ఎంతటి రసికుడవో
చిత్రం : ముత్యాలముగ్గు (1975)
రచన : సి.నారాయణరెడ్డి
సంగీతం : కె.వి.మహదేవన్
గానం : పి.సుశీల
నృత్యం : హలం

శ్రీరాగం-ఏక

ఎంతటి రసికుడవో తెలిసెరా నీ ॥వెంత॥
వింతలు యింతలు యింతలై
కవ్వింతలై మరులొలికెరా ॥ఎంత॥

1. *గుత్తపు రవిక ఓయమ్మో చెమట*
చిత్తడిలో తడిసివుండగా
ఎంతసేపు నీ తుంటరి చూపు
అంతలోనె తిరుగాడుచుండెరా ॥ఎంత॥

2. *మోము మోమున ఆనించి ఏవో*
ముద్దూముచ్చట లాడబోవగా
గ్రక్కున కౌగిట చిక్కబట్టి నా
చెక్కిలి మునిపంట నొక్కుచుండగా ॥ఎంత॥

చిత్రంలో ప్రతినాయకుడు ఒక జమీందారును లొంగ దీసుకోవడానికి నర్తకీమణిని అతని మీదికి ప్రయోగించే ప్రయత్నంలో ఈ నృత్యగీతాన్ని చిత్రించారు. ప్రతినాయకునిగా రావుగోపాలరావు, జమీందారుగా ముక్కామల, నర్తకీమణిగా హలం అభినయించారు.

శృంగారరసపర్ణనలో హుందాతనం కాక కొద్దిగా చవకబారు తనాన్ని జోడిస్తే బాగుంటుందని దర్శకులు బాపు చెప్పివుంటారు, దీనిక్కూడా సినారె కలం సైయంది. ఆ విధంగానే విజృంభించిన ఆయన కలం రసికజన హృదయాకర్షకమంత్రంతో చిందు లేసింది. మోహపెట్టాలనుకున్న రసికుని రసికత్వమెటువంటితో చమత్కారంగా ప్రకటిస్తున్నారు కవిగారు.

గుత్తపురవిక అంటే, ఒంటికి అతుక్కుపోయే బిగుతైన రవిక. అదీ తెల్లనిదైతే ఒంపుసొంపులు స్పష్టంగా కనిపిస్తాయి. అదే చెమటతో నిండితే ఇక చెప్పనక్కర లేదు. అటువంటి రవికవైపే రసికుడు చూస్తున్న వైనాన్ని ఈ పాట మొదటి చరణంలో వెక్కిరించారు. చెంతకు చేరి ఊరిస్తున్న వగలాడి వయ్యారాలకు లొంగిపోయిన రసికుని చేష్టలను రెండో చరణంలో చక్కగా చెప్పారు. 'గుత్తపురవిక' ప్రయోగం చక్కని దేశీయ సంప్రదాయం.

ఇలాంటి శృంగారరచనలకు సాధారణంగా ఖమాస్, మోహన, కల్యాణి, మాల్కౌంస్ వంటి రాగాలను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. కాని 'మామ' మహదేవన్ ఈ పాటను శ్రీరాగంలోకి తీసుకోవడం ఒక ప్రత్యేకత. ఆదితాళపు అక్షర కాలాన్ని అనుసరించాలనుకోక లాలిత్యధోరణికి తగినట్లుగా ఏకతాళాన్ని విధించారు.

ప్రారంభంలో ఒక ఆవర్తం మృదంగం, ఒక ఆవర్తం వేణువు వయొలిన్స్ సంచారంగా రూపొందించి ఆరు ఆవర్తాలలో వినిపించారు. స్వరకర్త తనకు అలవాటైన మధ్యమశ్రుతిలోనే దీన్ని పాడించారు. 'ఎంతటి' పల్లవిని సమంలోనే పంచమం నుండి ప్రారంభించారు. 'పనిపమరి రిగరిసా' అనడంలోనే వక్రంలో గాంధారాన్ని పలికించి శ్రీరాగం రంగును అద్దారు. 'తెలిసెరా' తరువాత వాద్యం కూడా 'తెలిసెరా' అని నినదిస్తున్నట్లుగా బాంజో వాద్యంతో 'నిపనిసా' అని పలికించారు. మొదటి పాదాన్ని రెండుసార్లు పాడాక 'నీ వింతలు' అనే అనుపల్లవిని కూడా రెండుసార్లు పాడి పల్లవిలో 'తెలిసెరా' దగ్గర వదిలేశారు.

తరువాత సితార్,వేణువులతో 8 ఆవర్తాలుగా బిట్వర్క్ వినిపించాక మొదటి చరణం 'గుత్తపురవిక' పంచమం నుండి సమంలో ప్రారంభించారు. మొదటిసారి తగిన దీర్ఘాలు తీసి రెండోసారి రవికవలెనే బిగుతుగా పాడారు. తరువాతి పాదాన్ని పాడుతున్నప్పుడు తబల నడకను మార్చి చల్తీలోకి తీసుకున్నారు. భావాత్మకంగా ఆపుతూ రెండోసారి మొత్తం కలిపి పాడారు. మూడోసారి సంగతిని మార్చి పాడారు. చివరి పంక్తిని జోడించి పల్లవిని అందుకున్నారు.

రెండో చరణానికి ముందు గిటార్‌తో బిట్టును ప్రారంభించి సితార్, వేణువులతో మరికొన్ని క్రొత్త బిట్లను కలిపి 7 ఆవర్తాలలో అందించి ఆధారషడ్జమం దగ్గర నిలిపారు. 'మోము మోమున' చరణాన్ని షడ్జమం నుంచి ఒక అక్షరం జాగా వదిలి అందుకున్నారు. తబలను శాస్త్రీయధోరణిలో సాగిస్తూ ఉండగా రెండు

పాదాలను పాడారు. రెండోసారి అవే పాదాలను మిశ్రచాపు తాళంలో పాడినాక వెంటనే మళ్ళీ ఏకతాళంలో మరోసారి పాడుతూ 'ఏవో' పదాన్ని వదిలేశారు. తరువాతి పాదాన్ని రెండుసార్లు పాడి చివరి పాదాన్ని పాడుతూ 'నొక్కుచుండగా' ను లయవాద్యం లేకుండా భావాత్మకంగా నొక్కినట్లుగానే పాడారు. తిరిగి పల్లవిని అందుకుని మొత్తం పల్లవి, అనుపల్లవులను పాడారు. చివర 'తెలిసెరా' ను మూడుసార్లు పాడుతూ మూడవసారి 'రారా' అంటూ గాంధారాన్ని కలుపుతూ పాడి ముగించారు.

54. మందారమకరందము

చిత్రం : దొరలు దొంగలు (1976)

రచన : మల్లెమాల

సంగీతం : సత్యం

గానం : ఎస్.జానకి

నృత్యం : మంజుభార్గవి



తోడి-ఏక

మందారమకరందము ॥మం॥
ఎలదేటికే సొంతము ॥మం॥
పగడాల నా అధరము పసగల
ప్రతివాడికే స్వంతము ॥మం॥

1. ముసిరిన విరహం తొలగాలంటే
ముచ్చట నాతో నెఱపండి

'మనసున' దగ్గర రెండు అక్షరాల, 'ఒదిగినా' దగ్గర రెండక్షరాల జాగాలో పఖ్‌వాజ్ వినిపించారు. తిరిగి 'మనసున' నుంచి పూర్తి చరణాన్ని పాడి పల్లవిని అందుకున్నారు. అనుపల్లవి కూడా పాడాక బిట్‌వర్క్‌ను క్రొత్తవిధంగా 10 ఆవర్తాలలో రూపొందించారు. పఖ్‌వాజ్ అనేది మృదంగం లాంటి హిందూస్తానీ వాద్యం.

1,2 ఆవర్తాలలో వీణ బిట్స్‌ను ఇచ్చారు. మూడవ ఆవర్తంలో వయొలిన్స్ వినిపించారు. 4,5 ఆవర్తాలలో మృదంగం, ఘటం, మోర్సింగ్‌లను వినిపించారు. ఆరవ ఆవర్తం నుండి శహనాయ్ బిట్టును రెండు ఆవర్తాలలో వినిపిస్తూ తబలాను జత చేర్చారు. తరువాత రెండున్నర ఆవర్తాలలో పఖ్‌వాజ్ వాద్య విన్యాసాన్ని ప్రదర్శించారు. మిగిలిన అర ఆవర్తంలో గజ్జెలను వినిపించారు. రెండవ చరణం 'నీ మేనైపోయి' గాంధారం నుండి ప్రారంభమై 'జనసమ్మోదిని' రాగలక్షణాలతో సాగిపోయింది. చరణంలోని మొదటి రెండు పాదాలనూ ఈ రాగంలోనే సుశ్రావ్యంగా వినిపించాక 'నాట్యాలు చేయాలి' దగ్గర శహనాయ్‌తో మనోహరమైన స్వరసంపుటిని రెండు ఆవర్తాలలో అందంగా వినిపించారు. తరువాత తిరిగి అవే పాదాలను జనసమ్మోదిని రాగంలోనే పాడారు.

ఇక్కడే స్వరకర్త చిన్న కిటుకు పెట్టారు. రెండవ చరణం హఠాత్తుగా రాగం మార్చుకున్నది. ఏవో అన్యస్వరాలను మిశ్రమం చేశారు అని భ్రమపడేట్టు చేశారు. కాని రాగధర్మం మారినా మేళకర్త చారుకేశి మారలేదు. జనసమ్మోదిని రాగం 26వ మేళకర్త చారుకేశికి జన్యరాగమే కనుక ఆయన అన్యస్వరాలను వేటినీ ఆశ్రయించే అవకాశం రాలేదు.

జనసమ్మోదిని రాగం మోహన,భూపాలం కలిసిన రాగం.

ఆరో : సరిగపదస
అవ : సదపగరిస

మోహనరాగంలోని దైవతాన్ని మార్చి శుద్ధదైవతం చేస్తే చాలు ఈ రాగం వచ్చేస్తుంది. 'నెల్లూరు నెఱజాణ' అనే 'ఒకేఒక్కడు' సినిమా పాట ఈ రాగం మీద ఆధారపడినదే.

మొదటి రెండు పాదాలవరకే ఈ రాగధర్మాన్ని ప్రదర్శించి, వెంటనే మూడవ పాదం నుంచి 'చారుకేశి' లోకి వచ్చేశారు. 'గలగలలు,సరిగమలు' దగ్గర పఖ్‌వాజ్ వాద్యపు నడకను చూపారు. రెండవసారి 'గలగలలు' పాదాన్ని పాడి, నాలుగవ పాదాన్ని కలుపుకుని పాడాక స్వరప్రస్తారం ప్రారంభించారు. రెండు ఆవర్తాలలో స్వరాలు పాడి 'గలగలలు' అందుకున్నారు. తరువాత త్రిశ్రగతిలోకి తాళపు నడకను తీసుకున్నారు. పఖ్‌వాజ్ వాద్యం అనుసరిస్తూ ఉండగా చిన్న ఆలాపనను మూడు ఆవర్తాలలో ముగించి స్వరాలాపనను ద్రుతగతిలో వినిపించారు. 7 ఆవర్తాలలో పఖ్‌వాజ్ వాద్యంతో పంచుకుంటూ స్వరాలను ఆలపించి 'గలగలలు' ఎత్తుకున్నారు. తరువాత పల్లవిని అందుకుని రెండుసార్లు పాడి ముగించగా పాటతోపాటు వాద్యాలు కూడా ముగిశాయి.

57. కన్నెగ ఉన్నానురా

చిత్రం : అగ్నిపూలు (1981)
రచన : ఆత్రేయ
సంగీతం : కె.వి.మహదేవన్
గానం : పి.సుశీల
నృత్యం : జయప్రద



ఉదయరవిచంద్రిక-ఖండగతి

సాకీ : బృందావనీ గోపికాబృందమందార
సుందరాకార రారా
యమునానదీతీర రసకేళికాలోల
నందగోపాల రారా
మురళీధరా రాగరత్నాకరా ధీర
మందరోద్ధార రారా
నవనీత సుకుమార ఘనమేఘ గంభీర
జీవనాధార రారా

కల్యాణి-ఆది

కన్నెగా ఉన్నానురా స్వామీ
నిన్నే మనసార ఎన్నిక గొన్నారా ॥కన్నె॥
మన్నికగా నన్నేలు
మన్నీడు నీవేరా ॥కన్నె॥

1. కంటిని నేనెందు నిగనిగలు నిన్నే
వింటిని కాలింది గలగలతో
చిలికితి నీ నవ్వు చల్లలతో నా
కల్పనలో,చిత్తములో అర్పితనై,అర్చితనై ॥కన్నె॥
2. మదనుడు వేసే శరములు చేసే
గాసికి వీసము వేసరిపోక
3. మనసును ఊపే మరులను రేపే
వగరు వయసు వశము కాగా
4. నా సరి మగువను వాసిగ వదలకు
రాసక్రీడల జరుపుతు ఉన్నా
5. నిన్నటి పిల్లా నేటికి పెళ్ళి
మెల్లగ తాళిక తానేదన్నా
6. సవతులు మెత్తని కత్తులు కాగా
తలపులు ఉరుములు పిడుగులు కాగా
మొలకలు చిరుచిరు ములుకులు కాగా
తరగని కర్పూరహారతి నీకే ॥కన్నె॥
7. సా.....సరసిజనయనా
రీ.....రిపుజనహాననా
గా.....గజనిభగమనా
మా.....మగువను కానా
పా.....పలుచన ఏలా
దా.....దయగన తగనా
నీ.....నినుగని మనినా
నా వేదన నా సాధన ఆరాధనలో కాలేనా నీదానా
నా తలపున, పలుకున, మనమున
దినదిన మననము మరువని ॥కన్నె॥

చిత్రంలో, వికలాంగురాలిగా మారిన కథానాయిక గతస్మృతులలో తాను నర్తించిన వైనాన్ని గుర్తు తెచ్చుకుంటున్న సందర్భంలో నాయిక పాత్రధారిణి జయప్రద మీద ఈ నృత్య గీతాన్ని చిత్రించారు. దృశ్యంలో కథానాయకుడు కృష్ణంరాజు కూడా కనిపిస్తారు.

మొట్టమొదటి సాకీలో శ్రీకృష్ణుని నామావళి జోరుగా సాగుతుంది. పల్లవిలో ప్రాస సౌందర్యం చక్కగా కనిపిస్తున్నది. ద్విత్వనకారాన్ని అనుప్రాసగా కూడా ఉపయోగించారు. 'మన్నీడు' అనేది 'గొప్పవీరుడు' అనే అర్థంలో ఉపయోగింపబడిన తెలుగు దేశ్యపదం. మొదటి చరణంలో స్వామివారి సర్వాంతర్యామిత్వాన్ని వర్ణిస్తూనే శరణాగతి తత్త్వాన్ని చిలికించారు. 2 నుంచి 6 చరణాలలో సరసశృంగార మాధుర్య రుచులను అలతి అలతి పదాలలో ప్రకటించారు. ఏడో చరణంలో సప్తస్వరాక్షరాలతో ప్రారంభించే విశేషణాలను చూపారు. "తలపున, పలుకున, మనమున" అంటూ త్రికరణశుద్ధిని నిరూపించారు. విరహిణి అయిన భక్తురాలి మధురభక్తిని నిక్షేపించారు. 1,6,7 చరణాలను నాలుగు పాదాలుగా, మిగిలినవాటిని రెండు పాదాలుగా రచించడం ఒక వినూతన రచనా ప్రయోగ విశేషమే అని చెప్పాలి. పాట ఈ రూపంలో ఉండడం ఎవరూ చేయని క్రొత్త ఆలోచన.

ప్రారంభంలో బెల్‌పియానో పైన 'నిసగమపనిసా' అనే ఉదయరవిచంద్రిక స్వరాలు వినిపిస్తాయి. 'బృందావని' సాకీ పంచమం నుండి ప్రారంభమైంది. మొదటి రెండు పాదాలు కాగానే వీణ,పియానో స్వరాలు వినవస్తాయి. 'యమునానది' పంక్తిని మధ్యమం నుంచి పాడారు. 'మురళీధరా'ను గాంధారం నుంచి ఎత్తుకున్నారు. 'నవనీత'ను పైషడ్జమం నుంచి పాడారు. ఈ పంక్తుల గానానికి వీణ,పియానోలు బిట్టుతో సహకరిస్తూ ఉండగా ఖండచాపు నడక స్ఫురిస్తుంది. కాని లయవాద్యాన్ని

ప్రయోగించలేదు.

సాకీ కాగానే 'కన్నెగ' అనే పల్లవిని తారషడ్జమం నుంచి కల్యాణి రాగంలో ఒకటిన్నర ఆవర్తాల జాగ వదిలి ప్రారంభించారు. పాట మొత్తమ్మీద త్రిశ్ర, ఖండగతులను పాక్షికంగా పొందిస్తూనే ప్రధానంగా ఆదితాళాన్ని అక్షరకాలానుగుణంగా ఖచ్చితమైన లెక్కలతో నడపడం చెప్పుకోదగిన గొప్ప విశేషం. నృత్యాభినయంతో ముడివడియుండడం వల్ల నడకను ఎక్కడా చెదరకుండా చూస్తూనే జతులను పలికింపజేశారు.

పల్లవి మొదటి పాదం కాగానే ఒక ఆవర్తంపాటు వీణాశ్రుతిని వినిపించారు. తరువాత పల్లవిని ఎత్తుకుని రెండో పాదాన్ని కూడా కలుపుకుని పాడి, 'స్వామి' దగ్గర చిన్న 'స్ట్రూ' లాంటి గమకాన్ని వినిపించారు. 'ఉన్నానురా' ను కూడా చక్కని గమకంతో పాడారు. తరువాత పలికిన 'కన్నెగా' పదాన్ని 'నీరిగమా' అంటూ ప్రతిమధ్యమాన్ని అన్యస్వరమేమో అన్నంత భ్రమను కలిగిస్తూ వినిపించారు.

ఎందుకోగాని, పల్లవి సంచారమంతటినీ తారస్థాయిలోనే రూపొందించారు. దానివల్ల అక్కడక్కడ సాహిత్యంలోని పదాలు అలుక్కుపోయినట్లు వినిపించాయి. ఇది సుశీలగారి గొంతులో మనం ఆశించే విషయం కాదు. నిషాదంతో కలిపి అనుపల్లవిని పాడారు. అనుపల్లవిలోని నాలుగు పదాలను మొదట నాలుగు భాగాలుగా విడగొట్టి, రెండవసారి వాటిని అందంగా కలిపి పల్లవిని ఎత్తుకున్నారు.

తరువాత రెండు ఆవర్తాలలో వీణాస్వరాలను వినిపించి షడ్జమం దగ్గర వదిలేయగా మొదటి చరణం 'కంటిని' ని నిషాద, తారరిషభాలతో కలుపుతూ ఒకటిన్నర అక్షరాల జాగాతో ఎత్తుకున్నారు. మొదటి రెండు పాదాలను పాడుతున్నప్పుడు తారస్థాయి పంచమం మరీ కీచుగా తగిలింది. 'గలగలలు' దగ్గర దీర్ఘం తీస్తూ ఒక ఆవర్తం గడిపాక మళ్ళీ మొదటి నుంచి పాడారు. మూడో పాదాన్ని రెండోసారి పాడుతున్నప్పుడు 'చల్లలలో' ను స్ట్రూగా త్రిప్పుతూ పాడారు. నాలుగవ పాదాన్ని మాత్రం అకస్మాత్తుగా ద్రుతగతిలో పాడి పల్లవిని ఎత్తుకున్నారు. రెండు ఆవర్తాలలో వీణానాదాన్ని వినిపించాక రెండవ చరణం 'మదనుడు' ను పంచమం నుండి సమంలో మిత్రం పద్ధతిలో అందుకుని ఒకేసారి పాడి పల్లవిని అందుకున్నారు.

వెంటనే రెండు ఆవర్తాలలో నృత్యగురువు జతులను 'కొనగోలు' గా నలుకగా మూడవ చరణం 'మనసును ఊపే' ను గాంధారం నుండి సమంలో ద్రుతగతిలో పాడి పల్లవిని అందుకుని క్రొత్త సంగతితో పాడారు. తరువాత నృత్యాచార్యులు జతులను ఖండగతిలో నడిపి చతురశ్రలోకి వస్తూ రెండు ఆవర్తాలుగా జతులను పలుకగా నాలుగవ చరణం 'నా సరియగు నను' ను నిషాదం నుంచి సమంలో ప్రారంభించి, ఒక్కసారి పాడి, పల్లవిని మరో వైవిధ్యపూరితమైన పోకడలో అందుకుని 'రా' దగ్గర చక్రభ్రమణపు గమకాన్ని పలికించారు.

నాట్యాచార్యులు త్రిశ్రగతిని అనుసరిస్తూ, చతురశ్రలోకి మారుతూ రెండు ఆవర్తాలలో జతులు పలుకగా 5 వ చరణం 'నిన్నటి'ని తారషడ్జమం నుండి సమంలో అందుకుని మొత్తాన్ని ఒకేసారి పాడి పల్లవి ధోరణిని మళ్ళీ మార్చుకుని 'రా' దగ్గర సొగసైన సంగతిని చూపారు.

మళ్ళీ నృత్యాచార్యులు జతులను ఒక ఆవర్తంలో పలుకగా ఆరవ చరణం 'సవతులు'ను తారషడ్జమంలో సమంలో ఎత్తుకుని చురుకైన వేగంతో నిజమైన మిత్రం పద్ధతిలో హుషారుగా పాడారు. ఈ పంక్తులు పాడుతున్నప్పుడు మోహనరాగచ్ఛాయలు లీలగా కదులుతాయి. నృత్యగురువు ఒక ఆవర్తంలో జతులు పలుకగా 'తలపులు' ను తారరిషభంలో ప్రారంభించారు. మిగిలిన రెండు పాదాలతో చరణాన్ని ముగించి పల్లవిని మాత్రమే పాడాక మిగతా జాగాను వీణానాదం పూర్తిచేసింది. మళ్ళీ జతులను రెండు ఆవర్తాలలో గురువు పలుకగా 7వ చరణం తారస్థాయి షడ్జమం నుంచి సమంలో ప్రారంభమైంది.

ఆయా స్వరస్థానాల నుంచే సమంలో ప్రారంభించి పాడుతున్నప్పుడు అర ఆవర్తాలను జతులతో పాడారు. అలా మధ్యమస్వరం దాకా సాగింది. మిగిలిన 'పదని' స్వరాల సాహిత్యాన్ని చక్కగా పాడి 'నా వేదన'ను తారరిషభం నుండి ప్రారంభించి త్రిశ్ర నడకను చూపిస్తూ వేగంగా పాడి 'నీదాన' ను నింపాదిగా వినిపించగా మిగిలిన అర ఆవర్తంలో జతులను వినిపించాక మళ్ళీ 'నా వేదన' ను అందుకుని చరణం చివరిదాకా పాడి,'కన్నెగా ఉన్నానురా' ను సాకీ ధోరణిలో పాడి ముగించారు. 'నా తలపున' నుండి చివరి పాదాలను పాడుతున్నప్పుడు కల్యాణి రాగంలోని వర్ణం పాడుతున్నంత పటిష్ఠంగా బాణీని సమకూర్చడం పాటకు నిండుదనాన్ని బాగా చేకూర్చింది.

ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ, సెల్ నెం : 9396611905

ఆత్మసౌందర్య సాక్షత్కారం

డా. శేషగిరి ప్రయాణాలు

– ఆచార్య వై. పార్థసారధి

దాదాపు సంవత్సరం క్రితం **మిసిమి** కార్యాలయంలో ఒక చర్చలో అనుకోకుండా పాల్గొనే అవకాశం ఏర్పడింది. నాకు సంపాదకులు తప్ప మిగిలిన ఇద్దరూ క్రొత్త. వేదాంత మీమాంస గురించి అక్కడ ఉన్న ఒక ప్రగతిశీల రచయిత, ఆ చింతన అంతా ఎందుకూ ఉపయోగపడదంటూ మాట్లాడాడు. అదే సమయంలో మానవ నాగరికతా అభివృద్ధిలో అవశేషాలు గా మిగిలి ఉన్న హరప్పా, మొహంజదారో పరిశోధనల పట్ల అవన్ని అనవసర ప్రయాసలని వాదించాడు. అంతకు ముందే ఆ గదిలో ప్రవేశించిన వ్యక్తి ఆ చర్చ అంతా విని అత్యంత సున్నితంగా తన విశ్లేషణను అందమైన భాషలో వ్యక్తీకరించాడు. ఏ విషయాన్నైనా పరిశీలించడానికి, మదింపు చేయడానికి మనం వాడే మేధడాలజి బట్టి ఉంటుందని, వేదాంత మీమాంసకు ఆధునిక శాస్త్రీయ పద్ధతిని, ఆపరేషన్ థియేటర్లో రోగికి జరిపే శస్త్రచికిత్సకు నాగరికతా ప్రయోజన, అప్రయోజన పద్ధతులు ఉపయోగపడవని, ప్రతి దానిని చర్చించడానికి దానికి అనుగుణ మైన పద్ధతి ఉంటుందని, దాని ప్రకారం మదింపు చేస్తేనే వాస్తవం బోధపడుతుందని, ఆయా కాల పరిస్థితులను గమనం లోకి తీసుకోకుండా చర్చించడం వలన, సమస్యలను మరింతగా జటిలం చేస్తామని చెప్పాడు. ఆవేశం, కోపం, తొట్రుపాటు లేకుండా చెప్పిన ఈ విషయాలు విశ్వవిద్యాలయాలలో పరిశోధనా పద్ధతులపై కార్యశాలలు జరిగినప్పుడు విశ్లేషించే పరిశోధనా సామగ్రి ప్రాధాన్యతల చర్చ నాకు గుర్తు వచ్చింది. అలా వ్యక్తీకరణ చేసిన వ్యక్తి లండన్‌లో నివసిస్తూ **మిసిమి** లో వివిధ దేశాల ప్రయాణ అనుభవాలను గురించి రచించే డా॥ నిమ్మగడ్డ శేషగిరిగా నాకు **మిసిమి** ద్వారా పరిచయం చేయబడ్డారు. ఆలా పరిచయం చేయబడిన డా॥ శేషగిరి నా సమీప గ్రామం అని, నేను చదువుకున్న ప్రాంతం లోనే చదువుకుని, డాక్టర్‌గా లండన్‌లో స్థిరపడ్డారని తెలిసి ఆనందానికి లోనవడం నా వంతయింది. చర్చ చివరలో ఆ కవి డాక్టర్ శేషగిరి అభిప్రాయా నికి అంగీకారం తెలపడం ఆ విశ్లేషణలోని శాస్త్రీయతకే కాక వివరించిన పద్ధతి కూడా కారణం.



డా. శేషగిరి

ముసాఫిర్

'ముసాఫిర్' అనే పదం అరబిక్, పర్షియన్, బెంగాలి, హిందీ, ఉర్దూలలో 'ప్రయాణీకుడని', రొమినియన్, టర్కిష్ భాషలలో 'అతిథి' అనే అర్థం కలిగి ఉంది. ఈ ప్రపంచం అంతం ఎక్కడ, విశ్వం అంచులు ఎంత దూరమో అనే ప్రశ్నలు అందరికీ వస్తాయి. జవాబులు అందరికీ దొరకవు. కొందరు దైవంపై భారం వేస్తే, మరికొందరు కొన్ని దూరాలు ప్రయాణించి, దేవాలయాలు దర్శించి పుష్కరాలపాటు అనుభూతులు పంచుకుంటూ ఉంటారు. ఇటీవల కాలంలో విదేశాలలో స్థిరపడ్డ పిల్లల దగ్గరకు వెళ్ళిన కొంతమంది ఆ విశేషాలు వర్ణిస్తూ ఉంటారు. చిన్న పిల్లల మనసుల్లో ఈ ప్రయాణాల పట్ల బలమైన ముద్రలు వేసేది, వారి ఊహాశక్తిని పెంచేవి కథలు, పుస్తకాలు, ప్రత్యేకించి యాత్రా విశేషాలు. సింద్‌బాద్ సాహసయాత్రలు, అరేబియన్ నైట్స్, గలివర్ యాత్రలు ఇప్పటికి సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తాయి. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, చందమామ కథలు విని, చదివి అలౌకిక ఆనందాన్ని పొందకుండా ఉండగలగడం అసాధ్యం. ప్రపంచీకరణ, ఇంటర్‌నెట్ టెక్నాలజీతో ప్రపంచం కుగ్రామమై దేశ విదేశ విశేషాలు అన్ని మనముందున్న టాబ్, ఫోన్, లాప్‌టాప్‌లలో త్రిడిలలో కనిపిస్తున్నాయి. యూట్యూబ్ లో, వివిధ ఛానళ్ళలో అనేక దేశాల పర్యటనలు, విశేషాలు, అలవాట్లు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆహార పద్ధతులు పెద్ద ఎత్తున పుంఖాను పుంఖాలుగా ప్రసారమవుతున్నాయి. ఒక రకమైన యాంత్రికతతో కూడిన ఈ ప్రసారాలన్నీ ఏదో



కాసబ్లాంక మసీదు

చూసినంత సేపు ముచ్చటపడడం తప్ప మనస్సును తట్టి లేపలేవు. ఇక్కడే మిసిమిలో ధారావాహికంగా వస్తున్న డా॥ శేషగిరి ప్రయాణాలు, అనుభవాలు, ఆయా సంస్కృతులు, ఆచారాలు, అలవాట్లను వివరించడమేగాక, ఆ అనుభవాల తాదాత్మ్యతను ఆహార పానీయాల రుచిని, ప్రయాణ బడలిక లతో పాటు, గమ్యస్థానం చేరిన తరువాత వచ్చే సంతృప్తిని భావాత్మకతతో ఉద్వేగంగా, మధురంగా, కవితా ధోరణిలో ప్రతి చిన్న అంశాన్ని గుర్తుంచుకుని వివరించడం, చదువరు లను కట్టి పడేస్తోంది. సాంకేతికత సాయంతో చూపే దృశ్య శ్రవణాల కన్నా, మనస్సును, ఆత్మను హత్తుకునే మానవీయ ధోరణిలో రాయగలగడం డాక్టర్ వృత్తిలో లండన్‌లోని ఒక పెద్ద ఆసుపత్రికి సంచాలకులుగా ఉంటూ, ఈ ప్రయాణ ప్రవృత్తిని నిరంతరంగా కొనసాగించడం అశ్చర్యకరం, అభినందనీయం.

డా॥ శేషగిరి మాటల్లో చెప్పాలంటే "ప్రయాణం నా వృత్తి జీవిత ఆరంభ దినాల నుండి, వృత్తితో పాటు, సంతృప్తి, సంతోషం కలిగిస్తోన్న వ్యాపకం. వృత్తి ఒత్తిడి నుండి సేద దీరడానికి, నన్ను నేను రీఛార్జ్ చేసుకోవడానికి ఒక ఉపకరణం గా మొదలైన ప్రయాణ పరంపర ప్రాణవాయువుతో సమానమై, నా మనుగడకు ఆధారంగా మారి నా జీవితానికి అర్థము, ప్రయోజనం కలిగించే మార్గంగా రూపొంది, నన్ను నేను ఆవిష్కరించుకోవడానికి దోహదపడుతోంది."

పాతికేళ్ళుగా మొదలైన ఈ ముసాఫిర్ ప్రయాణం 130 పైగా దేశాలను సందర్శించడంతో పాటు కొన్ని దేశాలకు మూడు, నాలుగు సార్లు వెళ్ళిరావడం, మిగిలిన ప్రాంతాలను చూసి, ఇంతకు ముందు ఆ దేశంలోనే చూసినవాటితో పోల్చి, ఆ తేడాలను గుర్తించి మనకు వివరించడం ఈ అలుపెరుగని యాత్రికుని ప్రత్యేక లక్షణం. ఆయన మూడుసార్లు పర్యటించిన ఉత్తర ఆఫ్రికా దేశం మొరాకో అనుభవాలను "ఊహలకందని మొరాకో"గా ఆలంబన ప్రచురణతో ఈ నెలలోనే ఆయన మాతృమూర్తి వినోద గారి చేతుల మీదుగా ఆదవిష్కరించ బడింది. **మిసిమి** లో వస్తోన్న ధారావాహిక వ్యాసాలను, ఈ మొరాకో పుస్తకాన్ని చదివిన తరువాత ఆ ప్రయాణాలలోని ప్రాధాన్యతను, ప్రస్తుత కాలంలో వాటి అవసరాన్ని వివరించే ప్రయత్నమే ఈ పరిచయాత్మక విశ్లేషణ.

రెండు సముద్రాల మధ్య ఎడారి దేశం

ఆఫ్రికా ఖండపు ఉత్తరాన ఒకవైపు అట్లాంటిక్ మహా సముద్రం, మరో వైపు మధ్యధరా సముద్ర తీరంతో, యూరప్ ఖండంలోని స్పెయిన్‌కు రాతివేటు సరిహద్దుతో ఉన్న మొరాకో ఎంతో వైవిధ్యం గల దేశం. భౌగోళిక వైవిధ్యం, మతపర సామరస్యం, పురాతన మానవ చరిత్ర, ఎడారి నడకలు, పర్వతారోహణలు, శిథిల నగరాలు, చరిత్రలోని బానిస వ్యాపా రాలు, మహిళా సాధికారికతలు, ఒంటె సవారీలు, యూరప్ రైళ్ళతో పోటీ పడే బుల్లెట్ రైళ్ళు, సాగర సమీరాలు, మంచు తుఫానులు, మండు టెండలు, ఆగ్నేయ దిశలో సహార ఎడారి, సాంస్కృతిక రాజధాని ఫెజ్, మెర్నెస్ వంటి పర్వత ప్రాంత నగరాలు, టాంజీర్, టెటువాన్ వంటి మధ్యధరా సముద్ర తీర నగరాలు, దేశ రాజధాని రబాత్, అంతర్జాతీయ ఖ్యాతి పొంది ఐరోపా ఛాయలతో ఉండే కాసాబ్లాంకా అట్లాంటిక్ మహాసాగర తీరంలో ఉండగా, మరాకేష్ మధ్యయుగ, ఆధునిక పొకడలతో విస్తు కొల్పే రీతిలో ఉంటుంది.

మార్మిక భూమి మరాకేష్

మధ్యయుగాల నాడు సహార దిగువ ప్రాంతాల నుండి మధ్యధరా సముద్ర ఓడరేవులకు సరుకులు చేరవేసే వ్యాపారు లకు 'మరాకేష్' ఒక మజిలీగా ఉండేది. నెలల తరబడి నీరు, నిప్పు దొరకకుండా ప్రయాణం చేసి అలసి, సొలసి వచ్చే వారికి మార్మికభూమి మరాకేష్. ఒక్కసారి మధ్యయుగాలకు, ఆ వెంటనే ఆధునిక జీవనాల అనుభవాలు కలిగిస్తుంది. కూల్‌డ్రింక్‌లు, పళ్ళరసాలు, మినరల్ వాటర్ దోరికే కాలంలో తోలు తిత్తులలో నీళ్ళు తెచ్చి లోహపు లోటాలలో పోసి అమ్మే వ్యక్తులు, కాలదోషం పట్టిన అనేక వృత్తులు సాంప్రదాయ చిహ్నంగా ఇప్పటికి కొనసాగడం, జాతకాలు చెప్పే వాళ్ళు, పాములి ఆడించే వాళ్ళు, ఇంద్రజాలం చేసేవారు, పిల్లి మొగ్గలు వేసేవారు, పిప్పి పన్నులు పీకేవాళ్ళు, చెవుల్లో గులిమి

శుభ్రం చేసేవారు – మన చుట్టూ మూగుతుంటారు. అక్కడలేని పురాతన వృత్తి లేదు. వాళ్ళ నైపుణ్యం చూసి అబ్బురపడి సంతోష ప్రకంపనాలకు లోనుకావడం మన వంతు. కొత్త నగరపు వీధుల్లో ఆధునిక భవనాలు, పాత కాలపు ప్రాకార సహిత పాత నగరం మదీనా మనల్ని శతాబ్దాల ముందుకూ వెనక్కూ తీసుకెళుతుంది.

ఇబ్న్ బటూటా – మార్కోపోలో

డా॥ శేషగిరి రచనల్లోని గొప్పతనం ఏమిటంటే ప్రాంతం, వ్యక్తులు, అనుభవాల గురించి మాత్రమే గాక అక్కడి చారిత్రక ప్రాధాన్యాన్ని, ఆ ప్రాంతపు మహనీయుల గురించి చెప్పడమే గాక వారిని ఆయా కాలాల ఇతర వ్యక్తులతో తులనాత్మక మదింపు చేయడం మనకు ఉత్సుకతను కలిగిస్తుంది.

ఆధునిక రవాణా సౌకర్యాల ఆవిష్కరణ లేమీ లేనప్పుడే ఏ యాత్రికుడూ ఇబ్న్ బటూటా అప్పట్లో మనిషికి తెలిసిన ప్రపంచంలో మూడొంతుల భాగాన్ని దాదాపు 30సంవత్సరాల పాటు 75000 మైళ్ళు (భూగోళపు చుట్టు కొలతతో మూడురెట్లు) తిరిగాడని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. 1304లో మొరాకోలోని టాంజీర్ నగరంలో ఇస్లామిక్ న్యాయ వాదుల కుటుంబంలో పుట్టిన బటూటా ఇరవై ఒక్క ఏళ్ళ వయస్సులో కంచర గాడిదను తోడు చేసుకొని హజ్‌యాత్రకు మక్కా బయలు దేరి అలా కొనసాగిస్తూ ఇరవై ఏడేళ్ళ తరువాత మొరాకో చేరుకున్నాడు. ఏ ఒక్క మార్గంలో రెండుసార్లు ప్రయాణం చేయలేదు.

మధ్యధరా సముద్ర ప్రాంతంలోని దాదాపు 40 దేశాలు తిరిగి సమర్ఖండ్, ఆఫ్ఘనిస్తాన్ మీదుగా ఢిల్లీ చేరి తుగ్లక్ కొలువులో న్యాయాధికారిగా పని చేశాడు. ఇస్లాం న్యాయనిర్ణేతగా సుల్తాన్ క్రూరత్వాన్ని భరించలేక వెళ్ళిపోదామనుకునే సమయంలో రాజ ప్రతినిధిగా చైనా ప్రయాణమై, అష్టకష్టాలు పడి, రోగాల బారినుండి, దొంగల బారినుండి, వెంట్రుకవాసిలో మరణాన్ని తప్పించుకున్నా, ఆ బాధలేవీ ఆయన భూభ్రమణాన్ని ఆపలేక పోయాయి. 27 సంవత్సరాల తర్వాత మొరాకో చేరుకుని తిరిగి మళ్ళీ ప్రయాణమై ఎన్నో దేశాల మేధావులు, తత్త్వవేత్తలను కలుసు కున్నాడు. పది వివాహాలు, బానిస యువతులను కొనడం వంటి కొన్ని విపరీత ధోరణులున్నప్పటికి, ఆ కాలపు నీతి నియమాలను అప్పటి సంప్రదాయాల ఆధారంగా మాత్రమే బేరీజు వెద్దామంటారు డా॥ శేషగిరి.

మార్కోపోలో అదే శతాబ్దంలో బటూటా కంటే 70 ఏళ్ళ ముందు పాశ్చాత్య దేశాల వారికి ఏమాత్రం పరిచయం లేని నిగూఢ రాజ్యం చైనా వైపు ఇటలీ నుండి సాహసంతో ప్రయాణించాడు. బటూటా చిరపరిచితమైన ఇస్లామిక్ ప్రపంచంలో యాత్రలు సాగించగా, మార్కోపోలో యూరప్ ఆసియాలకు వారధిగా పని చేశాడు.

మార్కోపోలో ఏళ్ళ తరబడి చైనా ప్రభువు కుబ్లయ్‌ఖాన్ కొలువులో ఉండిపోయాడు. మార్కోపోలో యాత్రలన్నీ కలిసి బటూటా ప్రయాణాల్లో మూడవ వంతు కూడా ఉండవు. భౌతిక సుఖాలు, సౌఖ్యాలు, సిరిసంపదల లాలస వంటివి ఈ యాత్రికులను కట్టి పడేయలేదు. బటూటా రాసిన యాత్రగాథ రిహ్లా. టిమ్ మెకంటిష్ – స్మిత్ చేసిన 'ది ట్రావెల్స్ ఆఫ్ ఇబ్న్ బటూటా' మంచి ఇంగ్లీష్ అనువాదమని, ఏ యాత్రా ప్రేమికుడినయినా ఇది ఆకట్టుకుంటుందని డా॥ శేషగిరి సూచన. దుబాయ్ నగరంలోని అతి పెద్ద మాల్‌కు, చంద్రుని మీద అతిపెద్ద బిలానికి బటూటా పేరు పెట్టారని తెలుసుకున్నప్పుడు ఆ యాత్రికుని యాత్రలు ధన్యమయ్యాయని అనిపిస్తుంది.

ప్రయాణాలు నేర్పే విషయాలు

ప్రయాణాలు అంత సులభం కాదు. ఇవి నేర్పే విషయాలు రెండు. మొదటిది ఓర్పు. రెండవది ఎప్పటికప్పుడు మారే పరిస్థితులకు అనుగుణంగా సమన్వయంతో సర్దుకు పోవడం. మనం ఎంతగా ప్రణాళికలు వేసుకున్నా అనుకున్నట్లు జరుగకపోవచ్చు. మన చేతుల్లో లేనివి చాలా ఉంటాయి. వాతావరణం మారిపోవడం, విమానాలు ఆలస్యం కావడం, ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం, మన సామాన్లు రాకపోవడం,



మదీనా మార్కెట్

సామాన్లు దొంగిలించబడడం, స్థానిక నియమాలు వేరుగా ఉండడం సహజంగా జరిగేవి. ఇందుకు హైరానపడి మనఃస్థిమితం కోల్పోవడం, అతిగా కంగారు పడడం, ఫలితంగా తప్పు నిర్ణయాలు తీసుకోవడం మొదలువుతుంది. యాత్రికులుగా పరిణితి చెందే కొద్ది ఎంత సేపైనా ఎదురు చూడగలగడం, ప్రయాణాల్లో అనిశ్చితను అంగీకరించడం, తప్పనిసరై కొన్ని టూర్లు రద్దు చేసుకోవడం సహజంగా అబ్బుతాయి.

మైమరిచిపోయే ప్రకృతి దృశ్యాలు, సహజ సౌందర్యం ఉట్టిపడే ప్రాంతాలు, ఒకే రకం జంతువులు వందలాదిగా మన చుట్టూ తిరుగుతుండడం, అరుదైన వృక్ష సంతతి, విస్తుగొలిపే నదీనదాలు, భూగర్భ దేవాలయాలు, విస్తారమైన మదీనాలు, రెండు కళ్ళూ సరిపోనంతా వ్యాసంలో ఉండే జలపాతాలు, ఎడారి మధ్యలో ప్రవహించే నైలు నదీ ప్రవాహాలు, అగ్నిపర్వత బిలాలు, స్థానిక ప్రజల సంప్రదాయాలు వారితో ముచ్చటించినప్పుడు పంచుకునే అనుభూతులు ముచ్చట గొలుపుతాయి.

పైవన్నీ ఒక ఎత్తైతే స్థానిక వంటకాల రుచుల మజా ఆస్వాదించడం మరో అనుభూతి. తూర్పు ఆఫ్రికా కాఫి వేడుకలు, స్టార్‌బక్స్ కంటే రుచిగా ఉండే ఇథియోపియన్ కాఫీ, టెఫ్ దినుసులతో చేసే ఇంజరాలు, గుడ్డుతో కూడిన కోడి మాంసం కూర, తేనెతో తయారుచేసే 'బెర్జ్' పానీయం, మింట్ టీ, టర్కీలో ఖలీఫాల కోసం మనముందే కుండలో వండే మటన్ కబాబ్‌లు, సఫారిలో మధ్యాహ్నం పూట చెట్ల క్రింద జంతువుల మధ్య చేసే భోజనం, మట్టి ఒవెన్‌లో చేసే వేడివేడి మొరాకో బ్రెడ్‌లు, చికెన్ టజిన్లు, వెజిటబుల్ కుస్ కుస్‌లు, నారింజ, దానిమ్మ రసాలు మనలో మాయమై పోయిన జిహ్వాలను తట్టిలేపి సంతృప్తి పరుస్తాయి.

ఆత్మ సాక్షాత్కారం

కదలిక అనే భావనే ఉత్తేజకరం. కదలికలోనే జీవ లక్షణముంది. భూగోళం తిరగడం మానేస్తే ప్రపంచం స్థంభించి పోతుంది. ఈ కదలిక, తిరగడం అనే లక్షణం మనుషులందరిలో నిక్షిప్తమై ఉన్న సామాన్య లక్షణం. అవి ప్రయాణాలు కావచ్చు, ఆలోచనలు కావచ్చు.

"విసుగూ, విరామం లేకుండా 50 పదుల వయస్సు దాటిన తరువాత జరిపే ఈ ప్రయాణాలు నా కుటుంబానికి మిత్రులకు నచ్చటం లేదు. ఈ ప్రయాణాలు రికార్డులు బద్దలు కొట్టడానికో కాక, సామర్థ్యాన్ని పరిక్షించుకోవడానికి మాత్రమే. ఎవరెస్ట్, కిలిమంజారో పర్వత శిఖరాల ఎక్కెవారంతా విజయం సాదించకపోవచ్చు. వైఫల్యం చెందితే ప్రకృతి శక్తుల ముందు తలవంచినందుకు గర్వపడతాను. ఆ అందాన్ని అందుకుంటే ఆ పర్వతాలకు, ప్రకృతి మాతకు తలవంచి నమస్కరిస్తాను. ఈ భావనలే స్వాంతనలు."

"పర్యటనల పర్యవసానం ఏమిటంటే, అవి ఆత్మజ్ఞానాన్ని కలుగజేసే యాత్రలు. జీవిత ప్రయాణంలో మన కుటుంబ, సమాజ విధులను నిర్వర్తించడంతో పాటు, ఆ పోరాటంలో అలిసిపోతూ మన ఆత్మపట్ల మనకున్న బాధ్యతలను విస్మరిస్తుంటాము. యాంత్రికంగా అలా పడి కొట్టుకుపోకుండా, సృజనాత్మకతను పెంచుకోవడానికి ఒక్కొక్క ప్రయాణం. నాలో పేరుకుపోయిన అవాంఛనీయ ఉద్వేగాలను, వ్యతిరేక భావనలను క్షాళనచేసి నిర్మల మనస్సును ఏర్పరుస్తుంది. యాత్రలన్నీ ఆత్మ సాక్షత్కారానికి దోహదపడే ఒక అలౌకిక, ప్రగాఢ అనుభూతి." ఈ వాక్యాలు డా॥ శేషగిరి వ్యాస పరంపరల మధ్యలో వెలి బుచ్చిన భావనలు. చిక్కటి భాషలో, పరిమిత పదాలలో భావవ్యక్తీకరణ చేస్తూ, చారిత్రక నేపథ్యం నుండి ప్రస్తుత కాలం లోకి మనల్ని తీసుకువస్తూ చేసే లోతైన విశ్లేషణలు మనస్సుకు హత్తుకుంటాయి.

ప్రయాణాలు ముందు నిన్ను అవాక్కయ్యేలా చేస్తాయి. ఆ తరువాత కథకుడిగా మారుస్తాయి. – బటూటా.

డాక్టర్ నిమ్మగడ్డ శేషగిరి ప్రయాణాల నుండి కథకుడిగా మారి ఆత్మ సౌందర్యాన్ని సాక్షత్కరించుకోవాడానికి, యాంత్రికంగా మారిపోయే మనిషిలోని సృజనాత్మకత అంతరించకుండా కాపాడతాయని తన ప్రయాణాలను అందరికీ ఉపయోగపడే విధంగా జనరంజకంగా చెప్పడం అమోఘం.

చివరగా, డాక్టర్ శేషగిరి ఆంగ్లంలో రాసిన ఆయన అనుభవాలను అందంగా, మూల రచనలలోని ఉత్సుకతను, ఉద్వేగాలను నవోన్మేషంగా వివిధ దేశాల అనుభవాలను డాక్టర్ అట్లూరి జయశ్రీ (లండన్) 'ఊహలకందని మొరాకో'గా పుస్తక రూపంలో అందించిన దాసరి అమరేంద్రల కృషి వెలకట్టలేనిది. తెలుగు చదువరులకు స్ఫూర్తి దాయకం.

ఆచార్య వై. పార్థసారథి
హైదరాబాద్, ఫోన్ : 9000438090

కొప్పర్తి కవితా శిల్పం

– శివాజీ పోతుల

సాహిత్యంలో అనేక ప్రక్రియలున్నాయి. కథానిక, నవల, వచన కవిత, మినీ కవిత, గేయం మొదలైనవి. ప్రతి ప్రక్రియకు ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. ఎంపిక చేసుకున్న వస్తువు తదనుగుణమైన రూపంలో అంటే ప్రక్రియలో పాఠకునికి సులభంగా, ఆకర్షణీయంగా చేరగలిగేలాగా రచయిత పొందుపరుస్తాడు. ఈ పనితనాన్నే శిల్పం అనవచ్చు. ఆంగ్లంలో టెక్నిక్ అనే పదానికి సమానార్థకం తెలుగులో శిల్పం అనే మాట ప్రయోగంలో ఉంది. 'తీసుకున్న వస్తువును అందించే విధానమే శిల్పం' అని, సాహిత్య నిఘంటువులు తెలియజేస్తున్నాయి. ప్రక్రియ ఏదైనా కావచ్చు – ఒక రచయిత రచనలో ఏం చెప్పాడన్నది వస్తువు. ఎలా చెప్పాడన్నది శిల్పం. ఈ వస్తు, శిల్పాలకు సమన్వయం సిద్ధించినపుడే ఆ కవిత్వం లేదా రచనగాని, సాహిత్యం గౌరవం పొందుతుంది. కొప్పర్తి వెంకట రమణమూర్తి రచించినది మూడు కవితా సంపుటాలు మాత్రమే. అవి పిట్ట పాడే పాట కోసం, విషాద మోహనం, యాభైఏళ్ల వాన. అప్పుడప్పుడు కొన్ని వ్యాసాలు రాశారు కానీ, అవి పుస్తక రూపంలోకి రాలేదు. ఈ మూడు కవితా సంపుటులను పరిశీలిస్తే, పిట్ట పాడే పాట కోసం రాళ్ళ మధ్య గలగలమంటూ పారుతూ ఈ ప్రపంచాన్ని నిబిడాశ్చర్యంతో చూస్తూ సాగే సెలయేరులాగ, విషాద మోహనం సుళ్లు తిరుగుతూ, పరవళ్లు తొక్కుతూ ప్రవహించే వరద గోదావరి ఉద్రేకంలాగ, యాభై ఏళ్ళ వాన నింగినీ, నేలను తాకుతూ నిశ్చలంగా అనంతంగా విస్తరించిన ఒక తాత్త్విక సముద్రంలాగా కనిపిస్తాయి. ఈ మూడు పుస్తకాలతో కొప్పర్తి తెలుగు కవిత్వం పై వేసిన ముద్ర చాలా బలమైనది – ఎంత బలమైనది అంటే వీరి కవిత్వంలో ఉండే స్పష్టత, గాఢత, విభిన్నిత తెలుగు కవిత్వంలో ఒక గీటురాయిలా నిలిచాయి. అక్షరంలో ఉండే శక్తి ఎంతటిదో కొప్పర్తికి బాగా తెలుసు 'పునరాగమనం' అనే ఖండికలో ఈ విషయాన్ని వాచ్యం చేస్తారు.

అక్షరాన్ని కూడబలుక్కుని / కుప్పగా పోసుకుంటున్నప్పుడు చెల్లా చెదురైన మెతుకుల్ని ఏరుకుని / ఒక అన్నం ముద్దను చేసుకుంటున్నట్టుగా ఉంది. *(పు. 59, విషాద మోహనం)*

చెల్లాచెదురుగా ఉన్నా ఒక్కొక్క మెతుకు ఏ ఒక్కరినీ బ్రతికించలేదు. అది అన్నం ముద్దగా మారినపుడు అది ఎవరికైనా జీవం పోస్తుంది. విడివిడిగా ఉన్న అక్షరాల్ని కుప్పగా పోసినపుడు అన్నం ముద్దలోని జీవశక్తి అక్షరాల కుప్పలోకి ప్రవహిస్తుంది. అయితే ఆ అక్షరాల్ని కుప్పగా పోయగల శిల్ప రహస్యం కవికి తెలిసి ఉండాలి. అది కొప్పర్తికి బాగా తెలుసు. ఒక "కెథార్సిస్ కోసం" అనే ఖండిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

రాసేటప్పుడు / కాగితం మీద కలం నాగేటి చాళ్లని సృష్టిస్తుంది / చేతి వేళ్లల్లోంచి జీవశక్తి అక్షరాల్లోకి ప్రవహిస్తుంది / రాసిన తర్వాత/ పదాల బోగీలతో వాక్యం రైలు కూత వేసుకుంటూ వెళ్లిపోతుంది / ధ్వని మాత్రం వాతావరణమంతా అలముకుంటుంది... రాస్తే తడి ఆరని అక్షరాన్నే రాయాలి.... ఎప్పుడో వచ్చే ఒక్క శాశ్వత వాక్యం కోసం / జీవితమంతా రాయాలి. *(పు. సం. 13, విషాద మోహనం)*

అని కొప్పర్తి నిర్ణయించుకొన్నారు. మామూలు గీత అక్షరంగా మారితే, కళగా. కవిత్వంగా రూపొందితే అది శక్తివంతమౌతుంది. ఆ అక్షరం ఎలా ఉండాలో కవికి బాగా తెలుసు. అందుకే కొప్పర్తి కవిత్వం నిండా ఈ తడి ఆరని అక్షరాల కుప్పలే కుప్పలు, తెప్పలుగా కనిపిస్తాయి. ఆ కుప్పల్లో శాశ్వత వాక్యాలూ కన్పిస్తాయి. ఇలాంటివి మచ్చుకు కొన్ని పరిశీలిద్దాం. 'పిట్ట పాడే పాట కోసం' కవితా సంపుటిలో 'భృత్యుజాలం' అనే కవిత అధిక్షేప ధోరణిలో సాగుతుంది. ఈ కవితలో ప్రతి పాదం "డు" అనే అంత్య ప్రాస ప్రయోగించారు. తొయ్యడం తన ధర్మమంటాడు.

మనల్ని ముందుకు తోసే విధి తనదేనంటాడు.

తోస్తాడు / బండిని తోస్తాడు / అంచుల్లో నిలబడ్డ మనల్ని అగాధాల్లోకి తోస్తాడు / అనిశ్చితిలో కొట్టుకుంటున్న మనల్ని అయోమయంలోకి తోస్తాడు / చివరకు / వాడే ఒక అభూత కల్పనలా తోస్తాడు.

(పు. 7, పిట్టపాడే పాట కోసం)

వస్తువు బలంగా ముద్రవేసేటట్లు చెప్పే నైపుణ్యం కొప్పర్తికి బాగా తెలుసన్న విషయంపై కవిత తెలియజేస్తుంది. మరణం గురించి తెలిసినవాడికే జీవితం గురించి తెలుస్తుంది. జీవితం గురించి తెలిసినవాడికే మరణం గురించి తెలుస్తుంది. జీవన్మరణం గురించి తెలిసిన కవికి

జీవన్మరణాతీత కాలం గురించి తెలుస్తుంది. అనంతమయిన కాలాన్ని 'కాలస్పృహ' అన్ని ఖండికలో అద్భుతంగా ఆవిష్కరించారు.

మొగ్గ పువ్వులా విచ్చుకుంటున్న సౌందర్యంలో
నేను కాలాన్ని చూస్తున్నాను / కూజాలోంచి కలశంలోకి పడుతున్నట్లు
కాలం ఒంపు తిరగడాన్ని పసిగడుతున్నాను.....
గ్లాసుడు నీళ్లు గటగటా తాగేసిన తర్వాత కానీ
నీళ్లతో పాటు కాలాన్ని తాగానని తెలీదు".....
కాలంగా మారనిదంటూ ఏమీ లేదు
కాలమై నిలిచిందంటూ ఏమీ లేదు.....
లెక్కల్లో కాలముంటుంది కానీ, కాలానికి లెక్కలుండవ్.

(పు. 76, విషాద మోహనం)

ఉషోదయం నుండి అర్ధరాత్రివరకూ వివిధ వాతావరణ పరిస్థితులు వర్ణించినవారున్నారు. అవి కల్గించే అనుభూతులు చెప్పిన కవులున్నారు. కానీ కాలాన్ని ఇంత కళాత్మకంగా ఆవిష్కరించిన కవి కొప్పర్తి ఒక్కరే అనడం అతిశయోక్తి కాదు. విషాద మోహనం కవితా సంపుటిలో 'దిద్దుబాటు' ఖండికలో వర్ణాంతర వివాహం చేసుకున్న తన మిత్ర దంపతులను గురించి ప్రస్థావించారు. ఇది వైయుక్తిక సంభోధానాత్మక కవిత.

అతను నల్లనివాడు / అమె తెల్లనిది / అతను ఆమె చెక్కిట పెళ్ళిచుక్క / ఆమె సప్తసింధులోయ / అతను దండకారణ్యం / అతనిది రాళ్ళను పనిముట్లుగా మలచిన పనితనం / ఆమెది నాగేటిచాళ్ళలో యవలు చల్లిన వారసత్వం / ఆమెది ఊరు / అతని వాడ / అతన్ని కోరి ఆమె / ఆమెని కోరి అతను / వొకే వర్ణం / వాళ్ళు వొకరు వొకరి కోసం / వాళ్ళిద్దరూ వొకరికోసం / ఆ వొకడే వాళ్ళ ప్రపంచం / వాళ్ళిపుడు / ప్రపంచానికి వర్ణమాల నేర్పుతున్నారు. *(పు. 51, విషాద మోహనం)*

ఈ కవిత ద్విస్తర కవిత పైకి చూస్తే ఒక అర్థం స్ఫురిస్తుంది. లోపల, లోతుగా ఆలోచిస్తే మరొక అర్థం స్ఫురించి మనకో సందేశం అందుతుంది. 'వాళ్ళిప్పుడు ప్రపంచానికి వర్ణమాల నేర్పుతున్నారు' అంటే వాళ్ళ ప్రతిరూపమైన బిడ్డకు వర్ణమాల నేర్పుతున్నారని వాచ్యార్థం. వర్ణ వివక్ష పాటిస్తున్న దిక్కుమాలిన సమాజానికి సున్నితంగా ఆదర్శ వివాహం ద్వారా, వర్ణాంతర వివాహం జరిగితే సమసమాజం సిద్ధిస్తుందని విశ్వసించారు.

'నిరపేక్షం' అనే కవిత పూర్తిగా తర్కాన్ని ఆధారంగా చేసుకొని వ్రాయబడింది.

మొదలూ లేదు చివరా లేదు / మొదలంటే రెండు చివరల మధ్య నుండటమే / చివరంటే రెండు ఆరంభాల మధ్య నిలవడమే.....

(పు.సం. 74, విషాద మోహనం)

అంటూ మొదలయిన కవిత "మధ్యనుండటంలో మధ్యన అన్నది నిజం కాదు ఉండటం ఒక్కటే నిజం ఉండటం ఒక్కటే నిజమైనప్పుడు లేకపోవడం కూడా నిజమే అవుతుంది" అంటూ ముగుస్తుంది. కవిత ఎత్తుగడ చివరకు వచ్చేసరికి దాదాపు యు టర్న్ తీసుకొంటుంది. ఇక మధ్య భాగంలో కనిపించే పోలికలు, ప్రతీకలు అన్నీ విషయాన్ని క్రమక్రమంగా ఒక్కో మెట్టూ ఎక్కిస్తూ తారాస్థాయికి తీసుకెళ్ళి వదుల్తాయి. అద్భుతమైన శిల్పనైపుణ్యానికి ఈ కవిత మంచి ఉదాహరణగా నిలుస్తుంది. ఈ తరహా తర్కాన్ని Deductive Logic అంటారు. అంటే ఒక General అంశాన్ని ఒక Specific అంశంతో ముడివేసి రెండు ఒకటే అని చెప్పటం. దాదాపు ఇట్లాంటిదే నిర్నిద్రం పేరుతో మరోకవిత యాభైఏళ్ల వానలో ఉంది.

చీకటనీ వెలుతురనీ / రెండుంటాయంటాం కానీ
ఉండేది చీకటే / వెలుతురు వచ్చి వెళుతుంది
శబ్దాన్నీ నిశ్శబ్దాన్నీ / వేరు పరుస్తాం కానీ
ఉండేది నిశ్శబ్దమే / దాన్ని భగ్నం చేస్తే / శబ్దం పుడుతుంది.....

(పు.సం. 74, యాభై ఏళ్ల వాన)

ఈ కవితలోని తర్కం కూడా చకితుల్ని చేస్తుంది. కొప్పర్తి కవితా నిర్మాణంలో కనిపించే తర్కం అతని కవిత్వాన్ని ప్రతిభావంతం చేస్తుంది. ఇది పారడాక్సికల్ వ్యక్తీకరణ కాదు. భిన్న–విరుద్ధ భావాలను తీసుకొని రెండూ ఒకటే అనే తార్కిక ప్రతిపాదన చేయటం. కొప్పర్తి శిల్ప వైవిధ్యాన్ని గమనిస్తే మనకు తెలిసేదేమిటంటే వారి కవితల్లో పేలవమైన మాటల్ని, వాక్యాన్ని అర్ధ స్ఫోరకం కాని భావాలు కానీ కనిపించకపోవచ్చు – పైన కవితలని పరిశీలిస్తే ఆ విషయం గమనించవచ్చు. అల్పాక్షరాలలో అనల్పార్థం సాధించడమే శిల్ప విదగ్ధత. ఇది కొప్పర్తికి బాగా తెలుసు కనుకనే, ఇంతటి శిల్ప నైపుణ్యం సాధించారు.

పోతుల శివాజీ - ఫోన్: 772 990 3035.



వడ్డెర చండీదాస్ హిమజ్వాల

వడ్డెర చండీదాస్ బాగా చదువుకున్న వ్యక్తి. మన సాహిత్యాన్నే కాక, పాశ్చాత్య సాహిత్యాన్ని కూడా ఎంతగానో చదివారు. సంగీతం, నృత్యం, చిత్రకళలులాంటి లలితకళలపట్ల గాఢానురక్తి ఉంది. వీటన్నిటి ప్రభావం ఆయన మీద ఉంది. అలాగే చండీదాస్ కు రచయిత బుచ్చిబాబుగారంటే ఎంతో అభిమానం. హిమజ్వాల ఆయనకే అంకితం ఇచ్చారు. బుచ్చిబాబు ప్రభావం చండీదాస్ గారి మీద చాలా వుంది, ముఖ్యంగా వర్ణనాధోరణిలో.

కృష్ణచైతన్య ఈ కథకి నాయకుడు. గీతాదేవి నాయిక. ఓ రాత్రి కృష్ణచైతన్య కారులో వస్తుండగా, ఓ సందుమలుపులో ఒక దొంగ ఓ స్త్రీ మెడలో గొలుసు తెంపి, ఆమెని గాయపరిచి పారిపోవటం కనిపించింది. అచేతనంగా ఉన్న ఆమెని తన బంగళాకి తీసుకొచ్చి ఉపచర్యలు చేశాక ఆమె కోలుకుంది. ఆమే గీతాదేవి.

కృష్ణచైతన్య ఫిలాసఫీ లెక్చరర్. తల్లి చాలాకాలం క్రితం మరణించింది. తండ్రి ఇంజనీర్. పెద్దస్థాయి ప్రభుత్వాధికారి. ఆయన ద్వారా కృష్ణచైతన్యకి కారు, బంగళా, చేతినిండా డబ్బు, కోరుకున్న సౌకర్యాలు సమకూరాయి. ఈ రకంగా ఏ లోటూ లేదు.

గీతాదేవికి ఎవరూ లేరు. డిగ్రీ పరీక్షలు రాసి పరీక్షా ఫలితాల కోసం ఎదురు చూస్తోంది. ఆమె తండ్రి ఓ జమీందారుగారి అమ్మాయిని ప్రేమించాడు. పెద్దలు ఒప్పుకోకపోవటంతో వాళ్లిద్దరూ ఉత్తరాదికి పారిపోయారు. వాళ్లకి కలిగిన ఏకైక సంతానం గీతాదేవి. కొంతకాలానికి గీతాదేవి తల్లి చనిపోయింది.

కృష్ణచైతన్య భావుకుడు. అలౌకిక సౌందర్యప్రియుడు. ప్రపంచం తీరులోని చాలా చాలా నచ్చక నైరాశ్యం చెందుతూ, నచ్చిన దానికోసం పరితపించే నిత్యా న్వేషి. మనసు మెత్తన, భావ కాఠిన్యతకల విచిత్ర వ్యక్తి. ఎవరినీ దేనినీ లక్ష్యపెట్టాల్సిన అవసరం లేని జీవితం. అతను ఉంటున్న బంగళా పేరు నఫీజ్‌మంజిల్. తండ్రి పనిమీద వెళ్లటం వల్ల ప్రస్తుతం ఒక్కడే ఉంటున్నాడు. చాలామంది పని వాళ్లకి సెలవిచ్చి పంపించేశాడు. కొద్దిమంది పనివాళ్లతో ఉన్న ఆ బంగళాలో అతనికీ, గీతాదేవికీ స్వేచ్ఛకి ఏమాత్రం లోటులేదు.

వాళ్లిద్దరూ నఫీజ్‌మంజిల్‌లో అలాగే రోజులు గడుపుతున్నారు. చూపులు కలుసుకుంటున్నాయి. మార్మికంగా మనసులు ముచ్చటించుకుంటున్నాయి. ఇద్దరూ కలిసి నఫీజ్‌మంజిల్ చుట్టుపక్కల గుట్టలు, పచ్చిక మధ్య తిరుగుతున్నారు. కబుర్లు చెప్పుకుంటున్నారు. భావాలు పరివర్తన చెందుతున్నాయి. సామీప్యంవల్ల చాలా చాలా కల్లపడుతున్నాయి.

'ఆమె శరీరం ఆమె బట్టల చుట్టూ వ్యాపిస్తోంది. అతని రక్తం లావాలా చిక్కబడుతోంది...' అంటూ రాశారక్కడ చండీదాస్.

నఫీజ్‌మంజిల్‌లో వీరిద్దరి సంబంధం మరింత ముందుకు సాగింది. పరస్పర ఆకర్షణ, శారీరక కాంక్ష పెరిగాయి. ఒకర్నొకరు యథేచ్ఛగా ముట్టుకుంటు న్నారు. పెదాలు కలుస్తున్నాయి. కానీ ఇద్దరి మధ్య శారీరక కలయిక జరిగిందోలేదో మాత్రం చండీదాస్ స్పష్టపరచలేదు.

ఆమె తీవ్రంగా దుఃఖించింది. 'హిమాలయం లావాలా ప్రజ్వరిల్లిన మహోజ్వల ఘడియ అది,' అంటారు చండీదాస్. కాస్సేపటికి ఆమే నెమ్మదిం చింది. ఓ నిర్ణయానికి వచ్చింది. కృష్ణచైతన్యకి ఉత్తరం రాసి, దిండుకింద పెట్టి వెళ్లిపోయింది.

ఆ ఉత్తరంలో చివరి వాక్యం...'ప్రొఫెసరుగారూ మనిషికి ఆకలి వేసేది ఒక్క కడుపులోనే కాదు,' అని.

గీతాదేవి అవసరాలన్నిటినీ ఎంతో జాగ్రత్తగా పట్టించుకున్న కృష్ణచైతన్యకి, ఆమె అసలైన అవసరం ఏమిటో తెలియలేదు. ఇరు హృదయాలూ తీవ్రంగా గాయపడ్డాయి.

పద్మ భర్త గీతాదేవితో మర్యాదగానే ఉండేవాడు. అలాంటిది పద్మ ఇంట లేని ఓరోజు గీతాదేవితో అసభ్యంగా మొరటుగా ప్రవర్తించి బలాత్కరించాడు. ఎదురుతిరిగి తప్పించుకుంది. కానీ పద్మకి మాత్రం జరిగిందానికి పూర్తి భిన్నంగా చెప్పాడు.

గీతాదేవి తనని వలలో వేసుకోవాలని బరితెగించి ప్రవర్తించిందని చెప్పాడు. భర్త మాటల్నే నమ్మింది పద్మ. ఇంక ఆ అబద్ధాల వాతావరణంలో ఉండలేక బయటికొచ్చేసింది గీతాదేవి.

అలా బయటకు వచ్చిన ఆమె తిరిగి తను ఇదివరకు ఉన్న హాస్టల్‌కే వెళ్లింది. కృష్ణచైతన్య స్నేహితుడు శశాంక్ కనిపించాడు ఓరోజు. అతని మిత్ర బృందాన్ని పరిచయం చేశాడు. గీతాదేవికి ఉద్యోగం కోసం ప్రయత్నాలు సాగాయి.

తిరుగుతూ తిరుగుతూ కృష్ణచైతన్య ఊటీ చేరాడు. అక్కడ చిదంబరరావు, ఆయన భార్య మాధురీదేవి పరిచయం అయ్యారు. ఆయన పెద్ద ఉద్యోగి, ధనవంతుడు. ఆరోగ్యం పాడైంది. వ్యాధి ఏమిటో సరిగ్గా అంతుచిక్కలేదు. కానీ ఏడాది, ఏడాదిన్నరకు మించి బతకడని వైద్యులు తేల్చారు. ఊటీ అయితే మేలని అక్కడికొచ్చి ఓ బంగళాలో ఉంటున్నారు. కొద్దిదూరంలోనే మరో బంగళాలో కృష్ణచైతన్య మకాం.

చిదంబరరావుగారు పరిచయమైనది మొదలు కృష్ణ చైతన్యని వదలలేదు. మాధురీదేవి అంతగా బయటపడకపోయినా ఆవిడా వదల్లేదు. వాళ్లింట్లో బాగా చనువు అలవాటు చేశారు అతనికి. చివరికి ఓ రాత్రి తనంతగా తానే తెగించి, కొంత వరకూ బలవంతం చేసి మాధురీదేవి కృష్ణచైతన్యని లొంగదీసింది.

అందమైన ప్రౌఢ... ఆమె మత్తులో, మైకంలో నిండుగా మునిగిపోయాడు. ఎలాగా చనిపోతున్న భర్తని మరింత తొందరగా చంపేయాలని నిద్రమందు మోతాదు పెంచింది. ఓ బైరాగి ఇచ్చిన గుళికవల్ల చిదంబరరావుగారి ఆరోగ్యం బాగుపడిపోయింది. అప్పుడిక మాధురీదేవి ప్లేటు మార్చింది. భర్తకి సహధర్మచారిణినే అంది. ఆ దంపతులు ఇద్దరూ తిరిగి వెళ్తూ కృష్ణ చైతన్యని తమ వెంట రమ్మన్నారు. ఆ ఇరుకు, ఇరకాటం తట్టుకోలేక, వాళ్లకి చెప్పకుండానే నిఖిలానంద ఆశ్రమానికి వెళ్లిపోయాడు. ఇక్కడికి హిమజ్వాల మొదటిభాగం అంటే, 210 పేజీలు పూర్తి.

శశాంక్ సమాచారం మేరకు విశాఖలో లెక్చరర్ ఉద్యోగంలో చేరింది గీతాదేవి. హాస్టల్లో ఉంటోంది. విశాఖ రాకముందే బొంబాయిలో ఎమ్.ఏ పూర్తి చేసింది. చిన్న చిన్న ఉద్యోగాలు చేసి, ట్యూషన్లు చెప్పి అలా కాలం గడిపింది. మంచి మిత్రుడిగా శశాంక్ సహకారం ఎంతో ఉపయోగపడింది. అతనిద్వారానే, కృష్ణచైతన్య నఫీజ్‌మంజిల్‌ను వదిలి ఎక్కడెక్కడో తిరుగుతున్నాడని తెలిసింది. బాధపడింది. 'కృష్ణా– నువ్వు విశిష్ట వ్యక్తివి... జీవితంలో తొలిసారిగా మనసు తొణికి నది నీ దగ్గరేకదా!' అనుకుంది.

బొంబాయి నుంచి విశాఖవస్తూ హైదరాబాద్‌లో ఆగినప్పుడు నఫీజ్ మంజిల్‌కి ఫోన్ చేసింది. అక్కడ కృష్ణచైతన్య తండ్రి ఉంటున్నారని తెలుసు. కానీ జవాబు ఎవరో చెప్పారు, కృష్ణచైతన్య రెండేళ్లుగా అక్కడ లేడని. ఒకవేళ కృష్ణచైతన్య తండ్రే తారసపడి ఉంటే, మీ అబ్బాయితో పెళ్లిచెయ్యండి అని అడిగి ఉంటే... ఇలాంటి అస్థిరమైన ఆలోచనలు వచ్చాయి గీతాదేవికి. ఉద్యోగం చేస్తోంది. రీసెర్చి చెయ్యాలనే ఉంది. ఆ అవకాశం రాగానే తిరిగి బొంబాయి వెళ్లాలని ఉద్దేశం.

సహోద్యోగి బంధువు శివరాంతో పరిచయమైంది. అతను వెంటపడీ వెంట పడీ పెళ్లి చేసుకుంటానన్నాడు. ఎంతగానో ప్రేమిస్తున్నాను, ఆమె ఏం చెప్పినా చేస్తాను అన్నాడు. అన్నాళ్లూ పెళ్లి అంటే పట్టించుకోలేదు. ఎన్నాళ్లిలా అనిపించింది. పైగా శివరాంతో అంతకుముందే చెప్పింది. ఇంతకాలం జీవితంలో కోర్కె తీర్చు కోలేదని, ఎందుకు ఒప్పుకుందో స్పష్టంగా తెలియ కుండానే 'సరే' అంది. కానీ ఏ తతంగం లేకుండా, ఆ క్షణం నుంచీ భార్యాభర్తలుగా ఉందామంది. శివరాం అందుకు అంగీకరించాడు. మంగళసూత్రాలు, పసుపుతాడు తనకి ఇష్టమని చెప్పి మరీ కట్టించుకుంది. శివరాంతో సంసారం కొద్దికాలమే సాగింది. ఇద్దరికీ పొసగలేదు. ముఖ్యంగా శారీరక కలయిక విషయంలో అతనికి శరీరాలకలయిక పూర్తిగా యాంత్రికం. కసితీరా నలపటం, హింసిస్తున్నట్లు ప్రవర్తించటం అలవాటు.

ఆమె దృష్టి అదికాదు. 'శరీరం మాంసపు యంత్రం కాదు. మీట నొక్కి నురగ కక్కించ టానికి. శరీరం ఒక శతతంత్రుల వీణ. మీటి ఆ తంత్రుల మీద మూర్ఛనలు పోతేనే రససిద్ధి,' అని అతనికే స్పష్టంగా చెప్పింది. అది విని శివరాం హేళన చేశాడు. ఆమెను కామపిశాచి అన్నాడు. ఇద్దరి మధ్యా ఘర్షణ పెరిగింది. అరకులోయకి వెళ్లినప్పుడు ఆ ఘర్షణ మరీ విపరీత స్థాయికి చేరింది. ఆమె తట్టు కోలేకపోయింది. అతను వదిలిపొమ్మనమని తిట్టాడు. పుస్తెలు తీసి, ఇచ్చేయమన్నాడు. అలాగే చేసింది. అలా చేసినప్పుడు తండ్రి గుర్తొచ్చాడు గీతాదేవికి. తండ్రి కోరిక మేరకు ఆత్మ జీవించి ఉండే బతుకే బతకాలనుకుంది.

వర్షంలో పూర్తిగా తడిసిపోయి, రోడ్డుమీద ఒంటరిగా నడుస్తోంది. అటుగా జీప్‌లో వెడుతున్న చీఫ్ ఇంజనీర్ విజయ సారథి ఆమె దగ్గర జీపు ఆపి, వాల్తేరులో దింపుతానని ఎక్కించ కున్నాడు. వాల్తేరుకే కాక, అక్కడ్నుంచి ఏకంగా హైద్రాబాద్‌కే తీసుకొచ్చాడు గీతాదేవిని ఆయన. దారిలో చాలా చాలా జరిగాయి. ఆ పెద్దాయన అన్నిరకాలుగా నచ్చాడు గీతాదేవికి.

ఆయనంటే మమత, కాంక్షా కలిగాయి ఆమెకి. ఆయన సాహచర్యం ఎంతో ఉపశమనంగా ప్రశాంతంగా ఉండి, తనని తాను అర్పించుకుంది. సుషుప్తి లాంటి స్థితిలో కలిసిపోతోంది. చల్లగా గడ్డకట్టడాలు, వెచ్చగా రగలటాలూ లేవు. అంతా ప్రశాంతి, కాంతి అంటాడు చండీదాస్– ఆ కలయిక గురించి. ఇన్నాళ్లూ తను చూడనిది, తను స్పృశించనిది, తను ఎరగని... ప్రేమ అంటే ఇదే కాబోలు అన్న తాదాత్మ్యం గీతాదేవికి. హైద్రాబాద్ చేరి, ఆ బంగళాకి చేరారు. నిశ్చేష్టురాలైంది. ఆ బంగళా నఫీజ్ మంజిల్. విజయసారథి కృష్ణచైతన్య తండ్రి. ఆమెకి కన్నీరు పెల్లుబికి తెరలు తెరలుగా వస్తోంది.

అయినా గీతాదేవి విజయసారథి నుంచి వెళ్లిపోలేదు. నఫీజ్‌మంజిల్‌లో ఆయనతోటే ఉంటోంది. 'రాలిపోయే ఈ పండుటాకు కోసం ఒక్క నాలుగురోజులు జాలిపడి నాతో ఉండ లేవా?!' అనడిగాడు ఆయన. 'మీకోసం కాదు, నాకోసం ఉంటాను. నేను మిమ్మల్ని ప్రేమించాను,' అంది. ఆ బంగళాలో వారిద్దరి ఉనికి అద్భుతం. ఆమెలో అద్భుత ప్రశాంతి ఆయనకి, చనిపోయిన ఆయన భార్య జ్యోతి తిరిగి అలా వచ్చిన భ్రాంతి. ఒకరికొకరు

ఎంతగానో కావాలి. మరేం అఖ్ఖర్లేదు. అలాగే ఉండిపోయారు.

ఆశ్రమం నుంచి బెంగళూరు వచ్చాడు కృష్ణచైతన్య. ఆశ్రమంలో ఉండగా డి.లిట్‌కి రాశాడు. నిజానికి డి.లిట్ కాదు తనకి కావాల్సింది. తనకి కావాల్సింది తనే. తనేమిటో తెలుసుకోవాలి. ఆ తపనలో గీత ఉంది. ఓ ఆరనిజ్వాలలా గడుపుతున్నాడు. తాగాడు, తిరిగాడు. తిరుగుబోతు అయ్యాడు. శాంతి లేదు. అంత అశాంతిలోనూ, తన రీసెర్చి కాయితాలు రిజిస్ట్రార్‌కి పంపించాడు. స్టెల్లా, లీల, సావిత్రి... ఏదీ ఎవరితోనూ సుఖం లేదు. బెంగళూరు వదిలి మద్రాసు వెళ్లాడు. అక్కడా ఉండలేక హైద్రాబాద్ బయల్దేరాడు. విజయవాడ స్టేషన్‌లో అనుకోకుండా శశాంక్ కలిసి కృష్ణచైతన్యని అక్కడ దింపేశాడు. తనింటికి తీసుకెళ్లాడు. శశాంక్‌తోటే ఉన్నాడు కృష్ణ.

కృష్ణచైతన్య బాగా చిక్కిపోయి, ఎంతగానో పాడైపోయాడని బాధపడ్డాడు శశాంక్. శశాంక్ ద్వారా చాలా విషయాలు తెలిశాయి. అనుకోకుండా మాధురీదేవి కలిసింది. ఆమె ఎవరో ఎ.కె. స్వామి అనే అతన్ని పట్టుకుంది.భర్త చనిపోయాడు. గీతాదేవి నఫీజ్‌మంజిల్‌లోనే విజయసారథిగారితో ఉందని చెప్పాడు శశాంక్. అదే సమయంలో గీతాదేవి నుంచి వచ్చిన టెలిగ్రాం ద్వారా విజయసారథి గారి మరణవార్త తెలిసింది. వెంటనే హైదరాబాద్‌కి వెళ్లారు.

తండ్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి. గీతాదేవిని చూశాడు. విషయాలన్నీ తెలిశాయి. ఆమె చెప్పింది. తన తండ్రిని దీవించి, తనని రక్షించటానికొచ్చిన మౌన శోకదేవతలా అనిపించింది అతనికి. వెళ్లిపోతానన్న ఆమెని వెళ్లనీయలేదు అతను. 'అప్పుడు నాదే పొరపాటు, నాకు తెలియని పొరపాటు. అప్పటినుంచి వెర్రిగా తిరుగుతున్నాను... బహుశా నీ నుంచి నాలోని నీ నుంచి పారిపోవాలని...' అన్నాడు. 'నాలో... అస్తిత్వం అంతటిలో నిండిపోయిన నా గీతని నేను విడవలేను,' అన్నాడు.

ప్రేమ అన్న భ్రమ వేరు, ప్రేమ వేరు అనీ, తను జీవితంలో తొలిసారిగా ప్రేమించిన వ్యక్తి విజయసారథి అని, నాలుగు నెలలుగా అందుకే అక్కడ ఉన్నాను, తనిప్పుడు కృష్ణచైతన్యకి పిన్నినని చెప్పింది. అలా ఇద్దరూ తపనపడి, తర్కించుకుని, అవుననుకుని, మళ్లీ కాదనుకుని చివరికి కలిసి నఫీజ్‌మంజిల్‌లోనే జీవించాలన్న నిర్ణయానికొచ్చారు. దానికి అడ్డుగా నిలిచిన వ్యక్తుల్నీ పరిస్థితుల్నీ సరిచేశాడు కృష్ణచైతన్య. విజయసారథిగారు ఆమెను తీసుకురాలేదని, తనే ఆమెను తండ్రి దగ్గరకు తోడుగా పంపించానన్న అందమైన అబద్ధం ప్రచారంలోకి తెచ్చాడు.

అంతా బావుందనుకున్న సమయంలో గీతాదేవి మాజీ భర్త శివరాం వీళ్లని చూడటం, నఫీజ్‌మంజిల్‌కి రావటం, ఘర్షణ పడటం, ఏకాంతంగా మాట్లాడటం, ఎంత ప్రాధేయపడినా తన మాట తీసిపారేసిందన్న కసితో, అక్కసుతో గీత పీక నులిమి, తన తలతో ఆమె తలను బాది ఆమెని చంపి తనూ చనిపోయాడు.

అంతా తెలిశాక కృష్ణచైతన్య 'జీవితం సమాప్తమవలేదు. ఇంకా జరగాల్సింది ఉంది. అంత్యక్రియలు వీళ్లవికావు, నిరంతరం జరిగే తన 'అంత్యక్రియ'లనుకున్నాడు. అదీ నవల ముగింపు.

గీతాదేవి చనిపోయి, కృష్ణచైతన్య జీవశ్చవంలా మిగిలిపోయాక, ఈ నవల మనకేమిచ్చింది. ఏం మిగిల్చింది అన్న సందేహం, అసంతృప్తి కలుగుతాయి. ఏదో మత్తుపదార్థం వల్ల మెదడుకి పట్టిన మొద్దుతనంలా ఉంటుంది– హిమజ్వాల చదువుతున్నప్పుడూ, చదివిన తర్వాతా కూడా. హాయిగా, ప్రశాంతంగా ఉండేది ఏదీ ఈ నవలలో లేదు. జీవితంలోని విపరీత ధోరణుల సమాహారం ఇది. చదివి బాధపడాలి. బాధపడుతూ చదవాలి. అలా అని ఈ నవలలో ఏమీ లేదని కాదు. భౌతికపరమైన సంఘటనలకన్నా, అనుభూతిపరమైన రససిద్ధి ఎంతో విలువైందన్న ప్రతిపాదన ఉంది. వెలుగు మరక, అనుభూతి సిగ్గెరుగదట, మరీచికాన్వేషణలాంటి నూతన పద బంధాల శీర్షికలు ఉన్నాయి. గీతాదేవి, కృష్ణచైతన్యల లాంటి పాత్రల తీరు, వాటి నిర్మాణం, అప్పుడే కాదు ఇప్పటికీ కొత్తదనం ఉన్నవే. పలుచోట్ల వర్ణనల్లో, భావనల్లో విలక్షణత్వం చండీదాస్ గారికే తగినవి. చాలారకాల రచనా ప్రయోగాలున్నాయి. ముఖ్యమైన మరో విషయం ఉంది. సమాజంలో ఉన్నవే అయినా, చాలామంది అక్షరబద్ధం చెయ్యటానికి సాహసించని లైంగిక సంబంధాల్ని చండీదాస్ ధైర్యంగా రాశారు. సమస్య ఉందని ముందు గుర్తిస్తేనేగా దానికి సమాధానపడటం ఎలాగో తెలిసేది. ఒకే స్త్రీకి తండ్రితోటి, కొడుకుతోటి లైంగిక సంబంధం అన్నది చాలా జటిలమైన, సున్నితమైన సమస్య. దాన్ని చిత్రించి, ఎలా సమాధానపడే అవకాశం ఉందో చండీదాస్ సూచించారు. కానీ తిరిగి తనే దాన్ని గీతాదేవి మరణరూపంలో ధ్వంసం చేశారు. గీతాదేవి మరణం లేకపోతే, నవల మరింత తెగువగా, ధైర్యంగా ఉండేది. మానవజీవితాన్ని సార్థకంచేసి, లక్ష్యాత్మం చేసే అనుభవాతీతమైన విలువలు– అంటే అల్టిమేట్ వ్యాల్యూస్ కలిగిన ఇటువంటి పాత్ర అసంపూర్ణంగా అసహజంగా జీవితం చాలిస్తే ఆ విలువలకు ఏమర్థం? ఏం ప్రయోజనం? అలాంటి వ్యక్తిత్వమున్న వారికి అలాంటి ముగింపే ఉంటుందని చెప్పటం కాదా?!' అని రామిశెట్టి చంద్రశేఖర ఆజాద్ ఈ నవలను ఆకాశవాణిలో విశ్లేషిస్తూ ప్రశ్నించారు. చండీదాస్ వ్యక్తిగత నైరాశ్యం, జీవితంపట్ల అసంతృప్తే ఈ ముగింపేమో అనిపిస్తుంది.

వి. రాజా రామ్మోహన్ రావు
హైదరాబాద్, సెల్ నెం : 9394738805

వేమన పద్యాల్లో 'అమ్మ' - 'ఆలి'

– జె. మధుబాబు

వేమనను ప్రజాకవిని చేసిన సాహిత్య నేపథ్యం తెలియని వారుండరు. సామాన్యునికి సైతం తేలికగా అర్థమయ్యే సరళత్వం వేమన సాహిత్యపు ప్రత్యేకత. అయితే వేమన సాహిత్యాన్ని అపార్థం చేసుకున్నవారు లేకపోలేదు. అలాంటి అపార్థమే–వేమన స్త్రీల గురించి చులకనగా చెప్పాడనే విమర్శ. మంచి చెడుల మర్మాన్ని విడమర్చి చెప్పడం వల్లే, ఈ అపనింద వచ్చివుండవచ్చు. నిజానికి ప్పుడు నిష్మూరంగా ఉంటాయనడం ఇందుకేనేమో! అయితే అవి వేమన పద్యాల్లో చాచిలెంపకాయ కొట్టినంత పనిచేస్తాయి. మరింత చురుక్కుమనిపిస్తాయి. మూఢ విశ్వాసులకు అవి మింగుడు పడవు. ఈ కారణంగానే వారు పై విమర్శచేసి వుండవచ్చు.

వేమన తన జీవిత అనుభవసారాన్ని ఆశువుగా, చాటువుగా చాటింపేశాడు. ఇందులో చాటుమాటులకు తావు లేదు. వేమన్న ఏమన్న దానికి తార్కికత వుంటుంది. నిష్కర్షగా పలికిన ప్రతిపలుకు జీవిత రహస్యాలను బట్టబయలు చేస్తుంది. నగ్నసత్యాలను ఆవిష్కరిస్తుంది. స్త్రీల పట్ల అవాజ్యమైన ప్రేమాభిమానాలను వేమన ఇలా చాటుకుంటాడు.

"అమ్మ సుమీ ఆలనగా
అమ్మనగా నాలు సుమ్మీ యా యిద్దరిని
ఇన్మహిలో పరమాత్ముని
నెమ్మదిలో తెలియ దాని నేర్పరి....."

అంటే వాగ్దేవత అమ్మగా ఎలా పరిగణించబడుతుందో అలాగే ముక్తికాంత కూడ ముక్తి దేవతగా, అమ్మగా పరిగణించబడుతుంది. అందుకే వేమన అమ్మయే ఆలి, ఆలియే అమ్మ అంటాడు. ఇందులో సామాన్యులకు బోధపడని ముక్తితత్వం ఇముడివుంది.

అమ్మ, అక్క, అత్త, ఆలి, చెల్లి వీరంతా శారీరక నిర్మాణంలో, సృష్టిలో ఒకేరీతిని నిర్మింపబడిన స్త్రీమూర్తులే. అయితే పురుషుడు వైవాహిక జీవితాన్ని తన ఆలితో మాత్రమే పంచుకుంటాడు. భగవంతుడు మానవునికి ప్రసాదించిన ఈ విచక్షణాజ్ఞానానికి స్పష్టమైన చిహ్నమిదే. ఈ ధర్మం పశుపక్షాదులందు కనిపించదు. ఈ మానవ ధర్మాన్ని ఎవరైతే పాటించరో వారిని పశువుగా పోల్చవచ్చు. జీవన నాటకరంగంపై తల్లి, కోడలు, కూతురు పాత్రలు ఒకరే పోషిస్తూ, మానవ సంబంధాలను ఎలా నిర్వర్తిస్తారో వేమన ఇలా అంటాడు.

" తల్లి యాలు యాయే
తగుగా కోడలునాయే
కోడలనంగ కూతురాయే
మాయ విడక ముక్తి మహినింకకల్గదు....." అంటాడు.

తల్లి అనగా తన తండ్రి భార్య అగును. ఆమెయే యెకరికి (మామకు) కోడలు, కోడలనగా నొకరి (అమె తండ్రికి) కూతురు. ఇలా ఒకరే అనేక రీతులుగా పిలువబడడం గమనించవచ్చు. అలాగే ఈ మాయా విశేషం అనేక రీతులుగా భ్రమలుపెట్టి జీవులను ఆడిస్తున్నాయని, ఈ మాయలో సర్వం అస్థిరమని వేమన అంటారు. అలాగే తల్లి, తండ్రి, అన్నదమ్ములు, భార్యా బిడ్డలు, ఆస్థిపాస్తులు,పేరుప్రఖ్యాతలు చివరకు ఈ దేహం సర్వం మాయని, ఈ మాయని గెల్వగలిగేవాడే నిజమైన మర్మజ్ఞుడని ప్రభోదించిన వేమన ఈ పద్యాల్లో యోగిలా దర్శనమిస్తాడు.

"ఆలుసుతులు మాయ
యన్నదమ్ములు మాయ
తల్లిదండ్రిమాయ తనువు మాయ
తెలియనీదు మాయ దీనిల్లుపాడాయే....."

మరో సందర్భంలో...

" సతులు సుతులు మాయ సంసారములు మాయ
ధనముఘనము మాయ తనువు మాయ
మాయగెల్చువాడు మర్మజ్ఞుడగుయోగి...." అంటూ సంసారిక విషయాలను మాయగా తలుస్తాడు వేమన.

మరో పద్యంలో ఎవడైతే తల్లిని తెలుసుకుంటాడో వాడు దైవాన్నికూడ తెలుసుకుంటాడని అమ్మతత్వంలోని అమృతాన్నిలా వివరిస్తాడు.

" తల్లినెరుగువారు దైవమ్మునెరుగును
మన్ననెరుగువాడు మిన్ననెరుగు
మిన్నుమన్నెరిగిన తన్నుతానెరుగురా....." అని అంటాడు.

తల్లి బిడ్డ కడువు చూస్తే భార్య భర్తజేబు చూస్తుందనే నానుడికి దగ్గరగా వుండే పద్యం.

" తల్లియున్నప్పుడె తనదుగారాబంబు
ఆమెపోవ తనను అరయరెవరు
మంచికాలమపుడే మరియాదనార్జింపు....."

అంటే తల్లి ఉన్నప్పుడే ఎన్ని వేషాలు వేసినా ఎన్ని గారాబాలు పోయిన. ఆమె పోయిన తర్వాత నిన్నెవరు పట్టించుకోరని హెచ్చరిస్తు మంచి సమయంలోనే మరియాదను సంపాదించుకోమని వేమన హితభోధ చేస్తున్నాడు. అలాగే వేమన ఆలి అవసరాన్ని ఇలా వర్ణిస్తున్నాడు.

"అమ్మలేకపోతే అన్నానికే బాధ
అయ్యలేకపోతే అప్పుబాధ
ఆలిలేని బాధ అంతింతకాదయా...." అని అంటాడు.

అలాగే మరో సందర్భంలో భార్య ఔచిత్యాన్ని చక్కని ఉపమానంతో వేమన ఉదహరిస్తాడు.

"గుణతివగు యువతిగృహము చక్కగనుండు
చీకటింట దివ్వెవెలుగురీతి
దేవియున్న గృహము దేవాతర్చన గృహము..."

అంటే గుణవంతురాలు గృహిణిగా ఉన్న ఇల్లు కడు శోభాయమానమై సుఖశాంతులతో, భోగభాగ్యాలకు నెలవై వుంటుంది. ఇంకా ఆమె చీకటింట్లో దీపంలా కుటుంబానికి ఆదర్శప్రాయమై నిలుస్తుందని, అలాంటి స్త్రీలు ఉన్న ఇల్లు దేవతల నిలయంగా ఉంటుందని వేమన పేర్కొనడాన్ని పై పద్యంలో గమనించవచ్చు.

మరో సందర్భంలో భార్య గుణగణాలను ప్రస్తావిస్తు కలిమిలోనే కాకుండా లేమిలో సైతం నిలబడగలిగే గుణం భార్యకుండాలని వేమనంటాడు.

"ఆపదగలవేళ నరసి బంధువులచూడు
భయమువేళ జూడు బంటుతనము
పేదవేళ జూడు పెండ్లాముగుణము...."

మరో సందర్భంలో భార్యమాటను గౌరవిస్తూనే పురుషుడు మంచి చెడుల విచిక్షణ పాటించాలంటాడు వేమన.

"ఆలిమాటలువిని అన్నదమ్ములరోసి
వేరేపోవువాడు వెర్రివాడు
కుక్కతోకబట్టిగోదావరీదునా...." అని హెచ్చరిస్తాడు.

మరో పద్యంలో... **"ఆలివంకవారలాత్మబంధువులైరి**
తల్లివంకతగినపాటి
దండ్రివంకవారు దాయాదిపగవారు...."

ఇకపోతే వివాహనంతరం వేమన తన ఆలిని వదిలి వెల యాలి పంచనచేరి చెడిన వైనాన్ని గ్రహించి పశ్చాత్తాప పడ్డాడు. తన తప్పును సరిదిద్దుకుంటూనే స్వానుభవాన్ని తన పద్యాల్లో పొందుపరిచాడు.

"ఇంటియాలు విడిచి యిల జారకాంతల
వెంట తిరుగువాడు వెర్రివాడు
పంటచేను విడిచి పరిగె యేరినట్లు....." అని వేమనంటాడు.

మరో సందర్భంలో వేశ్యలపొత్తు పరువు తీయడమే కాకుండా చావుక్కూడా హేతువవుతుందని ఘాటైన పదాలతో చెప్తాడు.

"తొత్తుతోటి పొందు దోషంబు దోషంబు
లంజతోటి పొత్తు లజ్జచెడును
జారతోటి పొత్తుచావుకు మూలమౌ...." అని హెచ్చరిస్తాడు.

అంతేకాకుండా, సమాజంలోని మూఢవిశ్వాసాలమీద వేమన కొరడా ఝళిపించకమానలేదు. పరిమపవిత్రమని చెప్తూ సాగించే 'అశ్వమేథయాగం', 'పౌండరీకం' లాంటి అనాచారాలలోని రంకు బాగోతాలను బజారుకీడ్చడమే కాకుండా ఇటువంటి యాగాలలో భార్యను ఎలా హీనంగా చూడబడుతుందో నిష్కర్షగా చెప్తాడు.

"ఆలి రంకుతెలుపు అఖిలయజ్ఞంబులు
తల్లిరంకు తెలుపు తద్దినములు
కానితెరవు కర్మకాండకల్పితమాయే...." యజ్ఞానికి ముందు యజ్ఞకర్త భార్య తన సచ్చీలతను అందరిముందు ప్రకటించుకోవాలి. తద్దినాలు, మాసికాలలో ఒక వితంతువు తన భర్తకు విశ్వాస పాత్రంగా ఉంది లేనిది అందరి ముందు చెప్పాలి. అసలు ఈ కర్మకాండలే ఒట్టి కల్పితాలని అన్ని వేళల గుర్తుంపుకు నోచుకోని వీటిని పాటించాల్సిన అవసరం లేదంటాడు వేమన.

బింకానికి పోని వేమన భాష బిగువుతో కూడిన సూటి దనాన్ని ప్రదర్శిస్తుంది. నీతులు బూతులుగా వినిపించినా! నిక్కచ్చితో కూడిన అతని నిర్మోహమాటం, మాటకొక నిండు దనాన్ని కల్గిస్తుంది. వేమనకు అమ్మన్నా, ఆలియన్న గౌరవమే అనడానికి ఈ ఉదహరణలు చాలేమో. వేమన స్త్రీ ద్వేషి కాదు. అందుకే వేమన ప్రజాకవి అయ్యాడు.

మధుబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్
జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు,
సెల్: 9393110848.

చదవండి...

- మిసిమి



అగ్నిశిల్పం: కవితా సంకలనం. డా. పొదిలి నాగరాజు. డా. సత్యనారాయణ మూర్తి, డా. ఎ.కె. వేణుగోపాలరెడ్డి, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, గంటేడ గౌరునాయుడు, డా. జింకా లక్ష్మీనారాయణ పైవారితో చక్కని ముందుమాటలు రాసి ఈ కవితలను, కవినీ పాఠకులకు పరిచయం చేశారు. ఇవన్నీ రాయలసీమ రాళ్లు – బండరాళ్ల బ్రతుకుల కన్నీటి కథలు – కడుపు మంటలు – అగ్నికీలలు. చదవండి. ఆ వేడి మీకు తగలకపోదు.

పేజీలు: 100, వెల: ₹ 150/- ప్రతులకు: డా. పొదిలి నాగరాజు, బద్వేల్, కడప జిల్లా. ఫోన్: 90520 38565.



పలుకు జెలి: (సాహిత్య విమర్శ వ్యాసాలు). డా. టి. శ్రీరంగస్వామి. అన్ని కథలు, కవితలు వస్తున్న నేటికాలంలో వ్యాసాలు, అందులోను సాహిత్య విమర్శ వ్యాసాలు రావటం అరుదు. డా. శ్రీరంగస్వామి కృషి ప్రశంసించాలి! డా. ఎస్వీ. రామారావు ముందుమాట రాసి ఆశీర్వదించారు – 'పల్లెసీమ' (కలం పేరా?) నిబద్ధ శోధకుడు అని బిరుదు ఇచ్చి శ్రీరంగస్వామిని స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం నుంచి – నిత్యానందం – రచనల వరకూ అన్నీ స్పృశించారు – సాహిత్య చరిత్ర విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

పేజీలు: 104, వెల: ₹ 100/- ప్రతులకు: శ్రీలేఖ సాహితి, 27-14-53, ఎమ్.ఆర్.ఒ. ఆఫీస్ ఎదురుగా, శ్రీలేఖ కాలని, హసన్‌పర్తి, వరంగల్ – 506 371. ఫోన్: 99498 57955.



హరిత నానీలు: బొమ్మ ఉమామహేశ్వరరెడ్డి. ఇప్పటికీ మా ఊరి / ఊడల మర్రి / తరతరాల అనుబంధాల సిరి – ఇలా ఉంటాయి నానీలు. రాయటం తేలికగానే అనిపిస్తుంది. చదివేవారికి, రాసేవారికి ఎన్ని పాట్లో! మందు, విందు / భలే పసందు / చివరకు మిగిలేది / రక్త కన్నీరు! అదీ సంగతి. వైరస్‌కంటే ప్రమాదం పుకారంటారు. గుడి ఎవ్వరి కోసం – ఎవరు కట్టిస్తేనేమిటి? నిత్యపూజలు చేసేది పూజారే కదా! ఇవన్నీ పచ్చగడ్డి వాసన వస్తుంటాయి. హరిత నానీలు.

పేజీలు: 47, వెల: ₹ 60/-

ప్రతులకు: బొమ్మ ఉమామహేశ్వరరెడ్డి, S/o బి. రామిరెడ్డి (Ex-VM), Opp: వేణుగోపాలస్వామి దేవాలయం ఎదురు, ఆత్మకూరు పోస్ట్, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా. పిన్: 522 503.



హాస్య కథలు: అఖిల భారత పశు (జంతు) ప్రదర్శన (హాస్య వ్యంగ్య కథానికలు). బాలం వెంకట్రావు. యర్రంశెట్టి శాయి, జంతు ప్రదర్శన శాల కాదు – ప్రజల మానసిక ప్రదర్శన శాల అంటే బాగుంటుంది అంటారు. హాస్యం, వ్యంగ్యం ఇవి పండించడం కత్తిమీద సాము – పండవచ్చు – పడిపోవచ్చు – కానీ 'బాలం'వారి 'గాలం' క్రీడావినోదం – సెల్ మంత్రాలతో ప్రయాణంలో పెళ్లి జరిపించిన పురోహితుడు పక్కా వ్యాపారి – అదీ హాస్యం.

పేజీలు: 117, వెల: ₹ 90/-

ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ.

ఫోన్: 0866-2430302, 9490952107. 9989267426, 9160698629.



రాజనాలబండ: కథల సంపుటి. ఆర్.సి. కృష్ణస్వామిరాజు. 'జీవితమే పెద్ద కథ' అంటారు కృష్ణస్వామి రాజు. ముందుమాట రాస్తూ నాగరాజుగారు ఇవన్నీ రాయలసీమ అదో రకమైన యాసతో జీవిత పరిమళాలను కలగలిపి 'రాజనాలబండ' కథలు తెచ్చారు. చాలా పత్రికల్లో వచ్చినవే. ఒకసారి చదవండి. చాలా తెలుసుకోవచ్చు.

పేజీలు: 160, వెల: ₹ 200/-

ప్రతులకు: ఆర్.సి. కృష్ణస్వామిరాజు, 22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, మంగళం రోడ్, తిరుపతి – 517507. ఫోన్: 939 366 2821.

మహాచైతన్యం: సమకాలీన సామాజిక సమస్యలు. రచయిత: బత్తనపల్లి టి. మునిరత్నం రెడ్డి. అమ్మకు వందనం దగ్గర్నుంచి ఆధునిక వివాహం వరకు 112 విషయాలపై ఒకటి – రెండు పుటల్లో వచనమో – వచన కవిత్వమో – మరీ ప్రక్రియ తెలియకుండా వివరిస్తూ రానుకుంటూ వెళ్లారు – సాంఘిక కీర్తనలందామా..



పేజీలు: 278, వెల: ₹ 300/-

ప్రతులకు: (1) వంశీ బుక్ స్టోర్స్, పాతటపేట, పలమనేరు.

(2) పద్మజ బుక్ డిపో, తేరువీధి పుంగనూరు.

విశ్వరథ: కన్నడంలో వచ్చిన విశ్వరథ నవలను తెలుగులో అనుసృజన చేశారు వేలూరి కృష్ణమూర్తి. మూల రచయిత బెంగుళూరు ఎం. గోపీనాథ్. ప్రముఖ కర్ణాటక సంగీతకారుడు, కన్నడ సాహిత్యానికి 'పర్వ'లాంటి నవలను అందించిన ఘనత ఉంది. దానికి కొనసాగింపు నవలగా 'విశ్వరథ'ను చెప్పుకోవచ్చు. మనం వెతుక్కునే సరస్వతి నాగరికత ఈ నవలలో కనిపిస్తుంది. ఇంకో విషయం... విశ్వామిత్రుడి జన్మనామం 'విశ్వరథ'. వేదకాలంలో ఆర్య – దస్యుల (అనార్యులు) మధ్య జరిగిన సుదీర్ఘ పోరాటంలో నడిచిన రెండు జంటల ప్రేమకథ. కాల్పనిక కథే అయినా అగస్త్య మహర్షి, లోపాముద్ర, విశ్వామిత్రుడి తల్లి ఘోషాదేవి, జమదగ్ని మొదలైనవారు – ఈ నవలలోని ముఖ్యపాత్రలు. ఆర్య – దస్య అన్న రెండు పేర్లు వేద సాహిత్యంలో వాడుకలో ఉన్నాయని చెబుతుంది నవల. ఆర్యులు బయటనుంచి వచ్చిన విదేశీయులు కాదని హిమాలయ పర్వతశ్రేణులు దిగువ ప్రదేశం నుండి సింధూ ప్రాంతానికి వలస వచ్చినవారని చెబుతుంది. కాల్పనిక సాహిత్యంలో ఇదో మంచి ప్రయత్నం. చదివించే గుణమున్న అనుసృజన.



పేజీలు: 240, వెల: ₹ 200/-

ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.

ఫోన్: 984 878 7284.

మొదటి అబద్ధం: మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులుగా మాడభూషి సంపత్‌కుమార్ సుపరిచితులు. తెలుగు భాషా, సాహిత్యాలకు సంబంధించి ఎంతో కృషి చేస్తున్నారు. సొంతంగా పుస్తకాలతో పాటు అనువాదాలు కూడా చేశారు. కరోనా సమయంలో జూమ్ సమావేశాల ద్వారా ఎంతోమందిని పరిచయం చేశారు. ఇన్ని చేశాక ఇప్పుడు 'మొదటి అబద్ధం' పుస్తకం వెలువరించారు. పైగా అది కవిత్వం కాదు తత్త్వం అని ప్రకటించారు. అబద్ధం లేకుండా జీవితం గడవని స్థితిలో ఉన్నాం మనమందరం. జీవన సత్యాలను రంగరించిన 'మొదటి అబద్ధం' మనలను ఆలోచింపజేయక మానదు.



పేజీలు: 64, వెల: ₹ 60/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.

కవిత్వమై కురిసిన కవి: ఒక కవిని విశ్లేషించమంటే చాలా లోతయిన చూపు కావాలి. నిశిత పరిశోధన కావాలి. అలాంటి దృష్టి ఉన్న కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డిగారు. మడభూషి సంపత్‌కుమార్ కవిత్వాన్ని కవిత్వమే కలిసిన కవిగా అభివర్ణిస్తూ మాడభూషి సంపత్ కుమార్ రచనలను విశ్లేషించే ప్రయత్నం చేశారు. మొదట పత్రికా రంగంలో పనిచేసి అనంతర కాలంలో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో చేరి సాహిత్యానికి ఎంతో సేవ చేశారు. నిరంతరం కలాన్ని పసిగడుతూ జాగరూకులై, ఉండాలన్న సూక్తిని ఆచరణలో పెడుతున్న కవిగా మాడభూషి సంపత్ కుమార్‌ను చెప్పుకోవచ్చు. మాడభూషి ఎంచుకున్న కవితా వస్తువుల్ని, నిర్మల పద్ధతుల్ని న్యాయంగా చెబుతారు కొండ్రెడ్డివారు.



పేజీలు: 184, వెల: ₹ 150/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.

పేగుబంధం: విశ్వపుత్రిక-2. ఇవన్నీ కథలు. స్త్రీల అంతరంగాన్ని సున్నితంగా ఆవిష్కరించే కథనాలు. స్త్రీ మనస్తత్వాన్ని విశ్లేషించే ఓపిక, ఓర్పూ కనిపిస్తాయి ఈ కథల్లో. సున్నితమైన సమస్యలే, మానసిక తత్త్వశాస్త్రంతో చిత్రికబట్టి కథలుగా వినిపిస్తున్నారు డా. విజయలక్ష్మిగారు.



పేజీలు: 128, వెల: ₹ 100/ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.

మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

చందా వివరాలు:

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

Scan QR to Pay
Misimi Publication

మిసిమి ప్రచురణలు


నోబెల్ వ్యాసాలు


మిసిమి పార్థసారథి వ్యాసాలు


చిత్రకళా నీరాజనం


నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు


పురస్కార సాహిత్యం


వ్యాస మంజూష


సారస్వత వ్యాసాలు


చార్లీ చాప్లిన్


రజ్జు సర్ప భ్రాంతి


భైరన్


షెల్లీ జీవిత కథ


దోసిట చినుకులు


నృత్యభారతి


పారిజాతం


సిద్ధార్థ


సప్తపర్ణి

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.